అనుదినం... జనస్వరం

నవతెలంగాణ

సమగ్ర తెలుగు దినపత్రిక

www.navatelangana.com

గురువారం13-02-2025

సంపుటి : 11 సంచిక : 44 | Published from Hyderabad, Rangareddy, Khammam, Karimnagar | 16 పేజీలు వెల : 6.50

పడకేసిన పారిశ్రామికోత్పత్తి

తయారీ రంగం వెలవెల

డిసెంబర్‌లో 3.2 శాతమే..

4.31 శాతంగా రిటైల్ ద్రవ్యోల్బణం



న్యూఢిల్లీ : దేశ ఆర్థిక వ్యవస్థ మందగమనంలోకి జారుకోవడంతో తయారీ రంగం వెలవెలబోతోంది. సరుకులకు డిమాండ్ తగ్గడంతో పారిశ్రామిక ఉత్పత్తి సూచీ (ఐఐపీ) నాలుగు నెలల కనిష్టానికి పడిపోయినట్టు స్వయంగా ప్రభుత్వ గణంకాలు స్పష్టం చేస్తున్నాయి. గడిచిన ఏడాది 2024 ...15లో

చట్టబద్ధత కల్పిస్తాం

బీసీలకు 42 శాతం రిజర్వేషన్లపై మార్చి మొదటివారంలో అసెంబ్లీలో బిల్లు

- కలిసొచ్చే పార్టీలతో సీఎం నేతృత్వంలో ఢిల్లీకి ప్రతినిధుల బృందం
- ప్రధానితో పాటు అన్ని పార్టీల నేతలనూ కలుస్తాం
- పార్లమెంట్‌లో ఓబీసీ రిజర్వేషన్ల బిల్లు కోసం ఒత్తిడి : డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క వెల్లడి



నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

రాష్ట్రంలో 42 శాతం రిజర్వేషన్లకు చట్టబద్ధత కల్పించేందుకు తాము కట్టుబడి ఉన్నామనీ, మార్చి మొదటి వారంలో అసెంబ్లీలో ఓబీసీ రిజర్వేషన్ బిల్లు ప్రవేశ పెడతామని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క స్పష్టం చేశారు. కులగణనలో వివరాలు నమోదు చేసుకోనివారు రాష్ట్రంలో మూడు శాతం ఉన్నారని చెప్పారు. వారికి ఫిబ్రవరి 16 నుంచి 28 వరకు మూడు పద్ధతుల్లో నమోదు చేయించుకునే అవకాశం కల్పిస్తున్నామని ప్రకటించారు. సీఎం నేతృత్వంలో కలిసొచ్చే పార్టీల నేతలతో ఢిల్లీకి ప్రతినిధుల బృందాన్ని తీసుకెళ్తామనీ, ప్రధానమంత్రి నరేంద్రమోడీతో పాటు అన్ని పార్టీల అగ్ర నేతలను కలిసి ఓబీసీ రిజర్వేషన్ల చట్టబద్ధతకు సహకరించాలని విజ్ఞప్తి చేస్తామని తెలిపారు. పార్లమెంట్‌లో ఓబీసీ రిజర్వేషన్ బిల్లు పెట్టేలా అన్ని పార్టీలపైనా ఒత్తిడి తీసుకొస్తామని చెప్పారు. రాజకీయ ప్రయోజనాలు పక్కన పెట్టి బీసీ రిజర్వేషన్ల కోసం వివిధ పార్టీల నేతలు, సామాజికవేత్తలు, మేధావులు, ప్రజలంతా కలిసి రావాలని విజ్ఞప్తి చేశారు. రాష్ట్ర జనాభాలో ఓబీసీలు 56 శాతంగా ఉన్నట్టు డిప్యూటీ సీఎం తెలిపారు. బుధవారం హైదరాబాద్‌లోని సచివాలయంలో బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతకుమారి, రాష్ట్ర ప్రణాళిక శాఖ ప్రధాన కార్యదర్శి సందీప్ కుమార్ సుల్తానియా తదితరులతో కలిసి డిప్యూటీ సీఎం మీడియా సమావేశంలో మాట్లాడారు. రాష్ట్రంలో ఓబీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించి దశాబ్దాల కలను నిజం చేస్తామని తెలిపారు. రాష్ట్రంలో కుల గణన విజయవంతమైతే దేశమంతటా అమలు చేయాల్సి వస్తుందని భయపడేవారే రీ సర్వే కోరుతున్నారని విమర్శించారు. దేశంలో ఎక్కడా లేనివిధంగా లక్ష మందికిపైగా సిబ్బందితో పూర్తిగా శాస్త్రీయంగా రాష్ట్రంలో సమగ్ర ఇంటింటి సర్వే జరిగిందని స్పష్టం చేశారు. రాష్ట్రంలో ఏయే సామాజిక తరగతుల జనాభా ఎంత ఉందో శాసనసభలో లెక్కలతో సహా సీఎం రేవంత్ రెడ్డి ...15లో


కులగణనకు మరో ఛాన్స్

16 నుంచి 28 వరకు

మూడు పద్ధతుల్లో నమోదు

ఇంటింటి సర్వేలో వివరాలు నమోదు చేసుకోని వారికోసం మరో అవకాశం ఇస్తున్నామని డిప్యూటీ సీఎం మల్లు భట్టివిక్రమార్క తెలిపారు. రాష్ట్రంలో మూడు శాతం కుటుంబాలు సర్వేలో పాల్గొనలేదన్నారు. కేసీఆర్, కేటీఆర్, పల్లా రాజేశ్వర్‌రెడ్డి వంటి వారు ఉద్దేశపూర్వకంగా సమాచారం ఇవ్వలేదని విమర్శించారు. అలాంటి వారందరి కోసం ఫిబ్రవరి 16 నుంచి 28 వరకు సమగ్ర ఇంటింటి సర్వేలో వివరాల నమోదుకు ప్రభుత్వం అవకాశం కల్పిస్తుందని తెలిపారు. టోల్ ఫ్రీ నెంబర్‌కు ఫోన్ చేసి వివరాలు నమోదు చేసుకోవాలని కోరితే అధికారులు ఫోన్ చేసిన వారి ఇంటికెళ్లి అన్ని వివరాలు నమోదు చేసుకుంటారన్నారు. మండల కార్యాలయాల్లోనూ ప్రజా పాలన అధికారులు ఈ పది రోజులు అందుబాటులో ఉంటారనీ, అక్కడ కూడా వివరాలు నమోదు చేసుకోవచ్చని సూచించారు. ఆన్‌లైన్ ద్వారా కూడా కుటుంబ వివరాల నమోదుకు అవకాశం ఇవ్వాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించిందని తెలిపారు.

ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీజేపీని ఓడించండి



బీసీలకు 42 శాతం రిజర్వేషన్లపై అసెంబ్లీలో బిల్లు పెట్టాలి

ఎస్సీ వర్గీకరణను ఆహ్వానిస్తున్నాం : సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ

వివరాలు 15లో

ఫీజు చెల్లించాలని ఒత్తిడి.. విద్యార్థిని ఆత్మహత్య

మేడ్చల్‌లో ఘటన

ప్రిన్సిపాల్‌పై కేసు 15లో



(ఫైల్)

పుతిన్‌తో ట్రంప్ హలో..హలో

ఉక్రెయిన్‌తో యుద్ధంతో పాటు పలు అంశాలపై చర్చ

'ట్రూత్ సోషల్'లో అమెరికా అధ్యక్షుడు వెల్లడి



వాషింగ్టన్ : రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్‌తో తాను ఫోన్‌లో మాట్లాడినట్టు అమెరికా ప్రెసిడెంట్ డోనాల్డ్ ట్రంప్ తెలిపారు. ఉక్రెయిన్‌తో రష్యా యుద్ధానికి ముగింపు పలికే లక్ష్యంతో తక్షణమే చర్చలను ప్రారంభించాలని తన జాతీయ భద్రతా బృంద సభ్యులను ఆదేశించినట్టు చెప్పారు. అమెరికా అధ్యక్షుడిగా రెండోసారి బాధ్యతలు చేపట్టిన తర్వాత ట్రంప్, పుతిన్‌ల మధ్య సంభాషణ జరగటం ఇదే తొలిసారి కావటం గమనార్హం. 14 ఏండ్లుగా జైలుశిక్షను అనుభవించిన పెన్సిల్వేనియా స్కూల్ టీచర్ మ్యార్క్ ఫొగెల్‌ను రష్యా విడుదల చేసిన ఒకరోజు తర్వాత ఈ పరిణామం చోటు చేసుకోవటం గమనార్హం. పుతిన్‌తో సుదీర్ఘమైన, అత్యంత ఉత్పాదకమైన ఫోన్ కాల్ చేసినట్టు ట్రంప్.. ట్రూత్ సోషల్‌లో రాసుకొచ్చారు. ఉక్రెయిన్, మిడిల్ ఈస్ట్, ఇంధనం, కృత్రిమ మేధస్సు, డాలర్ శక్తి, అనేక ఇతర విషయాలను చర్చించినట్టు వివరించారు. కలిసి పని చేయటం వల్ల ఏదో ఒకరోజు ...15లో

రాహుల్‌కు లక్నో కోర్టు సమన్లు 3లో..

మార్చి 24న విచారణ

ఆర్మీపై అభ్యంతరకర వ్యాఖ్యల కేసులో న్యాయస్థానం ఆదేశాలు

హరీశ్‌ను అరెస్టు చేయొద్దు వివరాలు 8లో

గత ఉత్తర్వులను పొడిగించిన హైకోర్టు





విద్యుత్ ఆర్టిజన్లను కన్వర్షన్ చేయాలి

గ్రేడ్ ఇంక్రిమెంట్‌ను వెంటనే విడుదల చేయాలి

ఫిబ్రవరి 20న చలో విద్యుత్ సౌధ : టీవీఏసీ జేఏసీ చైర్మెన్ కె.ఈశ్వర్‌రావు పిలుపు 15లో..

కార్పొరేట్లకు నజరానాలు

వనరులు, సంపద రాయితీల రూపేణా లబ్ది

కేంద్ర బడ్జెట్ ప్రజావ్యతిరేకం

ఆర్థిక సర్వేకు పూర్తిగా విభిన్నం : ఎంపీ శివదాసన్

రాముడి పేరు చెప్పి గాడ్సే పనులు చేస్తున్నారని వ్యాఖ్య

భారంగా గ్రామీణుల జీవన వ్యయం : అఖిలభారత వ్యకాస సహాయ కార్యదర్శి విక్రంసింగ్

కేంద్ర బడ్జెట్ - గ్రామీణ పేదలపై ప్రభావంపై తెలంగాణ వ్యకాస సెమినార్ 16లో..



సంబంధాలు మరింత బలోపేతం

పలు ద్వైపాక్షిక అంశాలపై చర్చించిన మోడీ, మాక్రాన్

ప్రజా ప్రయోజనాల కోసమే ఏఐ

మార్సెల్లెలో భారత్ కొత్త కాన్సులేట్ కార్యాలయం ప్రారంభం

అమెరికా బయలుదేరిన మోడీ 8లో..





యూరియా కష్టాలు

చెప్పులతో రైతుల క్యూ

నవతెలంగాణ - సైదాపూర్

యూరియా దొరక్క రైతులు నానా కష్టాలు పడుతున్నారు. కరీంనగర్ జిల్లా సైదాపూర్ మండలం వెన్నంపల్లి విశాల సహకార పరపతి సంఘం ఎదుట బుధవారం యూరియా కోసం రైతులు చెప్పులు క్యూలో పెట్టారు. మధ్యాహ్నం వరకు సహకార సంఘం గేటు తీయకపోవడంతో పక్కనే ఉన్న ప్రహరీ గోడపై కూర్చుని నిరీక్షించారు. ఈ మండలంలో 16వేల ఎకరాల్లో వరి సాగు కాగా.. 4వేల మెట్రిక్‌టన్నుల యూరియా అవసరం ఉంది. అయితే, ఇప్పటివరకు 1500 మెట్రిక్‌టన్నులు మాత్రమే ఈ మండలానికి వచ్చింది. అందులోనూ వెన్నంపల్లి సొసైటీకి నామమాత్రంగానే అందించడంతో దాని పరిధిలోని వెన్నంపల్లి, లసుమన్నపల్లి, ఎగ్లాస్‌పూర్, సోమవారం, ఆరెపల్లి, బూడిదపల్లి గ్రామాల రైతులు యూరియా దొరక్క అవస్థలు పడుతున్నారు. బుధవారం క్యూలో నిలబడలేక చెప్పులు, రాళ్లు పెట్టి పక్కనే ప్రహరీ గోడపై కూర్చుని సాయంత్రం వరకూ నిరీక్షించారు. సొసైటీకి నాలుగు లారీల లోడు యూరియాను తక్షణమే అందజేయాలని డిమాండ్ చేశారు.

సీఎం చేతిలో సహకార భవిష్యత్

రాజకీయ సమీకరణ కోసం చైర్మెన్ల పదవీ కాలాన్ని పొడిగించే ఛాన్స్

రేపటితో ముగియనున్న పీఏసీఎస్, డీసీసీబీల పదవీ కాలం

రాష్ట్రంలో 909 పీఏసీఎస్‌లు..9 డీసీసీబీలు..

పదవీకాలం పొడిగించాలని మంత్రి తుమ్మలను కలిసిన చైర్మెన్లు

ముఖ్యమంత్రితో చర్చిస్తానని హామీ

బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్‌లో చేరిన పలువురు చైర్మెన్లు

ప్రభుత్వ నిర్ణయాన్ని బట్టి చర్యలు : డీసీఓ



నవతెలంగాణ-మెదక్ ప్రాంతీయ ప్రతినిధి

ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలు, జిల్లా కేంద్ర సహకార బ్యాంకు, జిల్లా సహకార మార్కెటింగ్ సంస్థల భవితవ్యం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చేతిలో ఉంది. రాష్ట్ర వ్యాప్తంగా పీఏసీఎస్, డీసీసీబీ చైర్మెన్లు, వైస్ చైర్మెన్ల పదవీ కాలం ఈ నెల 14తో ముగియనుంది. ఇప్పటికిప్పుడు సహకార సంఘాలకు ఎన్నికలు నిర్వహించే పరిస్థితి లేనందున పదవీ కాలాన్ని పొడిగించాలని ప్రస్తుత చైర్మెన్లు రాష్ట్ర సహకార శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావును కోరారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డితో చర్చిస్తానని మంత్రి చైర్మెన్లకు హామీ ఇచ్చారు. రాజకీయ సమీకరణాల రీత్యా పాత వాళ్లకే తిరిగి కొంత సమయం ఇవ్వడం ద్వారా సహకార సంఘాల్లో పూర్తి స్థాయిలో అధికార పార్టీ పట్టు బిగించే అవకాశాలున్నాయని కాంగ్రెస్ నేతలు భావిస్తున్నారు. ఇప్పటికే రాష్ట్రంలో జిల్లా పరిషత్, మండల పరిషత్, గ్రామ పంచాయతీలకు స్పెషలాఫీసర్లున్నారు. దాంతో ప్రభుత్వం సహకార సంఘాలకు స్పెషలాఫీసర్లను పెట్టాలా..? పాత వాళ్ల పదవీ కాలాన్ని పొడిగించాలా..? అనే విషయంలో మల్లగుల్లాలు పడుతుంది.

2020 ఫిబ్రవరి 16న రాష్ట్రంలో ఉన్న 909 ప్రాథమిక సహకార సంఘాలు, 9 జిల్లా కేంద్ర సహకార బ్యాంకులతో పాటు జిల్లా సహకార మార్కెటింగ్ సంస్థలకు ఎన్నికలు జరిగాయి. అదే నెలలోనే చైర్మెన్, వైస్ చైర్మెన్, ఆఫీస్ బేరర్స్‌ను ఎన్నుకున్నారు. ఐదేండ్ల పదవీ ఈ నెల 14వ తేదితో ముగియనుంది. దాంతో రాష్ట్రంలో ఉన్న పీఏసీఎస్, డీసీసీబీ, డీసీఎంఎస్ చైర్మెన్, వైస్ చైర్మెన్లంతా మాజీలు కానున్నారు. ఈ నేపథ్యంలో తమ పదవీకాలాన్ని పొడిగించాలని పలువురు డీసీసీబీ చైర్మెన్లు రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. కొందరు డీసీసీబీ చైర్మెన్లు రాష్ట్ర సహకార శాఖ ...15లో

సాంకేతిక అంశాలున్నాయి

యుద్ధ విమానాల సరఫరాలో జాప్యంపై హెచ్ఏఎల్

మూడున్నర ఏండ్లలో అందజేస్తామని హామీ 3లో..



పౌరసత్వం ఆశలపై ట్రంప్ నీళ్లు

భారతీయ తల్లిదండ్రుల్లో ఆందోళన

సీ-సెక్షన్' కోసం పరుగులు

గ్రీన్ కార్డులు ఇక గగనమేనంటున్న నిపుణులు 3లో..



ఇంటర్ ప్రవేశాలు చేపట్టొద్దు

- ప్రయివేటు జూనియర్ కాలేజీలకు ఇంటర్ బోర్డు ఆదేశం
- నిబంధనలను ఉల్లంఘిస్తే తీవ్రంగా పరిగణిస్తాం

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలో వచ్చే విద్యాసంవత్సరం (2025-26) తాత్కాలిక అనుబంధ గుర్తింపు ప్రక్రియ ఇంకా ప్రారంభం కాలేదని ఇంటర్ బోర్డు కార్యదర్శి కృష్ణ ఆదిత్య బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. అనుబంధ నోటిఫికేషన్, ప్రవేశాల షెడ్యూల్‌ను ఇంకా జారీ చేయలేదని స్పష్టం చేశారు. జూనియర్ కాలేజీల్లో ప్రవేశాలను చేపట్టొద్దని ఆదేశించారు. గుర్తింపు లేని కాలేజీల్లో ప్రవేశాలు తీసుకోవద్దని విద్యార్థులు, తల్లిదండ్రులను కోరారు. అనధికార ప్రవేశ కార్య కలాపాలు, అడ్మిషన్ ప్రక్రియలో పీఆర్వోలను నియమించి విద్యార్థుల ముందస్తు ప్రవేశాలపై ఫిర్యాదులు, వార్తల క్లిప్పింగ్‌లు ప్రచురించడం జరుగుతుందని తెలిపారు. అనుబంధ నోటిఫికేషన్ జారీ చేసిన తర్వాత తాత్కాలికంగా అనుబంధ గుర్తింపు పొందిన జూనియర్ కాలేజీల జాబితాను టీజీబీఐఈ అధికారిక వెబ్‌సైట్ tgbie.cgg.gov.in లేదా acadtgbie.cgg.gov.in ప్రదర్శిస్తామని పేర్కొన్నారు. వాటిలోనే పిల్లలను చేర్చాలని తల్లిదండ్రులను కోరారు. అడ్మిషన్ షెడ్యూల్ ప్రకారమే ప్రవేశాలు చేపట్టాలని ప్రయివేటు జూనియర్ కాలేజీ యాజమాన్యాలను ఆదేశించారు. నిబంధనలను ఉల్లంఘిస్తే తీవ్రంగా పరిగణిస్తామని తెలిపారు. నిబంధనల ప్రకారం తగిన చర్యలు ప్రారంభించబడతాయని పేర్కొన్నారు. నిబంధనలు అతిక్రమించిన కాలేజీలకు 2025-26 విద్యాసంవత్సరానికి తాత్కాలిక అనుబంధ గుర్తింపు ప్రక్రియను చేపట్టబోమని వివరించారు. నిబంధనలను కచ్చితంగా అమలయ్యేలా డీఐఈవోలను కోరారు.

జేఈఈలో కార్పొరేట్‌కు దీటుగా

గురుకులాల సత్తా

పేదరికం విజయానికి అడ్డుగోడ కాదని నిరూపించిన విద్యార్థులు

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

దేశవ్యాప్తంగా ప్రతిష్టాత్మకంగా నిర్వహించిన జేఈఈ మెయిన్స్ మొదటి విడత ఫలితాల్లో తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల ప్రతిభ కేంద్రాలు (సీవోఈ) మెరుగైన పర్సెంటైల్‌ను సాధించాయి. కార్పొరేట్ కోచింగ్ కేంద్రాలకు దీటుగా సత్తా చాటాయి. ఈ మేరకు టీజీఎస్‌డబ్ల్యూఆర్ఈఐఎస్ కార్యదర్శి అలుగు వర్షిణి బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. సంక్షేమ గురుకులాల ప్రతిభ కేంద్రాల నుంచి 415 మంది జేఈఈ అడ్వాన్స్‌డ్‌కు అర్హతను సాధించారని వివరించారు. గౌలిదొడ్డి ప్రతిభ కేంద్రం నుంచి విద్యార్థులు అత్యధిక పర్సెంటైల్‌ను సాధించారని తెలిపారు. సాధించిన విజయానికి తమ కుటుంబ పేదరికం అడ్డుగోడ కాదని ఆత్మవిశ్వాసంతో నిరూ పించారని పేర్కొన్నారు. ఆర్ మణిదీప్ -99.03, కె చరణ్‌తేజ్-98.30, డి తేజస్విని- 98.267, పీఏవీ శ్రీనివాస్ -96.88, జే రాంచరణ్ తేజ్-96.78, ఎం భవ్యశ్రీ -95.75, పి భానుతేజ-95.49, వి సుజల-95.49, కె చరణ్ తేజ్-95.20, కె కీర్తన-95.07 పర్సెంటైల్‌ను సాధించారని వివరించారు. 90 పర్సెంటైల్‌కి పైగా సాధించిన విద్యార్థులు 28మంది, 80 నుంచి 90 పర్సెంటైల్ మధ్య సాధించిన వారు 111 మంది, 70నుంచి 80 పర్సెంటైల్ సాధించిన వారు 128 మంది, 60 నుంచి 70 పర్సెంటైల్ మధ్య సాధించిన వారు 168 మంది ఉన్నారని తెలిపారు. ఏప్రిల్ మొదటి వారంలో జరిగే రెండో విడత జేఈఈ మెయిన్‌లో మరింత మంది విద్యా ర్థులు అత్యధిక మంది మెరుగైన పర్సెంటైల్‌ను సాధించడానికి ప్రత్యేక కార్యాచరణను అమలు చేస్తామని పేర్కొన్నారు.




సీపీఐ(ఎం) కేంద్ర కమిటీ సభ్యులు తమ్మినేని వీరభద్రం కుమారుడు సంఘమిత్ర వివాహం సాయిరమ్యతో జరిగింది. ఈ వేడుకలో సీఎం రేవంత్‌రెడ్డి పాల్గొని నూతన వధూవరులకు శుభాకాంక్షలు తెలిపారు.

పౌరసత్వం ఆశలపై ట్రంప్ నీళ్లు

భారతీయ తల్లిదండ్రుల్లో ఆందోళన | 'సీ-సెక్షన్' కోసం పరుగులు

గ్రీన్ కార్డులు ఇక గగనమేనంటున్న నిపుణులు

న్యూఢిల్లీ : తాత్కాలిక వీసా కలిగిన వారి పిల్లలకు జన్మతః పౌరసత్వం కల్పించడాన్ని నిషేధిస్తూ ఎగ్జిక్యూటివ్ ఆర్డర్‌పై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ చేసిన సంతకం వలసదారులకు...ముఖ్యంగా భారతీయులకు గట్టి ఎదురు దెబ్బేనని చెప్పాలి. ట్రంప్ ఆదేశాలను కోర్టులో సవాలు చేసిన నేపథ్యంలో వాటి అమలును ప్రస్తుతానికి పక్కన పెట్టినప్పటికీ త్వరలో తల్లిదండ్రులుగా మారబోతున్న వేలాది మంది భారతీయులను ఈ విధానం అయోమయంలోకి నెట్టేసింది. హెచ్-1బీ వీసా కలిగిన భారతీయ నిపుణులపై దీని ప్రభావం మరింత అధికంగా ఉంటుంది. ఎందుకంటే అమెరికాలో జన్మించే తమ పిల్లలకు అక్కడి పౌరసత్వం దానంతట అదే లభిస్తుందని అనేక మంది ఆశించారు. కానీ ట్రంప్ ఆదేశాలు వారి ఆశలపై నీళ్ల చల్లుతున్నాయి.

'దాని ప్రభావంపై మాపై నేరుగా పడుతుంది' అని కాలిఫోర్నియాలోని శాన్ జోస్‌లో పనిచేస్తున్న భారతీయ ఇంజినీర్ అక్షయ్ పిసే వాపోయారు. ఆయన భార్య నేహా సత్పూతే ఈ నెలలో ప్రసవించాల్సి ఉంది. 'ట్రంప్ ఆదేశాలు అమలులోకి వస్తే ఏం జరుగుతుందో తెలియడం లేదు' అని ఆయన చెప్పారు. గడువు తేదీ లోగానే ప్రసవం అయ్యేలా చూసుకోవడానికి ఆ దంపతులు ఇష్టపడడం లేదు. 'నా భార్య క్షేమంగా ప్రసవించడం, ఆమె ఆరోగ్యం నాకు ముఖ్యం. ఆ తర్వాతే పౌరసత్వం' అని అక్షయ్ కరాఖండీగా చెప్పారు. అయితే తమ బిడ్డకు అమెరికా పౌరసత్వం లభించాలంటే ముందుగానే ప్రసవించాలని పలువురు నిర్ణయానికి వచ్చారు. అయితే అది మంచి పద్ధతి కాదని అమెరికన్ అసోసియేషన్ ఆఫ్ ఫిజీషియన్స్ ఆఫ్ ఇండియన్ ఆరిజిన్ (ఏపీపీఐ) అధ్యక్షుడు సతీష్ కతులా సలహా ఇస్తున్నారు. కఠినమైన వైద్య చట్టాలు అమలులో ఉన్న దేశంలో కేవలం పౌరసత్వం కోసం సీ-సెక్షన్ల విధానాన్ని అనుసరించడం మంచిది కాదని తెలిపారు.

'పాస్‌పోర్ట్ కోసం భారత కాన్సులేట్‌ను సంప్రదించాలా? ఏ వీసా వర్తిస్తుంది? దీనిపై స్పష్టమైన సమాచారం లేదు' అని శాన్ జోస్‌లో నివసిస్తున్న ప్రియాన్షి జాజూ చెప్పారు. ఆమె ఏప్రిల్‌లో ప్రసవించాల్సి ఉంది. కాగా అమెరికాలో జన్మించిన వారికి నాన్-ఇమ్మిగ్రెంట్ హోదా కల్పించే నిబంధన ఏదీ చట్టంలో లేదని న్యూయార్క్‌కు చెందిన ఇమ్మిగ్రేషన్ అటార్నీ సైరస్ మెహతా స్పష్టం చేశారు.

జన్మతః పౌరసత్వం లేని హెచ్-1బీ వీసా కలిగిన వారి పిల్లలు చట్టపరమైన అనిశ్చితిని ఎదుర్కోవాల్సి వస్తుందని న్యాయ నిపుణులు హెచ్చరించారు. తాము చట్టబద్ధంగా అమెరికాలో ఉంటున్నామని, పన్ను చెల్లింపుదారులమని, అలాంటప్పుడు తమ పిల్లలకు ఎందుకు పౌరసత్వం కల్పించరని పలువురు వలసదారులు ప్రశ్నించారు.



పిల్లల భవిష్యత్తుపై ఆందోళనలు

ట్రంప్ ఆదేశాలు డాక్యుమెంట్లు లేని వలసదారులపై కూడా ప్రభావం చూపుతాయి. అమెరికాలో వారికి జన్మించే పిల్లలకు జన్మతః పౌరసత్వం లభించే అవకాశమే లేదు. 21 సంవత్సరాల వయసు వచ్చిన వారు గతంలో తమ తల్లిదండ్రులను గ్రీన్ కార్డు కోసం స్పాన్సర్ చేసే అవకాశం ఉండేది. అయితే తాజా నిబంధనల కారణంగా ఆ అవకాశం లేకుండా పోయింది. డాక్యుమెంట్లు లేని భారతీయుల సంఖ్య 7.25 లక్షలు ఉండవచ్చునని ప్యూ రిసెర్చ్ అంచనా వేయగా 3.75 లక్షల మంది ఉండవచ్చునని మైగ్రేషన్ పాలసీ ఇన్‌స్టిట్యూట్ చెబుతోంది. హెచ్1బీ లేదా ఓ వీసాలు కలిగిన భారతీయులకు తమ పిల్లల భవిష్యత్తుపై తీవ్ర ఆందోళనలు కలుగుతున్నాయి. వీసా స్టాంపింగ్ కోసం తప్పనిసరిగా అమెరికాను వదిలి వెళ్లే వారికి తరచుగా నిరీక్షణ తప్పడం లేదు. తమ పిల్లలకు కూడా ఇదే సమస్య ఎదురవుతుందని అనేక మంది ఆందోళన చెందుతున్నారు.

వలసదారుల్లో భారతీయులది రెండో స్థానం



అమెరికాలో అత్యధిక సంఖ్యలో నివసిస్తున్న వలసదారుల్లో భారతీయులది రెండో స్థానం. ఆ కారణంగా ట్రంప్ నిర్ణయం వారి పైన ఎక్కువగా ప్రభావం చూపుతుంది. యాభై లక్షల మందికి పైగా నాన్-ఇమ్మిగ్రెంట్ వీసాలు ఉన్నాయి. కొత్త నిబంధనల ప్రకారం అమెరికాలో జన్మించే వీరి పిల్లలకు పౌరసత్వం లభించదు. ఇతర దేశీయులతో పోలిస్తే భారతీయులకే ఎక్కువ గ్రీన్ కార్డ్ బ్యాక్‌లాగ్‌లు ఉన్నాయని ఇమ్మిగ్రేషన్ విధాన విశ్లేషకుడు స్నేహా పూరీ తెలిపారు. ఏ దేశానికైనా గ్రీన్‌కార్డులను ఏడు శాతానికి పరిమితం చేయాలని ప్రస్తుత అమెరికా చట్టాలు నిర్దేశిస్తున్నాయి. భారతీయులు ప్రతి ఏటా 72 శాతం హెచ్-1బీ వీసాలు పొందుతుండడంతో బ్యాక్‌లాగ్ 11 లక్షలకు పెరిగింది. ఈ నేపథ్యంలో కొత్తగా దరఖాస్తు చేసుకునే భారతీయులు జీవితకాలం ఎదురు చూడాల్సి ఉంటుందని, గ్రీన్ కార్డు పొందకుండానే నాలుగు లక్షల మంది మరణించే అవకాశం ఉన్నదని కాటో సంస్థకు చెందిన ఇమ్మిగ్రేషన్ డైరెక్టర్ డేవిడ్ బియర్ హెచ్చరించారు.

సాంకేతిక అంశాలున్నాయి

యుద్ధ విమానాల సరఫరాలో జాప్యంపై హెచ్‌ఏఎల్

మూడున్నర ఏండ్లలో అందజేస్తామని హామీ

బెంగళూరు : ప్రభుత్వ రంగ రక్షణ సంస్థ హిందుస్థాన్ ఏరోనాటిక్స్ లిమిటెడ్ (హెచ్‌ఏఎల్)పై తమకు నమ్మకం లేదని, పదకొండు తేజస్ ఎంకే1 ఫైటర్ జెట్లను సరఫరా చేస్తామని చెప్పి ఒక్క దానినీ అందించలేదని వైమానికదళ అధిపతి అమర్ ప్రీత్‌సింగ్ చేసిన వ్యాఖ్యలపై ఆ సంస్థ స్పందించింది. ఫైటర్ జెట్ల సరఫరాలో జాప్యానికి సాంకేతిక అంశాలే కారణమని, అంతే తప్ప పరిశ్రమలో మందకొడితనం కాదని తెలిపింది. త్వరలోనే యుద్ధ విమానాలు సరఫరా చేస్తామని హామీ ఇచ్చింది. హెచ్‌ఏఎల్‌పై తనకు ప్రస్తుతానికి నమ్మకం లేదంటూ ఆ సంస్థ అధికారికి వాయుసేన అధిపతి చెబుతున్న మాటలకు సంబంధించిన వీడియో వైరల్ అయింది. బెంగళూరులో జరిగిన ఎరో షోలో హిందుస్థాన్ జెట్ ట్రైనర్ (హెచ్‌జేటీ-36)ను పరీక్షించి అందులో కూర్చున్న అమర్ ప్రీత్‌సింగ్ అక్కడి అధికారితో 'సంస్థలో సందర్భానికి తగిన పనితీరు, వేగం కన్పించడం లేదు' అని అన్నారు.

వైమానిక దళం 2021లో 83 తేలికపాటి తేజస్ ఎంకే1ఏ యుద్ధ విమానాల కోసం హెచ్‌ఏఎల్‌కు ఆర్డర్ ఇచ్చింది. అప్పటి నుండీ వాటి కోసం ఎదురు చూస్తూనే ఉంది. వైమానిక దళ యుద్ధ సామర్థ్యాన్ని పెంచాలంటే ఈ ఫైటర్ జెట్ల అవసరం ఎంతో ఉంది. కాగా ఎయిర్ చీఫ్ మార్షల్ వ్యాఖ్యలపై హెచ్‌ఏఎల్ ఛైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ డీకే సునీల్ స్పందిస్తూ 'ఈ జాప్యానికి కేవలం పరిశ్రమలో మందకొడితనమే కారణమని చెప్పలేము. కొన్ని సాంకేతిక అంశాలు ఉన్నాయి. ఇప్పుడవి పరిష్కారమయ్యాయి. ఎయిర్ చీఫ్ మార్షల్ ఆందోళన అర్థం చేసుకోదగినదే' అని అన్నారు. ఈ సంవత్సరాంతానికి నాసిక్‌లోని హెచ్‌ఏఎల్ నుండి ఒకటి, బెంగళూరు నుండి రెండు విమానాలను అందజేస్తామని, వైమానిక దళంతో కుదుర్చుకున్న కాం ట్రాక్ట్ ప్రకారం మొత్తం 83 జెట్ విమానాలను రాబోయే మూడున్నర సంవత్సరాల్లో సరఫరా చేస్తామని తెలిపారు.

'నిర్మాణాలు పూర్తవుతున్నాయని మేము హామీ ఇస్తున్నాము. ఈ విషయాన్ని వారికి తెలియజేశాం. వివిధ స్థాయిల్లో అనేక సమావేశాలు నిర్వహించాం. ఆ విషయాన్ని కూడా తెలియజేశాం. విమానాల నిర్మాణం పూర్తవుతోంది. ఇంజిన్లు అందుబాటులోకి రాగానే సరఫరాలు మొదలు పెడతాం' అని హెచ్‌ఏఎల్ అధిపతి సునీల్ చెప్పారు. కాగా వైమానిక దళం 2010లోనే 40 తేజాస్ ఎంకే1 విమానాలకు ఆర్డర్ చేసింది. వాటిలో నాలుగు విమానాలు ఇప్పటి వరకూ సరఫరా కాలేదు. యుద్ధ విమానాలకు అవసరమైన 12 జీఈ-404 ఇంజిన్లను ఈ ఏడాది అమెరికా సరఫరా చేస్తుందని, అత్యాధునిక జీఈ-414 ఇంజిన్ల సరఫరాపై సంప్రదింపులు జరుగుతున్నాయని సునీల్ తెలిపారు. ప్రధాని నరేంద్ర మోడీ అమెరికా పర్యటన సరఫరాలను వేగవంతం చేస్తుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు.



రాహుల్‌కు లక్నో కోర్టు సమన్లు

మార్చి 24న విచారణ

- ఆర్మీపై అభ్యంతరకర వ్యాఖ్యల కేసులో న్యాయస్థానం ఆదేశాలు

లక్నో : కాంగ్రెస్ అగ్రనాయకుడు, లోక్‌సభలో ప్రతిపక్ష నేత అయిన రాహుల్‌కు లక్నో కోర్టు సమన్లు జారీ చేసింది. తన భారత్ జోడో యాత్రలో భాగంగా 2022లో ఆర్మీపై చేసిన అభ్యంతరకర వ్యాఖ్యల ఆరోపణలపై న్యాయస్థానం ఈ చర్యకు దిగింది. ఈ కేసు తదుపరి విచారణను అడిషనల్ చీఫ్ జ్యుడిషియల్ మేజిస్ట్రేటు అలోక్ వర్మ వచ్చే నెల 24కు నిర్ణయించారు. దీనికి రాహుల్ హాజరు కావాల్సి ఉంటుంది. అంతకముందు బోర్డర్ రోడ్స్ ఆర్గనైజేషన్ మాజీ డైరెక్టర్ ఉదయ్ శంకర్ శ్రీవాస్తవ తరఫున లాయర్ వివేక్ తివారీ.. రాహుల్‌పై పరువు నష్టం దావా వేశారు. " భారత్ జోడో యాత్రలో భాగంగా రాహుల్.. డిసెంబర్ 16, 2022న ఈ అభ్యంతరకర వ్యాఖ్యలు చేశారు. కొందరు మీడియా వ్యక్తులతో మాట్లాడుతూ.. డిసెంబర్ 9న చోటు చేసుకున్న భారత్, చైనా ఆర్మీల మధ్య చోటు చేసుకున్న ఘర్షణ గురించి ఆయన అభ్యంత రకరంగా మాట్లాడారు" అని లాయర్ వివేక్ తివారీ వివరించారు.

గుజరాత్‌లో ప్రభుత్వ ఉద్యోగులకు షాక్

హెల్మెట్ ధరించకుండా వాహనం నడిపినవారికి చలాన్లు

మూడు గంటల్లో..మూడు వేల మందికి పైగా ఫైన్లు



మొత్తం రూ.15.96 లక్షలు వసూలు

గాంధీనగర్ : గుజరాత్‌లో ట్రాఫిక్ విభాగం.. ఆ రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు షాకిచ్చింది. తమ పని నిమిత్తం.. హెల్మెట్లు ధరించకుండా వాహనాలు నడిపినవారికి ఛలాన్లు వేసింది. ఇలా కేవలం మూడు గంటల్లో మూడు వేల మందికి పైగా ప్రభుత్వ ఉద్యోగులకు ఫైన్లు వేసింది. ఇలా ఫైన్ల రూపంలో మొత్తం రూ. 15.96 లక్షలు వసూలు చేసినట్టు అధికారులు తెలిపారు. హెల్మెట్ ధరించని ప్రభుత్వ ఉద్యోగుల విషయంలో రాష్ట్ర డీజీపీ వికాస్ సాహే ఆదేశాల మేరకు ట్రాఫిక్ విభాగం పోలీసులు రాష్ట్రవ్యాప్తంగా ఈ ప్రత్యేక డ్రైవ్‌ను చేపట్టారు. తమ కార్యాలయాల బయట హెల్మెట్లు ధరించకుండా వాహనాలు నడుపుతున్న ప్రభుత్వ అధికారుల, ఉద్యోగులకు మోటార్ వెహికిల్స్ యాక్ట్ కింద రూ.500 చొప్పున జరిమానా విధించారు. ఇలా రాష్ట్రవ్యాప్తంగా 39 ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ పరిధుల్లో 3192 మంది ప్రభుత్వ ఉద్యోగులకు ఫైన్లు వేసినట్టు సమాచారం. ఇలా మంగళవారం ఉదయం పది గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు ఫైన్ల రూపంలో మొత్తం రూ.15.96 లక్షలు వసూలు చేసినట్టు తెలిసింది. రాష్ట్రంలో ప్రధాన నగరాలైన బనాస్ కాంతా, సురేంద్రనగర్, భరూచ్‌ల నుంచి పెద్ద ఎత్తున ఉల్లంఘనలు నమోదయ్యాయని ట్రాఫిక్ విభాగం ఉన్నతాధికారి ఎం.ఎల్ నినామా తెలిపారు. అహ్మదాబాద్ నుంచి ఐదో వంతు(473 కేసులు), అహ్మదాబాద్ రూరల్ నుంచి 220 ఉల్లంఘనలు నమోదయ్యాయి. మంగళవారం కొనసాగిన ఈ డ్రైవ్‌లో అహ్మదాబాద్‌లో మొత్తం 660 ఉల్లంఘనలు నమోదు కాగా, మొత్తం ఫైన్లు రూ.3.3 లక్షలు అని ట్రాఫిక్ విభాగం అధికారి ఎన్.ఎన్ చౌదరీ తెలిపారు. ఇందులో 72 మంది పోలీసు సిబ్బంది కూడా ఉన్నారని చెప్పారు. రాజ్‌కోట్‌లో సోమవారం డ్రైవ్‌ను చేపట్టారు. ఇందులో 395 ఉల్లంఘనలు జరిగాయి. ఫైన్ల రూపంలో రూ. 1,97,500 వసూలైనట్టు ట్రాఫిక్ డీసీపీ పూజా యాదవ్ తెలిపారు.

పాఠ్య పుస్తకాల పైరసీని అరికట్టేందుకు విద్యా శాఖ చేపట్టిన చర్య సత్ఫలితాన్ని ఇవ్వకపోగా మరిన్ని సమస్యలు సృష్టించేలా ఉంది. ప్రభుత్వ నిర్ణయం పాఠ్య పుస్తకాల కొరతకు, మరింత పైరసీకి దారితీయ వచ్చునని విద్యావేత్తలు ఆందోళన వ్యక్తం చేశారు. పాఠ్య పుస్తకాల ముద్రణను మూడు రెట్లు పెంచా లని విద్యా శాఖ ఎన్సీఈఆర్టీకి సూచించింది. పాఠశాలలకు వెళ్లే విద్యార్థులకు పుస్తకాల కొరత రాకూడదని, వారు పైరసీ పుస్తకాలు కొనుగోలు చేయాల్సిన అవసరమే ఉండకూడదని సదరు మంత్రిత్వ శాఖ భావించి ఈ మేరకు సూచన లు జారీ చేసింది. ఇది వినడానికి బాగానే ఉంది కానీ పరిస్థితులే అందుకు అనువుగా లేవు.

విద్యార్థులను వెంటాడుతున్న పైరసీ భూతం

- ముంచుకొస్తున్న పాఠ్య పుస్తకాల కొరత
- అగ్నికి ఆజ్యంగా విద్యాశాఖ చర్యలు
- కిం కర్తవ్యం అంటూ తల పట్టుకున్న ఎన్సీఈఆర్టీ

15 ఏజెన్సీలతో ముద్రణ ఎలా?

న్యూఢిల్లీ : పాఠ్య పుస్తకాల ముద్రణ కోసం ఎన్సీఈఆర్టీ కొన్ని ఏజెన్సీలను ఎంపిక చేసు కుంటుంది. అవసరాల మేరకు వాటిలో కొన్నింటికి ముద్రణకు సంబంధించి ఆర్డర్లు ఇస్తుంది. అయితే ఎన్సీఈఆర్టీ గత సంవ త్సరం తన వద్ద ఉన్న ఆఫ్‌సెట్ ప్రింటింగ్ ఏజెన్సీల జాబితా నుంచి వంద సంస్థలను తొలగించింది. పుస్తకాల ముద్రణ నాణ్యంగా లేనందున ఈ చర్య తీసుకుంది. ఇప్పుడు జాబితాలో మిగిలింది పదిహేను ఏజెన్సీలు మాత్రమే. కొత్త ప్రింటర్లను ఎంపిక చేసుకోవడానికి కనీసం నెల రోజులు పడుతుందని చెబుతు న్నారు. మరోవైపు ఏప్రిల్‌లో నూతన విద్యా సంవత్సరం ప్రారంభం కాబోతోంది. ఆ లోగా ఉన్న ఏజెన్సీల ద్వారా రెండు మూడు కోట్లకు మించి పుస్తకాలను ముద్రించే పరిస్థితి లేదు. ఫలితంగా పైరసీ ఎడిషన్లకు డిమాండ్ మరింత పెరిగే అవకాశం ఉంది.

ఎన్బీటీ సత్తా ఎంత?

ఎన్సీఈఆర్టీ పుస్తకాలు ముద్రిస్తామంటూ నేషనల్ బుక్ ట్రస్ట్ (ఎన్బీటీ) ముందుకు వచ్చింది. అయితే అది ఇప్పటి వరకూ ఫిక్షన్, నాన్-ఫిక్షన్ పుస్తకాలను మాత్రమే ముద్రిస్తోంది.

పెద్ద ఎత్తున పుస్త కాలు ముద్రించిన అను భవం దానికి లేదు. ఇప్పటి వరకూ ఎన్బీటీ ముద్రించిన పుస్తకాలు ఎన్సీఈఆర్టీ అవసరాల్లో కనీసం పది శాతం కూడా లేవు. ఒక్కో ఎన్సీఈఆర్టీ పాఠ్య పుస్తకం ప్రింట్ ఆర్డర్ పది లక్షల కాపీల వరకూ ఉంటుంది. పుస్తకాల ముద్రణకు ఎన్బీటీ స్వచ్ఛందంగా ముందుకు వచ్చినప్పటికీ ఆ పని చేసే సామర్థ్యం దానికి లేదని ఓ అధికారి చెప్పారు. ఎన్బీటీ ప్రొడక్షన్ విభాగం లో కీలకంగా ఉండే జాయింట్ డైరెక్టర్ పోస్ట్ ఏడేండ్ల నుండి ఖాళీగానే ఉంది. మూడు అసిస్టెంట్ డైరెక్టర్ల పోస్టులను కూడా భర్తీ చేయాల్సి ఉంది.

కొత్త పుస్తకాలతో మరిన్ని ఇబ్బందులు



రాబోయే విద్యా సంవత్సరంలో కొత్త పాఠ్య పుస్తకాలు ప్రవేశ పెడుతున్న నేపథ్యంలో డిమాండ్ మరింత పెరుగుతుంది. దానిని తట్టుకునేందుకే ముద్రణను మూడు రెట్లు పెంచాలని విద్యా శాఖ సూచించింది. కానీ క్షేత్ర స్థాయిలో పరిస్థి తులు అందుకు అనుకూలంగా లేవు. ఎన్సీఈఆర్టీ రాబోయే విద్యా సంవత్సరంలో 4, 5, 7, 8 తరగతులకు కొత్త పాఠ్య పుస్తకాలు ప్రవేశపెడుతోంది. ఇప్పటికే 2022-23లో 1, 2 తరగతులకు, 2024-25లో 3, 6 తరగతులకు కొత్త పుస్తకాలు విడుదల చేసింది. పాఠ్యాం శాలు మారుతున్న నేపథ్యంలో విద్యార్థులు విధిగా కొత్త పుస్తకాలు కొనుగోలు చేయాల్సిందే. సీనియర్ విద్యార్థుల నుండి వారి పుస్తకాలు తీసుకునే అవ కాశం ఉండదు. ప్రింటింగ్ ఆర్డర్ పెంచాలని ఎన్సీ ఈఆర్టీ డిసెంబరులో తెలియజేసిందని ప్రింటర్లు చెబుతున్నారు. అయితే ఇప్పటి వరకూ పదిహేను ప్రింటింగ్ ఏజెన్సీలు కలిపి కోటి పుస్తకాలు మాత్రమే ముద్రించాయి.

తప్పని పైరసీ బెడద

ఇప్పటికే ఎన్సీఈఆర్టీని పైరసీ భూతం వెంటాడుతోంది. దేశంలో అతి పెద్ద పాఠశాల బోర్డు అయిన సీబీఎస్సీ ఎన్సీఈఆర్టీ ముద్రించిన పుస్తకాలనే వినియోగిస్తోంది. సీబీఎస్సీ ఏటా ఐదు కోట్ల పాఠ్య పుస్తకాల ముద్రణకు ఆర్డర్ ఇస్తుంది. వాస్తవానికి బోర్డుకు 10-12 కోట్ల పుస్తకాలు అవసరమవుతాయి. ఫలితంగా పైరసీ పుస్తకాలు మార్కెట్‌లోకి వచ్చి పడుతున్నాయి. పైరసీ పుస్తకాల ముద్రణకు ఉపయోగించే కాగితంలో నాణ్యత మచ్చుకైనా కన్పించదు. అలాగే ముద్రణ కూడా ప్రమాణాలకు అనుగుణంగా ఉండదు.

ఉక్రెయిన్‌తో భూభాగాల మార్పిడికి అవకాశం లేదు : రష్యా

మాస్కో : శాంతి ఒప్పందంలో భాగంగా ఉక్రెయిన్‌తో భూభాగాల మార్పిడికి ఎలాంటి అవకాశం లేదని రష్యా విదేశాంగ మంత్రిత్వశాఖ ప్రతినిధి మరియా జకరోవా స్పష్టం చేశారు. గార్డియన్ పత్రికకు ఇంటర్వ్యూ ఇచ్చిన సందర్భంగా ఉక్రెయిన్ అధ్యక్షుడు వ్లాదిమిర్ జెలెన్‌స్కీ రష్యాతో భూభాగాల మార్పిడికి ఒక ప్రతిపాదన చేశారు. గత ఆగస్టులో ఉక్రెయిన్ బలగాలు స్వాధీనం చేసుకున్న కుర్స్క్ ప్రాంతాన్ని వెనక్కి తిరిగి ఇచ్చేస్తామని, అందుకు ప్రతిగా రష్యా కూడా తమ భూభాగాన్ని ఇచ్చేయాల్సి వుంటుందని చెప్పారు. అయితే బదులుగా ఏ ఏ భాగాలు కోరాలనుకుంటున్నారనే అంశంపై జెలెన్‌స్కీ ఒక స్పష్టత ఇవ్వలేదు. కాగా ఆ ప్రతిపాదనను జకరోవా తోసిపుచ్చారు. "కుర్స్క్ ప్రాంతంలో విధ్వంసం సృష్టిస్తున్న నయా నాజీలకు ఎలాంటి భూభాగ మార్పిడి లేకుండానే ఒక మీటరు వెడల్పు, రెండు మీటర్ల పొడవు, మీటరన్నర లోతు వున్న ప్రాంతం లభిస్తుంది." అని వ్యాఖ్యానించారు. ఈ మేరకు ఆమె సోషల్‌మీడియాలో పోస్టు పెట్టారు. ఆ కొలతలతో సమాధి గురించి పరోక్షంగా ప్రస్తావిస్తూ ఆమె ఈ వ్యాఖ్యలు చేశారు. కదనరంగంలో ఉక్రెయిన్ బలగాలు ఎదుర్కొంటున్న ఇబ్బందులపై నుండి దృష్టి మరల్చడానికే జెలెన్‌స్కీ ఈ వ్యాఖ్యలు చేశారని ఆమె వ్యాఖ్యానించారు. ఆరు మాసాల క్రితం కుర్స్క్ ప్రాంతంలోకి తొలిసారిగా చొచ్చుకు పోయినపుడు స్వాధీనం చేసుకున్న భూభాగంలో సగానికి పైగా ప్రాంతాన్ని ఉక్రెయిన్ ఆర్మీ కోల్పోయింది. ఈ సైనిక కార్యకలాపాల వల్ల ఉక్రెయిన్ వైపు 59,500మందికి పైగా మరణించారని రష్యా రక్షణ శాఖ అంచనా వేసింది. ఇలా దాడులు జరపడం వల్ల చర్చలు జరిగే అవకాశాలు మృగ్యమైపోతాయని గత ఆగస్టులోనే రష్యా అధ్యక్షుడు పుతిన్ హెచ్చరించారు. ఉద్దేశ్యపూర్వకంగానే రష్యా పౌరులను, అణు సదుపాయాలను కీవ్ లక్ష్యంగా చేసుకుంటోందని విమర్శించారు.

సంపాదకీయం

ఉన్మాద పోకడలు

'సర్వేజనా సుఖినోభవంతు..'అని చెబుతుంటారు. అన్ని మతాలు సర్వమానవ సౌభ్రాతృత్వాన్ని ప్రబోధించేవే! అయితే మతం పేరు చెబుతూనే పరమత విశ్వాసులపైన, సెక్యులర్ భావాలు కలిగిన వారిపైన తమ మనోభావాలు దెబ్బతింటున్నాయన్న పేరుతో మతోన్మాదుల ఆగడాలు రోజురోజుకూ పెరిగిపోవడం ఆందోళనకరం. తెలుగు రాష్ట్రాల్లో ఇటీవల జరిగిన పుస్తక ప్రదర్శనలపై దాడులు, చిలుకూరు బాలాజీ ఆలయ ప్రధాన అర్చకుడి నివాసానికి వెళ్లి ఆయనపై దాడి చేయడం, బెదిరించడం వంటి పరిణామాలు విద్వేష శక్తుల వీరంగానికి నిదర్శనాలు. గతంలో గోవింద్ పన్సారే, గౌరీ లంకేష్ వంటి హేతువాదులను హత్యచేసిన మతోన్మాద మూకల దుశ్చర్యలు గుర్తుకొస్తున్నాయి.

రాజ్యాంగంలోని భావ ప్రకటనా స్వేచ్ఛకు విఘాతం కలిగించే ఏ చర్య అయినా దుర్మార్గమే! దాన్ని కూకటి వేళ్లతో పెకలించాల్సిందే. తాజా ఘటనను ప్రగతిశీల శక్తులతోపాటు సనాతనవాదిగా మారిన పవన్ కల్యాణ్ సైతం ఖండించారు. ఆయుధాలు పట్టి ఆర్మీలను నడుపుతున్న ఈ అరాచకవాదులను, గోగూండాలను కేంద్రప్రభుత్వం అడ్డుకోకపోగా ప్రత్యక్షంగానో, పరోక్షంగానో అండదండలిస్తోంది? ప్రగతికాములు, లౌకిక ప్రియులు, శాంతి, సామరస్యాలను కోరుకునే వారందరూ ఒక్క గొంతుతో నిరసించాలి. ప్రజాస్వామ్య, అభ్యుదయ సాహిత్యానికి, భావాలకు నెలవైన తెలుగు రాష్ట్రాల్లో ఇటువంటి మతోన్మాద దుశ్చర్యలకు చోటులేదని బిగ్గరగా చాటిచెప్పాలి!



సంఘ్ పరివార్ కుదుళ్ల నుంచి వచ్చిన సంస్థలు... కొందరు వ్యక్తులు.. మూకదాడులు చేయడం ఉత్తరాదిలో తరచూ కనిపిస్తూ ఉంటుంది. ఈ దుష్ట సంస్కృతిని తెలుగు రాష్ట్రాల్లోనూ విస్తరింపజేసే యత్నాలే ఇటీవలి ఘటనలు. వంద ఆలోచనలు సంఘర్షించనీ.. వెయ్యి భావాలు వికసించనీ... అన్నది లోకోక్తి. భారత రాజ్యాంగం ప్రకారం ప్రతి పౌరుడు తనకు నచ్చిన మతాన్ని అనుసరించడానికి, అన్ని మతాలకు చెందిన వారు జీవించడానికి, వారి భావజాలాన్ని ప్రచారం చేసుకోవడానికి, అందులో భాగంగా పుస్తకాలను ప్రచురించడానికి, విక్రయించుకోవడానికి హక్కు ఉంది. అయితే అవి ప్రజాజీవనానికి విఘాతం కలిగించరాదు. హైదరాబాద్‌లో బుక్ ఫెస్టివల్ నిర్వహిస్తుండగా వీక్షణం ఎడిటర్ వేణుగోపాల్‌పై కొందరు దాడికి తెగబడ్డారు. 'సనాతన ధర్మం'పైనా, తిరుపతి బాలాజీ ఆలయంపై పుస్తకాలను విక్రయించొద్దంటూ అడ్డుకునే ప్రయత్నం చేశారు. తిరుపతిలో 'పెరియార్ జీవిత చరిత్ర' పుస్తకాన్ని అమ్మవద్దంటూ దాడికి పాల్పడ్డారు. ఆచార్య యార్లగడ్డ లక్ష్మీప్రసాద్ రాసిన ద్రౌపది పుస్తకాన్ని అమ్మరాదని గొడవ చేశారు. ప్రముఖ సంస్కర్త త్రిపురనేని రామస్వామి చౌదరి సాహిత్యాన్ని కూడా తూలనాడారు. నెల్లూరు తదితర ప్రాంతాల్లోనూ ఇలాంటి ఘటనలు జరిగాయి. వీటిపై మేధావులు, సాహితీవేత్తలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్న సమయంలోనే... హైదరాబాద్ సమీపంలోని ప్రసిద్ధ ఆలయం చిలుకూరు బాలాజీ ఆలయ ప్రధాన అర్చకుడు సిఎస్ రంగరాజన్‌పై దాడి జరిగింది. 'రామరాజ్యం' పేరుతో సంస్థను స్థాపించిన వీరరాఘవరెడ్డి సుమారు ఇరవై మందిని తీసుకెళ్లి, కస్టడీలోకి తీసుకుంటున్నామంటూ... ఆయన్ను ఒక చిన్నగదిలో చుట్టుముట్టి పిడిగుద్దులు గుద్దారు. తమ సైన్యంలోకి యువతను రిక్రూట్ చేయాలని, ఆర్థిక వనరులను సమకూర్చాలని దారుణాలకు పాల్పడ్డారని పోలీసులు వెల్లడించారు. అరాచక మూక న్యాయస్థానాలను సైతం కించపరిచింది. ఇటీవల వీహెచ్‌పీ వారు గన్నవరం సమీపంలో జరిపిన భారీ సభలో డిమాండ్ చేసిన మాదిరిగానే రంగరాజన్, ఆయన తండ్రి ఆలయ వ్యవస్థాపకుడు సౌందర రాజన్ ఆలయాలపై ప్రభుత్వ అజమాయిషీ ఉండకూడదు, ధార్మిక సంస్థలు నడపాలంటూ కోర్టుల్లో పిటిషన్లు వేశారు. చిలుకూరు దేవాలయాన్ని అభివృద్ధి చేయడానికి, భక్తులకు అవసరమైన సౌకర్యాల కల్పనకూ కృషి చేశారు. అయినా మతోన్మాదులు దుశ్చర్యలకు పాల్పడ్డారు.

మెజారిటీ వాదం పేరుతో మత ఉన్మాదాన్ని పెంచి పోషించే దుశ్చర్యల ఫలితమే ఇది. పుస్తకాలను, సినిమాలను అడ్డుకోవడం, ట్రోల్ చేయడం, రచయితలను, కవులను, మేధావులను కించపరచడంలాంటి దుశ్చర్యలకు తెగబడుతున్నా మీనమేషాలు లెక్కించడం, ప్రత్యక్షంగానో, పరోక్షంగానో సహకరించడం బీజేపీ, దాని మిత్రులు అధికారంలో వున్నచోట పరిపాటిగా మారిపోయింది. అటువంటి పరిస్థితి వల్ల అరాచక మూకలు పెచ్చరిల్లుతున్నాయి. రాజ్యాంగంలోని భావ ప్రకటనా స్వేచ్ఛకు విఘాతం కలిగించే ఏ చర్య అయినా దుర్మార్గమే! దాన్ని కూకటి వేళ్లతో పెకలించాల్సిందే. తాజా ఘటనను ప్రగతిశీల శక్తులతోపాటు సనాతనవాదిగా మారిన పవన్ కల్యాణ్ సైతం ఖండించారు. ఆయుధాలు పట్టి ఆర్మీలను నడుపుతున్న ఈ అరాచకవాదులను, గోగూండాలను కేంద్రప్రభుత్వం అడ్డుకోకపోగా ప్రత్యక్షంగానో, పరోక్షంగానో అండదండలిస్తోంది? ప్రగతికాములు, లౌకిక ప్రియులు, శాంతి, సామరస్యాలను కోరుకునే వారందరూ ఒక్క గొంతుతో నిరసించాలి. ప్రజాస్వామ్య, అభ్యుదయ సాహిత్యానికి, భావాలకు నెలవైన తెలుగు రాష్ట్రాల్లో ఇటువంటి మతోన్మాద దుశ్చర్యలకు చోటులేదని బిగ్గరగా చాటిచెప్పాలి!

అప్రజాస్వామ్య అమానుష బరితెగింపు

తొండముదిరి ఊసరవెల్లి అయినట్టు అమెరికన్ సామ్రాజ్యవాద పెట్టుబడిదారీ వ్యవస్థ ట్రంప్ రూపంలో అనాగరిక క్రూర చర్యలకు మరల ఒడిగడుతున్నది.

'గాజాను కొంటాం. సొంతం చేసుకుంటాం' అనే మాటలు 21వ శతాబ్దంలోని ప్రజాస్వామ్య శకానికి చెందిన మాటలా? లేక మధ్య యుగాలకు చెందిన బార్బేరియన్ కల్చర్‌కు సంబంధించిన మాటలా? అనేది విజ్ఞత కలిగిన ప్రతి ఒక్కరూ ఆలోచించాల్సిన సందర్భం.

గాజా ప్రాంతమనేది పాలస్తీనియుల జన్మభూమి. ఒక సార్వభౌమిక దేశం. లక్షలాది మంది క్షతగాత్రుల య్యారు. తాత్కాలిక శాంతి ఒప్పందంతో ప్రాణాలు గుప్పెట పట్టుకుని ఇరుగుపొరుగు దేశాల్లో తలదాచుకున్నవారు ఇప్పుడిప్పుడే సొంతగూటికి తరలివస్తున్నారు. యుద్ధ విధ్వంసానికి శిథిలమైన తమ ఇళ్ళను చూసి బావురుమంటున్నారు.

ఈ నేపథ్యంలో ట్రంప్ మాటలు వింటున్న వారికి జుగుప్సకే జుగుప్సకలిగే రీతిలో భీతి కొల్పుతున్నది. ఎంత అమానుషం? ఎంత కండకావరం?



గాజా ప్రజల విషాద స్థితిగతులను గమనించి పొరుగుదేశాలు పంపే ఆహార, వస్తు సామాగ్రిని సైతం ఇజ్రాయిల్ అడ్డుకున్నది. చేతనైతే ఇజ్రాయిల్‌కు బుద్ధిచెప్పాలి. లేకుంటే లేదు. కానీ ఇజ్రాయిల్ తరపున వకాల్తా తీసుకుని గాజా ప్రజలందరిని కట్టగట్టేసి ఎక్కడికో పంపుతాననడం తీవ్ర దురహంకారం. గాజావాసులు జోర్డాన్, ఈజిప్టు, సౌదీ, టర్కీ దేశాలకు పోయి తలదాచుకోవాలట.

ప్రస్తుతం శిథిల శకలాలుగా మారిన గాజా ప్రాంతం కాబోయే ఓ పెద్ద రియల్ ఎస్టేట్ ప్రాంతమని, పొరుగు దేశాల కార్పొరేట్లు కూడా ఈ అభివృద్ధిలో పాలుపంచుకోవచ్చుని, అందుకు తన అనుమతులు ఉంటాయని అంటున్నాడు. కోస్తా తీర ప్రాంతంగా ఉన్న గాజా భూభాగాన్ని సుందరమైన టూరిస్టు ప్రాంతంగా తీర్చిదిద్దుతానని ట్రంప్ ప్రగల్బాలు పలుకుతున్నాడు.

ఫాసిస్టు భయంకర భావజాలంతో ట్రంప్ మాట్లాడే ఈ వాచాలత్వాన్ని ప్రతి ఒక్కరు ఖండించాలి. గాజా నుండి పాలస్తీనియులను వేరు చేయడం, దాన్ని సొంతం చేసుకునే అధికారం ఎవరికీ లేదని, ఈజిప్టు అధ్యక్షుడు ఎర్డోగాన్ అంటున్నాడు. ట్రంప్ బుర్రలోని గాజా రియల్ ఎస్టేట్ ప్లాన్‌ను మన కాలపు అతి పెద్ద అవినీతి కుట్రగా జర్మన్ చాన్సలర్ ఓలాఫ్ షుల్జ్ అభివర్ణించారు. ఇది మానవ నైతిక విలువలకేగాక, అంతర్జాతీయ న్యాయానికి సైతం విరుద్ధ చర్యగా ఆయన పేర్కొన్నారు.

'గాజాను నేను (అమెరికా కాదు) సొంతం చేసుకుంటా. అక్కడ ఎలాంటి ప్రమాదానికి తావులేని రీతిలో సురక్షిత కమ్యూనిటీలను నిర్మిస్తా. గాజాను భవిష్యత్ అవసరాలకు సంబంధించి కారు చౌకగా అభివృద్ధి చేయగల అందమైన భారీ రియల్ ఎస్టేట్ డెవలప్‌మెంట్ వెంచర్‌గా రూపొందిస్తా' అని ట్రంప్ కార్పొరేట్ దిగ్గజాలకు ఎర వేస్తున్నాడు.

అంటే అమెరికాలోనే కాదు అమెరికాతో సంబంధం ఉన్న అన్ని దేశాల్లోనూ కార్పొరేట్ వర్గాన్ని మిగిలిన ప్రజానీకాన్ని బాహాటంగానే విడదీస్తున్నాడు. ట్రంప్ దృష్టిలో కార్పొరేట్ వర్గమే ప్రజలు. మిగిలిన వారంతా బానిసలు లేదా శరణార్థులు. ఎక్కడ ఉండాలి, ఎలా ఉండాలి అనేది ఇకమీదట తానే నిర్ణయిస్తాడన్నమాట. మరి ఇది అప్రజాస్వామ అమానుష బరితెగింపు కాదా..?

అందుకే పాలస్తీనా ప్రజలకు ప్రాతినిధ్యం వహించే హమాస్ ట్రంప్ ప్రకటనను తీవ్రంగా తప్పు పట్టింది. ట్రంప్ ప్రకటన పూర్తిగా మతిలేనిది. పాలస్తీనాపైనా పశ్చిమాసియా ప్రజలపైనా, ఆ పరిస్థితులుపైనా అవగాహనా రాహిత్యానికి ట్రంప్ మాటలు నిదర్శనం. ఎవరో అమ్మడానికి, ఇంకెవరో కొనడానికి గాజా రియల్ ఎస్టేట్ ప్రాపర్టీ కాదు. పాలస్తీనీయుల జన్మభూమి గాజా. మేం ఎన్నటికీ విడిపోలేని మాలోని అంతర్భాగం గాజా. అని హమాస్ నేత ఇజ్జల్ ఆల్‌రిషిక్ వక్కాణించాడు.

కార్పొరేట్ పడగనీడలు కారుమబ్బులా ప్రపంచమంతటా కమ్ముకున్న వేళ ట్రంప్ తెంపరితనం మాటలు ప్రజాస్వామ్య శక్తులను ఒక్కసారిగా ఉలిక్కిపడేలా చేసాయి. అమెరికాకు ఏడు వేల కి.మీ. దూరంలో పాతిక లక్షలుపైగా ప్రజానీకం నివసించే గాజాస్ట్రిప్ ప్రాంతాన్ని ట్రంప్ వ్యక్తిగతంగా కైవసం చేసుకోవాలని ఉవ్విళ్ళూరుతున్నాడు. పాలకవర్గాలకు -కార్పొరేట్ వర్గాలకు మధ్యన ఉన్న సున్నితమైన రేఖను చెరిపేయడానికి పూనుకున్నాడు. రేఖ చెరిగిపోతే పాలన ఉండదు. బహిరంగ దోపిడే.

ఏడాదిన్నరగా ఇజ్రాయిల్ సైన్యాలు గాజాపై యుద్ధదాడులు చేసాయి. టన్నుల కొద్దీ బాంబుల వర్షం కురిపించాయి. స్త్రీలు, పిల్లలతో సహా 47 వేల మందిని పొట్టన పెట్టుకున్నాయి. అయినా కరువు తీరలేదు. ఇజ్రాయిల్‌కు అమెరికా ఎప్పుడూ వత్తాసు పలుకుతూనే ఉన్నది. ఒక పక్క యుద్ధాలకు చరమగీతం పాడుతానని అధికారంలోకి వచ్చిన ట్రంప్ మరల ఇప్పుడు కొత్త విధ్వంసాలకు, వినాశాలకు తెరలేపడం ప్రతి ఒక్కరూ గమనించాలి. మేల్కొనాలి.

- కె శాంతారావు, 9959745723.

నూతన విద్యావిధానమంటే స్కూళ్లు మూయడమేనా?



సుభాషిణి అలీ

కేంద్ర విద్యా మంత్రిత్వ శాఖ ఇటీవలనే జిల్లాల వారీగా విద్యా సంబంధమైన సమాచారాన్ని విడుదల చేసింది. దాంతోపాటే 2023లో-24లో మొత్తం విద్యార్థుల నమోదు డేటా కూడా వుంది. విద్యారంగంలో ఏదో గొప్ప అభివృద్ధి వచ్చేసినట్టుగా ప్రభుత్వం చెప్పుకుంటున్న గొప్పల పస ఏమిటో ఈ సమాచారం తేల్చివేసింది. అంతకు ముందుతో పోలిస్తే 2023-24లో మొత్తం విద్యార్థుల నమోదు కోటికి పైగా తగ్గిపోయినట్టు చెబుతున్నది. 2023-24లో మొత్తం విద్యార్థుల నమోదు 24.8 కోట్లుగా వుంది. అంతకు ముందు ఏడాదితో పోలిస్తే ఇది 37 లక్షల మంది విద్యార్థులు తక్కువగా నమోదయ్యారు. అయితే 2018-19లో స్కూళ్లలో నమోదు 26.02 కోట్లుగా వుంది. తర్వాతి ఏడాది అంటే 2019-20లో ఇది 1.6 శాతం పెరిగి, 26.45 కోట్లకు చేరుకుంది. అంటే 42 లక్షల కంటే ఎక్కువ మంది అదనంగా చేరారన్నమాట. వెనక్కుపోతే 2012-13లో కూడా 26.3 కోట్ల నమోదుగా వుంది. 2012-24 మధ్య దేశ జనాభా పెరుగుదలను కూడా లెక్కలోకి తీసుకుంటే ఈ తగ్గుదల మరింత కొట్టొచ్చినట్టు కనిపిస్తుంది.

2023-24లో మొత్తం విద్యార్థుల నమోదు 24.8 కోట్లుగా వుంది. అంతకు ముందు ఏడాదితో పోలిస్తే ఇది 37 లక్షల మంది విద్యార్థులు తక్కువగా నమోదు కావడాన్ని ఈ నివేదిక విశ్లేషించింది. 21 లక్షల మంది పురుష విద్యార్థులు తక్కువగా నమోదు కాగా సంఖ్య పదహారు లక్షల మంది విద్యార్థినులు విద్యారంగాన్ని వదిలివెళ్లిపోయినట్టు చెబుతున్నది. నమోదు సంఖ్యను లెక్కగట్టడంలో గతంకన్నా మెరుగైన పద్ధతులు తీసుకువచ్చినట్టు మంత్రిత్వశాఖ పేర్కొంటున్నది. బహుశా అంతకు ముందు సంవత్సరాలతో పోలిస్తే సంఖ్యలు తగ్గిపోవడానికి ఇది కారణమై వుండొచ్చునంటున్నది. అయితే ఈ తగ్గుదల ఆందోళనకరమైందనీ ఈ సమస్యను వీలైనంత త్వరగా పరిష్కరించే చర్యలు తీసుకోవాలని ఆ శాఖే చెబుతున్నది.

నూతన విధానంతో పెద్దఎత్తున స్కూళ్ల మూత

బీహార్ ఉత్తరప్రదేశ్, మహారాష్ట్ర వంటి బీజేపీ పాలిత రాష్ట్రాలలో ఈ తగ్గుదల అత్యధికంగా వుందని గమనించడం చాలా ముఖ్యం. 2018-19లో బీహార్‌లో 2.49 కోట్లమంది విద్యార్థులు నమోదుకాగా ఇప్పుడు 2.13 కోట్లకు తగ్గిపోయారు (అంటే 35.65 లక్షల కంటే ఎక్కువగా తగ్గారు). ఉత్తర ప్రదేశ్‌లో 2018-19లో నమోదు 4.44 కోట్లు కాగా తాజా నివేదికలో ఈసారి 28.26 లక్షల మంది తగ్గి ఇప్పుడు 4.16 కోట్లకు చేరుకున్నారు. మహా రాష్ట్రలో గతంలో 2.32 కోట్ల మంది నమోదైతే తాజా నివేదికలో ఆ సంఖ్య 2.13 కోట్లకు పడిపోయింది. ఈ నివేదిక విడుదల తర్వాత ఈ తగ్గుదలకు కారణాలేమిటనే దానిపై వేర్వేరు నిపుణులు వేర్వేరు కారణాలు ముందుకు తెస్తున్నారు. విద్యా విధానంలో మార్పులు, ఆర్థిక కడగండ్ల పెరుగుదల, స్కాలర్‌షిప్ మొత్తాలు సకాలంలో విడుదల చేయకపోవడమో ఎగవేయడమో ముఖ్య కారణాలుగా వస్తున్నాయి.

బీజేపీ ప్రభుత్వం మూడేళ్ల కిందట ప్రవేశపెట్టిన నూతన విద్యావిధానం ప్రయివేటు విద్యకే పెద్దపీట వేసింది. హర్యానా వంటి బీజేపీ పాలిత రాష్ట్రాలు ప్రయివేటు స్కూళ్లలో చేరిన విద్యార్థులకు సబ్సిడీలిచ్చి ప్రభుత్వ స్కూళ్లలో ఫీజులు పెంచాయి. బీజేపీ పాలిత రాష్ట్రాల్లో అత్యధిక భాగం (కాంగ్రెస్, బీజేపీ రెండింటి సర్కార్లు నడిచిన రాజస్థాన్ వంటి రాష్ట్రాలతో సహా) ప్రభుత్వ స్కూళ్లను భారీ ఎత్తున మూసివేయడం లేదా కలిపేయడం జరిగింది. అంటే పిల్లలు మరీ ముఖ్యంగా పేద కుటుంబాలకూ దళితులకూ సంబంధించిన పిల్లలు వెళ్లవలసిన స్కూళ్ల దూరమై పోయాయి. ఎంత దూరమంటే వారు వెళ్లడమే మానుకునేంత. ఇక బాలికల విషయంలో అంత దూరం ప్రయాణించడంలో భద్రతా సమస్యలు మరింత నిరుత్సాహ పరుస్తున్నాయి.2018-19 మధ్య 50 వేలకు పైగా ప్రభుత్వ పాఠశాలలు మూత పడ్డాయని యు.డి.ఐ.ఎస్.సి (యుడైస్) 2022 నివేదిక పేర్కొంటున్నది. 2024లో యూపీ ప్రభుత్వం 27 వేల పాఠశాలలు మూసివేసింది. ప్రత్యేకించి బీహార్, మహారాష్ట్రలో ప్రయివేటు స్కూళ్ల ఉధృతంగా ప్రారంభమవుతున్నాయి. ఈ రెండు రాష్ట్రాల్లో విద్యార్థుల నమోదు తగ్గడం, ఉత్తరప్రదేశ్‌లో స్కూళ్ల మూతలు చూస్తుంటే కేవలం ప్రయివేటు స్కూళ్లలో నమోదు పెరగడం ఒక్కటే సమస్యను పరిష్కరించలేదని అర్థమవుతుంది.

కేరళలో మెరుగైన ఫలితాలు

విద్యార్థుల నమోదు పెంచడానికేగాక వారు కొనసాగేలా చూడాలన్నా ఉచిత ప్రభుత్వ విద్య అందించడం ఏకైక మార్గమని కేరళ అనుభవం మనకు నొక్కి చెబుతుంది. విద్య నాణ్యత పెంచేందుకూ అదే మార్గం. 2021-22లో కేరళలో స్థూల నమోదు నిష్పత్తి (జి.ఇ.ఆర్) 41.3 శాతంగా వుంది. జాతీయ సగటు 28.4 శాతం కన్నా ఇది చాలా ఎక్కువ. ఒక నిర్దిష్ట వయో బృందంలో ఉన్నత విద్యా భాగస్వామ్యం ఏ స్థాయిలో వుందో తెలుసుకోవడానికి జి.ఇ.ఆర్ కీలక సూచిక. తాజాగా 2023-24 నివేదికలో కూడా కేరళ నమోదు సంఖ్యలు ఎంతో ప్రోత్సాహకరంగా వున్నాయి. ఈ రాష్ట్రంలో బాలికల చేరిక అబ్బాయిలను మించి వుండటం నిజంగా ప్రశంసనీయమైన విషయం. విద్యారంగంపై ప్రభుత్వ వ్యయం, ప్రభుత్వ పాఠశాలల్లో వసతుల మెరుగుదల కోసం ప్రభుత్వం పెట్టే ఖర్చు, ఉపకార వేతనాలు సకాలంలో చెల్లించడం, స్కూళ్లలో ఆరోగ్యవంతమైన సుహృద్భావ పూర్వకమైన వాతావరణం కోసం కేటాయింపు ఇవన్నీ విద్యార్థుల నమోదు పెరగడానికి, నిలబడటానికి దోహదం చేస్తున్నాయి.

కనీస సదుపాయాల లేమి

యుడైస్ తాజా నివేదిక వెల్లడించే అంశాలు విద్యార్థుల సమస్యల కోణం నుంచి కూడా చూడాలి. ప్రత్యేకించి పేదలు సామాజికంగా అణగారిన వర్గాల పిల్లలు అనేక రాష్ట్రాల్లో ఎదుర్కొంటున్న పరిస్థితిని పరిశీలించాలి. చాలా స్కూళ్లలో అమ్మాయిలకు ప్రత్యేకంగా మరుగుదొడ్లు కూడా లేవని ఈ నివేదిక చెబుతున్నది. ఉన్నవాటిలో చాలా చోట్ల తలుపులు లేవు. చాలా బడుల్లో మంచినీటి సదుపాయం లేదు. అనేక స్కూళ్ల భవనాలు శిథిలావస్థలో వున్నాయి. తరగతి గదుల్లోకి వేటలుతురే రాదు. కుర్చీలు, టేబుళ్లు కూడా వుండవు. అనేక రాష్ట్రాల్లో ఉపాధ్యాయులు, ప్రిన్సిపాళ్లు, ఉద్యోగులు పిల్లలపై అఘాయిత్యాలకు, లైంగిక దాడులకు పాల్పడిన ఘటనలు



బీజేపీ ప్రభుత్వం మూడేళ్ల కిందట ప్రవేశపెట్టిన నూతన విద్యావిధానం ప్రయివేటు విద్యకే పెద్దపీట వేసింది. హర్యానా వంటి బీజేపీ పాలిత రాష్ట్రాలు ప్రయివేటు స్కూళ్లలో చేరిన విద్యార్థులకు సబ్సిడీలిచ్చి ప్రభుత్వ స్కూళ్లలో ఫీజులు పెంచాయి. బీజేపీ పాలిత రాష్ట్రాల్లో అత్యధిక భాగం (కాంగ్రెస్, బీజేపీ రెండింటి సర్కార్లు నడిచిన రాజస్థాన్ వంటి రాష్ట్రాలతో సహా) ప్రభుత్వ స్కూళ్లను భారీ ఎత్తున మూసివేయడం లేదా కలిపేయడం జరిగింది. అంటే పిల్లలు మరీ ముఖ్యంగా పేద కుటుంబాలకూ దళితులకూ సంబంధించిన పిల్లలు వెళ్లవలసిన స్కూళ్లు దూరమై పోయాయి. ఎంత దూరమంటే వారు వెళ్లడమే మానుకునేంత. ఇక బాలికల విషయంలో అంత దూరం ప్రయాణించడంలో భద్రతా సమస్యలు మరింత నిరుత్సాహ పరుస్తున్నాయి.2018-19 మధ్య 50 వేలకు పైగా ప్రభుత్వ పాఠశాలలు మూత పడ్డాయని యు.డి.ఐ.ఎస్.సి (యుడైస్) 2022 నివేదిక పేర్కొంటున్నది.

జరిగాయి. దేశంలో అత్యధిక చోట్ల స్కూళ్లలో కులవివక్ష సంఘటనలు లెక్కలేనన్ని జరిగాయి.విద్యారంగంలో విచారకరమైన ఈ పరిస్థితికి ఇవన్నీ కారణాలే.

ఏకోపాధ్యాయులు, పారా టీచర్లు

చాలా రాష్ట్రాల్లో ప్రస్ఫుటంగా కనిపించే పెద్ద లోపం ఏకోపాధ్యాయ పాఠశాలలు పెద్ద సంఖ్యలో వుండటం. ఉదాహరణకు ఒకే టీచరు నాలుగు నుంచి ఆరు క్లాసులు ఇంకా ఎనిమిది క్లాసులు కూడా చూసుకునే పరిస్థితి వుంది. ప్రభుత్వ నివేదికల ప్రకారం 2023-24లో భారత దేశంలో ఏకోపాధ్యాయ పాఠశాలలు 1,10,971 వున్నాయి. ఇలాంటి పాఠశాలల్లో 89 శాతం గ్రామీణ ప్రాంతాల్లోనే వున్నాయి. అరుణాచల్ ప్రదేశ్, గోవా, తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, జార్ఖండ్, ఉత్తరాఖండ్, మధ్యప్రదేశ్, రాజస్థాన్‌లలో ఏకోపాధ్యాయ పాఠశాలలు ఎక్కువగా వున్నాయి. హిమాచల్ ప్రదేశ్‌లో ఏకోపాధ్యాయ పాఠశాలలు అధికంగా వుండగా కేరళలో కూడా కొన్ని వున్నాయి. కాని వాటిలో విద్యార్థుల సంఖ్య చాలా తక్కువ. హిమాచల్ ప్రదేశ్‌లో ఏకోపాధ్యాయ పాఠశాలల్లో 20 మంది కన్నా తక్కువగా పిల్లలున్నారు. కేరళలోనైతే వాటిలో సగటున పదిమంది పిల్లలున్నారు. నిజానికి కేరళలో ఏకోపాధ్యాయ పాఠశాలలు అతి తక్కువగా వుండగా వాటిలో పిల్లల సంఖ్య కూడా దేశంలోకెల్లా తక్కువగా వుంది. సగటున ఒక ఏకోపాధ్యాయ పాఠశాలలో 70, బీహార్‌లోనైతే 96 మంది పిల్లలు వున్న పరిస్థితితో పోలిస్తే ఇది చాలా మెరుగు.

అందువల్ల ఇక్కడ ప్రభుత్వ తాజా నివేదికలో ఆందోళన కలిగించేది పిల్లల నమోదు తగ్గిపోవడం ఒక్కటే కాదు. పాఠశాలల్లో వసతులు అధ్వాన్నంగా వుండటం, చాలా స్కూళ్లలో బోధనా ప్రమాణాలు కూడా దారుణంగా వుండటం. ఈ విషయంలోనూ కేరళ పరిస్థితి చాలా మెరుగ్గా వుంది. ఇక్కడ ముఖ్యంగా గమనించాల్సింది ఏమంటే కేరళలో ప్రభుత్వ పాఠశాలల్లో పారాటీచర్లు, కాంట్రాక్టు టీచర్ల నియామకమే లేదు. అక్కడ టీచర్ల ఉద్యోగాలు పర్మనెంటు పోస్టులు. వారు తమ బోధనా నైపుణ్యాన్ని బోధనా పద్ధతులను నిత్యం మెరుగు పర్చుకుంటుంటారు. ఆ ప్రక్రియపై పర్యవేక్షణా నిరంతరంగా సాగుతుంటుంది. దీంతో పోలిస్తే యూపీలో 24 వేల మంది కాంట్రాక్టు పద్ధతిలో ఆదేశాల ఉపాధ్యాయులు వున్నారు. ఎనిమిదో తరగతి వరకూ బోధించేందుకు గాను వీరికి రూ.7వేలిస్తారు. వారిలో చాలా మంది అవసరమైన అదనపు ఆదాయం కోసం టైలర్లు, ఆటో డ్రైవర్లు, దుకాణాల్లో సహాయకులుగా పని చేస్తుంటారు. అంతేగాక 1,42,000 విద్యా మిత్రలను కూడా వార్షిక కాంట్రాక్టు పద్ధతిలో నియమించుకున్నారు. ఏ క్షణంలోనైనా ఉద్యోగం ఊడిపోవచ్చుననే భయంలో కొట్టుమిట్టాడే వారు బోధనపై శ్రద్ధ పెట్టడం ఊహకందని విషయం. ఇంతేగాక ప్రభుత్వ పాఠశాలల్లో లక్షమంది ప్రిన్సిపాళ్లు, టీచర్ల పోస్టులు ఖాళీ పడి వున్నాయి.

చాలా రాష్ట్రాల పాఠశాలల్లో నమోదు తగ్గిపోవడం, విద్యా ప్రమాణాలు నాసిగా వుండటం భవిష్యత్తుపై చాలా హానికర ప్రభావం చూపిస్తాయి. నమోదులోనూ పిల్లలను నిలబెట్టుకోవడంలోనూ కేరళ విజయం ఉత్సాహకరంగా వుంది. దాంతోపాటే ప్రభుత్వ విద్యా వ్యవస్థలో నిరంతరం మెరుగుదల తీసుకురావడం, కూడా విస్తృతంగా ప్రచారం చేయవలసి వుంది. అత్యవసరమైన ఈ మార్పులు సాధించాలంటే ఆ విజయాలకు కారణమైన అక్కడి పద్ధతులను అనుసరించడం కూడా కీలకమవుతుంది.

అసైన్డ్ భూములకు హక్కుపత్రాలివ్వరా?



ఎం.ధర్మనాయక్
9490098685

జీవనోపాధి కోసం ఏండ్లకొద్దీ సాగుచేసుకుంటున్న భూములకు పట్టాలివ్వాలని గిరిజనులు, దళితులు, పేదలు ఎన్నో పోరాటాలు చేశారు. తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటం తర్వాత సర్కార్లు భూమిలేని వారికి చాలాచోట్ల భూపంపిణీ చేశాయి. లావని,బంజారు, డి ఫారెస్టు భూములకు పట్టాలిచ్చాయి. కొంత మంది పేదలకు తర్వాత మిగులు భూములను కూడా 1954-77వ దశకంలో అసైన్డ్ చేసి ఇచ్చింది. అడవిలో చెట్లు, పొదలు, గుట్టలుగా ఉన్న ఆ భూములను ఎంతో కష్టపడి సాగుకు అనువైన భూమిగా సాగులోకి తీసుకొచ్చారు.ఇప్పుడు ఆ భూములపైనే ఆధారపడి కుటుంబాలను పోషించుకుంటున్నారు. అయితే అభివృద్ధి పేరుతో వారు సాగుచేసుకుంటున్న భూము లను అసైన్డ్ ల్యాండ్ పేరుతో సర్కార్లు గుంజుకోవడానికి అనేక కుట్రలు చేస్తున్నాయి. ఇప్పటికే అనేక దఫాలుగా దళిత, గిరిజనుల నుండి ప్రాజెక్టులు, గనులు, బొగ్గు, రోడ్లు, రైలు పట్టాలు, ఇండ్ల స్థలాలు, ఇతర అభివృద్ధి పేరుతో భూములను లాక్కుని గిరిజనులను నిరాశ్రయులుగా మార్చాయి.ప్రత్యామ్నాయంగా పరిహారం, ఉపాధి గానీ చూపలేదు.దీనికి తోడు కబ్జాకోరులు, రియలేస్టేట్ నిర్వాహకులు కూడా అసైన్డ్ భూముల్ని కబ్జాచేసే పనిలో పడ్డారు.అయినప్పటికీ అధికార యంత్రాంగంలో కదలిక లేదు.

రాష్ట్రంలో 24 లక్షల ఎకరాల అసైన్డ్ భూమి ఉన్నది. 15 లక్షల కుటుంబాలు వాటి మీద ఆధారపడి జీవిస్తున్నాయి. అసైన్డ్ భూమి దరఖాస్తులు 18 లక్షలు నిరుపయోగంగానే ఉన్నాయి. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వస్తే అసైన్డ్ భూముల మీద సర్వహక్కులు కల్పిస్తామని అప్పటి పీసీసీ అధ్యక్షుడు, ప్రస్తుత గౌరవముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చేవెళ్ల డిక్లరేషన్‌లో నొక్కిచెప్పారు. అయినప్పటికీ భూములకు రక్షణ లేదు. పేద ప్రజల దగ్గర ఉన్నటువంటి అసైన్డ్ భూమి ఇప్పటికే అరవై శాతం అక్రమణకు గురైంది. రాష్ట్రవ్యాప్తంగా 8476 మంది అక్రమణదారులున్నారని తేలింది. 2007 జనవరి 29 నాటికి ఆక్రమణదారుల లిస్టు కూడా ప్రకటించారు.కానీ, చర్యలు తీసుకోవడంలోససేమిరా అంటున్న పరిస్థితి. 2014 జూన్2 నాటికి అసైన్డ్ భూమి ఎవరి పేర ఉంటే వారిదే అని అంటున్నారు. ఇది పేదల భూముల్ని పెద్దలకు కట్టబెట్టడమే తప్ప వేరేకాదు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం వైకుంఠధామాలు, పార్కులు, ఇండ్ల స్థలాల పేరుతో భూములను గిరిజనుల వద్ద నుంచి గుంజుకుంది. ఇలా ప్రభుత్వాలు తలపెట్టే కార్యక్రమాలన్నింటికీ అసైన్డ్ భూములంటూ లాక్కోవడం పరిపాటిగా మారింది. అసైన్డ్ భూమి, బంజారు, డి ఫారెస్ట్ భూములను వారసత్వంగా అనుభవించాలి తప్ప అమ్మడానికి వీలులేదని రాష్ట్ర సర్కార్ చెబుతున్నది. ఇరవైయేండ్లు భూమిని సాగుచేసుకున్న తర్వాత అమ్ముకోవచ్చని ఏపీ రాష్ట్రం చెబుతున్నది. అలాగే కర్నాటకలో 15, తమిళనాడులో 10, కేరళలో 25, మధ్యప్రదేశ్, యూపీలో పదేండ్ల తర్వాత పూర్తి సర్వ హక్కులు కల్పించేటట్టుగా అక్కడి ప్రభుత్వాలు చట్టాలు చేశాయి. మన రాష్ట్రంలో మూడు తరాల వరకు భూమిని సాగు చేసుకుని, అభివృద్ధి పరచి మార్కెట్ విలువ తీసుకొచ్చినా భూములకు హక్కులు మాత్రం కల్పించలేదు.పైగా అమ్ముకోవడాని వీల్లేదు అంటూ హెచ్చరిస్తోంది. ఇక్కడ అమ్ముకోవడం కూడా లబ్దిదారుల ఉద్దేశం కాదు, ఆస్తిపాస్తుల్లేనివారు గనుక ఆడపిల్లల పెండ్లిళ్లకు నానా అగచాట్లు పడాల్సిన పరిస్థితి ఉంది.


అసైన్డ్ భూములపై బడాబాబుల కన్ను!

నాగార్జునసాగర్ పునరావాస బాధితులకు మట్టంపల్లి మండలం గుర్రంపోడ్ ప్రాంతంలో 1959లో ఆరు తండాలకు చెందిన 62 మందికి 1832 అసైన్డ్ భూములివ్వగా 350 కుటుంబాలు ఆ భూముల్ని కొంతకాలం సాగుచేసుకున్నాయి. కృష్ణా రివర్ దగ్గర బ్యాక్ వాటర్ ఉండటంతో బడాబాబుల కన్నుపడింది. కర్నూలు జిల్లాకు చెందిన రియల్ ఎస్టేట్ వ్యాపారి సిమెంట్, మైనింగ్ ఫ్యాక్టరీలను పెట్టాలని ప్లాన్ చేయడంతో అక్కడి గిరిజనులు ఆందోళనలు చేశారు. అసైన్డ్ భూములకు సర్కార్ నేటికీ పట్టా పాస్‌బుక్కులివ్వలేదు. దీంతో అందులో పన్నెండు వందల ఎకరాలు కబ్జాకు గురయ్యాయి. భూములు కాపాడేందుకు ఉద్యమించిన గిరిజనులపై కేసులు పెట్టారు. రామచంద్రాపురం తండా, బొజ్జ తండా, గుర్రంపోడు తండా, భీమ్లా తండా, మంచి తండావాసులు చాలామంది జైలు పాలయ్యారు.ఇప్పటికీ కేసుల చుట్టూ తిరుగుతున్నారు. మట్టంపల్లి నుంచి పన్నెండు కిలోమీటర్ల దూరంలో ప్రస్తుతం భూసేకరణ కొనసాగుతున్నది. చందంపేట మండలం పొగిళ్ల గ్రామ పరిధిలో మూడు వేల జనాభా కలిగి ఉన్నది. గ్రామస్తులంతా నాగార్జునసాగర్ నిర్వాసితులే. అక్కడంతా అసైన్డ్, ఫారెస్ట్ భూములే. ఇప్పుడు నాగార్జునసాగర్ బ్యాక్ వాటర్ ఉండటంతో జంతువుల్ని రక్షించాలని, పులులు తిరుగుతున్నాయనే పేరుతో అడవుల్లోనుంచి గిరిజనుల్ని తరిమేసే కుట్ర చేస్తున్నారు. ఇక్కడ నివసించే గిరిజనులంతా హైదరాబాద్, గుంటూరు ప్రాంతాల్లో రిక్షా తొక్కుతూ తమ కుటుంబాలను పోషిం చుకున్నారు. తమ వ్యవసాయ పొలాన్ని అభివృద్ధి చేసుకున్నారు, కూలీనాలీ చేసి ఒక్కోపైసా పోగేసుకుని ఇండ్లు కట్టుకున్నారు. వాటి ధర ఇప్పుడు రూ.30 నుంచి 40 లక్షల వరకు పలుకుతున్నాయి. భూములకు రెట్టింపు ధర పెరిగింది. బ్యాక్ వాటర్ దగ్గరుందని, అభివృద్ధి పేరుతో ప్రయివేటు వారికి భూములకు కట్టబెట్టేందుకు ప్రయత్నించడం చూస్తే పాలకులు ప్రజల పక్షమా? లేదంటే కబ్జాకోరుల పక్షమా అనేది అర్థం కాని పరిస్థితి. గ్రామస్తులందరినీ రంగారెడ్డి జిల్లా యాచారం మండలం ముదిగొండ దగ్గర పునరావాస కేంద్రం ఏర్పాటు చేసి భూమి, ఇండ్లు ఇస్తామని, అక్కడికి వెళ్లాలని గిరిజనుల్ని భయాందోళనకు గురిచేస్తున్నారు.

టైగర్ జోన్ పేరుతో గిరిజనుల్ని తరిమేసే కుట్ర

నాగర్‌కర్నూల్ జిల్లా అమ్రాబాద్ టైగర్ ఫారెస్ట్, ఏజెన్సీ ప్రాంతమంతా అసైన్డ్ భూములే. ఇక్కడ యురేనియం నిక్షేపాల కోసం బాక్సైట్ తవ్వకాలు చేపట్టారు. గిరిజనులు పెద్ద ఎత్తున ఆందోళన చేయడంతో కాస్త వెనక్కి తగ్గారు. అయితే ఇక్కడి చెట్లు, జంతువులు, పక్షులు, వనమూలికలు హైదరాబాదుకు వచ్చే కృష్ణానది నీరు మానవాళి జీవనానికి ఎంతగానో తోడ్పడుతుంది. యురేనియం తవ్వకాలు చేపడితే గాలి, వాతావరణం అంతా కాలుష్యమై చుట్టు పక్కల జనజీవనం అనేక రోగాల బారిన పడుతారు. ఇక్కడ కూడా అసైన్డ్ భూములని, టైగర్ జోన్ పేరుతో గిరిజనుల్ని తరిమేసే కుట్ర చేస్తున్నారు. రంగారెడ్డి జిల్లా ముచ్చర్లలో ఫార్మా, వికారాబాద్ జిల్లా లగచర్లలో పారిశ్రామిక కారిడార్, దామగుండంలో ఏర్పాటు చేయనున్న రాడర్ వ్యవస్థకు అసైన్డ్ భూములే సేకరిస్తున్నారు. ఇంకా పోలేపల్లి, హకీంపేట ప్రాంతాల్లో వందల ఎకరాలు భూములు కాజేసి ఫ్యాక్టరీలు, ఫార్మా కంపెనీలు నెలకొల్పేందుకు ప్రయత్నాలు ముమ్మరం చేస్తున్నారు. ఇదంతా కూడా ఆ చుట్టుపక్కల ఉన్న బడా బాబుల భూములు రేట్లు పెంచడం కోసమేనని గిరిజనులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికే సంగారెడ్డి జిల్లా రామచంద్రపురం మండలం వెలిమల గ్రామంలో నలభై కుటుంబాల అసైన్డ్ భూమి 442 ఎకరాల భూమిని కబ్జా చేశారు. ఇది అసైన్డ్ భూమి అంటూ వారిని రాకుండా ప్రహరీ కడుతున్నారు.అయినప్పటికీ అధికారులు పట్టించుకోవడం లేదు. పైగా అడ్డు కోవడానికి చూస్తే దాడులు చేశారని, మర్డర్ కేసులు పెట్టి బాధితులను అనేక రకాలుగా హింసిస్తున్నారు. అయితే ఇక్కడ ముఖ్యమైన విషయం ఏంటంటే? గిరిజనులకు సాగు చేసుకోవడానికి ఎప్పుడో ఏండ్ల క్రితం ఇచ్చిన భూమి ప్రభుత్వ ఆధీనంలో ఉందని, అభివృద్ధి కోసమని ఇప్పుడు లాక్కోవాలని చూడటం సరైందేనా? దీని వెనుక ఉన్నది భూ బకాసూరులు కాదా? ఈ భూమినంతా కూడా కార్పొరేట్ శక్తులకు అప్పజెప్పే కుట్రేనన్నది వాస్తవం.అందుకే అసైన్డ్ భూములకు హక్కుపత్రాలివ్వాలి.ఈ భూముల రక్షణకు సంఘటితంగా ఉద్యమించాలి.

రంగారెడ్డి జిల్లా ముచ్చర్లలో ఫార్మా, వికారాబాద్ జిల్లా లగచర్లలో పారిశ్రామిక కారిడార్, దామగుండంలో ఏర్పాటు చేయనున్న రాడర్ వ్యవస్థకు అసైన్డ్ భూములే సేకరిస్తున్నారు. ఇంకా పోలేపల్లి, హకీంపేట ప్రాంతాల్లో వందల ఎకరాలు భూములు కాజేసి ఫ్యాక్టరీలు, ఫార్మా కంపెనీలు నెలకొల్పేందుకు ప్రయత్నాలు ముమ్మరం చేస్తున్నారు. ఇదంతా కూడా ఆ చుట్టుపక్కల ఉన్న బడా బాబుల భూములు రేట్లు పెంచడం కోసమేనని గిరిజనులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.



కాంగ్రెస్ వైఖరే బీజేపీకి బలం

పొత్తులు పొత్తులే పోరాటం పోరాటమే

- కార్పొరేట్లకు దోచిపెట్టడమే సబ్‌కా సాత్ సబ్‌కా వికాసా? :సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు



నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

కాంగ్రెస్ అనుసరిస్తున్న రాజకీయ వైఖరే బీజేపీకి బలంగా మారుతున్నదని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు విమర్శించారు. కాంగ్రెస్‌తో పొత్తులున్నప్పటికీ ప్రజా సమస్యలపై తమ పార్టీ పోరాడుతుందని స్పష్టం చేశారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో తమను కాంగ్రెస్ కలుపుకుని పోకపోతే బలమున్న చోట పోటీచేస్తామనీ, కలుసొచ్చే పార్టీలతో పొత్తు పెట్టుకునే అంశాన్ని పరిశీలిస్తామని చెప్పారు. పదేండ్లుగా కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ సర్కారు హిందూవుల్లోని పేదల అభ్యున్నతికి ఏం చేసిందని ప్రశ్నించారు. 99 శాతంగా ఉన్న పేద, మధ్యతరగతి ప్రజల బతుకులను వినాశనం చేస్తూ ఒక్క శాతమున్న కార్పొరేట్ శక్తులకు దేశ సంపద దోచిపెట్టడం సబ్‌కా సాత్ సబ్‌కా వికాస్ ఎలా అవుతుందని నిలదీశారు. బుధవారం హైదరాబాద్‌లోని మఖ్దూం భవన్‌లో రాష్ట్ర కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడారు. ఇండియా కూటమితో పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీ బలాన్ని తగ్గించగలిగామన్నారు. ఆ తర్వాత కాంగ్రెస్ వైఖరితో పాటు కేజ్రీవాల్ మొండితనం వల్లనే ఢిల్లీలో బీజేపీ గెలిచిందని చెప్పారు. ఆ ఫలితాలతో బీజేపీ మరింత రెచ్చిపోయే ప్రమాదముందని హెచ్చరించారు. ఇప్పటికైనా కాంగ్రెస్ ఉదారభావంతో వ్యవహరించి ఇండియా కూటమిని ఏకతాటిపై నడిపే చర్యలు తీసుకోవాలని సూచించారు. లేకపోతే దేశ ప్రజాస్వామ్యానికే పెనుముప్పు వస్తుందని హెచ్చరించారు. చిలుకూరి బాలాజీ దేవాలయం ప్రధాన అర్చకులు రంగరాజన్‌పై రామరాజ్యం సంస్థ ముసుగు ధరించి దాడులు చేసిన వారిని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు.

మావోయిస్టులపై కేంద్ర సర్కారు వ్యవహరిస్తున్న తీరును కూనంనేని తప్పుబట్టారు. దీనిపై అంతర్జాతీయ న్యాయస్థానంతో పాటు ఐక్యరాజ్య సమితి జోక్యం చేసుకుని అమిత్‌షాను శిక్షించాలని కోరారు. సుప్రీంకోర్టు సైతం విచారణ జరిపించాలని విజ్ఞప్తి చేశారు. ఈ దేశంలో విప్లవం ద్వారా రాజ్యాధికం వచ్చే పరిస్థితులు ప్రస్తుతం లేవనీ, ఈ నేపథ్యంలో మావోయిస్టులు పునరాలోచన చేసుకోవాలని కోరారు. ఎన్నికల సమయంలో ఆర్టీసీ కార్మికులకు ఇచ్చిన హామీలను తక్షణమే నెరవేర్చి సమ్మెను నివారించాలని రేవంత్‌రెడ్డి సర్కార్‌కు సూచించారు. ఎలక్ట్రికల్ బస్సుల నిర్వహణను ఆర్టీసీ సంస్థకే అప్పగించాలని డిమాండ్ చేశారు. కరీంనగర్ పట్టభద్రుల ఎమ్మెల్సీ స్థానానికి కాంగ్రెస్‌కు సంపూర్ణ మద్దతు ప్రకటిస్తున్నామన్నారు. ఉపాధ్యాయ ఎమ్మెల్సీ స్థానాలపై త్వరలో నిర్ణయం ప్రకటిస్తామని చెప్పారు. ప్రజాప్రతినిధుల పట్ల రాష్ట్ర ప్రభుత్వ అధికారులు, మంత్రులు వ్యవహరిస్తున్న తీరు సరిగా లేదన్నారు. రైతుల కోసం కాంగ్రెస్ ప్రభుత్వం భారీ మొత్తంలో ఖర్చు చేస్తున్నప్పటికీ దానిని వివరించడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని తన అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. రూ.2 లక్షలలోపు ప్రతిఒక్కరికీ మాఫీ చేసి ఉంటే ప్రభుత్వానికి మంచి పేరు వచ్చి ఉండేదన్నారు. సుప్రీంకోర్టులో ఉన్న రిజర్వేషన్లపై 50 శాతం సీలింగ్ అధిగమించేందుకు న్యాయ పోరాటం చేయాలని సూచించారు. కుల గణన సర్వేపై విమర్శలొస్తున్న నేపథ్యంలో గ్రామ సభలు పెట్టి సరిదిద్దాలని ప్రభుత్వాన్ని కోరారు. అక్రమ వలసల పేరుతో అమెరికా ప్రభుత్వం భారత ప్రజల పట్ల వ్యవహరిస్తున్న తీరును ఖండించారు. 104 మంది భారతీయులను అమానవీయంగా సంకెళ్లు వేసి, సైనిక విమానాల్లో దేశంలో వదలిపెడితే దీనిపై కేంద్ర ప్రభుత్వం కనీసం స్పందించకపోవడం దారుణమన్నారు. నిరుద్యోగులు మోసపోకుండా ఏజెంట్లను కట్టడి చేయాల్సిన బాధ్యత పాలకులపై ఉందని చెప్పారు.

ధృవ నారాయణ మరణం పట్ల మాస్‌లైన్ సంతాపం

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్ కేంద్ర కమిటీ సభ్యులు, బీహార్‌కు చెందిన ధృవ నారాయణ మంగళవారం రాత్రి ఆకస్మికంగా మరణించారని ఆ పార్టీ తెలిపింది. ఆయన మరణం పట్ల విప్లవ జోహార్లు అర్పించింది. ఈ మేరకు సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్ రాష్ట్ర కార్యదర్శి పోటు రంగారావు బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఆయన విప్లవోద్యమంలో సీనియర్ నాయకుడనీ, ఎన్నో పోరాటాలు చేశారని గుర్తు చేశారు. నక్సల్బరీ ఉద్యమం, సత్యనారాయణసింగ్‌తో ప్రభావం పొందారని తెలిపారు. ఆయన మరణం పట్ల సంతాపం ప్రకటిస్తున్నామని పేర్కొన్నారు. ఆయన విప్లవ ఆశయాల సాధన కోసం కృషి చేస్తామని తెలిపారు.

ఎమ్మెల్సీ ఎన్నికల్లో రియల్‌ఎస్టేట్, కార్పొరేట్ శక్తులను ఓడించండి

- టికెట్ అమ్ముకున్న పీఆర్టీయూటీఎస్ : ఎమ్మెల్సీ కూర రఘోత్తంరెడ్డి

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలో ఈనెల 27న జరిగే ఎమ్మెల్సీ ఎన్నికల్లో రియల్‌ఎస్టేట్, కార్పొరేట్ శక్తులను ఓడించాలని ఎమ్మెల్సీ కూర రఘోత్తంరెడ్డి పిలుపునిచ్చారు. బుధవారం హైదరాబాద్‌లో సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ పీఆర్టీయూటీఎస్ ఎమ్మెల్సీ టికెట్‌ను రియల్ ఎస్టేట్ వ్యాపారికి అమ్ముకుందని ఆరోపించారు. ప్రభుత్వ పాఠశాలలు, విద్యార్థులు, ఉపాధ్యాయుల సమస్యలు రియల్ ఎస్టేట్ వ్యాపారి, కార్పొరేట్ విద్యాసంస్థల అధినేతకు ఎలా తెలుస్తాయని ప్రశ్నించారు. తాను ఉపాధ్యాయునిగా 30 ఏండ్లపాటు పనిచేశానని చెప్పారు. తాను ఎమ్మెల్సీగా ఉన్న ఈ ఆరేండ్లలో అనేక సమస్యల పరిష్కారానికి కృషి చేశానని అన్నారు. మరోసారి ఎమ్మెల్సీ అభ్యర్థిగా పోటీ చేస్తున్నానని చెప్పారు. ఉపాధ్యాయులు, అధ్యాపకులు మొదటి ప్రాధాన్యతా ఓటుతో గెలిపించాలని కోరారు. రాష్ట్రంలో పెద్ద సంఘం అని చెప్తున్న పీఆర్టీయూటీఎస్‌కు రాష్ట్ర అధ్యక్షుడు లేరని ఆరోపించారు. ప్రస్తుతం ఉన్న అధ్యక్షుడు శ్రీపాల్‌రెడ్డి ఉద్యోగానికి రాజీనామా చేసి ఎమ్మెల్సీగా పోటీ చేస్తున్నారని వివరించారు. ఎన్నికల్లో ఓడిపోతే ప్రభుత్వంతో పైరవీ చేసి ఉపాధ్యాయ ఉద్యోగం తెచ్చుకుని మళ్లీ రాష్ట్ర అధ్యక్షునిగా కొనసాగాలని భావిస్తున్నారని అన్నారు. 2019లో నల్లగొండ ఉపాధ్యాయ నియోజకర్గంలో, 2023లో హైదరాబాద్ ఉపాధ్యాయ నియోజకవర్గంలో పీఆర్టీయూటీఎస్ ఓడిపోయిందన్నారు. పెద్ద సంఘం ఎలా అవుతుందని ప్రశ్నించారు. నల్లగొండ ఉపాధ్యాయ నియోజకవర్గంలో పూల రవీందర్‌కు మద్దతు ఇస్తున్నట్టు ప్రకటించారు. కరీంనగర్‌లో తనకు హర్షవర్ధన్‌రెడ్డి మదతిస్తున్నారని గుర్తు చేశారు. డీఎస్సీ-2003 ఉపాధ్యాయులకు పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని కోరారు. కాంగ్రెస్ హామీ ఇచ్చినట్టుగా సీపీఎస్‌ను రద్దు చేయాలని చెప్పారు.

మోడల్ స్కూల్ టీచర్లకు 010 పద్దు కింద వేతనాలివ్వాలి

- ఎమ్మెల్సీ అభ్యర్థి మల్క కొమరయ్య

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలో మోడల్ స్కూళ్లలో పనిచేస్తున్న ఉపాధ్యాయులకు 010 పద్దు కింద వేతనాలను చెల్లించాలని మెదక్-నిజామాబాద్-ఆదిలాబాద్-కరీంనగర్ ఉపాధ్యాయ నియోజకవర్గం బీజేపీ ఎమ్మెల్సీ అభ్యర్థి మల్క కొమరయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. వారు ప్రభుత్వ ఉద్యోగులుగా ఉన్నా ప్రతినెలా ఒకటో తేదీన జీతాలు తీసుకోవడం లేదని బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. మోడల్ స్కూళ్లు ఏర్పడి 12 ఏండ్లు అవుతున్నదనీ, ఇప్పటి వరకు 37 మంది ఉపాధ్యాయులు మరణించారని పేర్కొన్నారు. వారి కుటుంబాలకు ప్రభుత్వం ఎలాంటి సౌకర్యాలు అందడం లేదని తెలిపారు. కారుణ్య నియామకాలను చేపట్టాలని కోరారు. మోడల్ స్కూల్ ఉపాధ్యాయులు, సిబ్బందికి ఆరోగ్య కార్డులను ఇవ్వాలనీ, మెడికల్ రీయింబర్స్‌మెంట్ సౌకర్యం కల్పించాలని పేర్కొన్నారు. నోషనల్ సర్వీసు కల్పించాలని తెలిపారు. పదోన్నతుల ప్రక్రియను నిర్వహించాలని పేర్కొన్నారు.

పట్టణ ప్రాంతాలకు

మార్గదర్శకాలు ఎప్పుడో?

లక్షల్లో ఇందిరమ్మ దరఖాస్తులు పెండింగ్

- 90 శాతానికి పైగా జాగాల్లేవు
- అధికారుల్లో స్పష్టత కరువు

నవతెలంగాణ ప్రత్యేక ప్రతినిధి- హైదరాబాద్

గ్రేటర్ హైదరాబాద్ సహా పట్టణ ప్రాంతాల్లో ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ ప్రక్రియ తీవ్ర ఆలస్యమవుతున్నది. కాగా రాష్ట్ర ప్రభుత్వం ఇంతవరకూ మార్గదర్శకాలూ జారీ చేయలేదు. ఒక్కో నియోజకవర్గంలో 3,500 చొప్పున ఇండ్లు నిర్మించాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకున్న సంగతి తెలిసిందే. గ్రేటర్‌లోని 25 నియోజక వర్గాలతోపాటు గ్రేటర్ వరంగల్, కరీంనగర్, ఖమ్మం, నిజామాబాద్ తదితర జిల్లాల్లోని 40 అర్బన్ నియోజకవర్గాల్లో లక్షల సంఖ్యలో దరఖాస్తులు వచ్చినా, మార్గదర్శకాలు లేకపోవడంతో అవి పెండింగ్‌లో పెట్టాల్సిన పరిస్థితులు ఏర్పడ్డాయి.

ఇందిరమ్మ ఇండ్ల పథకానికి సుమారు 82 లక్షల దరఖాస్తులు వచ్చాయని అధికారిక సమాచారం. మొదటిదశలో జాగా ఉన్నవారికే ఇండ్లు కేటాయించాలని ప్రభుత్వం నిర్ణయించడంతో పట్టణ ప్రాంతాల్లోని పేదలు ఇల్లు పొందే అర్హత కోల్పోతున్నారు. పట్టణ ప్రాంతాల్లో ఎక్కువశాతం మురికివాడల్లో నివసిస్తున్న పేదలకు సొంత ఇంటి జాగాలు లేవు. అనాదిగా ప్రభుత్వ భూముల్లోనే గుడిసెలు, కచ్చా ఇండ్లు నిర్మించుకొని కాలం వెళ్లదీస్తున్నారు. ఎంతోకాలంగా వారు అక్కడే ఉంటుండడంతో కరెంటు కనెక్షన్లు, నల్లా కనెక్షన్లు కూడా మంజూరయ్యాయి. అయితే, ఇందులో చాలామందికి ఇండ్ల పట్టాలు కానీ, ఇంటి జాగాకు సంబంధించిన యాజమాన్య హక్కులను కల్పించే ధవపత్రాలు అందుబాటులో లేవు. ఉదాహరణకు గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో 10లక్షలకుపైగా దరఖాస్తులు రాగా, అందులో 90శాతం మందికి సొంత జాగాలు లేవు. వరంగల్, కరీంనగర్, ఖమ్మం తదితర పట్టణాల్లో సైతం ఇంచుమించు ఇదే పరిస్థితి ఉన్నట్టు సమాచారం. ఇందులో సింహభాగం ప్రభుత్వ జాగాల్లో గుడిసెలు నిర్మించుకొని ఉంటున్నవారు కాగా, మిగిలినవారు అద్దె ఇండ్లల్లో ఉంటున్నవారు ఉన్నారు. రాష్ట్రవ్యాప్తంగా దాదాపు 40 నియోజకవర్గాల్లో జాగా లేనివారి దరఖాస్తులే ఎక్కువగా ఉన్నట్టు అధికారులు తెలిపారు. దీంతో ఇందిరమ్మ ఇండ్ల పథకానికి వారు అర్హత కోల్పోయినట్టు చెప్పారు.

పట్టణాల్లో రెండు విధాలుగా ఇండ్ల నిర్మాణం

దేశంలోని వివిధ నగరాలు, పట్టణ ప్రాంతాల్లో రెండు విధాలుగా ప్రభుత్వాలు ఇండ్లను నిర్మించి ఇస్తున్నాయి. ప్రభుత్వ జాగాల్లో అపార్ట్‌మెంట్లు నిర్మించి ఇవ్వడం ఒక విధానమైతే, ప్రస్తుతం వారు నివసిస్తున్న ప్రదేశంలోనే వారిని ఖాళీ చేయించి అదేచోట(ఇన్ సిటూ విధానం) అపార్ట్‌మెంటు నిర్మించి అందరికీ కేటాయించడం మరో విధానం. జియాగూడ, సికింద్రాబాద్ ప్రాంతాల్లో గత ప్రభుత్వం ఇన్‌సిటూ విధానంలో అపార్ట్‌మెంట్లు నిర్మించింది. అలాగే, ఇతర మురికివాడల్లో నివసిస్తున్న వారికి ప్రభుత్వ జాగాలు ఉన్నచోట డబుల్ బెడ్‌రూమ్ ఇండ్లను నిర్మించి ఇచ్చింది. ఇలా గ్రేటర్‌లోని పేదలకు దాదాపు లక్ష ఇండ్లను ప్రభుత్వం కట్టింది. కాగా, ప్రస్తుతం ప్రభుత్వం జాగాలు లేవనే కారణంతో పట్టణ పేదలకు ఇండ్లను మంజూరు చేయకుండా, ఇంతవరకు వారికోసం సరైన మార్గదర్శకాలు జారీ చేయకుండా కాలయాపన చేయడం తీవ్ర విమర్శలకు తావిస్తున్నది.

ప్రతి గడపకూ

వర్గీకరణ ఫలాలు చేరాలి



ఎమ్మెల్యేలు, నాయకులదే ఆ బాధ్యత

మాదిగ ఎమ్మెల్యేలు, నాయకులకు మంత్రి రాజనర్సింహ దిశానిర్దేశం

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

ప్రతి గడపకూ వర్గీకరణ ఫలాలు చేరాలని రాష్ట్ర వైద్యారోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ ఆకాంక్షించారు. ఎమ్మెల్యేలు, నాయకులదే ఆ బాధ్యత అని తెలిపారు. మాదిగ సామాజికవర్గ ఎమ్మెల్యేలు, నాయకులకు ఆయన దిశానిర్దేశం చేశారు. అసమానతలు రూపుమాపేందుకే వర్గీకరణ తప్ప అది ఎవరికీ వ్యతిరేకం కాదని చెప్పారు. శాస్త్రీయ అధ్యయనం తర్వాతే కమిషన్ అన్ని వర్గాలకు న్యాయం చేసేలా మూడు గ్రూపులుగా వర్గీకరణ చేయాలని సూచిస్తూ నివేదిక సమర్పించిందని స్పష్టం చేశారు.

బుధవారం ఎమ్మెల్యేలు కడియం శ్రీహరి, లక్ష్మీకాంతరావు, అడ్లూరి లక్ష్మణ్, మందుల సామెల్, వేముల వీరేశం, కవ్వంపల్లి సత్యనారాయణ, కాలె యాదయ్య, మాజీ ఎమ్మెల్సీ రాజేశ్వరరావు తదితరులతో మంత్రి హైదరాబాద్‌లోని మినిస్టర్ క్వార్టర్స్‌లో భేటీ అయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దశాబ్దాల ఎస్సీ వర్గీకరణ ఆకాంక్షను నెరవేరుస్తున్న సందర్భంగా మంత్రికి వారు కృతజ్ఞతలు తెలిపారు. వర్గీకరణను ముందుకు తీసుకెళ్లే అంశంపై మంత్రితో వారు చర్చించారు. వర్గీకరణలో అవలంభించిన శాస్త్రీయ పద్ధతులను ప్రజలకు వివరంగా చెప్పాలలని మంత్రి వారిని కోరారు. ఇతరులు సృష్టించే అపోహలను, అనుమానాలను నమ్మి ప్రజలు ఆందోళనకు గురికాకుండా చూసే బాధ్యత ఎమ్మెల్యేలది, మాదిగ సామాజిక వర్గ నాయకులదేనన్నారు.

వర్గీకరణకు కాంగ్రెస్ పార్టీ మొదట్నుంచీ మద్దతుగా నిలిచిందని మంత్రి గుర్తు చేశారు. 2005లో అసెంబ్లీలో వర్గీకరణకు అనుకూలంగా మాజీ సీఎం వైఎస్ఆర్ తీర్మానం చేశారని గుర్తుచేశారు. ఈ తీర్మానం ఆధారంగా 2006లో నాటి యూపీఏ ప్రభుత్వం జస్టిస్ ఉషా మెహ్రా కమిషన్ వేసిందన్నారు. 2006లో దవిందర్ సింగ్ వేసిన కేసులో, వర్గీకరణకు అనుకూలంగా కాంగ్రెస్ ప్రభుత్వం తన వాదనను వినిపించిందని చెప్పారు. 2018లో రాహుల్ గాంధీ వర్గీకరణకు అనుకూలంగా ఉన్నామనీ, హైదరాబాద్‌లో జరిగిన ఎడిటర్ మీట్‌లో చెప్పారని తెలిపారు. 2023లో చేవెళ్లలో జరిగిన ఎస్సీ డిక్లరేషన్ సభలో, పార్టీ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే స్వయంగా వర్గీకరణకు అనుకూలంగా ప్రకటన చేశారని చెప్పారు. 2023 డిసెంబర్‌లో అధికారంలోకి వచ్చిన వెంటనే, సుప్రీంకోర్టులో వర్గీకరణకు అనుకూలంగా వాదించేందుకు సీనియర్ అడ్వకేట్‌ను సీఎం రేవంత్‌రెడ్డి నియమించారని తెలిపారు. 2006 నుంచి పెండింగ్‌లో ఉన్న కేసులో, 2024 ఆగస్టు ఒకటిన తీర్పు వచ్చిందనీ, తీర్పు వచ్చిన గంట లోపలే వర్గీకరణకు అనుకూలంగా సీఎం రేవంత్‌రెడ్డి ప్రకటన చేశారని మంత్రి దామోదర గుర్తు చేశారు. ఆ వెంటనే క్యాబినెట్ సబ్ కమిటీని, వన్ మ్యాన్ జ్యుడీషియల్ కమిషన్‌ను నియమించారన్నారు.

ఆ కమిషన్ సుప్రీంకోర్టు తీర్పునకు అనుగుణంగా, జనాభా, విద్య, ఉద్యోగ, ఉపాధి, ఆర్థిక, సామాజిక స్థితిగతులను అధ్యయనం చేసిందని తెలిపారు. ఆన్‌లైన్‌లో, ఆఫ్‌లైన్‌లో సుమారు 8 వేలకుపైగా వినతులను తీసుకుని, వాటిని క్రోడీకరించిందన్నారు. అన్నిరకాల విశ్లేషణలు, అధ్యయనం తర్వాత శాస్త్రీయంగా రూపొందించిన రిపోర్టును అందించిందని తెలిపారు. కమిషన్ రిపోర్ట్ ఇచ్చిన మరునాడే అసెంబ్లీలో సీఎం వర్గీకరణకు అనుకూలంగా తీర్మానం చేశారని మంత్రి గుర్తు చేశారు. కోర్టు తీర్పు వచ్చిన 6 నెలల్లోనే ఈ ప్రక్రియను పూర్తి చేసినట్టు చెప్పారు. ఇది కాంగ్రెస్ అంకితభావమనీ, సీఎం రేవంత్‌రెడ్డికి మాదిగల పట్ల ఉన్న చిత్తశుద్ధికి నిదర్శనమని ప్రజలకు చెప్పాలని ఎమ్మెల్యేలకు మంత్రి దిశానిర్దేశం చేశారు.

ప్రతి కులానికి న్యాయం చేసేలా వర్గీకరణ ఉందని మంత్రి తెలిపారు. అత్యంత వెనుకబడిన 15 కులాలను గ్రూప్ వన్‌లో, మధ్యస్తంగా ఉన్న 18 కులాలను గ్రూప్2లో, కొంత మెరుగ్గా ఉన్న కులాలను గ్రూప్3లో చేర్చాలని కమిషన్ సూచించిందని చెప్పారు. కమిషన్ సూచించినట్టుగా అన్ని వర్గాలకు సమన్యాయం చేసేలా వర్గీకరణ జరుగుతోందన్నారు. మాదిగ, మాదిగ సామాజిక వర్గాల దశాబ్దాల ఆకాంక్ష నెరవేరుతున్న ఈ తరుణాన్ని పండుగలా జరుపుకోవాలన్నారు. వర్గీకరణ విజయోత్సవాల్లో అందరూ పాల్గొనేలా చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యేలకు మంత్రి సూచించారు. సమావేశంలో ప్రొఫెసర్ మల్లేశం, టీపీసీసీ నాయకులు విజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఇసుక అక్రమ రవాణాపై

డేగ కన్ను



నగరంలోని ప్రతి అడ్డాలో అధికారుల తనిఖీ

- పాత పద్ధతిని రద్దుచేసి కాంట్రాక్టర్ల వ్యవస్థ
- ఇసుక క్వారీలను అప్పగించబోతున్నట్టు వదంతులు
- అయోమయంలో లారీ యజమానులు

నవతెలంగాణ- ఉప్పల్

రాష్ట్రంలో ఇసుక పాలసీలో పాత వ్యవస్థను రద్దుచేసి కాంట్రాక్టర్ల వ్యవస్థకు ఇసుక క్వారీలను అప్పగించ బోతున్నట్టు వారం రోజులుగా వదంతలు వ్యాపిస్తున్న క్రమంలో వేలాది మంది లారీ యజమానులు, ప్రత్యక్షంగా, పరోక్షంగా ఉపాధి పొందుతున్న వారు ఆందోళనకు గురవుతున్నారు. ముఖ్యంగా ఇసుక బుకింగ్ కోసం ఆన్‌లైన్‌లో డీడీలు బుక్ చేస్తున్నవారు, నిరుద్యోగ యువత భయాందోళనకు గురవుతున్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక, మొదటి ఆరు నెలలు పాసింగ్ విధానం అమల్లోకి తీసుకొచ్చిన విషయం తెలిసిందే. దీని వల్ల లారీ యజమానుల జీవితాల్లో ఆనందం నెలకొంది. అయితే ఆ ఆనందం ఆరు నెలల్లోనే అడియాశగానే మిగిలింది. ఇసుక క్వారీల్లో చోటా మోటా నాయకుల పైరవీలు, కాంట్రాక్టర్లు, దళారుల వ్యవస్థతో ఇసుక లారీ యజమానుల బతుకులు తిరిగి మొదటికొచ్చిపడ్డాయని అంటున్నారు. దీనంతటికీ ఇటీవల ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఖనిజాభివృద్ధి శాఖ సమీక్షా సమావేశంలో ఇసుక అక్రమ రవాణాపై చేసిన వ్యాఖ్యలే కారణమని తెలుస్తోంది. వాటిని ఆధారంగా చేసుకుని అనేక ఊహాగానాలు వినిపిస్తున్నాయి. చోటా మోటా నాయకుల పైరవీలు, కాంట్రాక్టర్లు, దళారుల వ్యవస్థ తిరిగి వస్తే రాష్ట్రంలో 50వేల లారీ యజమానుల బతుకులు రోడ్డున పడ్తాయని అంటున్నారు. లారీలపై తీసుకొచ్చిన ఫైనాన్స్ కట్టలేక ఆత్మహత్య దిక్కవుతుందని లారీ యజమానులు వాపోతున్నారు.

రంగంలోకి హైడ్రా..

రాష్ట్రంలో ఇందిరమ్మ ఇండ్లకు ఉచితంగా ఇసుకను సరఫరా చేయాలని ఖనిజాభివృద్ధి శాఖ సమీక్షా సమావేశంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆదేశించిన విషయం తెలిసిందే. ఇసుక అక్రమ రవాణాను అరికట్టాలని సీఎం ఆదేశాలతో హైడ్రా అధికారులు రంగంలోకి దిగారు. మంగళవారం నుంచే తనిఖీలు మొదలుపెట్టారు. వరంగల్ నుంచి హైదరాబాద్ వరకు అధికారులు విస్తృతంగా తనిఖీలు చేపట్టారు. ఓవర్ లోడ్‌తో వెళ్తున్న లారీలను సీజ్ చేసి కేసు కేసులు నమోదు చేస్తున్నారు.

ఆన్‌లైన్ ఇసుక బుకింగ్

రాష్ట్రంలో 2014 నుంచే ఆన్‌లైన్ బుకింగ్ విధానం అమల్లో ఉంది. 12 టైర్ల లారీకి 25 మెట్రిక్ టన్నులు, 14 టైర్ల లారీలకు 32 మెట్రిక్ టన్నులు, 16 టైర్ల లారీకి 35 మెట్రిక్ టన్నుల ఇసుకను తీసుకెళ్లేందుకు అధికారులు అనుమతినిచ్చారు. ఆన్‌లైన్‌లో ఉదయం పన్నెండు గంటల వరకు ఇసుకను బుకింగ్ చేసుకునే సదుపాయం ఉంది. ఇసుక బుకింగ్ అయిన లారీలు హైదరాబాద్ నుంచి కాళేశ్వరం, భద్రాచలం క్వారీలకు వెళ్లి అక్కడ ఇసుకను నింపుకుని, తిరిగి హైదరాబాద్‌కు వచ్చేవి. దాంతో మొత్తం ఖర్చు రూ.55 వేల నుంచి రూ.60 వేల వరకు వస్తుంది. ప్రస్తుతం నగరంలో దొడ్డు టన్ను ఇసుక ధర రూ.1300 ఉండగా, ప్లాస్టింగ్ ఇసుక ధర రూ.1400గా ఉంది. అన్ని ఖర్చులు పోను లారీ యజమానికి రూ.5000 ఆదాయం వస్తోంది.

జయశంకర్ భూపాలపల్లిలో సుమారు 10 నుంచి 15 క్వారీలుండగా, ములుగు పరిధిలో 10 క్వారీలు, కరీంనగర్, మంచిర్యాల, పెద్దపల్లి జిల్లాలో ఇసుకను డంపు చేస్తారు. డంపు చేసిన ఇసుకను ఆన్‌లైన్‌లో ప్రతి రోజూ లక్ష మెట్రిక్ టన్నులను బుకింగ్ చేసుకునే సదుపాయం ఉంది. దీని వల్ల రాష్ట్ర ప్రభుత్వానికి రోజుకు సుమారు రూ. 10 నుంచి రూ. 15 కోట్ల ఆదాయం వస్తోంది. రాష్ట్రంలో మద్యం, రెవెన్యూ ఆ తరువాత భారీగా ఆదాయం వచ్చేది ఇసుక నుంచే.

దీన్ని అదునుగా చేసుకొని, బడా కాంట్రాక్టర్లు, క్వారీలలో బకెట్ల విధానంతో ఒక్కొక్క బకెట్‌కు రూ.2500, లోడింగ్ పేరుతో రూ.2500, జేసీబీ, సీరియల్, కాంటా పేరుతో రూ.1000 వసూలు చేస్తూ, ప్రభుత్వ ఆదాయానికి గండికొడుతూ కోట్లకు పడగలెత్తుతున్నారు. కొంతమంది అధికారుల లోపాయికారీ ఒప్పందంతో ఈ తతంగం నడుస్తోంది. వీటిని అరికట్టాల్సిన అధికారులు, వారిపై ఎలాంటి చర్యలూ తీసుకోకపోగా, లారీ యజమానులపై కేసులు బనాయిస్తూ, లారీ డ్రైవర్లను, యజమానులను ఇబ్బందులకు గురి చేస్తున్నారు.



పాసింగ్ విధానం కొనసాగించాలి : ప్రతాప్‌రెడ్డి, రామాంతపూర్, ఉప్పల్ లారీ ఓనర్స్ అసోసియేషన్ అధ్యక్షులు

తెలంగాణలో ఆన్‌లైన్‌లో ఇసుక పాలసీని అమలుచేసి, పాసింగ్ విధానాన్ని కొనసాగించాలని, పాసింగ్ విధానంతోనే లారీల యజమానులు బతుకులు బాగుపడతాయని అంటున్నారు. రెండ్రోజుల నుంచి నగరంలో పోలీసుల వేధింపులతో టిప్పర్, లారీ డ్రైవర్లు భయాందోళన చెందుతున్నారు. అడ్డాలపై పోలీసుల ఆగడాలు, వేధింపులు మొదలయ్యాయి. క్వారీ నుంచి ఇసుకను తీసుకొచ్చిన లారీకి మాత్రమే వేబిల్ ఉంటుంది. ఈ పాసింగ్ విధానం ఇలానే కొనసాగించాలని లారీ యజమానులు కోరుతున్నారు.

అధికారులు ఇబ్బందులు పెడుతున్నారు.. : లారీ డ్రైవర్ యాదయ్య



రాష్ట్ర ప్రభుత్వం తీసుకొచ్చిన పాసింగ్ విధానంతో సంతోషంగా ఒక్కరోజు ఉన్నారో లేదో.. మరుసటి రోజునే పాసింగ్ ఉన్నా వేబిల్ డెలివరీ అడ్రస్ చూపించాలని అధికారులు డ్రైవర్లను తీవ్ర ఇబ్బందులు పెడుతున్నారు. కాళేశ్వరం, భద్రాచలం, ములుగు, పెద్దపల్లి జిల్లాల్లోని క్వారీల నుంచి తీసుకొచ్చిన పెద్ద లారీలకు మాత్రమే వేబిల్ ఉంటుంది. పెద్ద లారీ నుంచి టిప్పర్లకు డంపు చేసిన వాటికీ వేబిల్ ఎలా వుంటుంది? గల్లీల్లోకి పెద్దలారీలు ఎలా వెళ్తాయి? అయినా అధికార బలంతో అధికారులు టిప్పర్లను స్టేషన్‌కు తరలిస్తున్నారు. వెంటనే ఈ దౌర్జన్యాలను అరికట్టాలి.

ఇసుక బుకింగ్ వేళల పెంపు : టీజీఎండీసీ

హైదరాబాద్ : ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు ఇసుక బుకింగ్ వేళల్ని పెంచినట్టు తెలంగాణ మినరల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (టీజీఎండీసీ) మేనేజింగ్ డైరెక్టర్ తెలిపారు. ఈ మేరకు బుధవారం మైన్స్ అండ్ జియాలజీ శాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ అధ్యక్షతన ఇసుక కాంట్రాక్టర్లు, ట్రాన్స్ పోర్టర్లు, ట్రాన్స్ పోర్ట్ ఏజెన్సీలతో సమావేశం జరిగింది. అనంతరం టీజీఎండీసీ వీసీ అండ్ ఎండీ ఒక ప్రకటన విడుదల చేశారు. ఈ నెల 12 నుంచి ప్రజలు ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు బుక్ చేసుకోవచ్చని సూచించారు. 2025-26లో ప్రభుత్వ ఆదాయం పెరిగేందుకు ఇసుక కాంట్రాక్టర్లు సహకరించాలని అధికారులు కోరారు. టీజీఎండీసీతో చేసుకున్న ఒప్పందంలోని నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు తీసుకుంటామని వారు హెచ్చరించారు. ఎట్టి పరిస్థితిలో ఓవర్ లోడ్‌ను సహించేది లేదని స్పష్టం చేశారు. ఎక్కువ బుకింగ్స్ వస్తే మిగిలిన లారీ యజమానులు, ట్రాన్స్‌పోర్ట్ ఏజెన్సీలకు సమాన అవకాశాలిస్తామని అధికారులు స్పష్టం చేశారు.

ఎనుమాముల మార్కెట్ కార్యదర్శి నిర్మల సస్పెన్షన్

- రాష్ట్రవ్యాప్తంగా ఏడుగురు
- టెంపరరీ రిజిస్ట్రేషన్ పత్రాలు సరిగ్గా నమోదు చేయలేదని..
- రాష్ట్ర మార్కెటింగ్ శాఖ డైరెక్టర్ లక్ష్మీబాయి ఉత్తర్వులు జారీ
- ఎనుమాముల ఇన్‌చార్జి కార్యదర్శిగా జి. రెడ్డి బాధ్యతలు

నవతెలంగాణ-కాశిబుగ్గ

ఎనుమాముల వ్యవసాయ మార్కెట్ ఉన్నత శ్రేణి కార్యదర్శి పోలేపాక నిర్మలను సస్పెండ్ చేస్తూ మార్కెటింగ్ శాఖ ఉత్తర్వులు జారీ చేసింది. కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా పత్తి కొనుగోళ్లలో టెంపరరీ రిజిస్ట్రేషన్ పత్రాలు సరిగ్గా నమోదు చేయలేదనే కారణంతో రాష్ట్ర మార్కెటింగ్ శాఖ డైరెక్టర్ లక్ష్మీబాయి మంగళవారం రాత్రి ఎనుమాముల వ్యవసాయ మార్కెట్ కమిటీ కార్యదర్శి నిర్మలను సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. సస్పెన్షన్‌కు గురైన వారిలో వరంగల్ మార్కెట్ కమిటీ కార్యదర్శి నిర్మలతోపాటు ఆదిలాబాద్ కార్యదర్శి మధుకర్, చెన్నూర్ కార్యదర్శి రామాంజనేయులు, పెద్దపల్లి కార్యదర్శి పృథ్వీరాజ్, జనగామ కార్యదర్శి సంగినేని శ్రీనివాస్, భద్రాద్రి కొత్తగూడెం కార్యదర్శి శ్రీనివాస్, చిన్నకోడూరు కార్యదర్శి పరమేశ్వర్ ఉన్నారు.

కొంపముంచిన టెంపరరీ రిజిస్ట్రేషన్ పత్రాలు

రాష్ట్రవ్యాప్తంగా ఎంత మంది రైతులు పంట సాగు చేశారనేది వ్యవసాయ శాఖ నుంచి వివరాలు సేకరించి నమోదు చేసేందుకు మార్కెటింగ్ శాఖ ఒక యాప్‌ను రూపొందించింది. దాంతో రైతులు కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా సెంటర్‌కు వెళ్లి రైతు ఆధార్ కార్డు నెంబర్, ఊరు, పేరు చెప్పగానే ఆ రైతు ఎన్ని ఎకరాల్లో పత్తి సాగు చేశారనేది వెంటనే తెలిసిపోతుంది. దాని ఆధారంగా సీసీఐ సెంటర్‌లో రైతు పేరు, ఎన్ని క్వింటాళ్ల పత్తి కొనుగోలు చేశారు, తదితర వివరాలు నమోదు చేసుకుంటారు. ఆ వివరాల ఆధారంగా సీసీఐ నుంచి రైతుల ఖాతాల్లో డబ్బులు జమ అయ్యేవి. అయితే కౌలుకు తీసుకొని పత్తి సాగు చేసే రైతుల వివరాలు ఈ యాప్‌లో ఉండవు. అలాంటప్పుడు రైతు.. స్థానిక వ్యవసాయ శాఖ అధికారి చేత ధ్రువీకరణ పత్రాలను అందజేస్తే దాన్ని మార్కెట్ కార్యదర్శులు ఆమోదించిన తర్వాత సీసీఐ సెంటర్లలో నమోదు చేసుకొని పత్తి కొనుగోలు చేస్తారు. అయితే ఇదే అదనుగా కొందరు ఎలాంటి పత్రాలు లేకుండా పత్తి కొనుగోలు చేసినట్టు మార్కెటింగ్ శాఖ అధికారులు గుర్తించారు. టెంపరరీ రిజిస్ట్రేషన్ పత్రాలు సరిగ్గా నమోదు చేయలేదన్న కారణంతో రాష్ట్ర మార్కెటింగ్ శాఖ డైరెక్టర్ లక్ష్మీబాయి ఏడుగురు మార్కెట్ కార్యదర్శులపై సస్పెన్షన్ వేటు వేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.



ఇన్‌చార్జి కార్యదర్శిగా జి. రెడ్డి బాధ్యతలు

ఎనుమాముల వ్యవసాయ మార్కెట్ కమిటీ ఉన్నతశ్రేణి కార్యదర్శి నిర్మలపై వేటుపడటంతో ఆ స్థానంలో ప్రస్తుతం నర్సంపేట వ్యవసాయ మార్కెట్ ఉన్నతశ్రేణి కార్యదర్శిగా పనిచేస్తున్న గుగులోతు రెడ్డికి అదనపు బాధ్యతలు అప్పగిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. దాంతో ఆయన బుధవారం బాధ్యతలు చేపట్టారు. పోలెపాక నిర్మల కంటే ముందు ఎనుమాముల మార్కెట్ కార్యదర్శిగా పనిచేసిన అనుభవం ఆయనకుంది.

ప్రొఫెసర్ కోదండరాం

మౌనమెందుకు?

- ఆకునూరి మురళి ప్రభుత్వ పాఠశాలల్లో పర్యటించరెందుకు?: బీఆర్‌ఎస్వీ అధ్యక్షులు గెల్లు శ్రీనివాస్ యాదవ్

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

అధికారంలోకి రాగానే ఫీజు రీయింబర్స్‌మెంట్ చేస్తామన్న కాంగ్రెస్ మాట తప్పినా... ఎమ్మెల్సీ, ప్రొఫెసర్ కోదండరాం ఎందుకు మౌనంగా ఉన్నారని బీఆర్‌ఎస్వీ అధ్యక్షులు గెల్లు శ్రీనివాస్ యాదవ్ ప్రశ్నించారు. బీఆర్ఎస్ హయాంలో కోదండరాం కాలుకు బలపం కట్టుకుని తిరిగారని గుర్తుచేశారు. బుధవారం హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో ఆయన మీడియా సమావేశంలో మాట్లాడారు. ఉమ్మడి రాష్ట్రం నుంచి తెలంగాణ వరకు విద్యాశాఖకు మంత్రి లేని క్యాబినెట్ రేవంత్ క్యాబినెట్ ఒక్కటేనని తెలిపారు.

గురుకులాల్లో 50 మంది విద్యార్థులు చనిపోయినా.. విద్యాశాఖను తన వద్ద పెట్టుకున్న సీఎం రేవంత్ రెడ్డి సమీక్షించడం లేదని చెప్పారు. విద్యార్థినులకు స్కూటీలు ఇస్తామని మోసం చేసినా మహిళా మంత్రులు సీతక్క, కొండా సురేఖ ఎందుకు సీఎంను అడగడం లేదని ప్రశ్నించారు. ప్రతి విద్యార్థికి విద్యా భరోసా కార్డు, ఫీజు రీయింబర్స్‌మెంట్ ఇవ్వడం లేదనీ, జాబ్ క్యాలెండర్‌ను ఫాలో కావడం లేదని విమర్శించారు. వెంటనే విద్యాశాఖ మంత్రిని నియమించాలని డిమాండ్ చేశారు.

క్రీడలతో మానసిక ఒత్తిడి జయించొచ్చు



నవతెలంగాణ-అంబర్‌పేట

క్రీడలతో మానసిక ఒత్తిడి జయించొచ్చని, జైళ్ల ఉద్యోగాలు అనేక సవాలతో కూడుకున్నవని హోంశాఖ ప్రత్యేక కార్యదర్శి రవిగుప్తా అన్నారు. చంచల్‌గూడలోని సికా పరేడ్ గ్రౌండ్‌లో బుధవారం తెలంగాణ జైళ్ల శాఖ 7వ రాష్ట్ర స్థాయి వార్షిక స్పోర్ట్స్‌మీట్-2025ను జైళ్ల శాఖ డీజీ సౌమ్య మిశ్రాతో కలిసి ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా రవి గుప్తా మాట్లాడుతూ.. స్పోర్ట్స్ మీట్‌ల ద్వారా సిబ్బందిలో శారీరక దృఢత్వాన్ని ప్రోత్సహించడంతో పాటు సిబ్బంది మధ్య స్నేహ సంబంధాలకు ఎంతగానో దోహద పడుతుందని చెప్పారు. జైలు ఉద్యోగమనేది ఎన్నో సవాళ్లతో కూడుకున్నదని, ఒత్తిడిని అధిగమించేందుకు క్రీడలు దోహదం చేస్తాయని అన్నారు. ఉదయం ఇంటి నుంచి బయలుదేరితే.. తిరిగివెళ్లే వరకు విధులు తప్ప మరొక బాధ్యత ఉండదని తెలిపారు. జైళ్ల శాఖలో ఎంతోమంది ఖైదీలని మార్చడానికి శ్రమిస్తారని చెప్పారు. ఉద్యోగులు ఎల్లప్పుడూ విధుల నిర్వహణ కాకుండా క్రీడలపై కూడా దృష్టిసారిస్తే ఆరోగ్యపరంగా మానసికంగా ఉత్సవంగా ఉంటారని సూచించారు. అంతకు ముందు సిబ్బంది నుంచి గౌరవ వందనం స్వీకరించారు. మూడు రోజులపాటు ఈ పోటీలు జరుగనున్నాయని, ప్రతిఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో జైళ్ల శాఖ ఐజీలు రాజేశ్, డీఐజీలు మురళి బాబు, డాక్టర్ శ్రీనివాస్, సంపత్, చంచల్‌గూడ జైలు సూపరింటెండెంట్ ఎన్.శివకుమార్ గౌడ్, రామచంద్రం తదితరులు పాల్గొన్నారు.

సవాళ్లతో కూడుకున్నది జైలు ఉద్యోగం

- హోంశాఖ ప్రత్యేక కార్యదర్శి రవి గుప్తా

సీపీఎస్ రద్దుకోసం కృషిచేస్తా

- కరీంనగర్ పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి సంకినేని మధుసూదన్‌రావు

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్



రాష్ట్రంలో కాంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీం (సీపీఎస్) రద్దు కోసం కృషి చేస్తానని మెదక్- నిజామాబాద్- ఆదిలాబాద్- కరీంనగర్ పట్టభద్రుల నియోజకవర్గం ఎస్టీటీయూ బలపరిచిన స్వతంత్ర అభ్యర్థి సంకినేని మధుసూదన్‌రావు అన్నారు. ఉద్యోగులు, ఉపాధ్యాయులకు పాత పెన్షన్ విధానం (ఓపీఎస్) అమలయ్యేలా ప్రయత్నం చేస్తానని చెప్పారు. బుధవారం హైదరాబాద్‌లో తనను కలిసిన విలేకర్లతో ఆయన మాట్లాడుతూ ఉపాధ్యాయ, అధ్యాపక, నిరుద్యోగుల సమస్యలపై పూర్తి అవగాహన ఉందనీ, వాటిని ప్రభుత్వాల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానని అన్నారు. సమస్యల పరిష్కారం కోసం పోరాటం చేస్తానని చెప్పారు. జాబ్‌క్యాలెండర్ అమలైతేనే నిరుద్యోగులకు ఉద్యోగాలు వస్తాయని వివరించారు. కాంగ్రెస్ ఇచ్చిన హామీ ప్రకారం నిరుద్యోగ భృతి ఇవ్వాలని కోరారు. ప్రభుత్వ ప్రాథమిక విద్యారంగం బలోపేతానికి పాటుపడతానని చెప్పారు. డబ్బు, ఇతర ప్రలోభాలకు గురికాకుండా నీతి, నిజాయితీ, విలువలు ఉన్న వారికి మొదటి ప్రాధాన్యతా ఓటు వేసి గెలిపించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎస్టీటీయూ రాష్ట్ర అధ్యక్షులు కరివేద మహిపాల్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి అరికెల వెంకటేశం తదితరులు పాల్గొన్నారు.

నోటా ఉన్నా ఏకగ్రీవానికే ఆమోదం తెలపాలి

- ఈసీ సమావేశంలో సీపీఐ(ఎం) రాష్ట్ర నాయకులు డీజీ

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

స్థానిక సంస్థల ఎన్నికల్లో ఒకే నామినేషన్ దాఖలైతే ఏకగ్రీవానికే తాము మద్దతు తెలుపుతున్నట్టు సీపీఐ(ఎం) రాష్ట్ర నాయకులు డీజీ.నర్సింహరావు తెలిపారు. బుధవారం హైదరాబాద్‌లో 'నోటా' అమలుపై రాష్ట్ర గుర్తింపు పొందిన రాజకీయ పార్టీలతో రాష్ట్ర ఎన్నికల కమిషనర్ రాణి కుముదిని అధ్యక్షతన సమావేశాన్ని నిర్వహించారు. దీనిపై వివిధ రాజకీయ పార్టీలు తమ అభిప్రాయాలను తెలిపాయి. ఈ సందర్భంగా సీపీఐ(ఎం) అభిప్రాయాన్ని డీజీ వివరించారు. సింగిల్ నామినేషన్ దాఖలైన సందర్భంలో నోటాను ప్రత్యర్థిగా పరిగణించి పోలింగ్ నిర్వహిస్తే ఎన్నికల ప్రక్రియకు తీవ్ర అంతరాయం కలుగుతుందని అన్నారు. కొన్ని సందర్భాల్లో నోటాకు ఎక్కువ ఓట్లు వస్తే ఏ అభ్యర్థిని విజేతగా ప్రకటిస్తారని ఆయన ప్రశ్నించారు. తిరిగి ఎన్నికలు నిర్వహించడం తప్ప వేరే మార్గం ఉండబోదని స్పష్టం చేశారు. ఫలితంగా ప్రజాధనం దుర్వినియోగం అవుతుందని హెచ్చరించారు.ఈ విషయాన్ని పరిగణనలోకి తీసుకోవాలని ఆయన రాష్ట్ర ఎన్నికల సంఘానికి విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో కాంగ్రెస్ మాజీ ఎమ్మెల్సీ బి.కమలాకర్ రావు, బీఆర్ఎస్ ప్రధాన కార్యదర్శి సోమాభరత్, బీజేపీ మాజీ రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎస్. మల్లారెడ్డి, ఆమ్ ఆద్మీ పార్టీ సోషల్ మీడియా ఇన్‌చార్జి అబ్బాస్ అహసన్‌తో పాటు వివిధ పార్టీల నాయకులు పాల్గొని తమ అభిప్రాయాలను ఎన్నికల సంఘానికి వివరించారు. లిఖిత పూర్వకంగా తమ అభిప్రాయాలను తెలపాలని ఈ సందర్భంగా ఎన్నికల సంఘం ఆయా పార్టీలకు సూచించింది.

నోటాకు ఎక్కువ ఓట్లొస్తే తిరిగి ఎన్నికలు నిర్వహించాలి : సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి టి.శ్రీనివాసరావు

స్థానిక సంస్థల ఎన్నికల్లో ఒక్క నామినేషన్ దాఖలైనా ఏకగ్రీవానికి తావు ఇవ్వకుండా నోటాతో ఎన్నికలు నిర్వహించాలని సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి టి. శ్రీనివాస్‌రావు రాష్ట్ర ఎన్నికల కమిషన్‌కు సూచించారు. బుధవారం జరిగిన ఆల్ పార్టీ మీటింగ్‌లో ఆయన ఇదే అభిప్రాయన్ని వెల్లడించారు. మహారాష్ట్ర, ఢిల్లీ, హర్యానా రాష్ట్రాల్లో నోటాకు ఓట్లు ఎక్కువగా వస్తే... మళ్లీ ఎన్నికలు నిర్వహించిన విషయాన్ని గుర్తు చేశారు. ఇదే విధానాన్ని రాష్ట్రంలో కూడా అమలు చేయాలని కోరారు.

సంత్ సేవాలాల్ జయంతి ఉత్సవాలకు రండి

- సీఎం రేవంత్‌రెడ్డిని ఆహ్వానించిన మంత్రి సీతక్క

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

ఈ నెల 15న రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా నిర్వహిస్తున్న సంత్ సేవాలాల్ జయంతి ఉత్సవాలకు హాజరు కావాలని సీఎం రేవంత్ రెడ్డిని మంత్రి సీతక్క, గిరిజన సంక్షేమ శాఖ అధికారులు ఆహ్వానించారు. ఈ మేరకు బుధవారం సచివాలయంలో సీఎంను వారు కలిశారు. సంత్



సేవాలాల్ జయంతి ఉత్సవాల నిర్వహణ కోసం రూ. 2 కోట్లు కేటాయించిన సీఎం రేవంత్ రెడ్డికి సన్మానం చేశారు.

రాముడి పేరుతో దౌర్జన్యాలు చేస్తే సహించం

- నిజమైన రామ భక్తులపై కల్తీ రామ భక్తుల దాడి
- దాడి చేసిన వారిపై చర్యలు తీసుకోవాలి : సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు



నవతెలంగాణ-మొయినాబాద్

చిలుకూరు బాలాజీ ప్రధాన అర్చకులు రంగరాజన్‌పై రాముని పేరుతో కొంతమంది రామభక్తులు అని చెప్పి దౌర్జన్యాలకు పాల్పడి దుర్భాషలాడుతూ తిట్టడం బాధాకరమని, అలాంటి దొంగ రామభక్తులపై చర్యలు తీసుకోవాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు డిమాండ్ చేశారు. బుధవారం రంగారెడ్డి జిల్లాలోని చిలుకూరు బాలాజీ ఆలయం అర్చకులు రంగరాజన్‌ను ఆయన నివాసం వద్ద సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు, జిల్లా కార్యదర్శి పాలమాకుల జంగయ్య కలిసి ఆయన్ను పరామర్శించారు. ఈ సందర్భంగా కూనంనేని మాట్లాడుతూ.. భారతదేశం సకల మతాలకు నిలయమని, ఇలాంటి దేశంలో రాముని పేరుతో రాజకీయాలు, దౌర్జన్యాలు కొనసాగుతున్నాయని ఇది ముమ్మాటికీ ఫెడరల్ స్ఫూర్తికి విరుద్ధమని అన్నారు. నిజమైన రామ భక్తులు ఎవరూ ఇతరుల మీద దాడి చేయరని తెలిపారు. రామరాజ్యంలో కష్టాలు, కన్నీళ్లు, మహిళలపై హింస, లైంగికదాడులు ఉండవని, కానీ ఈ దేశంలో అన్ని జరుగుతున్నాయని దీన్ని ఎలా రామరాజ్యం అంటామని ప్రశ్నించారు. నిజమైన రామ భక్తులు, దేశభక్తులు.. కమ్యూనిస్టులేనని అన్నారు. దాడికి పాల్పడిన వ్యక్తులపై కఠిన చర్యలు తీసుకొని శిక్షించాలని తెలిపారు. మరోసారి దేశంలో, రాష్ట్రంలో ఎక్కడా ఇలాంటి సంఘటనలు జరగకుండా చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని కోరారు. అర్చకుడిని పరామర్శించిన వారిలో రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఆందోజు రవీంద్ర చారి, రాష్ట్ర సమితి సభ్యులు పానుగంటి పర్వతాలు, కె.రామస్వామి, జిల్లా కార్యవర్గ సభ్యులు ఎం. ప్రభులింగం, మొయినాబాద్, చేవెళ్ల, శంకరపల్లి మండలాల కార్యదర్శులు కె.శ్రీనివాస్, సత్తిరెడ్డి, పి. సుధీర్, ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి వడ్ల సత్యనారాయణ, నాయకులు కన్యగారి నరసింహారెడ్డి, సుధాకర్ గౌడ్, బీకేఎంయూ జిల్లా అధ్యక్షులు జె. అంజయ్య, నాయకులు వెంకటయ్య మల్లేష్, రఘురాం, నారాయణ, మధు తదితరులు ఉన్నారు.

డంపింగ్ యార్డ్ రద్దుకు గొర్రెలతో నిరసన, ధర్నా

- తహసీల్దార్ కాళ్లు మొక్కి వేడుకున్న రైతులు
- హైకోర్టు ఆదేశాలతో పనులకు తాత్కాలిక బ్రేక్



నవతెలంగాణ-మెదక్ ప్రాంతీయ ప్రతినిధి

ప్యారానగర్‌లో డంపింగ్ యార్డ్‌ను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ సమీప గ్రామాల్లో కొనసాగుతున్న ఆందోళనలు మంగళవారం 8వ రోజుకు చేరాయి. బుధవారం జేఏసీ ఆధ్వర్యంలో గొర్రెలు, మేకలతో నిరసన వ్యక్తం చేశారు. వేలాది కుటుంబాలు సన్న జీవాల పెంపకం ద్వారా జీవనోపాధి పొందుతున్నామని, డంపింగ్ యార్డ్ పెడితే గొర్రెలు, మేకలు, గేదెలు, పశువులన్నీ ఆ ప్రాంతంలో బతికే పరిస్థితి ఉండదని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. నల్లవల్లి, ప్యారానగర్, కొత్తపల్లి, గుమ్మడిదల ఇతర గ్రామాల్లో దీక్షలు కొనసాగాయి. కొత్తపల్లిలో దీక్షల్లో పాల్గొనడంతో పాటు అక్కడే వంటా వార్పు చేశారు. నల్లవల్లిలో ప్రజలు ర్యాలీ చేశారు. గుమ్మడిదల మండల కేంద్రంలో గొర్రెల మందతో వినూత్న పద్ధతిలో నిరసన తెలుపుతూ తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా చేయడంతో తహసీల్దార్ గంగాభవానీ రైతులతో చర్చించారు. డంపింగ్ యార్డ్ పట్ల రైతులకు ఉన్న అభ్యంతరాలను తెలుసుకునే ప్రయత్నం చేశారు. డంపింగ్ యార్డ్ పనుల్ని నిలిపి వేయాలని, తమ సమస్యలను చెప్పుకుంటూ పలువురు రైతులు తహసీల్దార్ కాళ్ల మీద పడి వేడుకున్నారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ.. హైకోర్టు ఆదేశాలున్నందున డంపింగ్ యార్డ్ పనుల్ని నిలిపి వేస్తున్నట్టు తెలిపారు. కాగా, డంపింగ్ యార్డ్ ఏర్పాటు చేయనున్న ప్యారానగర్‌కు సంగారెడ్డి జిల్లా అదనపు కలెక్టర్, జీహెచ్ఎంసీ అధికారులు రైతులు అభ్యంతరాలను తెలుసుకునేందుకు గురువారం ప్యారానగర్ రానున్నట్టు సమాచారం.

సీపీఐ(ఎం) ఆధ్వర్యంలో సంగారెడ్డి ఆర్డీఓకు వినతి

ప్యారానగర్ భూముల్లో డంపింగ్ యార్డ్ పనుల్ని ఆపడంతో పాటు పూర్తిగా రద్దు చేయాలని కోరుతూ సీపీఐ(ఎం) నాయకులు సంగారెడ్డి ఆర్డీఓ రవీందర్‌రెడ్డిని కోరారు. బుధవారం సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు అతిమేల మాణిక్, జిల్లా నాయకులు అశోక్, జిల్లా కమిటీ సభ్యులు కృష్ణ కలిసి ఆర్డీఓకు వినతి పత్రం అందజేశారు. 17 గ్రామాల వరకు ప్రజల జీవితాలతో చెలగాటమాడొద్దని సూచించారు. రైతుల న్యాయమైన పోరాటానికి సీపీఐ(ఎం) సంపూర్ణంగా మద్దతిస్తుందన్నారు.

హైకోర్టు ఆదేశాలతో ఊరట

ప్యారానగర్ భూముల వివాదం హైకోర్టులో విచారణ నడుస్తున్న నేపథ్యంలోనే జీహెచ్ఎంసీ డంపింగ్ యార్డ్ పనుల్ని ప్రారంభించింది. తాజాగా కొందరు హైకోర్టును ఆశ్రయించారు. 1 నుంచి 44 వరకు ఉన్న సర్వే నెంబర్లలో 86.13 ఎకరాల రైతుల భూముల్లో డంపింగ్ యార్డ్ ఏర్పాటు చేస్తున్నట్టు కోర్టుకు తెలిపారు. అట్టి భూములకు సంబంధించిన సర్వే చేయాలని గతంలోనే కోర్టు స్టేటస్ కో ఇచ్చింది. అయినా అధికారులు పట్టించుకోలేదు. దాంతో రైతులు మళ్లీ న్యాయస్థానాన్ని ఆశ్రయించడంతో డంపింగ్ పనుల్ని నిలిపివేయాలని కోర్టు చెప్పడంతో ఆ ప్రాంత రైతులకు ఊరట లభించనట్లయింది.

పట్టపగలు ఇంట్లో దోపిడీ

- వృద్ధురాలి కాళ్ళు, చేతులు కట్టేసి బంగారం చోరీ
- ఖమ్మం జిల్లా వైరాలో ఘటన



నవతెలంగాణ-వైరా

ఖమ్మం జిల్లా వైరా మున్సిపాలిటీలోని నందరయ్యనగర్‌లో పట్టపగలు ఇంట్లో దోపిడీకి పాల్పడి రూ.15 లక్షల విలువైన బంగారు నగలు అపహరించుకుపోయారు. బుధవారం మధ్యాహ్నం కారులో నలుగురు వ్యక్తులు వచ్చి సర్వే పేరుతో వృద్ధురాలైన వెంకట్రావమ్మ ఇంట్లోకి వెళ్లారు. ఒంటరిగా ఉన్న వెంకట్రావమ్మ కాళ్ళు, చేతులు తాడుతో కట్టేసి చోరీకి పాల్పడ్డారు. ఇంట్లో ఉన్న 18 తులాల నగలను ఎత్తుకెళ్లారు. నగల విలువ సుమారు రూ.15 లక్షలు ఉంటుందని అంచనా. విషయం తెలుసుకున్న వైరా ఏసీపీ రెహమాన్, సీఐ సాగర్, రెండవ ఎస్ఐ వెంకటేశ్వర్లు సిబ్బందితో ఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరిస్తున్నారు.

హింసాత్మక ధోరణితో మహిళల మానసిక ఆరోగ్యానికి దెబ్బ

దళిత, ఆదివాసీ మహిళలపై అధికం : డీఎస్ఎస్ సదస్సులో వక్తలు

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

సమాజంలో పెరిగిపోతున్న హింసాత్మక ధోరణి మహిళల మానసిక ఆరోగ్యాన్ని దెబ్బతీస్తున్నదని పలువురు వక్తలు తెలిపారు. దళిత స్త్రీ శక్తి (డీఎస్ఎస్) జాతీయ కన్వీనర్ గెడ్డం జాన్సీ అధ్యక్షతన బుధవారం హైదరాబాద్ లక్డీకాపూల్‌లోని అంబేద్కర్ రిసోర్స్ సెంటర్‌లో దళిత, ఆదివాసీ స్త్రీలపై హింస, మానసిక ఆరోగ్యం-వివిధ కోణాలు అనే అంశంపై సదస్సు జరిగింది. ఈ కార్యక్రమంలో దళిత స్త్రీ శక్తి 19వ వార్షిక నివేదిక-2024ను విడుదల చేశారు. ఈ సదస్సులో రాష్ట్ర విద్యాశాఖ కమిషన్ చైర్మెన్ ఆకునూరి మురళి, డిక్కీ జాతీయ అధ్యక్షులు పద్మశ్రీ నర్రా రవికుమార్, జీహెచ్ఎంసీ చీఫ్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ పద్మజ, విశ్రాంత ప్రొఫెసర్ రమా మేల్కొటే, సీఐడీ ఎస్పీ అనోన్య, తెలంగాణ రాష్ట్ర ట్రాన్స్‌కో డీఈ మాణిక్యం, ఆఫీసర్స్ ఫోరం కన్వీనర్ సిద్ధోజి రావు, ఈఎస్ఐ నాచారం చీఫ్ సివిల్ సర్జన్ డాక్టర్ కె.బి.సంధ్య, క్లినికల్ సైకాలజిస్ట్ డాక్టర్ ఎస్.రాధిక, జెండర్ యాక్టివిటీస్ కన్సల్టెంట్ జమున తదితరులు హాజరై మాట్లాడారు. సమాజంలో మహిళల ఆరోగ్యం దెబ్బతింటుంటే, దళితులు, ఆదివాసీ మహిళల్లో ఈ సమస్య మరింత ఎక్కువగా ఉందని తెలిపారు.

ఆకునూరి మురళి మాట్లాడుతూ దేశంలో



పరిస్థితులు మరింత భయపెడుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. హింసకు వ్యతిరేకంగా అందరం ఒక జట్టుగా నిలబడాలని సూచించారు. హింసను తగ్గించేందుకు ఏర్పాటు చేస్తున్న ఇలాంటి కార్యక్రమాల్లో ప్రభుత్వ అధికారులను ఎక్కువగా భాగస్వాములను చేయాలని కోరారు. డాక్టర్ పద్మజా మాట్లాడుతూ విద్యను ప్రోత్సహిస్తే ఇలాంటి హింసకు అడ్డుకట్ట వేయవచ్చని అభిప్రాయపడ్డారు. ప్రొఫెసర్ రమా మెల్కొటే మాట్లాడుతూ తన 85ఏండ్ల వయస్సులో ప్రస్తుతం చోటు చేసుకుంటున్నంతటి హింసను ఎప్పుడు చూడలేదని దిగ్భ్రాంతిని వ్యక్తం చేశారు. హింస విభిన్న రూపాలను సంతరించుకుందనీ, సాంకేతికతను కూడా ఉపయోగించుకుంటున్నదని ఆందోళన వ్యక్తం చేశారు. మానసిక ఆరోగ్యాన్ని అందించే సదుపాయాలు అందుబాటులోకి రావాలని ఆకాంక్షించారు. మనిషి తాను మనిషి అనే విషయం మరిచిపోయేలా వ్యవస్థ స్వార్థాన్ని ప్రోత్సహిస్తున్నదని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ హింసను అందరూ కలిసి ఎదుర్కోవాలనీ, ప్రశ్నించాలనీ, తిరగబడాలని ఆమె పిలుపునిచ్చారు.

అనోన్య మాట్లాడుతూ హింస ఇంట్లో, చదువుకునే లేదా పని చేసే స్థలంలో, ప్రయాణంలో, బయట చోటు చేసుకుంటున్నదని తెలిపారు. ముందుగా ఇంట్లో ఆడపిల్లలపై వివక్షను ఆపాలని సూచించారు. మాణిక్యం మాట్లాడుతూ ఆస్తిలో హక్కు ఇవ్వకుండా తల్లిదండ్రులే ముందుగా హింసించడం ప్రారంభిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. దీనికి తోడు పెళ్లి తర్వాత అతి పురుషత్వం కారణంగా శారీరకంగా, మానసికంగా హింసతో పాటు బయట చోటు చేసుకునే మూకదాడుల హింసలను ఆమె ప్రస్తావించారు. నర్రా రవికుమార్ మాట్లాడుతూ మహిళ ధైర్యవంతురాలని తెలిపారు. ఇంట్లో పెంపకంలోనే మానసిక ఆరోగ్యం ఆధారపడి ఉంటుందని చెప్పారు. ఎస్సీ, ఎస్టీల్లో ఆర్థికంగా ఎదిగిన వారితో పోలిస్తే ఎదగని వారిపై శారీరక హింస ఎక్కువగా ఉన్నట్టు తాము చేసిన అధ్యయనంలో తేలిందని చెప్పారు.

భయం పోగొట్టాలి

బాధితులకు అండగా నిలుస్తున్న క్రమంలో ఆయా వ్యక్తులకు, కుటుంబాలకు పరిహారం, లబ్ధి కోసం పోరాడుతున్న క్రమంలో వారిలో భయాన్ని పోగొట్టే అంశంపై శ్రద్ధ పెట్టాలని జమున సూచించారు. బాధితులుగా మారిన వారిలో మానసిక ఆరోగ్యం దెబ్బతింటున్నదని చెప్పారు.

డాక్టర్ రాధిక మాట్లాడుతూ చిన్నతనంలో అనుభవించిన బాధ హింసాత్మక ధోరణికి దారి తీస్తుందని తెలిపారు. పిల్లలను ప్రశాంతంగా పెంచాలని సూచించారు. డాక్టర్ సంధ్య మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ తమ కుటుంబం మరింత మెరుగ్గా జీవించడమెలా అనే దాని కోసం ఆలోచించాలని కోరారు.

రాజ్యాంగమే పరిష్కారం

శక్తివంతురాలైన మహిళలను నియంత్రించేందుకు పురుషులు దేవున్ని, మతాన్ని సృష్టించారని డాక్టర్ సిద్ధోజి రావు తెలిపారు. దాని ఆసరా తో మహిళలపై హింస జరుగుతున్నదన్నారు. హింసనుంచి బయటపడేందుకు ప్రతి ఒక్కరూ రాజ్యాంగం చదవాలని సూచించారు.

సంబంధాలు మరింత బలోపేతం

పారిస్ : భారత్, ఫ్రాన్స్‌ల మధ్య వాణిజ్య, పెట్టుబడుల సంబంధాలను మరింత పెంపొందించుకోవాలని భారత ప్రధాని నరేంద్ర మోడీ, ఫ్రాన్స్ అధ్యక్షుడు ఎమ్మాన్యుయేల్ మాక్రాన్‌లు పిలుపునిచ్చారు. ఇండో-పసిఫిక్ ప్రాంతంలో, అలాగే వివిధ అంతర్జాతీయ వేదికలపై సహకారాన్ని పెంచుకోవాలని అంగీకారానికి వచ్చారు. ఇరువురు నేతల ద్వైపాక్షిక భేటీ అనంతరం సంయుక్త ప్రకటన విడుదల చేశారు. ఆరోగ్య, కుటుంబ సంక్షేమ రంగాల్లో ఇరు దేశాల మధ్య సహకారం ఊపందుకోవడం పట్ల నేతలు సంతృప్తి వ్యక్తం చేశారు. కొత్త సంవత్సరంలో ద్వైపాక్షిక సహకారానికి ప్రాధాన్యతా రంగాలుగా డిజిటల్ ఆరోగ్యం, సూక్ష్మజీవుల నిరోధకత, ఆరోగ్య నిపుణుల పరస్పర మార్పిడి వంటి రంగాలను గుర్తించారు.

కృత్రిమ మేథస్సును వినియోగించేందుకు నిర్దేశించే ప్రమాణాలను ప్రజాస్వామిక విలువలు ప్రతిబింబించేలా చూడాల్సి వుందని ఇరు దేశాలు అభిప్రాయపడ్డాయి. ప్రజా ప్రయోజనాల కోసమే ఏఐని వాడాలని నేతలు పేర్కొన్నారు. ఏఐ అభివృద్ధిని పరిచే ప్రక్రియలో ఇరు దేశాలు భాగస్వామ్యం కావాలని నిర్ణయించారు. ఇంధన భద్రతకు అణు విద్యుత్ చాలా కీలకమని నొక్కి చెబుతూ అధునాతన అణు రియాక్టర్లను సంయుక్తంగా అభివృద్ధిపరచాలనే లక్ష్యాన్ని ఇరు దేశాలు నొక్కి చెప్పాయి. ఈ మేరకు ఒక అవగాహనా ఒప్పందంపై సంతకాలు కూడా చేశారు. తక్కువ కార్బన్లు వినియోగించుకునే ఆర్థిక వ్యవస్థ దిశగా పరివర్తన చెందడానికి, ఇంధన భద్రతకు అణు ఇంధనమనేది చాలా కీలకంగా మారిందని నొక్కి చెప్పారు. రక్షణ, రోదసీ, పౌర అణు సహకారం, ఆరోగ్యం, ప్రజల మధ్య సహకారం వంటి రంగాల్లో పురోగతిని నేతలు సమీక్షించారు.

2026ను భారత్, ఫ్రాన్స్ ఆవిష్కరణల సంవత్సరంగా ఇరువురు నేతలు ప్రకటించారు. ఈ మేరకు ఇరువురు నేతలు దీని లోగోను ఆవిష్కరించారు. ప్రధానంగా ఏఐపైనే ద్వైపాక్షిక చర్చలు కేంద్రీకృతమయ్యాయని విదేశాంగ కార్యదర్శి విక్రమ్ మిస్రి చెప్పారు. యూరప్, పశ్చిమాసియా, ఇండో-పసిఫిక్ ప్రాంతాల్లో నెలకొన్న పరిణామాలపై పరస్పరం అభిప్రాయాలు వ్యక్తం చేసుకున్నారని తెలిపారు. విభిన్నమైన వ్యూహాత్మక భాగస్వామ్యంపై చర్చలు జరిగాయన్నారు.

కొత్త కాన్సులేట్ కార్యాలయం ప్రారంభం

అమరవీరులకు నివాళులు

అనంతరం ఇరువురు నేతలు ఫ్రాన్స్ అధ్యక్ష విమానంలో మార్సెల్లె నగరానికి చేరుకున్నారు. అక్కడ కొత్తగా భారత కాన్సులేట్ కార్యాలయాన్ని సంయుక్తంగా ప్రారంభించారు. ఇరు దేశాల ప్రజల మధ్య సంబంధాలను మరింత బలోపేతం చేయడంలో ఈ కార్యాలయం కీలక పాత్ర పోషిస్తుందని ప్రధాని మోడీ వ్యాఖ్యానించారు. అనంతరం మజర్గ్యూస్ యుద్ధ వీరుల సమాధిని సందర్శించి పుష్పగుచ్ఛాలుంచి అంజలి ఘటించారు. మొదటి ప్రపంచ యుద్ధంలో తమ ప్రాణాలను త్యాగం చేసిన 205 మంది భారతీయ సైనికులకు ఘనంగా నివాళులర్పించారు. ఈ యుద్ధంలో అశువులు బాసిన వీరుల త్యాగానికి గుర్తుగా ఫ్రాన్స్ ప్రభుత్వం గతంలో మార్సెల్లె నగరంలో యుద్ధ స్మారకాన్ని నిర్మించింది. కామన్‌వెల్త్ వార్ గ్రేవ్స్ కమిషన్ (సీడబ్ల్యూజీసీ) ఈ స్మారక నిర్వహణా బాధ్యతలు చూస్తుంది.

ఫ్రాన్స్‌లో రెండు రోజుల పర్యటన ముగించుకుని ప్రధాని మోడీ అమెరికా పర్యటనకు బయలుదేరి వెళ్లారు.

బర్డ్ ఫ్లూ ఎఫెక్ట్.. రాష్ట్ర సరిహద్దులు అప్రమత్తం

- భద్రాద్రి జిల్లా సరిహద్దుల్లో పశుసంవర్ధక శాఖ తనిఖీలు
- ఇతర రాష్ట్రాల కోళ్ల రవాణాకు జిల్లాలోకి నిరాకరణ
- భారీగా పడిపోయిన చికెన్ విక్రయాలు

నవతెలంగాణ-అశ్వారావుపేట

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వారావుపేట, చర్ల సరిహద్దుల్లో పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో నిఘా పెంచారు. ఈ రెండు ప్రదేశాల్లో ఇటు అశ్వారావుపేట రవాణా శాఖ తనిఖీ కేంద్రం, అటు బస్తర్(ఛత్తీస్‌గఢ్) నుంచి తెలంగాణలోకి వస్తున్న కోళ్ల వాహనాలను అడ్డుకుని వెనక్కి పంపుతున్నారు. ఆంధ్రాలోని డెల్టా ప్రాంతంలో పలు పౌల్ట్రీల్లోని లక్షలాది కోళ్ళు మృత్యువాత పడటం, అనంతరం ల్యాబ్ టెస్టుల్లో కోళ్ళకు బర్డ్ ఫ్లూ పాజిటివ్, "హెచ్5ఎన్1 ఇన్ఫ్లుయెంజా" వైరస్ సోకినట్టు నిర్ధారణ అవడంతో అప్రమత్తమైన తెలంగాణ ప్రభుత్వం.. తెలుగు రాష్ట్రాల సరిహద్దులను కట్టుదిట్టం చేసింది. ఆంధ్రా నుంచి కోళ్ల తెలంగాణలోకి అనుమతించొద్దని ఉత్తర్వులు జారీ చేసి రాష్ట్ర వ్యాప్తంగా 24 చెక్‌పోస్టులు ఏర్పాటు చేసింది. అందులోభాగంగా అశ్వారావుపేట, చర్ల తనిఖీ కేంద్రం వద్ద పశుసంవర్ధక శాఖ సిబ్బంది ఆంధ్రా, బస్తర్‌ల నుంచి తెలంగాణలోకి రవాణా చేస్తున్న కోళ్ల వాహనాలను అడ్డుకుని తిరిగి వెనక్కు పంపిస్తున్నారు. వైరస్ పూర్తిగా నశించిన అనంతరం ప్రభుత్వం నుంచి ఉత్తర్వులు వచ్చేవరకూ ఆంక్షలు అమల్లో ఉంటాయని, అప్పటి వరకూ బ్రాయిలర్, లేయర్ కోళ్ల వాహనాలు సహా చిక్స్ వాహనాలు కూడా రాష్ట్రంలోకి అనుమతించమని అధికారులు స్పష్టం చేస్తున్నారు.

అశ్వారావుపేట ప్రాంతానికి పెద్ద బాయిలర్, ఫారం కోళ్ల ఆంధ్రాలోని తిరువూరు, నూజివీడు, జంగారెడ్డిగూడెం నుంచి రవాణా చేస్తారు. వీటిని పశుసంవర్ధక శాఖ అధికారులు వెనక్కి తిప్పి పంపుతున్నారు. చిన్న బాయిలర్ కోళ్లను అశ్వారావుపేట, దమ్మపేట మండలాల్లోని పౌల్ట్రీ ఫామ్‌లో కొనుగోలు చేస్తున్నారు. మండలంలో సుమారుగా 100 మాంసం దుకాణాలు ఉన్నట్టు యజమానులు తెలిపారు. ఆంధ్రాలో బర్డ్ ఫ్లూ సోకడంతో తెలంగాణ సరిహద్దు మండలాల్లో మాంసం విక్రయాలు పడిపోయాయని దుకాణం యజమానులు వాపోతున్నారు. ఈ విషయంపై పశుసంవర్ధక శాఖ అదనపు సంచాలకులు డాక్టర్ ప్రదీప్ కుమార్ మాట్లాడుతూ.. ప్రస్తుతానికి తమ సిబ్బందితో నిఘా పెట్టామని తెలిపారు. స్థానిక ఎస్‌హెచ్‌ఓ ఎస్ఐ యయాతి రాజును వివరణ కోరగా.. తమ శాఖ నుంచి నిఘా పెంచామని కానీ, కోళ్ల లోడ్‌లు వెనక్కి పంపమని ఎటువంటి అధికారిక ఆదేశాలు లేవన్నారు.



అన్ని సమస్యలపై వారం రోజుల్లో సమావేశం

- టీయూఎంహెచ్ఇయూ నాయకులతో మంత్రి దామోదర రాజనర్సింహ
- వైద్యారోగ్యశాఖ సిబ్బంది సమస్యలపై వినతి



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

ఆరోగ్యమిత్రలు, 104 ఉద్యోగులు, ప్రభుత్వాస్పత్రుల్లో పని చేస్తున్న పేషెంట్ కేర్, శానిటేషన్, స్వీపర్స్, సెక్యూరిటీలు, ఎన్‌హెచ్ఎం ఉద్యోగులు, కాంట్రాక్ట్ ఏఎన్ఎంల సమస్యలపై వారం రోజుల్లో సమావేశం ఏర్పాటు చేయనున్నట్టు వైద్యారోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ తెలిపారు. బుధవారం హైదరాబాద్‌లోని మినిస్టర్స్ క్వార్టర్స్‌లో తెలంగాణ యునైటెడ్ మెడికల్, హెల్త్ ఎంప్లాయిస్ యూనియన్ (టీయుఎంహెచ్ఇయూ) రాష్ట్ర గౌరవాధ్యక్షులు భూపాల్ నేతృత్వంలో ఆరోగ్యశ్రీ రాష్ట్ర అధ్యక్షులు గిరి యాదయ్య, యూనియన్ రాష్ట్ర కార్యదర్శి వి.విజయవర్ధన్ రాజు, ఆరోగ్యశ్రీ ఉపాధ్యక్షులు సుమన్, 104 ఉద్యోగ నాయకులు శ్రీనివాస్, వెంకటేశ్వర్ రెడ్డి, రజాక్, రమేశ్, విజయ్ కుమార్ తదితరులు మంత్రిని కలిసి వినతిపత్రాలు సమర్పించారు.

ఈ సందర్భంగా మంత్రి స్పందిస్తూ వారం రోజుల్లో అన్ని సమస్యలపై సమావేశం ఏర్పాటు చేయనున్నట్టు తెలిపారని యూనియన్ నాయకులు వెల్లడించారు. ఆరోగ్యశ్రీలో పని చేస్తున్న ఆరోగ్య మిత్రల క్యాడర్ మార్పు, వేతనం పెంపుదల గురించి వివరించగా, వారం రోజుల్లో ప్రత్యేకంగా చర్చించి పరిష్కరిస్తానని మంత్రి హామీ ఇచ్చారన్నారు. 104 ఉద్యోగుల బకాయి వేతనాలు, డీఎంఈలోకి మార్పు చేసే విషయంపై వివరిస్తే, ప్రిన్సిపల్ సెక్రటరీకి ఆదేశాలు జారీ చేస్తామని దామోదర రాజనర్సింహ భరోసానిచ్చారని తెలిపారు. ప్రభుత్వాస్పత్రుల్లో పని చేస్తున్న పేషెంట్ కేర్, శానిటేషన్ , స్వీపర్స్, సెక్యూరిటీలకు ఆరు నెలల బకాయి వేతనం వెంటనే విడుదల చేయాలని కోరగా, త్వరలోనే జీతాలు ఇప్పిస్తానని మంత్రి మాటిచ్చారన్నారు. అదే విధంగా ఎన్‌హెచ్ఎంలో పని చేస్తున్న ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలనీ, కాంట్రాక్ట్ ఏఎన్ఎంల పీఆర్సీ బకాయిలు ఇవ్వాలనీ, ఈసీ ఏఎన్ఎంల పెండింగ్ జీతాలు చెల్లించాలని యూనియన్ నాయకులు కోరారు. వీటితో వివిధ రకాల క్యాడర్లు ఎదుర్కొంటున్న ఇతర సమస్యలను కూడా యూనియన్ నాయకులు మంత్రి దృష్టికి తీసుకెళ్లారు.

హరీశ్‌ను అరెస్టు చేయొద్దు

- గత ఉత్తర్వులను పొడిగించిన హైకోర్టు

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్



ఫోన్ ట్యాపింగ్ అభియోగాల కేసును కొట్టేయాలంటూ మాజీ మంత్రి హరీశ్‌రావు దాఖలు చేసిన పిటిషన్‌పై బుధవారం హైకోర్టులో వాదనలు జరిగాయి. హరీశ్‌వేసిన పిటిషన్‌ను కొట్టేయాలని రాష్ట్ర ప్రభుత్వం తరపున సుప్రీంకోర్టు న్యాయవాది సిద్ధార్థ లూథ్రా వాదించారు. ఫోన్ ట్యాపింగ్ చేయించడమంటే రాజ్యాంగం కల్పించిన వ్యక్తిగత హక్కులను హరించడమేనని చెప్పారు. వ్యక్తిగత గోప్యతను దెబ్బతీసే చర్యే అవుతుందన్నారు. కేసు దర్యాప్తు దశలో కోర్టులు అడ్డుకోడానికి వీల్లేదన్నారు. టెలిగ్రాఫ్ చట్ట నిబంధనల ప్రకారం ఫోన్ల ట్యాపింగ్ తీవ్ర నేరమన్నారు. ట్యాపింగ్ ప్రజల గోప్యత హక్కును హరించడమేనని వాదించారు. తొలుత హరీశ్‌రావు తరపున సుప్రీం కోర్టు సీనియర్ అడ్వకేట్ శేషాద్రి నాయుడు వాదనలు వినిపిస్తూ, రాజకీయ కక్షతోనే చక్రధర్‌గౌడ్ ఫిర్యాదు చేశారనీ, పోలీసులు ప్రాథమిక విచారణ కూడా చేయకుండా హడావుడిగా ఎఫ్ఐఆర్ నమోదు చేశారన్నారని పేర్కొన్నారు. ఇరు పక్షాల వాదనలు విన్న న్యాయమూర్తి జస్టిస్ కె.లక్ష్మణ్ గతంలోని మధ్యంతర ఉత్తర్వులను పొడిగిస్తూ. విచారణను ఈ నెల 19కి వాయిదా వేశారు..

బీఆర్ఎస్ సభకు అనుమతి

అధికార కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన ఆరు గ్యారెంటీలను అమలు చేయలేదంటూ బీఆర్ఎస్ పార్టీ ఈ నెల 18న రంగారెడ్డి జిల్లా అమనగల్‌లో నిర్వహించే సభకు హైకోర్టు అనుమతిచ్చింది. పలు షరతులు విధిస్తూ అనుమతి ఉత్తర్వులను జస్టిస్ విజయ్‌సేన్‌రెడ్డి జారీ చేశారు. 18న అమనగల్ జూనియర్ కాలేజీ మైదానంలో ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు మూడు వేల మందితో సభ నిర్వహించాలని ఆదేశించింది. బీఆర్ఎస్ నిరసన కార్యక్రమానికి పోలీసులు అనుమతి ఇవ్వకపోవడంపై అమనగల్ పార్టీ అధ్యక్షులు వేసిన పిటిషన్‌పై విచారణను మూసివేసింది.

కేసు కొట్టేయండి...సునీత లక్ష్మారెడ్డి

మెదక్ జిల్లా వెల్దుర్తి పీఎస్‌లో 2018లో నమోదైన కేసును కొట్టేయాలని కోరుతూ నర్సాపూర్ ఎమ్మెల్యే సునీతా లక్ష్మారెడ్డి ఇతరులు పిటిషన్ వేశారు. దీనిపై విచారణను ఈ నెల 18కి వాయిదా వేస్తూ జస్టిస్ లక్ష్మణ్ ఉత్తర్వులు జారీ చేశారు. వెల్దుర్తి అంబేద్కర్ క్రాస్ రోడ్డు వద్ద పర్మిషన్ లేకుండా నిరసన వ్యక్తం చేసి ప్రజలకు ఇబ్బంది కలిగించారనే కేసు కోర్టు విచారణలో ఉంది. ఫిర్యాదుదారును ప్రతివాదిగా చేర్చేందుకు ఆమెను అనుమతిస్తూ విచారణను వాయిదా వేశారు.

ఇల్లు అమ్మాలి.. లేకపోతే చంపేస్తా..!

- ఓ కుటుంబంపై నయీమ్ అనుచరుడు దాడి, వార్నింగ్
- రెండేండ్లుగా బెదిరింపులు
- పోలీసులకు బాధితుల ఫిర్యాదు

నవతెలంగాణ-చంపాపేట్

కిడ్నాప్, హత్యలు, బెదిరింపులకు పాల్పడి తన నేర సామ్రాజ్యాన్ని స్థాపించుకున్న నయీమ్ ఎన్‌కౌంటర్ జరిగి తొమ్మిదేండ్లు గడుస్తున్నా. చాపకింద నీరులా అతని అనుచరుల బెదిరింపులు, దాడులు కొనసాగుతున్నాయి. అపార్ట్‌మెంట్ ఫ్లాట్ అమ్మేయాలంటూ ఓ మిర్చి వ్యాపారిని నయీమ్ అనుచరుడు రెండేండ్ల నుంచి బెదిరింపులకు పాల్పడుతున్నాడు. వినకపోవడంతో బాధితుడి ఇంటిపై దాడి చేసి కుటుంబ సభ్యులపై దాడి చేశాడు. ఈ ఘటన హైదరాబాద్ సైదాబాద్ పోలీసు స్టేషన్ పరిధిలో వెలుగు చూసింది. పోలీసులు, బాధితులు తెలిపిన వివరాల ప్రకారం..

వై.ప్రకాష్ తన కుటుంబంతో కలిసి సైదాబాద్ లక్ష్మి అపార్ట్‌మెంట్‌లో 20 ఏండ్లుగా నివాసముంటున్నాడు. తొమ్మిది ఫ్లాట్స్ ఉన్న అపార్ట్‌మెంట్‌పై నయీమ్ అనుచరుడు పి.శ్రీహరి కన్ను పడింది. ముందుగా పెంట్‌హౌస్ అద్దెకు తీసుకున్నాడు. మెల్లిగా దాన్ని స్వాధీనం చేసుకున్నాడు. ఆ తరువాత నాలుగు ఫ్లాట్స్ యజమానులను నయానోభయానో బెదిరించి స్వాధీనం చేసుకున్నాడు. ఆ తరువాత అతని కన్ను ప్రకాష్ నివాసముంటున్న ఫ్లాట్‌పై పడింది. తనకు ఆ ఫ్లాట్ అమ్మాలంటూ రెండేండ్ల నుంచి బెదిరిస్తున్నాడు. ఈ క్రమంలోనే అతని ఫ్లాట్‌కు నీళ్లు రానియ్యలేదు. అయినా, తన ఫ్లాట్‌ను ప్రకాష్ అమ్మనని ఖరాకండీగా చెప్పేశాడు. దీంతో రెచ్చిపోయిన శ్రీహరి ఆదివారం రాత్రి ప్రకాష్ భార్య అనురాధ, కుమారుడు శ్యాంసుందర్, అల్లుడు సంతోష్‌పై దాడి చేశాడు. అడ్డువచ్చిన గర్భవతైన కోడలును సైతం కొట్టాడు. "మేము నయీమ్ అనుచరులం.. చాలా హత్యలు చేశాం.. మార్చి 30లోపు ఫ్లాట్ అమ్మి ఖాళీ చేయకుంటే ఏప్రిల్‌లో అందర్నీ చంపేస్తాం.." అంటూ బాధితులకు వార్నింగ్ ఇచ్చి వెళ్లిపోయాడు. ఆ సమయంలో ప్రకాష్ ఇంట్లో లేడు. అనంతరం ఇంట్లో వారం రోజుల్లో కుమారుడి పెండ్లి ఉండటంతో బాధితులు ఈ విషయాన్ని గోప్యంగా పెట్టారు. అయితే, శ్రీహరి తిరిగి బాధితులపైనే మంగళవారం కేసు పెట్టించాడు. దీంతో బాధితులు అసలు జరిగిన విషయాలపై ఈస్ట్ జోన్ డీసీపీ, సైదాబాద్ ఏసీపీ, సీఐకి బుధవారం ఫిర్యాదు చేశారు. దాంతో పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు. నయీమ్ ఎన్‌కౌంటర్ మరుసటి రోజే అతని అనుచరుడైన శ్రీహరిని పోలీసులు అరెస్టు చేశారు. ఇతనిపై నల్లగొండ, హైదరాబాద్, రాచకొండలో పలు కేసులు నమోదయ్యాయి. పీడీ యాక్ట్ కింద అతను ఏడాది జైలు జీవితం గడిపి విడుదలయ్యాడు.

జోనల్ కమిషనర్‌కు ఆత్మీయ సమ్మేళన ఆహ్వాన పత్రిక

నవతెలంగాణ-హయత్ నగర్



సీనియర్ సిటీజన్స్ సొసైటీ, సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఈ నెల 18వ తేదీన ఆత్మీయ సమ్మేళనాన్ని నిర్వహిస్తున్నారు. ఈ మేరకు హయత్ నగర్ డివిజన్ కార్పొరేటర్ కళ్లెం నవజీవన్ రెడ్డి ఎల్బీనగర్ జోనల్ కమిషనర్ హేమంత్ కేశవ్ పటేల్‌ను బుధవారం మర్యాదపూర్వకంగా కలిసి ఆత్మీయ సమ్మేళన ఆహ్వాన పత్రికను అందజేశారు. ఈ కార్యక్రమంలో హయత్‌నగర్ సర్కిల్ ఆసరా కమిటీ సభ్యులు పాటి యాది రెడ్డి, బీజేపీ డివిజన్ అధ్యక్షులు గంగాని శ్రీను, సీనియర్ సిటిజన్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

నిత్యావసర సరుకులు అందజేత

నవతెలంగాణ-సిటీబ్యూరో



సెవెన్ రేస్ ఫౌండేషన్ ఫౌండర్ డాక్టర్ సారా పేదలకు అండగా నిలుస్తున్నారు. పేద విద్యార్థులతోపాటు, వృద్ధులు, వికలాంగులకు తన వంతుగా సహాయ సహకారాలు అందజేస్తున్నారు. బుధవారం లాల్‌బజార్‌లో నివాసం ఉండే ప్యాట్రిక్ అనే వ్యక్తికి రెండు కాళ్లు లేవు. చాలా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. విషయం తెలుసుకున్న సారా ఆయన ఇంటికి వెళ్లి నిత్యావసర సరుకులు అందజేసి తన ఉదారతను చాటుకున్నారు.

అక్రమంగా ఇసుకను తరలిస్తే ఉక్కుపాదం మోపుతాం

- ఎంతటివారైనా నిబంధనలు పాటించాల్సిందే
- రాచకొండ సీపీ సుధీర్ బాబు




నవతెలంగాణ-సిటీబ్యూరో

నిబంధనలకు విరుద్ధంగా ఇసుకను తరలించేవారిపై ఉక్కుపాదం మోపుతామని రాచకొండ సీపీ సుధీర్ బాబు తెలిపారు. అక్రమాలకు పాల్పడేవారు ఎంతటి వారైనా వదిలిపెట్టమని, ప్రభుత్వ నిబంధనలు పాటించాల్సిందేనన్నారు. అపార్టుమెంట్లు, భారీ భవన నిర్మాణాలు, రోడ్ల నిర్మాణాలు, వ్యక్తిగత గృహాల నిర్మాణం వంటి పలు నిర్మాణ సంబంధ అవసరాలకు ఉపయోగిస్తున్నారు. అయితే ప్రభుత్వం విధించిన నిబంధనలను పాటించకుండా, ప్రభుత్వానికి చెల్లించాల్సిన పన్నులను ఎగవేస్తూ, ఇసుకను అక్రమంగా తరలించి బ్లాక్ మార్కెట్లో సొమ్ము చేసుకుంటే వారిపై రాచకొండ పోలీసులు ఉక్కుపాదం మోపుతున్నారు. ప్రజలకు చట్టబద్ధంగా అందాల్సిన ఇసుకను, ప్రభుత్వ అధికారుల కన్నుగప్పి అక్రమంగా తరలిస్తూ సొమ్ము చేసుకుంటున్న వారిపైన రాచకొండ పోలీసులు ప్రత్యేక నిఘా వేశారు. అక్రమంగా ఇసుక తరలిస్తున్న వారి మీద కేసులు నమోదు చేయడమే కాక ఇసుక తరలింపునకు ఉపయోగించిన టిప్పర్లు, ట్రాక్టర్లతోపాటు వివిధ వాహనాలను సీజ్ చేస్తున్నారు.

మంగళవారం నుంచి నిర్వహిస్తున్న స్పెషల్ డ్రైవ్‌లో రాచకొండ కమిషనరేట్ పరిధిలోని ఎల్బీనగర్ జోన్ పరిధిలో 5 కేసులు, మల్కాజిగిరి జోన్ పరిధిలో 10 కేసులు, యాదాద్రి భువనగిరి జోన్ పరిధిలో 5 కేసులు నమోదు చేశారు. రాచకొండ పరిధిలో మొత్తం 20 కేసులు నమోదు చేసిన పోలీసులు రూ.17,36,000 విలువైన 915 టన్నుల ఇసుకను సీజ్ చేశారు. ఈ సందర్భంగా కమిషనర్ సుధీర్‌బాబు మాట్లాడుతూ ఇసుక అనేది సహజ సంపదని, నదులు, ఏరుల్లో లభించే ఇసుకను ప్రభుత్వ నిబంధనలు పాటించకుండా, సరైన అనుమతులు లేకుండా విచ్చలవిడిగా తవ్వడం, అక్రమంగా తరలించడం వల్ల రాష్ట్రానికి పన్నుల పరంగా నష్టం జరగడమే కాకుండా పర్యావరణానికి సైతం హాని కల్గుతుందన్నారు. ఎంతటి వారైనా సరే ప్రభుత్వం నిర్ణీత పన్నులను చెల్లించకుండా, నిబంధనలకు విరుద్ధంగా అక్రమంగా ఇసుకను తరలిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అక్రమంగా ఇసుకను తరలించేవారు ఇప్పటి నుంచైనా అడ్డదారులు మానుకోవాలని, నిబంధనల ప్రకారం అనుమతులు తీసుకొని, నిర్ణీత ఛార్జీలను ప్రభుత్వానికి చెల్లించి ఇసుకను పొందాలని సూచించారు. లేనిపక్షంలో ఉక్కుపాదం మోపుతామని హెచ్చరించారు.





4 ఏండ్లుగా ఫారెస్ట్ భూమి అమ్మకం

- తమ భూమి అంటూ మోసం చేస్తున్న కొందరు వ్యక్తులు
- ఆలస్యంగా నిందితులు అరెస్ట్..
- రెవెన్యూ, ఫారెస్ట్ అధికారుల నిర్లక్ష్యమని ఆరోపణలు


నవతెలంగాణ - హయత్‌నగర్

అదంతా ఫారెస్ట్ భూమి అని కేంద్ర ప్రభుత్వం 1994 ధ్రువీకరణ చేసింది. సర్వే నెంబర్ 7 మన్సూరాబాద్, బండ్లగూడ, ఆటో నగర్, తట్టి అన్నారం పరిధిలో 582 ఎకరాల్లో ఆ ఫారెస్ట్ భూమి విస్తరించి ఉంది. ఆ భూమి తమ తల్లిదండ్రులది అని ఓ ప్రవేటు వ్యక్తి రోజు రోజుకు పెరుగుతున్న భూ ధరలను ఆసరాగా చేసుకుని.. పేదలను టార్గెట్ చేసుకుని సబ్ ఏజెంట్‌ల ద్వారా కేవలం 60-100 గజాలకు 5వేల రూపాయల నుండి 50వేల రూపాయల వరకు వసూలు చేశారు. ఇదంతా సుమారు నాలుగైదేండ్లుగా జరుగుతున్నా ఎవరికీ తెలియకపోవడం విడ్డూరంగా ఉంది. ఈ విషయంపై రెవెన్యూ, ఫారెస్ట్ అధికారులకు స్థానిక కార్పొరేటర్ సమాచారం అందించినా కూడా పెడచెవిన పెట్టారని కార్పొరేటర్ ఆరోపిస్తున్నారు. కానీ ఈ భూమిని కొని రాష్ట్ర వ్యాప్తంగా సుమారు 40 నుండి 50వేల మంది మోసపోయిన బాధితులు ఉండడం గమనార్హం.

గత నెల 26న గణతంత్ర దినోత్సవం సందర్భంగా మన్సూరాబాద్ ఆటో నగర్ పరిధిలో ఉన్న మసీదు వద్దకు వందల మందికి సోషల్ మీడియాలో సమాచారం ఇచ్చిన షేక్ జిలాని పిలుపుతో వారంతా అక్కడికి చేరుకున్నారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని సుమారు 70మంది అల్లరి మూకలను అదుపులోకి తీసుకు న్నారు. అదే రోజు హరిణ వనస్థలి ఫారెస్ట్ అధికారితో ఫిర్యాదు స్వీకరించిన పోలీసులు పూర్తి స్థాయిలో విచారణ జరిపి, వారం రోజుల్లో బాధితులకు అండగా ఉంటామని తెలిపారు. ప్రధాన నిందితుడు అయిన హైకోర్ట్ అడ్వకేట్ షేక్ జిలాని, అతని బంధువులు అని చెప్పుకుంటున్న యూసుఫ్ ఖాన్, తులసమ్మా అలియాస్ సుల్తానాలను గత నెలలో అరెస్ట్ చేసి వారిని రిమాండ్‌కు తరలించినట్లు వనస్థలిపురం ఇన్స్పెక్టర్ శ్రీనివాస్ తెలిపారు. ప్రధానంగా నిందితుల పేరిట ఫారెస్ట్ భూమిని బాధితులకు గిఫ్ట్ డీడ్, సేల్ డీడ్లను నోటరీపై రాయించి అమ్ముతున్నారు. ఈ తతంగం అంతా నాలుగేండ్లుగా జరుగుతుంది. దీనిపై సాక్ష్యాత్తు 59జీవో, ధరణి, ప్రజావాణిలో దరఖాస్తు చేసినట్టు తెలిపారు బాధితులు.


అరెస్ట్‌తో చేతులు దులుపుకున్నారు..


షేక్ జిలాని అనే వ్యక్తి హై కోర్ట్ న్యాయ వాది. అతను మన్సూరాబాద్‌లో ఉన్న హరిణ వనస్థలి జాతీయ పార్క్ స్థలాన్ని తన తల్లీదండ్రులు ఇచ్చిన వారసత్వ భూమిగా చూపుతూ తెలంగాణ వ్యాప్తంగా 30-40వేల మంది బాధితుల నుండి సుమారు 60-100గజాలకు 5వేల నుండి 30వేల రూపాయల వరకు వసూలు చేసినట్లు సమాచారం. కానీ గత నెలలో ఫిర్యాదు స్వీకరించిన వనస్థలిపురం పోలీసులు కేస్ నమోదు చేసుకుని నిందితులు అయిన ముగ్గురిని అరెస్ట్ చేశారు. కానీ బాధితుల నుండి వసూలు చేసిన డబ్బును రికవరీ చేయలేకపోయారని బాధితులు వాపోతున్నారు.



కొందరు వ్యక్తులు ఫారెస్ట్ భూమిని తమ తల్లీదండ్రులది అంటూ నాలుగైదేండ్లుగా పలువురికి విక్రయించి మోసం చేస్తున్నారు. బాధితులు బయటకు రాకపోవడంతో వారు చాలా మందిని మోసం చేశారు. మరి రెవెన్యూ, ఫారెస్ట్ అధికారులకు ఈ విషయం తెలియదా..? అని పలువురు ప్రశ్నిస్తున్నారు. ఆలస్యంగా అయిన ఈ విషయం బయటకు వచ్చింది.. మరి అధికారులు ఎలాంటి చర్యలు తీసుకుంటారో..!







ఇకపై మళ్లీ జరగకుండా కేస్ పెట్టాం

ఇకపై ఎవరూ ఫారెస్ట్ భూమిని తమదిగా చూపకుండా ఉండేవిధంగా కేసు పెట్టాం. పోలీస్ స్టేషన్‌లో షేక్ జిలాని, వారి తల్లిదండ్రులు అయిన యూసఫ్ ఖాన్, తులసమ్మ అలియాస్ సుల్తానాలపై ఫిర్యాదు చేశాం. కేస్ నమోదు చేసిన పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు.

- ఫారెస్ట్ అధికారి సాయి ప్రకాష్

ధరణిలో పెట్టిన దరఖాస్తును తిరస్కరించాం

సర్వే నెంబర్ 7లో ఉన్న భూమికి తక్కువ ధరకు పేదలకు గిఫ్ట్ డీడ్ పేరుతో నోటరీ చేసి విక్రయాలు చేస్తున్నట్లు తమకు వచ్చిన సమాచారంతో గతంలో కూడా ధరణి, 59జీవో, ప్రజావాణిలో కూడా దరఖాస్తులు వచ్చాయి. వాటిని పరిశీలించి రద్దు చేశాం.

- సరూర్ నగర్ తహసీల్దార్ వేణుగోపాల్

ఫిర్యాదుతో నిందితులను అరెస్ట్ చేశాం

నాలుగేండ్లుగా ఈ తతంగం అంతా జరుగుతున్నా.. మాకు మాత్రం గత నెలలో ఫారెస్ట్ అధికారి ఫిర్యాదుతో కేస్ నమోదు చేసి షేక్ జిలాని, యూసఫ్ ఖాన్, తులసమ్మ అలియాస్ సుల్తానా అనే ముగ్గురుని అరెస్ట్ చేసి రిమాండ్ కు తరలించాం.

- వనస్థలిపురం ఇన్స్పెక్టర్ శ్రీనివాస్

ముందే హెచ్చరించినా పెడచెవిన పెట్టారు

అధికారులను ముందే హెచ్చరించిన కూడా పెడచెవిన పెట్టారు. మలక్‌పేటలో అడ్డాగా పెట్టుకుని బాధితుల నుండి నగదు వసూలు చేశారు. పేదల నుండి వసూలు చేసిన డబ్బుతో నెల్లూరులో 200ఎకరాల పొలం కొన్నారు. అతన్ని పోలీసులు కస్టడీకి తీసుకుని బాధితులకు న్యాయం చేయాలి.

- మన్సూరాబాద్ కార్పొరేటర్ కొప్పుల నర్సింహారెడ్డి

నిందితుల ఆస్తులు అటాచ్ చేసి బాధితులకు న్యాయం చేయాలి

ఫారెస్ట్ భూమి తమదేనని సుమారు 50వేల మంది బాధితులను మోసం చేసిన నిందితుల ఆస్తులను ప్రభుత్వం అటాచ్ చేసి పేదలకు దక్కేలా న్యాయం చేయాలి. అదే రాష్ట్ర ప్రభుత్వం భూమి అయితే గతంలో రాజకీయ నేతల్లాగా అప్పనంగా కబ్జా చేసిన వారికి అప్పగించేవారు. కేంద్ర ప్రభుత్వం భూమి కాబట్టి చర్యలు తీసుకున్నారు.

- సీపీఐ(ఎం) జిల్లా కమిటీ సభ్యులు కీసరి నర్సీరెడ్డి

నిలిచిపోయిన పనులు పూర్తయ్యేందుకు కృషి

మధుయాష్కీ గౌడ్

నవతెలంగాణ - హస్తినాపురం

కొన్ని అనివార్య కారణాల వలన మధ్యలో నిలిచిపోయిన వరద నీటి కాల్వ పనులను పూర్తిచేసే విధంగా కృషి చేస్తానని తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ ప్రచార కమిటీ చైర్మన్ మధుయాష్కీ గౌడ్ అన్నారు. హస్తినాపురం కార్పొరేటర్ బానోతు సుజాత నాయక్‌తో కలిసి డివిజన్ పరిధిలోని వందన పూరి కాలనీలో అర్ధాంతరంగా నిలిచిపోయిన వరద నీటి కాల్వ పనులను బుధవారం మధుయాష్కీ గౌడ్ పరిశీలించారు. ఈ సందర్భంగా మధుయాష్కీ గౌడ్ మాట్లాడుతూ చాపల చెరువును గత పాలకులు ఆక్రమించుకొని సామాన్య ప్రజలకు అమ్ముకున్నారని, ఆ ప్రాంతంలో వసతులు లేక వర్షాలు వచ్చినప్పుడు కాలనీ మునిగిపోతుందని ఆరోపించారు. కాలనీవాసులు ఎదుర్కొంటున్న సమస్యలను త్వరలో పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. పనులను సక్రమంగా చేపట్టకపోవడం వలన వర్షం వచ్చిందంటే కాలనీవాసులు అనేక ఇబ్బందులకు గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వెంటనే ఈ సమస్యను ఎల్బీనగర్ జోనల్ కమిషనర్ దృష్టికి తీసుకువెళ్లి వర్షాకాలం నాటికి వరదనీటి కాలువ పనులు పూర్తి అయ్యే విధంగా కృషి చేస్తానని భరోసా ఇచ్చారు. అవసరమైతే ముఖ్యమంత్రి దృష్టికి తీసుకువెళ్లి సమస్యను పరిష్కరించనున్నట్లు తెలిపారు. దీంతో పాటు రెడ్డి కాలనీ తదితర ప్రాంతాల్లో పాదయాత్ర నిర్వహిస్తూ ఆ ప్రాంత వాసులు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. రెడ్డి కాలనీలో జీహెచ్ఎంసీ నిధులు రూ.10 లక్షల 50 వేలతో ఏర్పాటు చేసిన ఓపెన్ జిమ్‌ను కార్పొరేటర్ ప్రారంభించగా.. ఆ ఓపెన్ జిమ్‌ను మధుయాష్కీ గౌడ్ పరిశీలించారు. ఈ కార్యక్రమంలో హస్తినాపురం డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు దెంది శశిధర్ రెడ్డి, వనస్థలిపురం కార్పొరేటర్ రాగుల వెంకటేశ్వర రెడ్డి, చంపాపేట కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు శ్రీపాల్ రెడ్డి, పి.సి.సి కార్యదర్శి గజ్జి భాస్కర్ యాదవ్, కాంగ్రెస్ నాయకులు గోపిరెడ్డి చంద్రశేఖర్ రెడ్డి, పాశం అశోక్ గౌడ్, శ్రీనివాస్ గౌడ్, చంద్రశేఖర్ నేత, లింగాల కిషోర్ గౌడ్, బుడ్డా సత్యనారాయణ, లత, మమత మల్లేష్ గౌడ్, శనీర్, సాయిరాం రెడ్డి, విజయభాస్కర్ రెడ్డి దుర్గారెడ్డి, రెడ్డి కాలనీ అధ్యక్షులు వెంకటరెడ్డి, రాజి రెడ్డి, తోకటి కిరణ్ పాల్గొన్నారు.



చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలి

ప్రయివేటు పాఠశాలల రాష్ట్ర అధ్యక్షులు శ్రీనివాస్ రావు



నవతెలంగాణ-బడంగ్‌పేట్

విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించి.. జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో పేరు ప్రఖ్యాతులు సంపాదించాలని ప్రయివేటు పాఠశాలల రాష్ట్ర అధ్యక్షులు జీ.శ్రీనివాస్ రావు అన్నారు. మహేశ్వరం నియోజకవర్గం బాలాపూర్ మండల ప్రైవేట్ పాఠశాలల సంఘం ఆధ్వర్యంలో జిల్లెల్లగూడలో విద్యార్థులకు బుధవారం క్రీడల పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ పోటీలలో పాల్గొన్న మల్లాపూర్ గ్లోబల్ ట్రీ స్కూల్ విద్యార్థులు క్యారమ్స్, రింగ్ బాల్‌లలో రెండవ బహుమతి సాధించినట్టు తెలిపారు. పాఠశాలలో విద్యార్థులకు విద్యతో పాటు ఆసక్తి ఉన్న క్రీడాలలో ప్రత్యేక శిక్షణ ఇవ్వాలన్నారు. అనంతరం విజయం సాధించిన విద్యార్థులకు బహుమతులను అందజేశారు. ఈ కార్యక్రమంలో బాలాపూర్ మండల ప్రవేట్ పాఠశాలల సంఘం కార్యదర్శి చంద్రశేఖర్, కోశాధికారి వెంకటేశ్వర్లు, గ్లోబల్ ట్రీ స్కూల్ కరస్పాండెంట్ హన్మంతు, వివిధ పాఠశాలల కరస్పాండెంట్లు, విద్యార్థులు పాల్గొన్నారు.

స్వాతి రెసిడెన్సిలో నిలిచిన పనులు పూర్తి చేయండి

టీపీసీసీ ప్రచార కమిటీ చైర్మెన్ మధు యాష్కీ గౌడ్



నవతెలంగాణ-హయత్‌నగర్

స్వాతి రెసిడెన్సిలో నిలిచిపోయిన డ్రైనేజీ ట్రంక్ లైన్ పనులను వెంటనే పూర్తి చేయాలని జల మండలి అధికారులను టీపీసీసీ ప్రచార కమిటీ చైర్మెన్ మధు యాష్కీ గౌడ్ ఆదేశించారు. మన్సూరాబాద్ డివిజన్ పరిధిలోని స్వాతి రెసిడెన్సి(వీరన్న గుట్ట)లో నత్తనడకన సాగుతున్న డ్రైనేజీ పనులను అధికారులతో కలిసి బుధవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మధుయాష్కీ గౌడ్ మాట్లాడుతూ ఏమైనా సమస్యలు ఉంటే తమ దృష్టికి తీసుకురావాలని ఎల్బీనగర్ నియోజకవర్గ పరిధిలో ఉన్న కాలనీ వాసులు సూచించారు. ఉన్నతాధికారులతో మాట్లాడి వాటిని త్వరితగతిన పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. ఆయన వెంట వాటర్ వర్క్స్ డీజీఎం మాధవి, స్వాతి రెసిడెన్సి, పవనగిరి కాలనీ, బాలాజీ నగర్, బాలాజీ నగర్ ఫేజ్2, లక్ష్మీ భవాని కాలనీ వాసులతో పాటు డివిజన్ అధ్యక్షుడు సత్యనారాయణ, చెన్నగొని రవీందర్ గౌడ్, శ్రీ పాల్ రెడ్డి, నర్సింహ యాదవ్, కిషోర్ గౌడ్, వేణు గోపాల్ యాదవ్, సదాశివుడు, మార్కెట్ కమిటీ డైరెక్టర్ అశోక్ గౌడ్, టీమిడి రామకృష్ణ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రైతుల ఆర్థికాభివృద్ధికి ఎంతో కృషి

చైర్మెన్ మర్రి నర్సింహారెడ్డి



నవతెలంగాణ-బడంగ్‌పేట్

నాదర్‌గుల్ గ్రామంలోని ది భాగ్యనగర్ రైతు సేవా సహకార సంఘం బ్యాంకు అభివృద్ధికి, రైతుల ఆర్థికాభివృద్ధికి ఎంతో కృషి చేసినట్టు బ్యాంకు చైర్మెన్ మర్రి నర్సింహారెడ్డి అన్నారు. మహేశ్వరం నియోజకవర్గం బడంగ్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో ఉన్న నాదర్‌గుల్ గ్రామంలోని ది భాగ్యనగర్ రైతు సేవా సహకార సంఘం బ్యాంకు చైర్మెన్ మర్రి నర్సింహారెడ్డి తన పదవి కాలం ఈ నెల 15న ముగుస్తున్న సందర్భంగా బుధవారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. తాను బ్యాంకు చైర్మెన్‌గా బాధ్యతలు స్వీకరించిన 5సంవత్సరాలుగా బ్యాంకు పరిధిలో ఉన్న రైతుల, వ్యాపారుల, ప్రజల సంక్షేమానికి అధిక ప్రాధాన్యత ఇచ్చినట్టు పేర్కొన్నారు. 2020 సంవత్సరం మార్చి 31న తాను రైతు సేవ సహకార సంఘం బ్యాంకు చైర్మెన్ బాధ్యతలు స్వీకరించిన సమయంలో బ్యాంకు డిపాజిట్లు రూ.10కోట్ల 6లక్షల 16వేలు నిల్వ ఉండగా.. 31జనవరి 2025వరకు రూ.16కోట్ల 15లక్షల 45వేలకు చేరిందన్నారు. అదే విధంగా పంట రుణాలు రూ.1కోటి 67లక్షల 16వేలు ఉండగా.. రూ.1కోటి 87లక్షల 75వేలకు చేరిందన్నారు. గేదెలు, గొర్రెల, ట్రాక్టర్, ఫాలిహౌజ్‌ల ఏర్పాటు కోసం రూ.94లక్షల 93వేలుఉండగా.. రూ.18లక్షల 39వేలకు చేరిందన్నారు. వ్యాపార, ద్విచక్ర వాహనాల కోసం రుణాలు రూ.1కోటి 23లక్షల 9వేలు ఉండగా.. రూ.8కోట్ల 23లక్షల 85వేలకు చేరిందని తెలిపారు. అదే విధంగా బంగారు ఆభరణాలపై రుణాలు రూ.6కోట్ల 66లక్షల 53వేలు ఉండగా.. రూ.18కోట్ల 63లక్షల 44వేల వరకు అన్ని రకాల బ్యాంకు రుణాలను సకాలంలో రైతులతో పాటు అన్ని రకాల రుణాలు అందచేసి నిస్వార్థంగా మహేశ్వరం నియోజకవర్గం ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి సహకారంతో తన వంతుగా కృషి చేసినట్టు వివరించారు. బ్యాంకు లాభం రూ.2కోట్ల 1లక్ష 30వేలు ఉండగా..ఈ 5సంవత్సరాల కాలంలో బ్యాంకు రూ.4కోట్ల 62లక్షల 72వేల లాభాల బాటలో నడుస్తుందని తెలిపారు. అనంతరం తనకు సహకరించిన పాలక వర్గం, సిబ్బందికి ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలియజేశారు.

జీహెచ్ఎంసీ కార్మికులకు బట్టలు పంపిణీ

నవతెలంగాణ-చంపాపేట్



మలక్‌పేట నియోజకవర్గం సైదాబాద్ డివిజన్ కార్పొరేటర్ కొత్త కాపు అరుణ రవీందర్ రెడ్డిని బుధవారం జీహెచ్ఎంసీ కార్మికులు మర్యాదపూర్వకంగా కలిసి శాలువతో ఘనంగా సత్కరించారు. డివిజన్ పరిధిలో విధులు నిర్వహిస్తున్న జీహెచ్ఎంసీ కార్మికులకు బుధవారం బట్టలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ.. భాగ్యనగరాన్ని శుభ్రంగా ఉంచడంలో పారిశుధ్య సిబ్బందిదే కీలకపాత్ర అని అన్నారు. పేరుకుపోయిన చెత్తాచెదారాన్ని తొలగిస్తూ హైదరాబాద్ నగరాన్ని ఎంతో పరిశుభ్రంగా ఉంచుతున్నారని కొనియాడారు. హైదరాబాద్ నగరంలోని సైదాబాద్ కాలనీ ఆదర్శంగా నిలవాలని, తడి, పొడి చెత్తను వేరు చేసి ఆటోలో వేయాలని సూచించారు. చెత్త సేకరణ పకడ్బందీగా కొనసాగేందుకు అధికారులు చర్యలు చేపట్టాలని కోరారు. నిత్యం తెల్లవారు జామున ఆరు గంటలకే క్షేత్ర స్థాయిలో పర్యటిస్తూ సిబ్బందికి సలహాలు, సూచనలు చేస్తూ స్వేచ్ఛ సైదాబాద్‌కు కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో కాలనీ అధ్యక్షులు కృష్ణ మురళి, రాజేశ్వరరావు, సత్యనారాయణమూర్తి, కమిటీ సభ్యులు, పారిశుధ్య సిబ్బంది, అభిమానులు పాల్గొన్నారు.

డ్రయినేజీ నిర్మాణ పనుల పరిశీలన



నవతెలంగాణ-బడంగ్‌పేట్

ప్రజలకు మౌలిక సదుపాయాలు కల్పించేందుకు కృషి చేస్తానని 8వ డివిజన్ మాజీ కార్పొరేటర్ జీ.ఇంద్రసేన అన్నారు. బుధవారం మహేశ్వరం నియోజకవర్గం బడంగ్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో ఉన్న నాదర్ గుల్ 8వ డివిజన్ పరిధిలోని వైష్ణవి కాలనీలో నూతనంగా చేపట్టిన డ్రైనేజీ నిర్మాణ పనులను, వెంకటాద్రి కాలనీలో చేపట్టిన సీసీ రోడ్డు నిర్మాణ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 5సంవత్సరాలుగా డివిజన్ పరిధిలో ఉన్న అన్ని కాలనీల ప్రజలకు అనేక అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలను అమలు చేయడం జరిగిందన్నారు. కోట్లాది రూపాయల నిధులతో అనేక అభివృద్ధి చేపట్టినట్లు తెలిపారు. ఆయన వెంట కాలనీ వాసులు తదితరులు ఉన్నారు.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
మేడ్చల్-మల్కాజిగిరి-ఉప్పల్
గురువారం | ఫిబ్రవరి 13, 2025 | www.navatelangana.com

కుంభమేళా మృతుల కుటుంబాలకు పరమేశ్వర్ రెడ్డి పరామర్శ



నవతెలంగాణ - చర్లపల్లి

ఉత్తరప్రదేశ్‌లోని ప్రయాగ్‌రాజ్‌లో కుంభమేళాకు వెళ్లి వస్తు రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన వారి కుటుంబాలను ఉప్పల్ కాంగ్రెస్ ఉప్పల్ నియోజకవర్గ ఇన్‌చార్జి మందుముల పరమేశ్వర్‌రెడ్డి పరామర్శించారు. బుధవారం నాచారంలోని మృతుల ఇండ్లకు వద్దకు వెళ్లి వారి కుటుంబ సభ్యులను ఓదార్చారు. సురకంటి మల్లారెడ్డి, రాంపల్లి రవి కుమార్, బోరంపేట సంతోష్, కల్యారి రాజు, సోమవరం శశి కాంత్ మృతదేహాలకు పరమేశ్వర్ రెడ్డి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ కృష్ణారెడ్డి, కాంగ్రెస్ నాచారం డివిజన్ అధ్యక్షులు శ్రీకాంత్ గౌడ్, రాంరెడ్డి, అశ్వద్దామరెడ్డి, మహేష్ యాదవ్, లింగంపల్లి రామకృష్ణ, మామిడాల సంతోష్ రెడ్డి (రిటైర్డ్ ఆర్మీ), గదా క్రాంతి, శ్రవణ్, చిల్కా నరేష్, శ్రీనివాస్ రెడ్డి, బోలెం నరేష్, భారతమ్మ, లీలా తదితరులు పాల్గొన్నారు.

ఎంపీటీసీ డ్రాఫ్ట్ పోలింగ్ స్టేషన్ ముసాయిదా జాబిత ప్రచురణ



నవతెలంగాణ - మేడ్చల్

మేడ్చల్ మండల ఎంపీటీసీ డ్రాఫ్ట్ పోలింగ్ స్టేషన్ జాబితా ముసాయిదాను ఎంపీడీవో కార్యాలయంలో నోటీస్ బోర్డులో పెట్టినట్లు ఎంపీడీవో వసంత లక్ష్మి బుధవారం తెలిపారు. కాగా ఇట్టి జాబితాపై ఏమైనా అభ్యంతరాలు ఉంటే ఈ నెల 13వ తేదీనలోపు ఎంపీడీవోకు తెలియజేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపీవో సునీత, సూపరింటెండెంట్ హృదయ్ కుమార్ పాల్గొన్నారు.

స్ఫూర్తి గ్రూప్‌లో చార్లెస్ డార్విన్ జయంతి



నవతెలంగాణ-కాప్రా

తెలంగాణ ప్రజా సాంస్కృతిక కేంద్రం స్ఫూర్తి గ్రూపు ఆధ్వర్యంలో కమలానగర్ ఆఫీసులో ప్రముఖ శాస్త్రవేత్త చార్లెస్ డార్విన్ జయంతి నిర్వహించారు. ఈ కార్యక్రమానికి స్ఫూర్తి గ్రూపు నాయకులు శ్రీమన్నారాయణ అధ్యక్షత వహించారు. పీపుల్స్ వెల్ఫేర్ ట్రస్ట్ మెడికల్ విభాగం చూస్తున్న ఉమామహేశ్వరావు చార్లెస్ డార్విన్ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. అనంతరం సామాజిక ఉద్యమ నాయకులు కోమటి రవి మాట్లాడుతూ చార్లెస్ డార్విన్ జీవుల పరిణామ క్రమాన్ని అనేక పరిశోధనలు చేసి వివరంగా వివరించారని తెలిపారు. అప్పటివరకు మానవుడు, జీవరాసులు దేవుని సృష్టి అని మతాలు చెబుతూ వచ్చాయన్నారు. దానికి భిన్నంగా జీవులు పరిణామక్రమం చెందుతూ రూపం మార్చుకున్నాయని పరిశోధన క్రమాన్ని ప్రపంచానికి తెలిపారని పేర్కొన్నారు. మానవ పరిణామక్రమాన్ని అద్భుతంగా వివరించారని కొనియాడారు. ఈ సందర్భంగా శ్రీమన్నారాయణ, యువ నాయకులు గిరీష్ మాట్లాడుతూ.. డార్విన్ పరిణామ సిద్ధాంతం ప్రపంచాన్ని అధ్యయనం చేయడంలో కొత్త రూపును తీసుకొచ్చిందని వివరించారు. అనంతరం సభికులందరూ చార్లెస్ డార్విన్ చిత్రపటానికి పూలను వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో గిరీష్, ఉమామహేశ్వరరావు, జి.శివరామకృష్ణ, గౌసియా, ఉమామహేశ్వరరావు, కోమటి రవి తదితరులు పాల్గొన్నారు.

సెలబ్రిటీ క్రికెట్ లీగ్‌కు భద్రత కట్టుదిట్టం

- రాచకొండ సీపీ సుధీర్ బాబు
- రాజీవ్ గాంధీ స్టేడియంలో 14, 15న సెలబ్రిటీ టీ20 మ్యాచ్‌లు



నవతెలంగాణ-సిటీబ్యూరో

ఉప్పల్‌లోని రాజీవ్ గాంధీ క్రికెట్ స్టేడియంలో ఈ నెల 14, 15న పదకొండవ సీజన్ సెలబ్రిటీ క్రికెట్ లీగ్-2025 పోటీలకు భద్రతకట్టు దిట్టం చేస్తున్నామని, ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా అన్ని చర్యలు తీసుకుంటున్నామని రాచకొండ సీపీ సుధీర్‌బాబు తెలిపారు. రెండు రోజుల పాటు జరగనున్న టీ20 మ్యాచ్‌ల నిర్వహణ, భద్రతా ఏర్పాట్లపై రాజీవ్ గాంధీ ఉప్పల్ స్టేడియంలో రాచకొండ కమిషనర్ సుధీర్ బాబు సీసీఎల్ నిర్వాహకులతో కోఆర్డినేషన్ మీటింగ్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో స్టేడియం అధికారులు, జీహెచ్ఎంసీ, విద్యుత్ శాఖ, రెవెన్యూ శాఖ అధికారులతో పాటు ఇంటెలిజెన్స్, స్పెషల్ బ్రాంచ్, రిజర్వ్ పోలీసుతోపాటు వివిధ విభాగాలకు చెందిన అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీపీ సుధీర్ బాబు అధికారులకు దిశానిర్దేశం చేశారు. శాంతి భద్రతలకు విఘాతం కలగకుండా, తగిన విధంగా పటిష్టమైన భద్రతా ఏర్పాట్లు చేయాలని అధికారులకు సూచించారు. ప్రేక్షకులకు ఎటువంటి అసౌకర్యం కలుగకుండా చర్యలు తీసుకోవాలన్నారు. ముఖ్యంగా వివిధ భాషల సినిమా తారలు పాల్గొనే సెలబ్రిటీ క్రికెట్ పోటీలు కావటం వల్ల భారీ సంఖ్యలో ప్రేక్షకులు వచ్చే అవకాశం ఉంటుందన్నారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా జాగ్రత్తగా ఉండాలని అధికారులను ఆదేశించారు. సెలబ్రిటీ క్రికెట్ లీగ్ ప్రతినిధులతో సమన్వయం చేసుకోవాలని అధికారులకు సూచించారు. కూల్ డ్రింక్స్, ఇతర ఆహార పదార్థాల ధరలు నిబంధనల మేరకు ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. స్టేడియంతోపాటు పరిసరాల్లో సీసీ టీవీలను ఏర్పాటు చేయాలన్నారు. అవసరమైన పార్కింగ్ ఏర్పాట్లు చేయాలన్నారు. ప్రతీ ఒక్కరి కదలికలూ సీసీటీవీ కెమెరాల్లో నిక్షిప్తం అవుతాయని పేర్కొన్నారు. మీడియా ప్రతినిధులకు, ఇతరులకు ఇచ్చే పాసుల జారీలో తగిన విధంగా జాగ్రత్తలు తీసుకోవాలని నిర్వాహకులకు సూచించాలని అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో ఎస్బీ డీసీపీ జి. నరసింహా రెడ్డి, ఎస్ఓటీ డీసీపీ రమణారెడ్డి, ట్రాఫిక్ డీసీపీ మల్లారెడ్డి, హెడ్ క్వార్టర్ డీసీపీ శ్యాం, మల్కాజిగిరి అడిషనల్ డీసీపీ వెంకటరమణ, అడిషనల్ డీసీపీ సీఎస్‌డబ్ల్యూ ఏసీపీ శ్రీనివాసరావు, మల్కాజిగిరి ఏసీపీ చక్ర చక్రపాణి, సెలబ్రెటీ క్రికెట్ లీగ్ ఫౌండర్ విష్ణు వర్ధన్ ఇందూరి, బృంద సభ్యులు, తదితర అధికారులు పాల్గొన్నారు.

మయుక సిల్వర్ జ్యూయలరీ ప్రారంభం



నవతెలంగాణ-సిటీబ్యూరో

ప్రీమియం సిల్వర్ జ్యూవెలరీ నగరంలో పేరుగాంచిన మయుక సిల్వర్ జ్యూవెలరీ తన లేటెస్ట్ కలెక్షన్, తెలంగాణలో తన మూడో స్టోర్‌ను జూబ్లీహిల్స్ రోడ్డు నెంబర్-10లో ప్రారంభించారు. వెండి ఆభరణాల ఔత్సాహికుల అవసరాలను తీర్చే మయుక సిల్వర్ జ్యూవెలరీ అతి తక్కువ కాలంలోనే మార్కెట్‌లో నమ్మకమైన బ్రాండ్‌గా స్థిరపడింది. 92.5 ప్రీమియం వెండి సేకరణ మయుక సిల్వర్ జ్యూవెలరీ ఇప్పటికే వినియోగదారుల మధ్య ప్రాచుర్యం పొందింది. ప్రీమియం వెండి ఆభరణాల అద్భుతమైన శ్రేణి. ఇది క్లిష్టమైన నమూనాలను, అసాధారణమైన నైపుణ్యాన్ని ప్రదర్శిస్తుంది. వెండి ఆభరణాలను సామాజిక స్థాయితో సంబంధం లేకుండా అందరికీ అందుబాటు ధరల్లో అందించాలన్నదే ప్రధాన లక్ష్యం. ఈ సేకరణలో అన్ని అకేషన్స్‌కి లేటెస్ట్ కలెక్షన్స్‌తో పాటు రింగులు, చెవి పోగులు, నెక్లెస్లు, చాలా వెండి ఆభరణాలు ఉన్నాయి. అన్ని ప్రీమియం 1205 వెండితో తయారు చేయబడ్డాయి. సొగసైన, అందం, ఆకర్షణ సారాంశం ప్రతిభింబించేలా ప్రతి ఆభరణం ప్రత్యేకంగా రూపొందించబడింది. మేనేజింగ్ డైరెక్టర్ అభిజిత్ మాట్లాడుతూ 'నాణ్యత, కస్టమర్ సంతృప్తి పట్ల బ్రాండ్ నిబద్ధతను, డిజైనర్ ఆభరణాలను అందరికీ అందుబాటులో ఉండే విధంగా మయూకా సిల్వర్ జ్యూవెలరీ ఈ ప్రత్యేకమైన స్టోర్‌ను ప్రారంభించింది. ఇక్కడ వచ్చే కస్టమర్స్‌కి లగ్జరీ ఫీల్‌ను కలిగిస్తుంది' అని తెలిపారు. కస్టమర్ల కోసం మయుక సిల్వర్ జ్యూవెలరీ ఉత్తేజకరమైన ఆఫర్లను ఈ నెల 28వ తేదీ వరకు ప్రవేశపెట్టింది. రూ.లక్ష కొనుగోలుపై డైమండ్ రింగ్ ఫ్రీ, రూ.50వేల కొనుగోలుపై వాచ్ ఫ్రీ, రూ.25వేల కొనుగోలుపై బంగారు ఫోటో ఫ్రేమ్ ఇవ్వనున్నట్టు ఆఫర్లను ప్రకటించారు.

ఘనంగా 1104 యూనియన్ ఆవిర్భావ వేడుకలు



నవతెలంగాణ - జవహర్‌నగర్

తెలంగాణ విద్యుత్ కార్మికుల 1104 యూనియన్ ఆవిర్భవించి 75 ఏండ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా బాలాజీ నగర్ 33కేవీ సబ్ స్టేషన్ కార్యాలయం ముందు ప్లాటినం జూబ్లీ వేడుకలు ఘనంగా నిర్వహించారు. రాష్ట్ర కమిటీ ఇచ్చిన పిలుపు మేరకు జెండా ఆవిష్కరణ చేశారు. కార్మికుల ఐక్యత వర్ధిల్లాలని నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో బాలాజీ నగర్ ఏఈ సాంబశివ రావు, యూనియన్ నాయకులు సాగర్, నరసింహ, సతీష్ రెడ్డి, శ్రీనివాస్ నాయక్, మధు సుధన్ రెడ్డి, నాగరాజు, నగేష్ సుధాకర్, ఉపేందర్, సంతోష్, తదితరులు పాల్గొన్నారు.

కీసరగుట్ట ఆలయ అభివృద్ధికి ప్రభుత్వం కృషి చేస్తుంది

- ప్రభుత్వ చీఫ్‌విప్ పట్నం మహేందర్ రెడ్డి
- ట్రస్ట్ బోర్డు సభ్యుల ప్రమాణ స్వీకారం



నవతెలంగాణ-కీసర

కీసరగుట్ట ఆలయ అభివృద్ధికి ప్రభుత్వం కృషి చేస్తుందని ప్రభుత్వ చీఫ్ విప్, ఎమ్మెల్సీ పట్నం మహేందర్ రెడ్డి అన్నారు. కీసరగుట్ట శ్రీరామలింగేశ్వర దేవస్థానానికి ప్రభుత్వం నియమించిన ట్రస్ట్ బోర్డు సభ్యులు బుధవారం ప్రమాణ స్వీకారం చేశారు. ఆలయ మహామండపంలో జరిగిన ఈ కార్యక్రమంలో ట్రస్ట్ బోర్డు సభ్యులుగా నల్ల మధుసూదన్ రెడ్డి, కౌకుంట్ల కృష్ణారెడ్డి, కందాడి రాజిరెడ్డి, పోచమైన రాజు, రెడ్డబోయిన ప్రవీణ్ కుమార్, మొరుగు ముత్యాలు, జూపల్లి సాయిలు, దుండిగల్ల దుర్గాప్రసాద్ గౌడ్, సామల అమరేందర్, నల్లోల కుమార్, సగ్గు అనిత, రాపోలు శంకరయ్య, పాముకుంట్ల ప్రభాకర్ గౌడ్‌లతో పాటు ఎక్స్ అఫిషియో సభ్యులు వి. బాల రామశర్మతో ఈవో కట్ట సుధాకర్‌రెడ్డి దేవాదాయ శాఖ నిబంధనల మేరకు ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ కార్యక్రమంలో మేడ్చల్ మాజీ ఎమ్మెల్యే మలిపెద్ది సుధీర్‌రెడ్డి, టీపీసీసీ ఉపాధ్యక్షులు తోటకూర వజ్రేష్ యాదవ్, డీసీసీ అధ్యక్షులు సింగిరెడ్డి హరివర్ధన్ రెడ్డి, రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు నక్క ప్రభాకర్ గౌడ్, ఆలయ చైర్మెన్ టి.నారాయణ శర్మ, ఈఓ కె.సుధాకర్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ యువతి మృతి



నవతెలంగాణ -శామీర్‌పేట

ఈ నెల 10న ఉదయం శామీర్ పేట పోలీస్ స్టేషన్ పరిధిలోని బిట్స్ జంక్షన్ లో రెడీ మిక్స్ వాహనం ఎదురుగా వస్తున్న కారును తప్పించబోయి బస్టాపులో ఉన్న ఇద్దరు అమ్మాయిల మీదకు దూసుకెళ్లిన రోడ్డు ప్రమాదంలో తూంకుంట మున్సిపాలిటీ అంతాయపల్లి గ్రామానికి చెందిన కొరివి గాయత్రి, కొరివి భవానిలు తీవ్రంగా గాయపడ్డ విషయం విధితమే. కాగా మంగళవారం రాత్రి సమయంలో కొరివి భవాని ఓ ప్రయివేట్ హాస్పిటల్‌లో చికిత్స పొందుతూ మృతి చెందింది. మరో అమ్మాయి కొరివి గాయత్రిని మెరుగైన వైద్యం అందించడానికి నగరంలోని యశోద హాస్పిటల్ కు తరలించామని బాధితురాలి కుటుంబ సభ్యులు తెలిపారు.

శ్మశాన వాటిక కబ్జాదారులపై చర్యలు తీసుకోవాలి



- జిల్లా ఉన్నతాధికారులకు కాంగ్రెస్ నేత పోగుల వీరారెడ్డి ఫిర్యాదు

నవతెలంగాణ-బోడుప్పల్

బోడుప్పల్‌లో వందేండ్ల నుంచి వాడుకుంటున్న పోగుల వంశస్తుల శ్మశాన వాటికను కబ్జాదారుల నుంచి కాపాడాలని కాంగ్రెస్ నాయకులు పోగుల వీరారెడ్డి బుధవారం మేడ్చల్ జిల్లా కలెక్టర్, ఆర్డీవో, మేడిపల్లి తహసీల్దారుతో పాటు బోడుప్పల్ కమిషనర్‌కు రాతపూర్వకంగా ఫిర్యాదు చేశారు. బోడుప్పల్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు ఎదురుగా ఉన్న పోగుల వంశానికి చెందిన తమ తాతలు ఏర్పాటు చేసిన శ్మశానవాటికలో తమ వంశస్తులు ఎవరైనా చనిపోతే అక్కడనే అంత్యక్రియలు చేస్తున్నారన్నారని వీరారెడ్డి అధికారులకు వివరించారు. వందల ఏండ్ల చరిత్ర ఉన్న ఈ శ్మశాన వాటికను తమ వంశస్థులైన పోగుల వెంకటరెడ్డి, పోగుల నర్సింహారెడ్డిలు వారికున్న పలుకుబడితో శ్మశాన వాటికను ఆక్రమించుకున్నారని వీరారెడ్డి తన ఫిర్యాదులో పేర్కొన్నారు. భవిష్యత్‌లో పోగుల వంశస్థులు చనిపోతే అంత్యక్రియలు జరపడానికి ఇబ్బందులు ఏర్పడతాయన్నారు. ఈ విషయంలో అధికారులు విచారణ జరిపి ఇంతకు ముందున్న శ్మశాన వాటికను యధావిధిగా ఉండేటట్టు చర్యలు తీసుకోవాలని అధికారులకు విజ్ఞప్తి చేశారు. భూముల విలువలు బాగా పెరగడంతో చివరకు శ్మశాన వాటికలను సైతం కబ్జాలు చేస్తున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని వీరారెడ్డి అధికారులకు విన్నవించారు.

కాంగ్రెస్ ప్రభుత్వం ఆరు గ్యారెంటీలను అమలు చేస్తుంది

- ప్రభుత్వ చీఫ్ విప్ డాక్టర్ మహేందర్ రెడ్డి
- కీసర మండలంలో 71 మంది లబ్దిదారులకు ఇందిరమ్మ ఇండ్లను పంపిణీ



నవతెలంగాణ-కీసర

కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల మ్యానిఫెస్టోలో పెట్టిన ఆరు గ్యారెంటీలను పక్కాగా అమలు చేస్తుందని ప్రభుత్వ ఛీప్ విప్ పట్నం మహేందర్‌రెడ్డి అన్నారు. నిరుపేదలకు ఇండ్లు ఉండాలనే సదుద్దేశంతో ఆరు గ్యారెంటీలను అమలులో భాగంగా అర్హులకు ఇండ్లను అందించడమే కాకుండా మౌలిక వసతులను కల్పిస్తున్నామన్నారు. బుధవారం కీసర మండలంలోని కీసర, చీర్యాల గ్రామాలలో అర్హులైన 71 మంది లబ్దిదారులకు ఇందిరమ్మ ఇండ్లను పంపిణీ కార్యక్రమానికి ముఖ్యతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతి నిరుపేదకు రేషన్ కార్డు, ఇల్లు లేని వారికి ఇందిరమ్మ ఇల్లు అందిస్తామన్నారు. పేదలకు ఇచ్చిన ఇందిరమ్మ ఇండ్ల కాలనీలలో మంచినీటి సదుపాయాలు, మౌలిక వసతులు కల్పిస్తామని తెలిపారు. రైతులందరికీ రెండు లక్షల రుణ మాఫీ చేసి, ప్రస్తుతం ఎకరాకు రూ. 6000 చొప్పున రైతు భరోసా అందిస్తున్నామని అన్నారు. రేషన్ కార్డుల పంపిణీ నిరంతర ప్రక్రియ అన్నారు. రేషన్ కార్డు రాలేదని ఎవరూ బెంగ పడాల్సిన అవసరం లేదని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి, మేడ్చల్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి తోటకూర వజ్రేష్ యాదవ్, రాష్ట్ర నాయకులు నక్క ప్రభాకర్ గౌడ్, తహశీల్దార్ అశోక్ కుమార్, కాంగ్రెస్ పార్టీ కీసర మండల అధ్యక్షుడు కొల కృష్ణ యాదవ్, తదితరులు పాల్గొన్నారు.

సానిటేషన్ ఇన్‌స్పెక్టర్ నాగరాజు హఠాన్మరణం



నవతెలంగాణ-అల్వాల్

మల్కాజిగిరి సర్కిల్ సానిటేషన్ ఇన్‌స్పెక్టర్‌గా విధులు నిర్వహిస్తున్న నాగరాజు మంగళవారం సాయంత్రం గుండె పోటుతో మరణించారు. విషయం తెలుసుకున్న పలువురు రాజకీయ నాయకులు, అధికారులు ఆల్వాల్ సర్కిల్ టీఆర్‌కే ఎన్‌క్లేవ్‌లో ఉన్న నాగరాజు ఇంటికి తరలివచ్చి శ్రద్ధాంజలి ఘటించారు. ఈ కార్యక్రమంలో మల్కాజిగిరి మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంతరావు, కార్పొరేటర్ ప్రేమ్ కుమార్, లక్ష్మీకాంతరెడ్డి, సతీష్ కుమార్, ఏ ఎమ్ హెచ్ ఓ మంజుల, తదితరులున్నారు.

ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్తా



- కాంగ్రెస్ మహిళా ఉపాధ్యక్షురాలు దుర్గా

నవతెలంగాణ-బోడుప్పల్

రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రజా సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకువెళ్ళేందుకు కృషి చేస్తానని కాంగ్రెస్ మేడ్చల్ జిల్లా మహిళా ఉపాధ్యక్షురాలు ఎన్.ఎన్.కే దుర్గా అన్నారు. బుధవారం గాంధీ భవన్‌లో కాంగ్రెస్ మహిళా రాష్ట్ర అధ్యక్షురాలు సునీతారావు, మేడ్చల్ జిల్లా అధ్యక్షురాలు రాజనాల లక్ష్మీ చేతుల మీదుగా కాంగ్రెస్ మహిళా ఉపాధ్యక్షురాలిగా నియమకపు పత్రం అందుకున్నారు. అనంతరం దుర్గా మాట్లాడుతూ పీర్జాదిగూడ కార్పొరేషన్‌లో కాంగ్రెస్ పార్టీ బలోపేతం కోసం కృషి చేశానని, భవిష్యత్తులో పార్టీని మరింత బలోపేతం చేసేందుకు కృషి చేస్తానన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలోని ప్రజా ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్తానన్నారు. మహిళలకు అందుతున్న సంక్షేమ పథకాలను పూర్తి స్థాయిలో ప్రజలకు అర్థం అయ్యేలా వివరించేందుకు కృషి చేస్తామని తెలిపారు.

విద్యార్థులకు క్రమశిక్షణతో కూడిన విద్య అవసరం



- విశ్రాంత ఐపీఎస్ జేడీ లక్ష్మీనారాయణ
- ఘనంగా విజయరత్న స్కూల్ ఎలాన్-25 వార్షికోత్సవ వేడుకలు
- ఆకట్టుకున్న విద్యార్థులు నృత్యాలు

నవతెలంగాణ-బోడుప్పల్

విద్యార్థులకు క్రమశిక్షణతో కూడిన విద్యా చాలా అవసరమని సీబీఐ మాజీ డైరెక్టర్ జేడీ లక్ష్మీనారాయణ అన్నారు. పీర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని విజయరత్న పాఠశాల యాజమాన్యం ఎలాన్-2025 పేరుతో నిర్వహించిన వార్షికోత్సవ వేడుకలకు ముఖ్యతిథిగా హాజరయ్యారు. వార్షికోత్సవ వేడుకలను పాఠశాల డైరెక్టర్స్ విజయసేనారెడ్డి, నరేంద్రనాథ్, నరసింహారావు, శ్రీనివాస్ రెడ్డిలు జ్యోతి ప్రజ్వల చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా జేడీ లక్ష్మీనారాయణ 2024-25 అకాడమిక్ సంవత్సరంలో ఉత్తమ ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు షీల్డ్, మెమెంటోలతో పాటు మెడల్స్ బహుకరించారు. అనంతరం విజయరత్న స్కూల్స్ అన్ని బ్రాంచీల వార్షిక రిపోర్టును డైరెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి చదివి వినిపించారు. ఈ సందర్భంగా లక్ష్మీనారాయణ మాట్లాడుతూ తల్లిదండ్రులు పిల్లలతో సమయం గడిపి మంచి మార్గం వైపు నడిచేటట్టు ప్రోత్సహించాలన్నారు. విద్యార్థులకు పదహారేండ్లు వచ్చే వరకు తల్లిదండ్రుల పాత్ర ఎంతో కీలకమని తెలిపారు. పట్టుదలతో విద్యను అభ్యసించి ముందుకు సాగలన్నారు. సంస్కృతికి, సంప్రదాయానికి అద్దం పట్టే సంగీతనృత్య ప్రదర్శనలు, చిన్నారుల వేషధారణ, వస్త్రధారణ వీక్షకుల మనసును ఆకర్షించింది. అనంతరం శ్రీనివాసన్ రెడ్డి మాట్లాడుతూ విద్యార్థుల పాటలు డాన్సులు నేటి సమాజానికి సందేశం ఇచ్చే విధంగా చేయడం సంతోషం కలిగించిందన్నారు. వారిని ప్రోత్సహించి నేర్పించిన గురువులకు, తల్లిదండ్రులకు ధన్యవాదాలు తెలిపారు. ముఖ్యతిథిగా హాజరైన లక్ష్మీనారాయణకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపి సత్కరించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థుల తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.





ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి సోదరుడు బండారి వెంకటరెడ్డి సతీమణి బండారి పద్మ ఇటీవల మృతి చెందారు. విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే ప్రశాంత్‌రెడ్డి బుధవారం సైనిక్‌పురిలోని బండారి వెంకట్‌రెడ్డి నివాసంలో ఆయనను పరామర్శించారు. ఈ సందర్భంగా తన ప్రగాఢ సానుభూతి తెలిపారు. నవతెలంగాణ,కాప్రా

ఆర్టీఏ అథారిటీ మెంబరుగా భీమిడి జైపాల్‌రెడ్డి

- నియామక పత్రం అందజేసిన ఆర్టీఏ అథారిటీ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్



నవతెలంగాణ-శామీర్‌పేట

మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా రీజినల్ ట్రాన్స్‌పోర్ట్ అథారిటీ మెంబరుగా తూంకుంట మున్సిపల్ కాంగ్రెస్ అధ్యక్షులు భీమిడి జైపాల్ రెడ్డి నియమితు లయ్యారు. తూంకుంట మున్సిపాలిటీ దేవరయం జాల్‌లోని జైపాల్ రెడ్డి నివాసంలో బుధవారం రీజనల్ అథారిటీ ట్రాన్స్‌ఫోర్ట్ ఇన్స్‌స్పెక్టర్ శ్రీనివాస్ నియామక పత్రం అందజేశారు. ఈ సందర్భంగా జైపాల్ రెడ్డి మాట్లాడుతూ... తన సేవలను గుర్తించి తనపై నమ్మకంతో జిల్లా ఆర్టీఏ మెంబరుగా నియమించినందుకు రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌కు ప్రత్యేక ధన్యవా దాలు తెలిపారు. తనకు పదవి రావడానికి సహకరిం చిన టీపీసీసీ ఉపాధ్యక్షులు, కాంగ్రెస్ మేడ్చల్ నియోజకవర్గ ఇన్‌చార్జి తోటకూర వజ్రేష్‌యాదవ్, డీసీసీ అధ్యక్షుడు సింగిరెడ్డి హరివర్ధన్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు మల్లిపెద్ది సుధీర్ రెడ్డి, మైనంపల్లి హన్మంతరావు రావు, కూన శ్రీశైలం గౌడ్, జిల్లా పరిషత్ మాజీ చైర్మెన్ మల్లిపెద్ది శరత్ చంద్రారెడ్డి, వివిధ నియోజకవర్గాల ఇంచార్జీలు కోలన్ హనుమంత్ రెడ్డి, బండి రమేష్ మందుముల పరమేశ్వర్ రెడ్డి, రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు నక్క ప్రభాకర్ గౌడ్, టీపీసీసి ప్రధాన కార్యదర్శి నర్సారెడ్డి భూపతి రెడ్డి, జిల్లా కాంగ్రెస్ నాయకులకు,నియోజకవర్గ కాంగ్రెస్ నాయకులకు, కార్యకర్తలకు కృతజ్ఞతలు తెలిపారు.

బాక్సింగ్‌లో వర్షితకు గోల్డ్ మెడల్

- శాలువాతో సత్కరించిన ప్రిన్సిపాల్ ఇస్రాత్



నవతెలంగాణ -శామీర్‌పేట

ఈ నెల 11న లాలాపేటలోని జయశంకర్ స్టేడియంలో జరిగిన రాష్ట్రస్థాయి సీనియర్ బాక్సింగ్ ఛాంపియన్ షిప్ పోటీలలో శామీర్ పేటలోని తెలంగాణ సాంఘీక సంక్షేమ గురుకుల మహిళా డిగ్రీ కళాశాల విద్యార్థిని వర్షిత పాల్గొని ఉత్తమ ప్రతిభ కనబరిచి బంగారు పతకం సాధించింది. ఉత్తమ బాక్సర్ అవార్డు కైవసం చేసుకున్న సందర్భంగా బుధవారం కళాశాల ప్రిన్సిపాల్ ఇస్రాత్ ఆమెను శాలువాతో ఘనంగా సన్మానించి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్, పీడీ మాట్లాడుతూ వర్షితను ఆదర్శంగా తీసుకోని మిగతా విద్యార్థులు కూడా చదువుతోపాటు ఆటల్లో రాణించాలన్నారు. తమ తోటి విద్యార్థిని గోల్డ్ మెడల్ సాధించడం పట్ల విద్యార్థులు హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ చేతన, అకాడమిక్ వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ స్రవంతి, ఫిజికల్ డైరెక్టర్ హైమవతి ,హౌస్ మాస్టర్ అనుపమ, కల్చరల్ కోఆర్డినేటర్ ధనవేణి, అధ్యాపకులు, విద్యార్థులు

అన్నప్రసాద వితరణ



నవతెలంగాణ-కాప్రా

మీర్‌పేట్ హెచ్‌బీ కాలనీ నాలుగో డివిజన్ మంగాపురం కాలనీలోని శ్రీ వెంకటేశ్వర స్వామి ఆర్చ్ వద్ద శ్రీవెంకటేశ్వర స్వామి స్వచ్ఛంద అన్నప్రసాద వితరణ కమిటీ ఆధ్వర్యంలో ప్రతినెలా పౌర్ణమిని పురస్కరించుకొని అన్నప్రసాద వితరణ కార్యక్రమం నిర్వహిస్తున్నామని వెంకటేశ్వర స్వామి అన్నప్రసాద వితరణ కమిటీ నాయకులు సమ్మని మురళి చారి తెలిపారు. గత నెల భోగి పౌర్ణమి రోజున శ్రీ వెంకటేశ్వర స్వామి స్వచ్ఛంద అన్న ప్రసాద వితరణ కమిటీ ఏర్పాటు చేశామని తెలిపారు. ప్రతినెలా పౌర్ణమి రోజున అన్న ప్రసాదన్న వితరణ కార్యక్రమం నిర్వహిస్తున్నామని, ఇది రెండో నెల అన్న ప్రసాద వితరణ కార్యక్రమం అని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొంటున్నారని చెప్పారు. అన్న ప్రసాద వితరణలో పాల్గొన్న భక్తులకు, ప్రజలపై, స్వచ్ఛంద అన్నదాన కమిటీ సభ్యులపై కు ఆ వెంకటేశ్వర స్వామి కృప ఎల్లప్పుడూ ఉండాలని కోరారు.ఈ కార్యక్రమంలో శ్రీవెంకటేశ్వర స్వామి స్వచ్ఛంద అన్న వితరణ కమిటీ సభ్యులు బ్రహ్మయ్య, సత్యనారాయణచారి, పవన్, మురళీ, ప్రభాకర్‌చారి, సుధాకర్ గుప్తా, విక్రమ్, సాయినాథ్, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



శ్రీలక్ష్మి బ్యాంకెట్ హాల్ ప్రారంభోత్సవానికి ముఖ్యఅతిథిగా చర్లపల్లి డివిజన్ కార్పొరేటర్ బొంతు శ్రీదేవి యాదవ్ హాజరయ్యారు. ఈ సందర్భంగా బాల నరసింహ దంపతులకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కొప్పుల కుమార్, రేగల సతీష్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.-నవతెలంగాణ,కాప్రా

రోడ్డు ప్రమాదంలో బాలిక మృతి



నవతెలంగాణ - కూకట్‌పల్లి

రోడ్డు ప్రమాదంలో బాలిక మతి చెందిన ఘటన కూకట్ పల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మూసాపేట, జనతా నగర్‌లో నివాసం ఉండే, శ్రీనివాస్, కుమారి దంపతుల కుమార్తె మమత (17) మంగళ వారం రాత్రి 11 గంటల సమయం లో తన స్నేహితుడు నరేష్‌తో కలిసి పనిమీద ,ద్విచక్ర వాహనంపై మూసాపేట నుండి కూకట్ పల్లి వైపు వెళ్తున్నది. ఈ క్రమంలో మూసా పేట మెట్రో స్టేషన్ వద్ద గుర్తు తెలియని వాహనం వీరి బైక్‌ను ఢీకొట్టడంతో బాలిక తీవ్ర రక్తస్రావంతో అక్కడికక్కడే మృతి చెందింది. నరేష్‌కు గాయాలయ్యాయి. కుటుంబసభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. మత దేహాన్ని పోస్టు మార్టం నిమిత్తం ఆస్పత్రికి తరలించారు.

మల్లాపూర్ యూపీహెచ్‌సీని సందర్శించిన డీఎంహెచ్‌ఓ



నవతెలంగాణ-సిటీబ్యూరో

మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ సి.ఉమాగౌరి మల్లాపూర్ పరిధిలోని మరిగూడ బస్తీ దవాఖానను బుధవారం సందర్శించారు. ఈ సందర్భంగా హాజరు, అవుట్ పేషెంట్ రిజిస్టర్లను పరిశీలించి, బీడీకే సేవలను సమీక్షించారు. ఎప్పుడైనా ఉన్నతాధికారులు సందర్శన చేసే అవకాశం ఉన్నందున, సిబ్బంది పూర్తి సిద్ధంగా ఉండాలని సూచించారు.

జిల్లా గ్రంథాలయ బడ్జెట్ రూ.20 కోట్ల 88 లక్షలు



నవతెలంగాణ-సిటీబ్యూరో

మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా గ్రంథాలయ సంస్థ 2025-26 వార్షిక బడ్జెట్‌ను చైర్మెన్ బొంగునూరి శ్రీనివాస్‌రెడ్డి అధ్యక్షతన బుధవారం ప్రవేశపెట్టారు. ఇందులో ప్రధానంగా మున్సిపాల్టీల్లోని 14 శాఖా గ్రంథాలయాల మంజూరి గురించి, గ్రంథాలయ పన్ను రూ.4 కోట్లు వసూలు చేయడానికి, ప్రస్తుతం ఉన్న శాఖా గ్రంథాలయాల్లో మౌలిక వసతులు కల్పించడం, భవన నిర్మాణం నిమిత్తం రూ.15 కోట్లు కేటాయించారు. ప్రతి మున్సిపాలిటీలో ఐదు పఠన మందిరాలను ఏర్పాటు చేసే విధంగా ఇందుకు రూ.కోటి కేటాయించారు. ఇంకా వివిధ పద్దులతో కలిపి రూ.20 కోట్ల 88 లక్షల వార్షిక బడ్జెట్‌ను రూ.15 లక్షల 88 వేల మిగులుతో ఆమోదించి రాష్ట్ర గ్రంథాలయ పరిషత్‌కు పంపించారు. సభ్యులు, కార్యదర్శి పి.సురేష్ బాబు, తదితరులు పాల్గొన్నారు.

- 'పీఏసీఎస్'ల్లోనూ ప్రత్యేకాధికారుల పాలన..!
- 15తో ముగియనున్న పాలకవర్గాల కాలపరిమితి
- ఎన్నికల నిర్వహణకు జరగని ఏర్పాట్లు
- పంచాయతీ ఎన్నికల తర్వాత పరిశీలించే అవకాశం
- ఆరు నెలలు పొడించే ఛాన్స్.. త్వరలో ఉత్తర్వులు..!



సహకార సమరం లేనట్టే..!

నవతెలంగాణ-సిటీబ్యూరో

ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల్లోనూ ప్రత్యేకాధికారుల పాలన విధించనున్నట్టు సమాచారం. ఇప్పటికే మున్సిపల్, గ్రామపంచాయతీలు ప్రత్యేకాధికారుల పాలనలో కొనసాగుతున్నాయి. తాజాగా ఈ జాబితాలోకి పీఏసీఎస్‌లు కూడా చేరనున్నట్టు తెలుస్తోంది. పీఏసీఎస్ పాలకవర్గాల గడువు మరో మూడు రోజుల్లో ముగియనుంది. దీంతో ప్రభుత్వం నుంచి ఇప్పటి వరకు ఎలాంటి ఉత్తర్వులు వెలువడకపోగా, ఎన్నికల నిర్వహణకు అధికార యంత్రాంగం సైతం ఎలాంటి చర్యలు చేపట్టలేదు. దీంతో సహకార సంఘాలకూ ప్రత్యేకాధికారులను నియమించేందుకు ప్రభుత్వం కసరత్తు చేస్తున్నట్టు సమాచారం. సహకార సంఘాలు రైతుల ఆర్థిక లావాదేవీలతో పాటు ఎరువులు, విత్తనాలు వంటి కీలక సేవలు అందించాల్సి ఉండటంతో ప్రభుత్వం ఆచితూచి వ్యవహరిస్తూ, నిర్ణయం తీసుకోనున్నట్టు సమాచారం.

జిల్లాలో 9 సహకార సంఘాలు

మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలో 9 సహకార సంఘాలున్నాయి. మేడ్చల్, డబిల్‌పురా, అల్వాల్, ఘట్‌కేసర్, కీసర, శామీర్‌పేట, బౌరంపేట, దూలపల్లి, పూడూరు సహకార సంఘాల్లో దాదాపు 30 వేల మంది రైతులు సభ్యులుగా ఉన్నారు. ఈ పీఏసీఎస్‌లకు 2020లో ఎన్నికలు జరిగాయి. ఈ పాలకవర్గాల ఐదేండ్ల పదవీకాలం ఈ నెల 15వ తేదీతో ముగియనుంది. మరో మూడు రోజుల సమయం మాత్రమే మిగిలి ఉంది. నిబంధనల ప్రకారం పీఏసీఎస్‌లకు ఎన్నికలు నిర్వహించాలి. ఆయా సంఘాలకు డైరెక్టర్లు, చైర్మెన్లను ఎన్నుకోవాలి. అడ్డంకుల్లేకుండా ఈ ప్రక్రియ పూర్తి కావాలంటే కనీసం నెల రోజులు ముందుగానే నోటిఫికేషన్ విడుదల చేయాల్సి ఉంటుంది. ఈ మేరకు ఇప్పటికే ఓటరు జాబితాను విడుదల చేసి గ్రామ పంచాయతీల్లో అతికించాలి. అందులో ఏమైనా అభ్యంతరాలుంటే మార్పులు, చేర్పులు చేసి తుది జాబితాను వెల్లడించాలి. ఈ ప్రక్రియ నడుస్తుండగానే అధికారులు ఎన్నికలకు సిద్ధం చేస్తుంటారు. ప్రస్తుతం జిల్లాలో ఇవేవీ జరుగుతున్న దాఖలాల్లేవు. దీంతో ఇప్పట్లో సహకార సమరం జరిగే అవకాశాలు కనిపించడం లేదని సమాచారం. ప్రభుత్వం ఇప్పటికే గ్రామ పంచాయతీ, మండల, జిల్లా పరిషత్ ఎన్నికల మాదిరిగానే సహకార సంఘాల ఎన్నికలను కూడా వాయిదా వేసే అవకాశం ఉందని తెలుస్తోంది. అయితే ప్రభుత్వం ప్రత్యేకాధికారులను నియమిస్తుందా..? ప్రస్తుతం ఉన్న పాలకవర్గాల పదవీ కాలాన్ని పొడిగిస్తుందా..? అనేది చర్చనీయంశంగా మారింది.

స్థానిక సమరం తర్వాతే ఎన్నికలు

ప్రస్తుతం పంచాయతీ, ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికల నిర్వహణపై ప్రభుత్వం ఫోకస్ పెట్టింది. ఈ ఎన్నికల తర్వాతనే సహకార సంఘాల ఎన్నికలు జరిగే అవకాశం ఉందని తెలుస్తోంది. సహకార సంఘాల పాలకవర్గాల పదవీ కాలం ఈ నెల 15వ తేదీతో ముగియనుంది. దీంతో ఇప్పటి వరకు ప్రభుత్వం నుంచి ఎలాంటి స్పష్టత రాలేదు. స్థానిక ఎన్నికలు త్వరలో నిర్వహించేలా ప్రభుత్వం కసరత్తు చేస్తుండటంతో పీఏఎస్ ఎన్నికలు వాయిదాపడే అకాశాలు కనిపిస్తు న్నట్టు సమాచారం. ఎన్నికలు వాయిదా పడే అవకాశం ఉందని సహకార సంఘాల వర్గాలు సైతం భావిస్తున్నట్టు సమాచారం.

ప్రజా సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి

- ఎమ్మెల్యే కేపీ వివేకానంద్



నవతెలంగాణ - కుత్బుల్లాపూర్

ప్రజా సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తున్నానని కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కేపీ వివేకానంద అన్నారు. బుధవారం ఆయనను తన నివాసంలో కలవడానికి వచ్చిన ప్రజలను సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ప్రతి ఒక్కరి సమస్యను ఎమ్మెల్యే శ్రద్ధగా విని, తగిన చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులకు ఆదేశాలు ఇచ్చారు. ప్రజల సమస్యలు త్వరితగతిన పరిష్కారమయ్యేలా కృషి చేస్తామని భరోసా ఇచ్చారు. ముఖ్యంగా నీటి సరఫరా, నూతన సీసీ రోడ్లు, విద్యుత్, ఆరోగ్య పరిరక్షణ, పెన్షన్లు, రేషన్ కార్డులు తదితర అంశాలపై ప్రజలు ఆయనతో మాట్లాడారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ, "ప్రజల సమస్యల పరిష్కారమే నా ప్రథమ లక్ష్యం. నాపై ప్రజలు ఉంచిన విశ్వాసాన్ని నిలబెట్టుకునేందుకు ఎప్పుడూ అందుబాటులో ఉంటాను" అని చెప్పారు. అనంతరం నియోజకవర్గానికి చెందిన పలువురు ప్రజా ప్రతినిధులు, సంక్షేమ సంఘం నాయకులు, అభిమానులు, తమ ఇంట్లో జరుపుకునే శుభకార్యాలకు, ఇతర ప్రత్యేక కార్యక్రమాలకు రావాల్సిందిగా ఎమ్మెల్యేకు ఆహ్వాన పత్రాలు అందజేశారు.

మల్టీప్లెక్స్‌లో పనిచేస్తున్న కార్మికుల సమస్యలు పరిష్కరించాలి



- సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి ఐలాపురం రాజశేఖర్

నవతెలంగాణ - బాలానగర్

కూకట్ పల్లి నియోజకవర్గంలోని నెక్సస్ మాల్‌లో, పీవీఆర్ ఐనాక్స్‌లో పనిచేస్తున్న కార్మికుల సమస్యలు పరిష్కరించాలని సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి ఐలాపురం రాజశేఖర్ కోరారు. ఈ మేరకు బుధవారం డ్యూటీ మేనేజర్ మహేందర్‌క మెమొరాండం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మల్టీప్లెక్స్‌లో పనిచేస్తున్న కార్మికుల అనేక సమస్యలు యూనియన్ దృష్టికి వచ్చాయని తెలిపారు. ముఖ్యంగా మహిళలకు పై పొజిషన్ ఇవ్వడంలో వ్యత్యాసాలు, వారి ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నారని యూనియన్ దృష్టికి వచ్చిందని చెప్పారు. ముఖ్యంగా అతి తక్కువగా మ్యాన్ పవర్ మెయింటినెన్స్ చేస్తూ కార్మికులపై మీద పని ఒత్తిడికి గురి చేస్తున్నారన్నారు కావున యాజమాన్యం కార్మికుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో కార్మికులను ఏకంచేసి ప్రత్యేక పోరాటాలు చేస్తామని హెచ్చరిం చారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ కూకట్ పల్లి నాయకులు శంకర్, మల్లేష్, తెలంగాణ సినిమా థియేటర్స్ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర కార్యదర్శి అధ్యక్షుడు ఎన్. మారన్న, రాష్ట్ర కార్యదర్శి అరుణ్, శ్రీనివాస్ రెడ్డి, సతీష్, అశోక్, నరసింహ రాజు, చలం, నాగరాజు, భరత్, శశిధర్ రెడ్డి, మురళి మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలలో డిజిటల్ బోర్డును వినియోగించాలి



- మేడ్చల్ జిల్లా విద్యాశాఖ అధికారి విజయకుమారి

నవతెలంగాణ - బాలానగర్

వచ్చే విద్యాసంవత్సరం ప్రభుత్వ పాఠశాలలో ప్రవేశపెట్టే డిజిటల్ బోర్డును వినియోగించాలని మేడ్చల్ జిల్లా విద్యాశాఖ అధికారి డీఈఓ విజయకుమారి అన్నారు. బాలానగర్ మండలంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జరుగుతున్న ఐపీఎఫ్ ట్రైనింగ్ కు డీఈఓ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలను కార్పొరేట్‌కు దీటుగా తీర్చిదిద్దాలనే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం డిజిటల్ బోధను అమలు చేస్తోందని తెలిపారు. ఇందులో భాగంగా పాఠశాలలను సర్వాంగ సుందరంగా తీర్చి దిద్దుతోందన్నారు. విద్యార్థులకు మౌలిక వసతులు కల్పిస్తూ ఆధునిక సాంకేతికతను జోడిస్తుందని, ఈ క్రమంలో వచ్చే విద్యా సంవత్సరం ప్రారంభం నాటికి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో డిజిటల్ టచ్ స్క్రీన్ టీవీల ద్వారా విద్యార్థులకు బోధన అందిం చేందుకు విద్యా శాఖ అధికారులు రంగం సిద్ధం చేస్తున్నారని తెలిపారు. ఈ శిక్షణ ద్వారా ఉపాధ్యాయులు ఆయా సబ్జెక్టుల్లో డిజిటల్ బోర్డులను వినియోగం పట్ల తగిన నైపుణ్యాలు పెంపొందించుకుని తరగతి గదిలో ప్రతి రోజూ లాగిన్ చేసుకుని విద్యార్థులకు నాణ్యమైన పాఠాలను బోధించాలని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు అరుణ జ్యోతి, ఉపాధ్యాయులు వెంకటేశ్వరరావు, బయోలాజికల్ సైన్స్ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



ఫ్లెక్సీలు చించిన వారిపై చర్యలు తీసుకోవాలి

నవతెలంగాణ - కుత్బుల్లాపూర్

శ్రీ పెద్దమ్మ పోచమ్మ తల్లి 20వ వార్షికోత్సవ సందర్భంగా ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలను చించివేసిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరుతూ జీడిమెట్ల సీఐ గడ్డం మల్లేష్‌ను 130 డివిజన్ బీఆర్ఎస్ నాయకులు బుధవారం కలిసి ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సుభాష్ నగర్ 130 డివిజన్ ఎస్.ఆర్. నాయక్ నగర్ లో శ్రీశ్రీ శ్రీ పెద్దమ్మ పోచమ్మ తల్లి, 20వ వార్షికోత్సవం సందర్భంగా కాలనీ ఎంట్రన్స్‌లో ఏర్పాటు చేసుకున్న బీఆర్ఎస్ బ్యానర్లను ఆదివారం రాత్రి ఆటోలలో వచ్చి కొందరు చాకులతో బ్లేడ్లతోకోసి పారేశారన్నారు. ఇది మొదటిసారి కాదు , గతంలో కూడా పలుమార్లు ఇదే బ్యాచ్ బ్యానర్లను చించివేసిందని తెలిపారు. చించిన వారిపై కఠిన చర్యలు తీసుకుని మరోసారి ఏ పార్టీ ఫ్లెక్సీలపై కూడా వారు చెయ్యి వేయకుండా చట్టపరంగా చర్యలు తీసుకోవాలని జీడిమెట్ల సీఐని కోరారు. సీఐ సానుకూలంగా స్పందించి బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు. బీఆర్ఎస్ నాయకులు గుబ్బల లక్ష్మీనారాయణ, పీవీ భాస్కర్ రెడ్డి, ఎస్సార్ నాయక్ నగర్ కాలనీ వైస్ ప్రెసిడెంట్ హరిబాబు యాదవ్‌లు ఫిర్యాదు చేసిన వారిలో ఉన్నారు.

పరికి చెరువును పరిరక్షించండి

- సీపీఐ నియోకవర్గ కార్యదర్శి ఉమా మహేష్



నవతెలంగాణ - కుత్బుల్లాపూర్

కబ్జాదారుల చేతుల్లో హారతి కర్పూరంలా కరిగిపోతున్న పరికిచెరువును ఎమ్మెల్యే కెపి.వివేకానంద్ పరిరక్షించాలని సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి ఈ.ఉమామహేష్ కోరారు. ఎమ్మెల్యే వివేకానంద నిజాంపేట్ పరిధిలోని తుర్కా చెరువు, శ్రీరామ్ కుంట చెరువును సందర్శించి ఆ చెరువులను కాపాడాలని అధికారులను, స్థానిక నాయకులను కోరడాన్ని సీపీఐగా స్వాగతిస్తున్నామని, అందుకు ధన్యవాదాలు తెలిపారు. అదే విధంగా నియోజకవర్గం పరిధిలోని ఇతర చెరువులను కుడా కాపాడాలని అధికారులను అదేశించాలని బుధవారం ఒక ప్రకటనలో కోరారు. ముఖ్యంగా జగద్గిరిగుట్ట, గాజులరామారం పరిధిలో 65 ఎకరలో విస్తరించిన పరికి చెరువు గత బీఆర్ఎస్ హయాంలో సగం కబ్జా కాగా , నేడు మిగిలి ఉన్న సగం కూడా కబ్జాకు గురయ్యే పరిస్థితి ఏర్పడిందని తెలిపారు. ఎమ్మెల్యేగా ఆ చెరువును కూడా రక్షించే బాధ్యత మీ పై ఉందని కావున వెంటనే పరికించి చెరువును సందర్శించి పరిరక్షించడానికి పనిచెయ్యాలని కోరారు. హైడ్రా కమిషనర్ రంగనాథ్ పరికించి చెరువును సందర్శించి అనంతరం స్థానికులతో ఏర్పాటు చేసిన సమావేశంలో కూడా కబ్జాలను ఆపుతామని,చెరువును కాపాడుతామని, కబ్జాదారులను శిక్షిస్తామని చెప్పినప్పటికి కబ్జాదారులకు ఎలాంటి భయంలేకుండా పట్టపగలే కబ్జాచేస్తున్నారని,ఆ ఫోటోలను హైడ్రా అధికా రులకు పంపినప్పటికి ఎలాంటి చర్య తీసుకోకపోవడం అన్యాయమన్నారు. చెరువును కాపాడుకోవడానికి సీపీఐ నిత్యం పోరాటం చేస్తుందన్నారు. కార్యక్రమంలో సీపీఐ నియోజకవర్గం కార్యదర్శి ఉమా మహేష్, సీపీఐ కార్యవర్గ సభ్యులు స్వామి,ఏఐటీయూసీ కార్యదర్శి శ్రీనివాస్ , సీపీఐ నాయకులు జగన్నాథ పాల్గొన్నారు.

నియోజకవర్గం అభివృద్ధే లక్ష్యం

మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలం గౌడ్



నవతెలంగాణ - కుత్బుల్లాపూర్

కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలోని పేదలకు అన్ని సంక్షేమ పథకాలు అందేలా చూస్తానని... నియోజకవర్గాన్ని అభివృద్ధి చేయడమే లక్ష్యమని మాజీ ఎమ్మెల్యే , కాంగ్రెస్ రాష్ట్ర నాయకులు కూన శ్రీశైలం గౌడ్ తెలిపారు. బుధవారం షాపూర్ నగర్‌లో తన నివాసం వద్ద ఆయన రోజువారి కార్యచరణలో భాగంగా నియోజకవర్గం ప్రజల సమస్యలు అడిగి తెలుసుకున్నారు.అనంతరం పలు ఆహ్వానాలను స్వీకరించి సానుకూలంగా స్పందించారు. నాయకులు, కార్యకర్తలు, అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

నర్సింహారెడ్డి ఇంజినీరింగ్ కళాశాలలో ఐటీ పార్క్ ప్రారంభం



నవతెలంగాణ-మేడ్చల్

మైసమ్మగూడలోని నర్సింహారెడ్డి ఇంజినీరింగ్ కళాశాలలో బుధవారం సైబర్ స్పేస్‌ను భద్రపరచడం-డిజి టల్ ప్రపంచానికి ఒక సవాలు పై ఒక రోజు సెమినార్‌కు తెలంగాణ కౌన్సిల్ ఆఫ్ హయ్యర్ ఎడ్యుకేషన్ చైర్మెన్, జేఎన్‌టీయూహెచ్ ఇన్‌చార్జి వీసీ ప్రొ. వి. బాలకిష్ట రెడ్డి ముఖ్య అతిథిగా విచ్చేసి నూతనంగా నిర్మించిన ఐటి పార్క్‌ను ప్రారంభించారు. వింగ్ కమాండర్ గరిగిపాటి శ్రీనివాసు, మహీంద్రా విశ్వవిద్యాలయం అసిస్టెంట్ ప్రొఫెసర్, బంగారు లక్ష్మీ గౌరవ అతిథులుగా విచ్చేసి సైబర్ సెక్యురిటి సెమినార్‌ను ప్రారంభించి మాట్లాడారు. సైబర్ దాడులను ప్రతి ఒక్కరూ సమర్థవంతంగా ఎదుర్కోవాలని అందుకు తగ్గ కనీస అవగాహన మనకు ఉండాలని, మనకు ఉన్న జ్ఞానాన్ని ఇతరులకు పంచాలని తద్వారా సైబర్ దాడులను ఎదురుకోగలమని తెలిపారు. అనంతరం కళాశాల సీడీసీ డీన్ లావణ్య కెరీర్ అభివద్ధి కేంద్రం ఆవశ్యకత ను అందు వల్ల విద్యార్థుల్లో ప్రతిభ ను వెలికి తెసేలా ఈ కేంద్రం మరింత ఉపయోగపడుతుందని తెలిపారు ఈ సందర్భంగా అతిథులు మాట్లాడుతూ సాధారణ ప్రజలు వాడే వినియోగ పరికరాలు చరవాణులు, కంప్యూటర్లు, లాప్‌టాప్‌లు, స్మార్ట్ గడియారాలు సైబర్ నేరగాళ్ల లక్ష్యాలు అవుతాయన్నారు. అనంతరం బంగారు లక్ష్మీ మాట్లాడుతూ సైబర్ సెక్యూరిటీ అనేది హ్యాకర్‌లు, స్పామర్‌లు సైబర్ నేరగాళ్ల హానికరమైన దాడుల నుండి ఇంటర్నెట్-కనెక్ట్ చేయబడిన పరికరాలు సేవలను రక్షించే రక్షణ అన్నారు.కళాశాల కార్యదర్శి జె. త్రిశూల్ రెడ్డి మాట్లాడుతూ ఇలాంటి గొప్ప కార్యక్రమాలు తమ కళాశాలలో జరగడం చాలా ఆనందకరమని, ఈ కార్యక్రమాలన్ని విద్యార్థులకు మేలు చేసేవే అని, తద్వారా వారు ప్రాంగణ నియామకాల్లో మరింత రాణించగలరాని తెలిపారు. కళాశాల డైరెక్టర్ డా. ఎ మోహన్ మాట్లాడుతూ ఇలాంటి సెమినర్ల వల్ల ఉపాధ్యాయులు తమ ప్రతిభను మరింత మెరుగుపర్చుకోగలరని తెలిపారు. కళాశాల ప్రిన్సిపాల్ డా. ఆర్ లోకనాథం మాట్లాడుతూ కళాశాల ప్రారంభించి 17 సంవత్సరాలు అయిందని,ఆ నాటి నుండి నేటి వరకు కళాశాల అంచెలంచెలుగా పురోగమించిందని, అనతికాలంలోనే 'న్యాక్', 'ఎంబీఏ' వంటి అక్రిడిటేషన్స్ ను పొందిందని, అలాగే తక్కువ కాలంలోనే యూజీసీ అటానమస్ స్థాయి కి కూడా చేరుకుందని తెలిపారు. అనంతరం కళాశాలలో ఆవరణలో పర్యావరణ హితంగా ఉండేందుకు మొక్కలు నాటారు.ఈ కార్యక్రమంలో కళాశాల చైర్మెన్ జె నర్సింహారెడ్డి , కార్యదర్శి జె త్రిశూల్ రెడ్డి , కోశాధికారి త్రిలోక్ రెడ్డి , సాక్ కన్వీనర్ కె పురుషోత్తం ప్రసాద్ , కార్యక్రమ సమన్వయకర్తలు డా. దిలీప్ రెడ్డి , శ్రీ లక్ష్మి , శ్రీనివాస్ , రేవతి , సౌమ్య , , మెకానికల్ విభాగాధిపతి అశోక్ కుమార్ , ఎంబీఏ విభాగాధిపతి నాగరాజు ,సివిల్ విభాగాధిపతి వెంకటేశ్ వరప్రసాద్, గోపాల్ రెడ్డి అధ్యాపకులు పాల్గొన్నారు.

లాంగ్విటీ లాంజ్‌ను ప్రారంభించిన ఒమేగా ఆస్పత్రి



నవతెలంగాణ-సిటీబ్యూరో

క్యాన్సర్, కార్డియాక్ అరెస్ట్, బ్రెయిన్ స్ట్రోక్ తదితర ప్రాణాంతక వ్యాధులను ముందస్తుగా గుర్తించి.. చికిత్స అందించేందుకు వీలుగా రూపొందించిన లాంజ్విటీ లాంజ్‌ను బుధవారం గచ్చిబౌలిలోని ఒమేగా ఆస్పత్రిలో బుధవారం ప్రారంభించారు.లాంగ్విటీ లాంజ్ అనేది ఖచ్చితత్వంతో కూడిన జన్యుపరమైన ఆరోగ్య స్క్రీనింగ్లకు అంకితమైన సెంటర్. ప్రివెంటివ్ హెల్త్కేర్లో అత్యున్నత ప్రమాణాలను కోరుకునే వ్యక్తుల కోసం రూపొందించారు. ఇది ప్రత్యేకమైన హాస్పిటాలిటీ అనుభవంతో అత్యాధునిక వైద్య శాస్త్రాన్ని సజావుగా అనుసంధానిస్తుంది.

ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఒమేగా హాస్పిటల్స్ ఫౌండర్ డాక్టర్ మోహన వంశీ మాట్లాడుతూ ఒమెగా హాస్పిటల్స్ వైద్య విధానంలో అందుబాటులో ఉన్న నూతన టెక్నాలజీని అందిపుచ్చుకోవడం లో ఎల్లప్పుడూ ముందుంటుందన్నారు. దేశంలోనే ఇది మొట్ట మొదటిదని తెలిపారు. ఆరోగ్యాన్ని ఆప్టిమైజ్ చెయ్యడం అనేది కష్టతరంగా కాకుండా సులభంగా ఉండాలని ఎలైట్ లైఫ్ స్టైల్లో ఇతర అంశాల లాగా అధునాతనంగా, వ్యక్తిగతీకరించి ఉండాలనే ఉద్దేశంతో ఇది ప్రారంభించినట్టు చెప్పారు.

అల్ట్రా-ప్రీమియం, ప్రయివేటు సెట్టింగ్

ప్రశాంతమైన వాతావరణంలో అత్యాధునిక సదుపాయాలతో వ్యక్తి గోప్యతను పాటిస్తూ పర్సనలైజ్డ్ కేర్ అందించాలనే ఉద్దేశంతో డిజైన్ చేశారు.

స్టేట్ ఆఫ్ ది ఆర్ట్ జెనెటిక్ టెస్టింగ్

క్యాన్సర్ తీవ్రత , గుండె ఆరోగ్యం, ముందస్తు వ్యాధి ప్రమాదాల గుర్తింపు , సంతానోత్పత్తి సమస్య ,మెటబోలిక్ హెల్త్ తో పాటు మరిన్ని కీలకమైన ఆరోగ్య కారకాలపై లోతైన అధ్యయనం చేయడంతో పాటు ఖచ్చితమైన డయాగ్నోసిస్ అండ్ ట్రీట్ మెంట్ .

బీ స్పోక్ వెల్నెస్

ప్రతి ఒక్కరికీ అనుభవజ్ఞులైన జెనెటిక్ స్పెషలిస్ట్ కన్సల్టేషన్‌తో పాటు కచ్చితమైన డేటాతో కూడిన హెల్త్ గైడెన్స్. ప్రపంచ స్థాయి లగ్జరీతో పాటు సైంటిఫిక్ ఎక్సెలెన్స్‌ను అనుసంధానం చేస్తూ ఈ లాంగ్విటీ లాంజ్ ప్రివెంటివ్ హెల్త్‌కేర్‌లో సరికొత్త బెంచ్‌మార్క్ సెట్ చేస్తుంది.



శివ పూజ మహోత్సవంలో ఎమ్మెల్యే

నవతెలంగాణ - కుత్బుల్లాపూర్

రాజీవ్ గాంధీ నగర్, నల్లగుట్టలో శ్రీ భ్రమరాంబ మల్లికార్జున స్వామి దేవస్థానంలో నియోజకవర్గ యూత్ అధ్యక్షులు దూదిమెట్ల సోమేష్ యాదవ్ ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించిన 24వ ద్వాదశ జ్యోతిర్లింగాల శివ పూజ మహోత్సవ కార్యక్రమానికి ఎమ్మెల్యే కె.పి. వివేకానంద్ , మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలం గౌడ్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ మహోత్సవంలో వారు దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించి, భక్తులకు శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ నల్లగుట్ట శివాలయం నుండి 50 మంది శివస్వాములు కాలినడకన శ్రీశైలంకు బయలుదేరడం మంచి శుభపరిణామమన్నారు.. శివ స్వాములు 41 రోజులు ఉపవాస దీక్షలు పూర్తిచేసుకుని పాదయాత్రగా వెళ్ళడం సంతోషంగా ఉందన్నారు.. శివయ్య, మల్లికార్జున స్వామివారి ఆశీస్సులు నియోజకవర్గ ప్రజలపై,శివ స్వాముల కుటుంబాలపై ఎల్లవేళలా ఉండాలని కోరుకున్నారు. ఈ కార్యక్రమంలో పాక్స్ డైరెక్టర్ పరుష శ్రీనివాస్ యాదవ్, డివిజన్ అధ్యక్షులు రుద్ర అశోక్, పోలే శ్రీకాంత్, ఏరువ శంకరయ్య, నాయకులు ఎత్తరి మారయ్య, వేణు యాదవ్, ఫిరోజ్, చిన్న చౌదరి, బద్రి, శివస్వాములు, భక్తులు పాల్గొన్నారు.



కాలేజీలో విద్యార్థినీ అనుమానాస్పద మృతి



నవతెలంగాణ-దుండిగల్

ఇంటర్మీడియట్ విద్యార్థిని అనుమానాస్పదంగా మృతి చెందిన సంఘటన బాచుపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. బాధితులు తెలిపిన వివరాల ప్రకారం.. సూర్యాపేట జిల్లా కృష్ణాపురం గ్రామానికి చెందిన శ్రీనివాసరావు దేవి దంపతుల కూతురు పూజిత బాచుపల్లి మండలం సాయి కృష్ణ హిల్స్ ఎస్సార్ జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియట్ రెండో సంవత్సరం చదువు తున్నది. ఆమె బుధవారం తాను ఉంటున్న గదిలో ఆత్మ హత్య చేసుకుంది. అయితే కళాశాల యాజమాన్యం.. బాధిత కుటుంబ సభ్యులకు తెలియ కుండా వెంటనే ఆస్పత్రికి తరలించి, ఆ తరువాత కుటుంబ సభ్యులకు బాత్ రూములో కాలుజారి పడిపోయి ప్రమాదానికి గురై చనిపోయిందని తెలిపారు. ఆ తరువాత రూమ్ లో రాసిన సూసైడ్ లెటర్ దొరికిందని యాజమాన్యం తెలపడంతో ఆగ్రహంతో కుటుంబ సభ్యులు కళాశాల యాజమాన్యం పై ఆగ్రహం వ్యక్తం చేశారు. తమ కూతురు మరణంపట్ల యాజమాన్యం పొంతన లేని సమాధానాలు తెలుపుతున్నదని.. కుటుంబ సభ్యులు కళాశాల ఎదుట ధర్నా నిర్వహించారు. విషయం తెలుసుకున్న విద్యార్థి సంఘాలు కుటుంబ సభ్యులకు అండగా నిలిచారు. బాచుపల్లి పోలీసులు ఆందోళన జరగకుండా శాంతింపజేసేందుకు ప్రయత్నించారు. అయితే బాధిత కుటుంబ సభ్యులు మాత్రం తమ కూతురు మృతి విషయాన్ని వెంటనే ఎందుకు తెలుపలేదని ప్రశ్నించారు. బాచుపల్లి పోలీసులు కేసు నమో నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.



విద్యార్థులకు పరీక్ష కిట్లు అందజేసిన ఎమ్మెల్యే

నవతెలంగాణ - కూకట్ పల్లి

క్షత్రియ యూత్ ఫెడరేషన్ వారి ఆధ్వర్యంలో కూకట్ పల్లి జెడ్పీహెచ్ఎస్ స్కూల్‌లో బుధవారం ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు చేతులమీదుగా విద్యార్థులకు పరీక్ష కిట్లు అందజేశారు. జామెట్రీ బాక్స్, పెన్స్, ఎగ్జామ్ పాడ్స్ అందజేశారు.కార్పొరేటర్ జూపల్లి సత్యనారాయణ, శ్యామలరాజు, సుధీర్, రాము కృష్ణంరాజు, సంతోష్, ప్రభాకర్, తదితరులు పాల్గొన్నారు.



పార్టీని పటిష్టవంతం చేసేందుకు కృషి..

● ప్రజా ఏక్తా పార్టీ జాతీయ అధ్యక్షులు బోనాల శ్రీనివాస్



నవతెలంగాణ-సుల్తాన్‌బజార్

పార్టీని బలోపేతం చేసేందుకు అన్ని వర్గాలకు సముచిత ప్రాధాన్యం కల్పిస్తున్నట్లు ప్రజా ఏక్తా పార్టీ జాతీయ అధ్యక్షులు బోనాల శ్రీనివాస్ అన్నారు. పాత బస్తీ హుసేని అలం ప్రాంతానికి చెందిన అలీ మొహ్మద్ బద్రీ, ఆసిఫ్ బద్రిలు బుధవారం గౌలిగూడ లోని పార్టీ కేంద్ర కార్యాలయంలో ప్రజా ఏక్తా పార్టీలో వారు చేరారు. ఈ సందర్భంగా పార్టీ జాతీయ అధ్యక్షులు బోనాల శ్రీనివాస్ ఇద్దరికి కండు వాలు కప్పి పార్టీ లోనికి ఆహ్వానించారు. ఈ సందర్భంగా అలీ మొహ్మద్ బద్రని తెలంగాణ రాష్ట్ర సమన్వయకర్తగా నియమించారు. ఆసిఫ్ బద్రిని గ్రేటర్ హైదరాబాద్ సమన్వయకర్తగా నియమించారు. ఈ కార్యక్రమం లో సినీ దర్శకులు చరణ్, పార్టీ నేతలు నరేశ్ గౌడ్ సురేశ్ తదితరులు పాల్గొన్నారు.

డాక్టరేట్ కోడిచెర్ల రమేష్‌కు ఘన సన్మానం..

● రాష్ట్ర అధ్యక్షులు పాల్వాయి శ్రీనివాస్ నాయి



నవతెలంగాణ-సుల్తాన్‌బజార్

గత 18 సంవత్సరాలుగా చూపు లేని వారు (బ్లైండ్) దివ్యాంగులు, అనాధలు, కుష్ఠి వ్యాధిగ్రస్తులకు ఉచితంగా కటింగ్‌లు, క్షౌవరవృత్తి చేస్తూ కోడిచెర్ల రమేష్ దాతృత్వం చాటుకున్నారు. రాష్ట్రంలో ఉన్న వివిధ ఆశ్రమంలో ఉన్న వాళ్లకు అయినా క్షౌవర సేవలు అందిస్తున్నారు. సౌత్ ఆఫ్రికా యూనివర్సిటీ ఆయన సేవలు గుర్తించి రమేష్‌కు ఇటీవల డాక్టరేట్ ప్రధానం చేసింది. రమేష్‌ను నాయి బ్రాహ్మణ సేవా సంఘం రాష్ట్ర అధ్యక్షులు పాల్వాయి శ్రీనివాస్, విజయ్ సాయి ఆయనకు శాలువా కప్పి ఘనంగా సన్మానించారు. డాక్టరేట్‌తో తన బాధ్యత మరింత పెరిగిందని పేదవారికి సేవ చేయడమే తన లక్ష్యమన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర వైస్ ప్రెసిడెంట్ విజయ్ సాయి, రంగారెడ్డి ఇన్‌చార్జి శ్రీహరి నాయి, రాష్ట్ర నాయకులు ప్రేమ్ నాయి, రాష్ట్ర నాయి బ్రాహ్మణ బిజెపి బీసీ సెల్ జి. ఆనంద్ కుమార్ నాయి తదితరులు పాల్గొన్నారు.

వేసవి కాలంలో ప్రజలు జాగ్రత్తలు తీసుకోవాలి

● మెడికల్ ఆఫీసర్ డాక్టర్ ఉమేరా సమ్రీన్



నవతెలంగాణ-సుల్తాన్‌బజార్

గత రెండు మూడు రోజులుగా ఎండలు విపరీతంగా పెరిగాయి. దీంతో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వేసవి కాలంలో ప్రజలు పలు జాగ్రత్తలు తీసుకోవాలని ఆగాపుర పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం మెడికల్ ఆఫీసర్ డాక్టర్ ఉమేరా సమ్రీన్ అన్నారు. బుధవారం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఆమె మాట్లాడుతూ.. ప్రజలు ఎండాకాలంలో పలు జాగ్రత్తలు పాటించాలని సూచించారు. వేడిని తట్టుకునేందుకు ఇంట్లో వాతావరణం చల్లగా ఉండే విధంగా చూసుకోవాలన్నారు. ప్రజలు పండ్ల రసాలు, కొబ్బరి నీళ్ల తాగడం ఆరోగ్యానికి మంచిదని సూచించారు. రోజుకు కనీసం నాలుగు లీటర్ల మంచినీరు తప్పక తీసుకోవాలన్నారు. ఆహారంలో తగినంత ఉప్పు, నీరు, పోషక విలువలు ఉండే విధంగా చూసుకోవాలని చెప్పారు. కూరగాయలు, పండ్లు, పండ్ల రసాలు తీసుకోవాలన్నారు. పసి పిల్లలపై ఎండ ప్రభావం పడకుండా చూసుకోవాలన్నారు. చిన్న పిల్లలకు తల్లి పాలు తప్పనిసరిగా పట్టించాలని తెలిపారు. వృద్ధులు, గర్భిణులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. ప్రజలు తేలికగా జీర్ణమయ్యే ఆహారాన్ని తీసుకోవాలన్నారు. ప్రజలు పోషకాలుండే పుచ్చకాయ, ద్రాక్ష, కర్బూజ లాంటి పండ్లరసాలను ఎక్కువగా తీసుకోవాలని సూచించారు. మజ్జిగ, కొబ్బరి నీరు తీసుకోవడం శరీరంలో వేడి తగ్గడంతోపాటు విలువైన పోషకాలు లభిస్తాయన్నారు. కీరదోష, క్యారట్, బీట్రూట్ లాంటి పచ్చి కూరగాయలను తీసుకోవాలని సూచించారు. వడదెబ్బ కు గురైతే వెంటనే వైద్యుని సంప్రదించాలని సూచించారు. చిన్నపిల్లలకు పుట్టినప్పటినుంచి ఐదు సంవత్సరాల లోపు పిల్లలకు ఎంఆర్ వ్యాక్సిన్ తీసుకోవాలని సూచించారు. తమ ఆస్పత్రిలో బీపీ, బీషుగర్, థైరాయిడ్ వ్యాధులకు మందులను ఉచితంగా అందిస్తున్నామన్నారు. అన్ని రకాల రక్త పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి మందులను అందిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో స్టాఫ్ నర్సులు నాగరాణి, సుజాత, ఏఎన్ఎం లు జ్యోత్స్న, పావని, డీఈఓ ప్రతిమ, ఎల్ టి స్వాతి తదితరులు పాల్గొన్నారు.

తాండ్ర కుమార్ 3వ వర్ధంతిని జయప్రదం చేయండి



● ఎంసీపీఐ(యు) రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు వనం సుధాకర్

నవతెలంగాణ-ముషీరాబాద్

ఎంసీపీఐ(యు) పొలిట్ బ్యూరో సభ్యుడు, తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి అమరజీవి కామ్రేడ్ తాండ్ర కుమార్ 3వ వర్ధంతి సందర్భంగా రాష్ట్రవ్యాప్తంగా ఫిబ్రవరి 14 నుంచి 21 వరకు జరుగు కార్యక్రమాలను జయప్రదం చేయాలని యంసీపీఐ(యు) రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు వనం సుధాకర్ తెలిపారు. ఈ సందర్భంగా కార్యక్రమానికి సంబంధించి కరపత్రాన్ని బాగ్‌లింగంపల్లిలోని ఎంసీపీఐ (యు) రాష్ట్ర కార్యాలయం, ఓంకార్ భవన్‌లో విడుదల చేశారు. అనంతరం వనం సుధాకర్ మాట్లాడుతూ ఎంసీపీఐ (యు) పొలిటిబ్యూరో సభ్యులుగా తెలంగాణ రాష్ట్ర కార్యదర్శిగా బాధ్యతలు నిర్వహిస్తున్న సమయంలో అనారోగ్యంతో బాధపడుతూ అమరులైయ్యారు. 14 నుంచి 21 వరకు రాష్ట్రవ్యాప్తంగా భూమి ఇండ్లు స్థలాలు ప్రభుత్వ విధానాలు మన కర్తవ్యం అనే అంశంపై సభలు సమావేశాలు జరుపుతున్నామని తెలియజేశారు. 14న మొదటి రోజు గ్రేటర్ హైదరాబాద్ పరిధిలోని మియాపూర్ క్రాస్ రోడ్డు వద్దగల తాండ్ర కుమార్ భారీ స్థూపం నుండి టేకు నరసింహ నగర్ వరకు ర్యాలీ నిర్వహించి అనంతరం టేకు నరసింహనగర్‌లో కామ్రేడ్ తాండ్ర కుమార్ విగ్రహా విష్కరణ కార్యక్రమం అనంతరం సభ జరుగుతుందని తెలియజేశారు. ఈ కార్యక్రమానికి ఎంసీపీఐ(యు) అఖిల భారత ప్రధాన కార్యదర్శి మద్ది కాయల అశోక్ ఓంకార్, బిఎల్ఎఫ్ చైర్మన్ నల్ల సూర్యప్రకాష్, వామపక్షకమ్యూనిస్టు పార్టీల రాష్ట్ర నాయకులు, ఎంసీపీఐ(యు) రాష్ట్ర నాయ కత్వం, వివిధ జిల్లాల నుండి పార్టీ శ్రేణులు ప్రజాసంఘాల నాయకులు హాజరవుతున్నారని తెలియజేశారు. భూమి, ఇండ్ల స్థలాలు కోసం, పేద ప్రజల విముక్తి కోసం. పాలక వర్గాల తప్పుడు విధానాలపై కామ్రేడ్ తాండ్ర కుమార్ రాజీ లేని పోరాటం చేశారని గుర్తు చేశారు. ఈకార్యక్రమంలో ఎంసీపీఐ(యు) రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు వి.తుకారాం నాయక్, సభ్యులు రాయ బండి పాండురంగ చారి, బి.యాదగిరి, ఎం.మార్టిన్, లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

కార్ల అద్దాలకున్న బ్లాక్ ఫిల్మ్ తొలగింపు..

● అబిడ్స్ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ ఎల్.రవికుమార్



నవతెలంగాణ-సుల్తాన్‌బజార్

కార్ల అద్దాలకు ఉన్న బ్లాక్ ఫిలిం తొలగింపు స్పెషల్ డ్రైవ్‌ను అబిడ్స్ ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ పరిధిలో నిర్వహించారు. బుధవారం అబిడ్స్ చౌరస్తా, చిరాక్ అలీ లైన్ వద్ద కార్ల అద్దాలకు ఉన్న బ్లాక్ ఫిల్లింగ్‌ను అబిడ్స్ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ రవికుమార్ తొలగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ట్రాఫిక్ అడిషనల్ కమిషనర్ ఆదేశాలతో స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తున్నామన్నారు. ఇప్పటివరకు 60 వాహనాలకు ఉన్న బ్లాక్ ఫిలింతొలగించి, చాలాన్‌లు విధించామన్నారు. ఫోర్ వీలర్ వాహనాలు ఉన్న వాహనదారులు కార్ల అద్దాలకు ఉన్న బ్లాక్ ఫిల్మ్ తొలగించుకోవాలని సూచించారు. వాహనదారులు వాహనాలకు నెంబర్ ప్లేట్స్ లేకుంటే చట్ట పరమైన చర్యలు తీసు కుంటామని హెచ్చరించారు. నంబర్ ప్లేట్స్ లేని వాహనాలను సీజ్ చేస్తామన్నారు. ప్రతి వాహనానికి తప్పని సరిగా నెంబర్ ప్లేట్ బిగించు కోవాలని, వాహన దారులు తమ వెంట వాహనాలకు సంబంధించిన డ్రైవింగ్ లైసెన్స్, ఇన్సూరెన్స్, వాహన ఆర్‌సీ, హెల్మెట్ తెచ్చుకోవాలని, మైనర్లు వాహనాలు నడిపితే తల్లిదండ్రులపై చర్యలు తీసుకుంటామని ట్రాఫిక్ నిబంధనలను ప్రతి ఒక్కరూ పాటించాలని సూచించారు. ఫోర్ వీలర్ వాహనదారులు సీట్ బెల్ట్ తప్పనిసరిగా పెట్టుకోవాలని సూచించారు.

రామరాజ్యం పేరుతో దాడులకు పాల్పడే వారిని శిక్షించాలి

సోషలిస్ట్ పార్టీ ఆఫ్ ఇండియా యునైటెడ్ తెలంగాణ వ్యవస్థాపక అధ్యక్షులు బి. పురుషోత్తం



నవతెలంగాణ-ముషీరాబాద్

రామరాజ్యం పేరుతో దాడులకు పాల్పడే వారిని కఠినంగా శిక్షించాలని సోషలిస్ట్ పార్టీ ఆఫ్ ఇండియా యునైటెడ్ తెలంగాణ వ్యవస్థాపక అధ్యక్షులు బి.పురుషోత్తం డిమాండ్ చేశారు. రంగారెడ్డి జిల్లా మొయినాబాద్ మండల పరిధిలో గల చిలుకూరు బాలాజీ టెంపుల్ ప్రధాన అర్చకుడు రంగరాజన్ అతని కుమారుడుపై జరిగిన దాడిని ఖండిస్తున్నామని బుధవారం చిక్కడపల్లిలోని రాష్ట్ర కార్యాలయంలో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సమావేశంలో అధ్యక్షులు బి.పురుషోత్తం హాజరై మాట్లాడుతూ చిలుకూరు బాలాజీ దేవాలయ అర్చకుడు రంగరాజన్ పై దాడికి పాల్పడిన రామరాజ్యం రాఘవారెడ్డిని కస్టడీలోకి ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. గత కొన్ని సంవత్సరాలుగా రంగరాజన్ చిలుకూరు బాలాజీ టెంపుల్ అభివృద్ధికి తోడ్పడి అక్కడ దర్శించుకోవడానికి వస్తున్నటువంటి భక్తులకు హుండిలో ఒక్క రూపాయి కూడా వేయకుండా యావత్ భారత దేశంలో అసలు హుండే లేనట్టి వంటి దేవాలయం ఒక్క చిలుకూరు బాలాజీ టెంపుల్ మాత్రమే ఇలాంటి పవిత్ర దేవాలయ అర్చకునిపైన దాడి జరగడం దుర్మార్గమన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా మతపరంగా దాడులకు పాల్పడిన వారిని వాటిని ప్రోత్సహిస్తున్న వారిని ఎట్టి పరిస్థితుల్లో ఉపేక్షించేదిలేదని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో నాయకులు బి. సుజాత అధ్యక్షత వహించారు. ఆర్ యూనీస్, భాను ప్రసాద్, గోవిందు నాయక్, పి.సురేష్, జ్యోతి, సిహెచ్ రాజ్, పి. సంధ్యారాణి, వి.నాగేంద్రమ్మ, ఈ శేఖర్ కుమార్, బి.నవీన్, బి.లావణ్య నాగలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

'పంచాయతీరాజ్ ఎన్నికల్లో చట్ట ప్రకారం రిజర్వేషన్స్ పెంచాలి'

● లేకపోతే ఈ నెల 18న రాష్ట్ర వ్యాప్తంగా కలెక్టరేట్ల ముట్టడి, నిరసన, ధర్నాలు

● రాజ్యసభ సభ్యులు ఆర్.కృష్ణయ్య హెచ్చరిక



నవతెలంగాణ-హిమాయత్‌నగర్

పంచాయతీరాజ్ ఎన్నికల్లో బీసీలకు పార్టీ పరంగా 42 శాతం కోటా ఇస్తామని రాష్ట్ర సీఎం ఎ.రేవంత్ రెడ్డి ప్రకటించారని, పార్టీ పరంగా 42 శాతం ఇస్తే బీసీలకు న్యాయం జరగదని, చట్ట ప్రకారం అసెంబ్లీలో బీసీ రిజర్వేషన్లు 42 శాతానికి పెంచుతూ బిల్లు పెట్టి చట్టం చేయాలని, ఇందుకు అఖిలపక్ష సమావేశం ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. లేకపోతే రాష్ట్ర వ్యాప్తంగా 18న కలెక్టరేట్ల ముట్టడి, నిరసన, ధర్నాలు, ఆందోళన కార్యక్రమాలు చేపడతామని రాజ్యసభ సభ్యులు, జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షులు ఆర్.కృష్ణయ్య హెచ్చరించారు. తెలంగాణ నిరుద్యోగ జేఏసీ చైర్మెన్ నీల వెంకటేష్ అధ్యక్షతన బుధవారం బషీర్‌బాగ్ ప్రెస్ క్లబ్‌లో 14 బీసీ కుల సంఘాల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్.కృష్ణయ్య మాట్లాడుతూ పంచాయతీరాజ్ ఎన్నికల్లో బీసీలకు పార్టీ పరంగా 42 శాతం కోటా ఇస్తామని సీఎం ఎ.రేవంత్ రెడ్డి ప్రకటించిన నేపథ్యంలో పార్టీ పరంగా 42 శాతం ఇస్తే బీసీలకు న్యాయం జరగదన్నారు. ఇతర పార్టీల వారు అంగీకరిస్తే అప్పుడు న్యాయం జరుగుతుందన్నారు. రాష్ట్రంలో డెడికేటెడ్ బీసీ కమిషన్ బీసీ రిజర్వేషన్లపై రిపోర్టు ఇచ్చిందని, జనాభా లెక్కల సేకరణలో అవకతవ కలు జరిగాయని, వాటిని సరి చేయాలని బీసీ మంత్రి పొన్నం ప్రభాకర్ ఏర్పాటు చేసిన సమావేశంలో మేధావులు, బీసీ సంఘాలతో మంత్రి సరి చేస్తామని హామీ ఇచ్చిన ట్లు గుర్తు చేశారు. కానీ సరి చేయకుండానే ఆదరాబాదరగా రిపోర్టు ఇచ్చారన్నారు. దీన్ని వెంటనే అమలు చేయాలని కోరారు. ఈ సమావేశంలో బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు వేముల రామకృష్ణ, నాయకులు నందగోపాల్, మోడీ రాందేవ్, మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

గంజాయి బ్యాచ్‌లకు అడ్డాగా 'లింగంపల్లి పార్క్'

● గత 6 నెలలుగా పార్క్‌లో లైట్లు వెలుగక చిమ్మ చీకటి..

● రాత్రి, సాయంత్రం వేళల్లో ఆకతాయిలు మద్యం, ధూమపానం, గంజాయి సేవిస్తూ గొడవలకు దిగడం

● సరైన నిర్వహణ కరువై అంద విహీనంగా మారిన పార్క్

● పార్క్, కాలనీ చుట్టూ బిగించిన కెమెరాలు సరిగ్గా పని చేయకపోవడం


● స్థానిక ప్రజలు, వాకర్స్‌కు ఇబ్బందులు

● పలుమార్లు ఫిర్యాదు చేసిన పట్టించుకోని స్థానిక ఎమ్మెల్యే, కార్పొరేటర్, జీహెచ్ఎంసీ అధికారులు, సిబ్బంది, పోలీసులు














నవతెలంగాణ-హిమాయత్‌నగర్

నారాయణగూడ వార్డు నెంబర్.80, వీధి నెంబర్.1లో గల సీఐబీ క్వార్టర్స్ లోని 'లింగంపల్లి పార్క్'లో గత ఆరు నెలలుగా లైట్లు వెలుగకపోవడంతో పార్క్ అంతటా చిమ్మనీ చీకటి ఆవరించి ఉండటంతో ఇదే అదునుగా భావించిన యువత, ఆకతాయిలు రాత్రి, సాయంత్రం వేళల్లో బ్యాచీలుగా విచ్చలవిడిగా మద్యం, ధూమపానం, గంజాయి సేవిస్తూ స్థానిక ప్రజలపై గొడవలకు దిగడం గమనార్హం.

అసాంఘిక కార్యకలాపాలకు అడ్డ

లింగంపల్లి పార్క్, కాలనీ చుట్టుపక్కల ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలు సరిగ్గా పని చేయకపోవడం, వీధి దీపాలు వెలుగకపోవడం, చెట్ల కొమ్మలు విపరీతంగా పొడవు పెరగడంతో పార్కు, వీధి మొత్తం చిమ్మ చీకటిగా మారడంతో అటు ఆకతాయిలకు, ఇటు లవర్స్‌కు 'లింగంపల్లి పార్క్' అసాంఘిక కార్యకలాపాలకు అడ్డగా మారిందని స్థానిక ప్రజలు ఆరోపించారు.పార్క్ లోనే విచ్చలవిడిగా మద్యం సేవిస్తూ బీరు బాటిళ్లు పగలగొట్టడం, ఇంటి ముందు పార్క్ చేసుకున్న బైకుల్లోని పెట్రోల్ దొంగలించడం వంటి దుశ్చర్యలకు పాల్పడుతున్నారని, దీంతో స్థానికులు ఆకతాయిలను హెచ్చరించడంతో స్థానికులపైకే గొడవలకు దిగుతున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.పార్క్ చుట్టుపక్కల కాలనీలో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలు పని చేయకపోవడంతోనే ఇలాంటి ఇబ్బందులు తలెత్తుతున్నాయని స్థానికులు ఆరోపిస్తున్నారు.

పలుమార్లు ఫిర్యాదు చేసిన పట్టించుకోని స్థానిక ఎమ్మెల్యే, కార్పొరేటర్, జీహెచ్ఎంసీ అధికారులు, సిబ్బంది, పోలీసులు

గత ఆరు నెలల కాలంగా స్థానిక ప్రజలకు, వాకర్స్ కు అనేక ఇబ్బందులు కలుగుతున్న కనీసం స్థానిక ఎమ్మెల్యే, కార్పొరేటర్, జీహెచ్ఎంసీ అధికారులు, సిబ్బంది, పోలీసులు పట్టించుకోకపోవడం శోచనీయమన్నారు. కాలనీ పార్క్ సరైన నిర్వహణ లేకపోవడంతో పార్క్, వీధులు అంద విహీనంగా తయారయ్యాయని, చెత్త, చెదారం నిండిన పార్క్ గోడల వద్ద మలమూత్ర విసర్జనలు చేస్తుండటంతో దుర్వాసన వస్తుందని, దీంతో దోమలు తయారై స్థానిక ప్రజలు అనారోగ్యానికి గురవుతున్నారని వాపోయారు. ఈ సమస్యలపై పలుమార్లు స్థానిక ప్రజా ప్రతినిధులు, పోలీసులు, జీహెచ్ఎంసీ అధికారులకు ఫిర్యాదు చేసిన పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు.గతంలో పార్క్ చుట్టూరా రాత్రి వేళల్లో పోలీస్ పెట్రోలింగ్ నిర్వహణ, దోమల ఫ్లాగ్గింగ్ నిర్వహిస్తుండే వారని, అవి నేడు కరువైయ్యాయన్నారు. ఇప్పటికైనా కాలనీ పార్కులో జరుగుతున్న అసాంఘిక కార్యకలాపాలకు, వీధుల్లోని సమస్యలను వెంటనే పరిష్కరించాలని స్థానిక ప్రజలు సంబంధిత అధికారులను, ప్రజా ప్రతినిధులను కోరారు.

స్థానికుడు: జి.వెంకటేష్



గత ఆరు నెలలుగా 'లింగంపల్లి పార్క్' సరైన నిర్వహణ లేక పచ్చదనం, స్వచ్ఛత కోల్పోయిందన్నారు. స్థానిక ప్రజలు పార్క్ లోని వాటర్, నిర్వహణ, వీధి దీపాలు, వాకింగ్ ట్రాక్ లు తమ సొంత ఖర్చులతో బాగు చేయించుకుంటున్నారని చెప్పారు. పార్క్ నిర్వహణకు వచ్చే నిధులను స్థానిక ప్రజా ప్రతినిధులు, నాయకులు, అధికారులు దొబ్బి తింటున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇప్పటికైనా ఈ సమస్యలపై దృష్టి పెట్టి పరిష్కరించాలని కోరారు.

స్థానికుడు : బి.కృష్ణ



వీధి నెంబర్.1లోని 'లింగంపల్లి పార్క్'లో గత కొంతకాలం నుంచి ఆకతాయిలు మద్యం, ధూమపానం, గంజాయి సేవిస్తూ అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడుతున్నారని, పార్క్‌లోని లైట్లు, వీధి దీపాలు వెలుగకపోవడంతో కాలనీ పరిసర ప్రాంతాలు చీకటిమయం కావడంతో ఆకతాయిలకు, లవర్స్‌కు ఈ పార్క్ అడ్డగా మారిందన్నారు. దీంతో అనేక సమస్యలు తలెత్తడంతో స్థానిక ప్రజలు, వాకర్స్ ఇబ్బందులకు గురవుతు న్నారన్నారు. పార్క్ లోని లైట్లు, వీధి దీపాలు చాలా రోజుల నుండి వెలుగకపోవడంతో పలుమార్లు స్థానిక ప్రజా ప్రతినిధులకు, అధికారులకు ఫిర్యాదు చేసిన పట్టించుకోలేదన్నారు. ఇప్పటికైనా ఈ సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఆయన కోరారు.

పార్క్‌లను సుందరీకరించి సౌకర్యాలు ఏర్పాటు చేయాలి

● కార్పొరేటర్ ఎ.పావని వినయ్ కుమార్



నవతెలంగాణ-ముషీరాబాద్

డివిజన్‌లోని పార్క్ లను సుందరికరించి, మెరుగైన సౌకర్యాలు ఏర్పాటు చేయాలని గాంధీనగర్ డివిజన్ కార్పొరేటర్ ఎ.పావని వినయ్ కుమార్ అధికారులను కోరారు. డివిజన్‌లోని పలు పార్కులను, హార్టికల్చర్, స్ట్రీట్ లైట్స్, ఇంజనీరింగ్ అధికారులతో కలిసి సందర్శించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ అధికారులతో మాట్లాడుతూ పార్కుల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించాలని, సుందరీకరణతో పాటు అంధకారాన్ని తొలగించేందుకు అవసరం ఉన్న చోట నూతన స్ట్రీట్ లైట్స్ ఏర్పాటు చేయాలని ఆదేశించారు. పీపుల్స్ పార్క్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యుల ఫిర్యాదు మేరకు పార్క్‌లో వాటర్ ఫౌంటెన్, కూర్చునేందుకు నూతన బల్లల ఏర్పాటు, పిల్లలు ఆడుకునేందుకు కొన్ని ఆట పరికరాలను అమర్చాలని సూచించారు. చెత్త చెదారం లేకుండా ప్రతిరోజూ చెత్తను తొలగించాలని జీహెచ్ఎంసీ సిబ్బందికి ఆదేశించారు. వాకర్స్ కొరకు ప్రత్యేకమైన పాత్ వే నిర్మించాలని అధికారులకు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ సికింద్రాబాద్ పార్లమెంట్ జాయింట్ కన్వీనర్ ఎ.వినయ్ కుమార్, హార్టికల్చర్ డి.ఈ ఆశిష్, ఎ.ఈ సంజయ్, స్ట్రీట్ లైట్స్ సూపర్‌వైజర్లు బాలు నాయక్, రాజు, నాయకులు శ్రీకాంత్, దామోదర్, పి.నర్సింగ్ రావు, ఎం.ఉమేష్, ప్రకాష్ యాదవ్, ఆనంద్ రావు,సాయి కుమార్, నీరజ్ పీపుల్స్ పార్క్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు గంగరాజు, సభ్యులు విద్యాసాగర్, శ్రీనివాస్ రావు, రజినీ కాంత్, ఆంజనేయులు, ప్రేమ్ కుమార్, వినోద్ జైన్, గణేష్, తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయాలి



● 20న జరిగే చలో హైదరాబాద్‌ను జయప్రదం చేయండి : సీపీఐ (ఎం-ఎల్)న్యూ డెమోక్రసీ

నవతెలంగాణ-ముషీరాబాద్

కాంగ్రెస్ ఎన్నికల సందర్భంగా ఇచ్చిన హామీలను,6 గ్యారంటీలను అమలు చేయాలని, ప్రజాస్వామిక పాలనను డిమాండ్ చేస్తూ 20న చలో హైదరాబాద్ పోస్టర్ ఆవిష్కరణ బుధవారం విద్యానగర్ మార్క్స్ భవన్‌లో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సీపీఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ రాష్ట్ర అధికార ప్రతినిధులు జేవీ చలపతిరావు, సాధినేని వెంకటేశ్వరరావు మాట్లాడుతూ. కాంగ్రెస్ అధికారంలోకి రావడం కోసం 6 గ్యారంటీల మాటున 420 హామీలను ఇచ్చిందన్నారు. 7వ గ్యారంటీగా ప్రజా హక్కులను కాపాడుతామని, ప్రజాస్వామిక పాలనను అందిస్తామని హామీ ఇచ్చిందన్నారు. అధికారంలోకి వచ్చి 400 రోజులు గడిచిపోయిన కూడా నేటికీ ప్రజలకు ఇచ్చిన వాగ్దానాలను అమలు చేయడంలో తీవ్రమైన నిర్లక్ష్యాన్ని వహిస్తుందన్నారు. ప్రజాస్వామిక పాలనను అందిస్తామన్న కాంగ్రెస్ నేడు బూటకపు ఎన్‌కౌంటర్లను చేస్తుందన్నారు. పరిపాలన కొనసాగించడంలో ప్రజలకు ఇస్తానన్న హామీలను అమలు చేయడంలో కాంగ్రెస్ విఫలం చెందిందని అందుకే 20న సీపీఐ ఎంఎల్ న్యూ డెమోక్రసీ చలో హైదరాబాద్‌కు పిలుపునిచ్చిందని సుందరయ్య పార్క్ నుండి ఇందిరా పార్క్ వరకు ర్యాలీని, ధర్నా చౌక్‌లో వేలాది మంది ప్రజలతో బహిరంగ సభ ను నిర్వహిస్తు న్నామన్నారు. ఈ కార్యక్రమానికి ప్రజలు పెద్ద ఎత్తున తరలివచ్చి జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర సెక్రటేరియట్ సభ్యులు కే.గోవర్ధన్, జి.ఝాన్సీ, ఐఎఫ్‌టీయు రాష్ట్ర ఉపాధ్యక్షులు అరుణ, అనురాధ, పీడీఎస్‌యు జాతీయ నాయ కులు పి.మహేష్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పోడపంగి నాగరాజు, నాయకులు కంచనపల్లి శ్రీనివాస్, మల్లిక్, ఝాన్సీ తదితరులున్నారు.

కనకాల కట్ట మైసమ్మ దేవాలయంలో ప్రత్యేక పూజలు



నవతెలంగాణ-ముషీరాబాద్

మాఘ పౌర్ణమి సందర్భంగా ఆలయ వార్షికోత్సవంను పురస్కరించుకొని శ్రీ కనకాల కట్ట మైసమ్మ అమ్మవారి దేవాలయంలో 366 కలషాలతో ప్రత్యేక అభిషేకం రుద్ర సహిత చండీ సప్తశతి హెూమం కార్యక్రమాన్ని ఆల య చైర్మెన్ గౌతమ్ కుమార్ ఆలయ కార్య నిర్వాహనాధికారి కే.సాంబ శివరావు ఆలయ ముఖ్య అర్చకులు ఆలయ సిబ్బంది అత్యంత వైభవంగా నిర్వహించారు.

'మాదిగలకు 9 శాతం రిజర్వేషన్లు కల్పించడాన్ని స్వాగతిస్తున్నాం'

● మాదిగ, మాదిగ అనుబంధ కులాల ఐక్యవేదిక



నవతెలంగాణ-హిమాయత్‌నగర్

మాదిగ, మాదిగ ఉప కులాలకు 9 శాతం రిజర్వేషన్లు కల్పించడాన్ని స్వాగతిస్తున్నామని మాదిగ, మాదిగ అనుబంధ కులాల ఐక్యవేదిక తెలిపింది. 40 ఏండ్ల సుదీర్ఘ పోరాటాన్ని తెలంగాణ ప్రభుత్వం గుర్తించి ఆకాంక్షను నెరవేర్చే విధంగా ఎస్సీ వర్గీకరణ చేసిన సీఎం రేవంత్ రెడ్డికి, మంత్రి దామోదర రాజనర్సింహలకు కృతజ్ఞతలు తెలుపుతూ బుధవారం బషీర్‌బాగ్, బాబు జగ్జీవన్ రామ్ విగ్రహం వద్ద సీఎం రేవంత్ రెడ్డి, మంత్రులు ఉత్తమ్ కుమార్‌రెడ్డి, దామోదర రాజనర్సింహ చిత్ర పటాలకు పాలాభిషేకం చేశారు. అనంతరం ఐక్యవేదిక చైర్మెన్ మేడి పాపయ్య మాట్లాడుతూ అన్ని వర్గాల మద్దతుతోనే వర్గీకరణ సాధించుకున్నామని, ఇక ఐక్య పోరాటాలకు నాంది పలుకుదామని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఐక్యవేదిక రాష్ట్ర సలహాదారులు కొండేటి మల్లన్న, ప్రొఫెసర్ మల్లేష్, విజయ్ కుమార్, కృపాకర్, వైస్-చైర్మన్లు కనకరాజు, బైరి వెంకటేశం, మంగేష్, గుర్రాల శ్రీనివాస్, మేడి రమణ, రాజలింగం, పెద్ద ఎత్తున నేతలు పాల్గొన్నారు.



ఎల్లమ్మ పండుగ వేడుకలో పాల్గొన్న మాజీ మంత్రి సి. కృష్ణ యాదవ్, నాయకులు సునీల్, గణేష్, ప్రవీణ్, జగన్, రోహిత్ తదితర నాయకులు పాల్గొన్నారు. నవతెలంగాణ-అంబర్‌పేట

లక్ష్యం నిర్దేశించుకుని ఉన్నత వ్యక్తులుగా ఎదగాలి

- సోషల్ మీడియా, సెల్‌ఫోన్ వినియోగం తగ్గించాలి
- జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి
- సికింద్రాబాద్ ప్రభుత్వ ఎస్సీ బాలికల సంక్షేమ హాస్టల్ తనిఖీ

నవతెలంగాణ-సిటీబ్యూరో



విద్యార్థులు తాము నిర్దేశించుకున్న లక్ష్యానికి అనుగుణంగా కష్టపడి చదివినప్పుడే అనుకున్న ఫలితాలు సాధించవచ్చని హైదరాబాద్ జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి అన్నారు. బుధవారం సికింద్రాబాద్ ప్రభుత్వ ఎస్సీ కళాశాల బాలికల వసతి గృహాన్ని కలెక్టర్ ఆకస్మికంగా సందర్శించారు. వసతి గృహంలోని వంటగదిని, పరిసరాలను పరిశీలించారు. ఏమైనా సమస్యలు ఉన్నాయా, పుస్తకాలు, మ్యాట్రెస్ తగినన్ని ఉన్నాయా, వసతి గృహంలో ప్రతిరోజు దినపత్రికలు వస్తున్నాయా అని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా విద్యార్థులతో కలెక్టర్ మాట్లాడుతూ సుదూర ప్రాంతాల నుంచి తల్లిదండ్రులను విడిచి వసతి గృహంలో ఉండి చదువుకుంటున్నారనీ, ప్రభుత్వం కల్పిస్తున్న అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. నిర్దేశించుకున్న లక్ష్యం మేరకు పట్టుదలతో బాగా చదివి ఉన్నత స్థానాలలో నిలబడి ఇతరులకు స్ఫూర్తిగా నిలవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్సీ వెల్ఫేర్ డిప్యూటీ డైరెక్టర్ కోటాజి, ఆర్డీవో సాయి రామ్, ఏఎస్‌డబ్ల్యూ మోహన్, హాస్టల్ వార్డెన్ మనోహర, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.






దారుల్‌షిఫా అంధుల ప్రాథమిక పాఠశాలకు ఆయాను నియమించుటకు సగౌర చార్టిటబుల్ సొసైటీ అధ్యక్షులు డాక్టర్ సత్యనారాయణ ఆర్థిక సహాయం అందజేశారు. ఈమేరకు బుధవారం సంబంధిత నగదు చెక్కును ఆయన చేతుల మీదుగా ఆయాకు అందజేశారు. ఈ సందర్భంగా సత్యనారాయణ మాట్లాడుతూ చిన్నపిల్లల సంరక్షణ పట్ల ఆమె చేస్తున్న సేవను అభినందించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు మందడి వెంకట్ రెడ్డి, ఉపాధ్యాయులు జావీద్, రవీందర్ రెడ్డి, జానయ్య, అంజాద్, విద్యార్థులు పాల్గొన్నారు.

నవతెలంగాణ-సిటీబ్యూరో

దారుణ హత్య...!



నవతెలంగాణ-బేగంపేట/ఆల్వాల్

గుర్తుతెలియని వ్యక్తి హత్యకు గురైన సంఘటన ఆల్వాల్ రైల్వే స్టేషన్ సమీపంలోచోటు చేసుకుంది. రైల్వే పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి... అల్వాల్ రైల్వే బ్రిడ్జి కింద గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం పడి ఉన్నట్లు సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి వెళ్లి పరిశీలించారు. మృతుడి తలపై బండరాయితో మోది హత్య చేసినట్లు పోలీసులు గుర్తించారు. మృతుడి వయస్సు 50 ఏండ్ల వరకు ఉంటుందని తెలిపారు. మృతుడి చేతిపై ఆంజనేయస్వామి పచ్చబొట్టు ఉందని, మెడలో ఆంజనేయస్వామి లాకెట్ ఉన్నట్టుగా పోలీసులు గుర్తించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టినట్లు రైల్వే ఇన్‌స్పెక్టర్ సాయి ఈశ్వర్ గౌడ్ తెలిపారు.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
సికింద్రాబాద్ - సనత్‌నగర్ - జూబ్లీహిల్స్
గురువారం | ఫిబ్రవరి 13, 2025 | www.navatelangana.com

ఓయూ రిజిస్ట్రార్, ఓఎస్డీలకు బీఆర్ఎస్వీ వినతి



నవతెలంగాణ-ఓయూ

ఓయూ పీహెచ్డీ ప్రవేశ పరీక్షల్లో ప్రొఫెసర్ల రిటైర్మెంట్ వయసు 65 ఏండ్లకు పెంచిన నేపథ్యంలో ఓయూ పీహెచ్డీ ఎంట్రెన్స్ నోటిఫికేషన్‌లో మార్పులు చేయాలని, సీట్ల సంఖ్య పెంచాలని బుధవారం ఓయూ రిజిస్ట్రార్, ఓఎస్డీలకు వేరు వేరుగా బీఆర్ఎస్వీ వినతిపత్రం అందజేశారు. రీసెర్చ్ సెంటర్స్ , పీజీ సెంటర్స్, రిటైర్డ్ ప్రొఫెసర్లుకు కూడా గైడ్ షిప్ ఇవ్వాలని, అట్టడుగువర్గాల విద్యార్థుల ఆర్థిక పరిస్థితిని దృష్టిలో ఉంచుకుని పీహెచ్డీ అప్లికేషన్ ఫీజును తగ్గించి విద్యార్థులందరికీ న్యాయం చేయాలని రిజిస్ట్రార్‌ని కోరారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్వీ విద్యార్థి సంఘం నాయకులు పాల్గొన్నారు.

దరఖాస్తుల సరళిని పరిశీలించిన కార్పొరేటర్



నవతెలంగాణ-ఓయూ

సీతఫల్‌మండిలోని మీసేవ కేంద్రంలో జరుగుతున్న రేషన్ కార్డు దరఖాస్తుల సరళిని కార్పొరేటర్ డా.సామల హేమ పరిశీలించారు. ఈ సందర్భంగా మీసేవ కేంద్రం వారితో మాట్లాడి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ.. రేషన్ కార్డులు గతంలో గానీ, ప్రజా పాలనలో దరఖాస్తు పెట్టుకున్నవారు మళ్ళీ అప్లై చేసుకోవాల్సిన అవసరం లేదని అన్నారు. హెడ్ ఆఫ్ ద ఫ్యామిలీగా మహిళను ఎంచుకుంటారని అన్నారు. కొత్తగా పెండ్లైన వారికి నూతన రేషన్ కార్డు కావాలంటే ఇప్పటికే ఉన్న రేషన్ కార్డులో ఉన్న పేరును తొలగిస్తేనే నూతన రేషన్ కార్డుకు అప్లికేషన్ పెట్టుకోవాలని సూచించారు. రేషన్ కార్డు అప్లికేషన్ కొరకు తమ వెంట ఆధార్ కార్డు, కరెంట్ బిల్లు తీసుకురావాలని తెలిపారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

చదువుతో ఉన్నతమైన స్థానం




● మేయర్ గద్వాల్ విజయలక్ష్మి

నవతెలంగాణ-బంజారాహిల్స్

చదువుతో ఉన్నతమైన స్థానాన్ని కైవసం చేసుకోవచ్చని నగర మేయర్ గద్వాల్ విజయలక్ష్మి తెలిపారు. బంజారాహిల్స్ డివిజన్, ప్రేమ్‌నగర్‌లో భార్య ఇద్దరు పిల్లలతో కలసి నివాసం ఉంటున్న బస్తీ వాసి డీ. లక్ష్మప్ప తాను పడ్డ కష్టం పిల్లలకు రాకూడదానే దృఢ సంకల్పంతో కొడుకు లోకేస్‌ను అతి కష్టమైన చార్టెడ్ అకౌంట్ చదివించాడు. అతడికి ప్రయివేట్ సంస్థల్లో ఎన్నో అవకాశాలు వచ్చిన ఇన్ఫోసిస్‌లో జాయిన్ అవ్వాలని నిర్ణయించుకొని జాయిన్ అయ్యాడు. ప్రేమ్‌నగర్ బస్తీ ప్రధాన కార్యదర్శి కొండ భగవాన్ దాస్ మేయర్‌కి తెలియజేయడంతో ముందుగా లోకేష్ తల్లిదండ్రులను సన్మానించి, విద్యార్థి లోకేష్‌ను శాలువాతో సత్కరించి చదువుతో ఉన్నతమైన స్థానం ఖాయమని అభినందించారు. ఈ కార్యక్రమంలో ప్రేమ్ నగర్ బస్తీ కమిటీ ప్రధాన కార్యదర్శి కె. భగవాన్ దాస్, ప్రవీణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఆలయ వార్షికోత్సవ వేడుకల్లో ఎమ్మెల్యే



నవతెలంగాణ-బంజారాహిల్స్

సోమాజిగూడ డివిజన్ అమీర్‌పేట్‌లోని గణపతి ఆలయంలోని 25వ వార్షికోత్సవ వేడుకలు బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ స్థానిక కార్పొరేటర్ వనం సంగీత శ్రీనివాస్ యాదవ్‌తో కలిసి పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్ర ప్రజలందరూ ఆరాధ్యంగా కొలుచుకొనే ఆదిదేవుడు గణపతి ఆశీస్సులు ఎల్లప్పుడూ ఉండాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో స్థానిక వార్డ్ మెంబర్ నాగరాజు, విజయ్ యాదవ్, హరికృష్ణ, బాషా, ఎన్.గణేష్ తదితరులు పాల్గొన్నారు.

వర్గీకరణ ఉద్యమానికి అండగా కేంద్రమంత్రి



నవతెలంగాణ-ఓయూ

ఎమ్మార్పీఎస్ పోరాటానికి అండగా ఉంటూ నేడు సాధించిన ఎస్సీ రిజర్వేషన్ల విజయంలో రేపు తెలంగాణలో అమలు కాబోతున్న వర్గీకరణ విజయానికి నాంది పునాది కేంద్రమంత్రి కిషన్ రెడ్డి అని మాజీ ఎంఎస్ఎఫ్ జాతీయ అధ్యక్షుడు ఆర్.లింగస్వామి,షెడ్యూల్ క్యాస్ట్ రైట్ ప్రొటెక్షన్ కమిటీ జాతీయ అధ్యక్షుడు ఆర్.నాగేశ్వరరావు అన్నారు. నాగేశ్వరరావు బుధవారం న్యూ ఢిల్లీ, అశోక్ రోడ్డులోని ఆయన నివాసంలో కలిసి సత్కారం చేశారు. అడుగడుగునా తగిలిన అడ్డంకులను అధిగమించే దగ్గర నుండి తెలంగాణ అసెంబ్లీలో బిల్లు పాస్ అయ్యేంతవరకు బీజేపీ ప్రభుత్వం, భారత ప్రధాని నరేంద్ర మోడీ కృషి, సహకారం పట్ల మాదిగ జాతి మరువలేదని అన్నారు.

నగరంపై డీజీ ఆనంద్ ముద్ర

- క్షేత్ర స్థాయి నుంచి పోలీస్ వ్యవస్థ ప్రక్షాళన
- పెండింగ్ బకాయిల విడుదలకు విశేష కృషి

నవతెలంగాణ-సిటీబ్యూరో

రాష్ట్ర రాజధాని హైదరాబాద్‌లో పోలీసింగ్ వ్యవస్థను పటిష్ట పరచడంతో పాటు సిబ్బంది సంక్షేమంపై నగర పోలీస్ కమిషనర్ డీజీ సీవీ ఆనంద్ తనదైన శైలీలో ప్రత్యేక ముద్ర వేశారు. సురక్షితమైన నగరంగా పేరుగాంచిన హైదరాబాద్‌కు మొదటి సారి నగర పోలీస్‌బాస్‌గా బాధ్యతలు చేపట్టిన ఆయన అనేక మార్పులకు నాందిపలికారు. శాంతిభద్రలతోపాటు సిబ్బంది సంక్షేమాన్ని రెండు కండ్లగా చూస్తారు. తప్పుచేసిన వారిపై చర్యలు తీసుకోవడంతోపాటు పోలీస్ శాఖలో అవినీతి నియంత్రణ, మహిళల భద్రతపై ప్రత్యేక చర్యలు తీసుకున్న విషయం తెలిసిందే. సెక్షన్ 107 అధికారంతో అడిషనల్ డిస్ట్రిక్ మెజిస్ట్రే(ఎగ్జిక్యూటివ్) హోదాలో న్యాయమూర్తిగా విచారణ చేశారు. దాంతోపాటు కరుడుగట్టిన నేరస్తులు, రౌడీషీటర్లలో మార్పు తీసుకొచ్చేందుకు పలు చర్యలు చేపట్టారు. 10దేండ్లపాటు ఎలాంటి నేరాలు చేయకుండా సత్‌ప్రవర్తన కలిగిన నేరస్తును గుర్తించి వారిపైవున్న నేరచరిత్రను ఎత్తివేసి వారికి కొత్త జీవితాన్ని కల్పించారు. అంతేకాకుండా పోలీస్ శాఖలో పనిచేస్తున్న వారు 24గంటలపాటు శాంతి భద్రత పర్యవేక్షణలో



నిమగ్నమవుతారని, వారి ఆరోగ్యంపై శ్రద్ధవహించారు. సిబ్బంది సంక్షేమ కోసం ప్రత్యేక చర్యలు తీసుకున్న సీపీ వారు ఆరోగ్యంగా ఉండాలనే ఉద్దేశంతో 'ఫిట్ క్యాప్'యాప్‌ను ప్రారంభించిన విషయం తెలిసిందే.

> శాంతిభద్రలతోపాటు ..
> సిబ్బంది సంక్షేమాన్ని రెండు కండ్లగా చూస్తారు.
> తప్పుచేసిన వారిపై చర్యలు తీసుకోవడంతోపాటు
> పోలీస్ శాఖలో అవినీతి నియంత్రణ, మహిళల భద్రతపై
> ప్రత్యేక చర్యలు తీసుకున్న

ఒక పక్క నేరాల నియంత్రణ... సిబ్బంది సాధకబాధకలపై దృష్టి

డీజీ సీవీ ఆనంద్ రెండోసారి నగరబాస్‌గా బాధ్యతల చేపట్టేనాటికి నగర పోలీసు వ్యవస్థ ఆందోళన కరపరిస్తితిలో ఉంది. నగరంలో నడీరోడ్లపై వరస హత్యలతో నగరవాసులు భయాందోళనకు గురయ్యారు. ఒక పక్క నేరాలు పెరగడం, మరో పక్క సిబ్బంది నిరాస నిస్పహలకు గురై ఉన్నారు. ఉన్నతాధికారులు తమ గోడును పట్టించుకునే పరిస్థితిలో లేరనే బావనతో నగర కమిషనరేట్‌లోని పోలీస్ సిబ్బంది ఎంతో ఆవేదనతో ఉన్నారు. ఆ సమయంలో బాధ్యతలు తీసుకున్న డీజీ సీవీ ఆనంద్ క్షేత స్థాయి నుంచి పోలీస్ వ్యవస్థను ప్రక్షాళన చేస్తూ వచ్చారు. ఒక పక్క నేరాలు నివారించడం, శాంతి భద్రతలను పటిష్టం చేయడంలో తన ముద్ర వేస్తూ, సిబ్బంది సంక్షేమ, వారి ఆరోగ్యం విషయంలో పలు కీలక నిర్ణయాలు తీసుకున్నారు. ఉదయం 8 గంటలకే పోలీస్‌స్టేషన్‌కు వచ్చి రాత్రి 10 గంటల వరకు విధులలో ఉండే పరిస్థితితో ఇబ్బందులు ఎదుర్కొంటున్న క్షేత్ర స్థాయి సిబ్బంది యొక్క సాధక బాధలు తెలుసుకున్నారు. సిబ్బంది ప్రశాంతంగా ఉన్నప్పుడే శాంతి భద్రతలు పటిష్టంగా ఉంటాయని ఆయన బలంగా నమ్మారు. సిబ్బందికి పెండింగ్‌లో ఉండే వివిధ రకాల బకాయిలను విడుదల చేయడం, క్షేత్ర స్థాయిలో ఆయా పరిస్థితులను బట్టి సిబ్బంది వేళ పాల పాటించేలా ఆయా అధికారులు చూసుకోవడం, సిబ్బంది ఆరోగ్యం విషయంలో జాగ్రత్తలు తీసుకోవడం, క్షేత్ర స్థాయిలో పనిచేసే సిబ్బందితో ఆయా ఠాణాల అధికారులు, ఆపై అధికారులు మర్యాదపూర్వకంగా, స్నేహభావంతో పనిచేయించుకునేలా వాతావారణాన్ని కల్పించారు. ఇలా ఠాణాలలో ఖర్చుల కోసం ప్రభుత్వం అందించే నెలవారి రూ. 75 వేలు పెండింగ్‌లో ఉండడంతో వాటిని విడుదల చేయించారు. సిబ్బంది సంక్షేమమే ధ్యేయంగా పలు చర్యలు చేపట్టడంతో హైదరాబాద్ పోలీసింగ్ అంతా అలర్ట్‌గా ఉంటున్నారు.

మా బాస్ సూపర్



❑ హైదరాబాద్ పోలీసు అధికారుల సంఘం అధ్యక్షుడు, ఎన్.శంకర్‌రెడ్డి

బాస్‌లు సిబ్బంది యోగక్షేమాలు పట్టించుకున్నప్పుడు ప్రతి ఒక్కరూ లక్ష్యం దిశగా పనిచేస్తారు. హైదరాబాద్ పోలీస్ కమిషనర్ ఇక్కడ పనిచేసేవారంతా నా పోలీసు కుటుంబ సభ్యులే అనే విధంగా వారి సంక్షేమ గూర్చి ఎప్పుడు ఆలోచిస్తుంటారు. దీంతో కమిషనరేట్ పరిధిలో పనిచేసే పోలీసు అధికారులు, సిబ్బంది తమ విధులను సంతోషంగా నిర్వహిస్తూ, హైదరాబాద్‌లో శాంతి భద్రతలు పటిష్టంగా ఉండేవిధంగా పనిచేస్తున్నారు. ముఖ్యంగా నేరాల నివారణ కోసం నిరంతరం పెట్రోలింగ్ చేస్తూ బాధ్యతగా ప్రతి ఒక్కరు విధులను నిర్వహిస్తున్నారు. ఇలా హైదరాబాద్ పోలీస్ బాస్ హైదరాబాద్‌ను సురక్షితమైన నగరంగా తీర్చిదిద్దుతూ, పోలీసుల యోగ క్షేమాలను ఎప్పటికప్పుడు మా బాస్ తెలుసుకుంటుంటారు. సిబ్బందితోపాటు పోలీస్ కుటుంబసభ్యులు ఆరోగ్యంగా ఉండేవిధంగా హెల్త్ చెకప్‌లు, యాప్‌ను అందుబాటులోకి తీసుకొచ్చారు. పోలీస్ ఇండ్లలో సైతం ప్రశాంత వాతావరణం తీసుకొచ్చే విధంగా సంక్షేమ కార్యక్రమాలు చేపట్టారు. మా బాస్ సూపర్ అని హైదరాబాద్ పోలీస్ అధికారుల సంఘం అధ్యక్షులు ఎన్.శంకర్‌రెడ్డి అభిప్రాయపడ్డారు.

సమస్యలను పరిష్కరించేలా చర్యలు



● ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్

నవతెలంగాణ-బేగంపేట్

కళాసిగూడలో నెలకొన్న సమస్యలను పరిష్కరించేలా చర్యలు తీసుకుంటామని మాజీమంత్రి, సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ చెప్పారు. బుధవారం బేగంపేట డివిజన్ పరిధిలోని కళాసిగూడలోని మినర్వ కాంప్లెక్స్ డౌన్‌లో వివిధ శాఖల అధికారులతో కలిసి పర్యటించి స్థానిక ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ప్రధానంగా పారిశుధ్య నిర్వహణ సక్రమంగా లేదని, కలుషిత త్రాగునీటి సరఫరా జరుగుతుందని స్థానికులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకొచ్చారు. అదేవిధంగా డ్రయినేజీ ఓవర్ ఫ్లో జరిగి మురు గునీరు రోడ్లపై ప్రవహించి ఇబ్బందులు పడుతున్నట్టు వివరించారు. స్పందించిన ఎమ్మెల్యే త్రాగునీటి పైప్‌లైన్ ఎక్కడ లీకేజీ ఉందో గుర్తించి కలుషిత నీటి సరఫరాను నియంత్రించాలని సంబంధిత అధికారులను ఆదేశిం చారు. అదేవిధంగా డ్రయినేజీ ఓవర్ ఫ్లో సమస్య పరిష్కారానికి వెంటనే చర్యలు తీసుకోవాలని చెప్పారు. స్ట్రీట్ లైట్‌లు లేవని, రోడ్డు నిర్మాణం చేపట్టా లని కోరగా, వెంటనే స్ట్రీట్ లైట్‌ల ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని ఆదేశిం చారు. రోడ్డు నిర్మాణం కోసం ప్రతిపాదనలు అందజేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో డీసీ సమ్మయ్య, కార్పొరేటర్ టి.మహేశ్వరి, వాటర్ వర్క్స్ డీజీఎం శశాంక్, ఈఈ సుబ్రహ్మణ్యం, టౌన్ ప్లానింగ్ అధికారి సుష్మిత, మాజీ కార్పొరేటర్ అత్తిలి మల్లిఖార్జున్ గౌడ్, బస్తీ వాసులు ప్రమోద్, నర్సింగ్, బీజేపీ పార్టీ రాంగోపాల్ పేట డివిజన్ అధ్యక్షుడు అత్తిలి శ్రీనివాస్ గౌడ్, నాయకులు శ్రీహరి, నరేందర్, శేఖర్, కిషోర్, ఆంజనేయులు, ఆరీఫ్ తదితరులు పాల్గొన్నారు.

సీఎంను విమర్శించే నైతికత కేటీఆర్‌కు లేదు

● ప్రజా సంఘాల జేఏసీ చైర్మెన్ గజ్జల కాంతం



నవతెలంగాణ-బంజారాహిల్స్

సీఎం రేవంత్ రెడ్డిని విమర్శించే నైతికత కేటీఆర్, హరీష్, కవిత రావులకు లేదని ప్రజాసంఘాల జేఏసీ చైర్మెన్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు గజ్జల కాంతం అన్నారు. బంజారాహిల్స్‌లోని ఓ హోటల్లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో బీఆర్ఎస్ నాయకుల తీరుపై తీవ్రస్థాయిలో విమర్శలు చేశారు. కేటీఆర్ బీసీల గురించి మాట్లాడడం సిగ్గుచేటని అన్నారు. ఏండ్ల తరబడి సాగిన వర్గీకరణ పోరాటానికి తెరదించింది ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సర్కారు అన్నారు. ప్రజా రంజకమైన పాలన అందిస్తున్న ముఖ్యమంత్రిని విమర్శిస్తారా మీ స్థాయి ఏమిటని నిలదీశారు. బీఆర్ఎస్ హయాంలో ప్రాజెక్టుల పేర్లతో ప్రతి పనిలో కమిషన్లు తీసుకున్నారని మండిపడారు. మిగులు రాష్ట్రంగా ఏర్పడ్డ తెలంగాణను అప్పుల ఊబిలోకి నెట్టిన ఘనత మీదేనని అన్నారు. 7లక్షల కోట్లు అప్పులు చేసి 3 లక్షల కోట్లు నొక్కేశారని ఆరోపించారు. శాంతిభద్రతలు విఘాతం కలగకుండా రాజ్యాంగానికి లోబడి పరిపాలించాల్సింది పోయి ఫోన్ టాపరింగ్లు చేసిన బీఆర్ఎస్ గత ప్రభుత్వానికి బీజేపీ ప్రభుత్వం మద్దతు ఇస్తుందని అన్నారు. స్థానిక ఎన్నికల్లో ఓటమి తప్పదని పట్టబద్రుల ఎన్నికల్లో మీ సత్తా ఏందో చూపించాలన్నారు. అభ్యర్థిని ఎందుకు ఖరారు చేయలేదు ఎవరికి మద్దతు ఇవ్వడానికి ఆ నిర్ణయం తీసుకున్నారో ప్రజలకు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. అనవసరపు ఆరోపణలతో ప్రజలను రెచ్చగొడితే తగిన విధంగా బుద్ధి చెప్తామని హెచ్చరించారు.

విద్యార్థులకు మానసిక నిపుణులచే కౌన్సిలింగ్ ఇవ్వాలి

● బీసీ నేత లింగంగౌడ్

నవతెలంగాణ-ఓయూ



మార్చి 5 నుంచి ఇంటర్మీడియట్ పరీక్షలు ప్రారంభమవుతున్న నేపథ్యంలో విద్యార్థులలో కలిగే భయాన్ని పోగొట్టేందుకు రాష్ట్రవ్యాప్తంగా ఇంటర్మీడియట్ పరీక్షలు అయిపోయేంత వరకు మానసిక నిపుణులచే కౌన్సిలింగ్ ఇప్పించి వారిలో ఉన్న బయోందోళనలు పోగొట్టాలని కోరుతూ నాంపల్లి లోని ఇంటర్మీడియట్ బోర్డు కార్యాలయంలో ఇంటర్మీడియట్ కంట్రోల్ ఆఫ్ ఎగ్జామినేషన్ జయప్రద విజ్ఞప్తి చేసినట్టు బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి జాజుల లింగంగౌడ్ తెలిపారు. ఈ సందర్భంగా జాజుల మాట్లాడుతూ.. పరీక్షలు దగ్గర పడుతున్న కొద్ది విద్యార్థుల్లో ఒత్తిడి పెరిగి భయంతో మానసికంగా కృంగిపోయే అవకాశం ఉందని, విద్యార్థులో ఆత్మనూన్యత భావం ఎక్కువగా ఉంటుందని కొంతమంది బయటకు చెప్పుకోలేక తమలో తామే కృంగిపోతారని వారికి మానసిక నిపుణులు, సైకాలజిస్టులచే కౌన్సిలింగ్ ఇప్పించాలని కోరారు. యోగా, మెడిటేషన్ తరగతుల వంటివి కూడా నిర్వహించాలన్నారు. తెలంగాణ విద్యార్థి యువజన యువజన పరిషత్ స్టేట్ ప్రెసిడెంట్ బూర శ్రీనివాస్, ఓయూ జేఏసీ ప్రెసిడెంట్ బండి నరేష్, మాల విద్యార్థి సంఘం స్టేట్ ప్రెసిడెంట్ చంద్ర మోహన్ రాయ్, బీసీ విద్యార్థి సంఘం రాష్ట్ర నాయకులు గోదా రవీంద్ర పాల్గొన్నారు.

మహార్ కులస్తులను ప్రత్యేక గ్రూప్‌లో పెట్టాలి

● మందకృష్ణ మాదిగ



నవతెలంగాణ-బంజారాహిల్స్

వెనకబడ్డ వారిని ముందు వరుసలో ఉన్న మాలల గ్రూప్‌లో ఉంచుతారని, తమని ప్రత్యేక గ్రూప్‌లో రిజర్వేషన్లు ఇవ్వాలని మహార్ కులస్తుల పక్షాన ప్రభుత్వాన్ని మందకృష్ణ మాదిగ డిమాండ్ చేశారు. బుధవారం సోమాజిగూడ ప్రెస్ క్లబ్‌లో మహార్ కులస్తుల సమావేశం నారాయణ దగ్గి నేతృత్వంలో జరిగింది. ఈ కార్యక్రమాన్ని మాజీ ఎంపీ బొర్లకుంట వెంకటేష్ నేత సమన్వయ కర్తగా వ్యవహరించాగా ముఖ్య అతిథిగా మందకృష్ణ మాదిగ వారితో కలిసి మాట్లాడారు.. దళితుల్లో ఏ సామాజిక స్పృహతో ఆలోచించిన 59 ఉపకులాల్లో మలాల కన్నా ఎక్కువ స్థాయిలో అభివృద్ధి చెందిన వారు ఎవరు లేరని అటువంటి జాబితాలో మహార్ కులస్తులను వర్గీకరణలో చేర్చడం రాజకీయ పలుకుబడి ఉపయోగించి బలవంతంగా ఉంచడం సమంజసం కాదన్నారు. మాహార్ కులస్తులకు అండగా నిలబడతానని న్యాయం జరిగేంత వరకు పోరాటం చేద్దామని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సయ్యద్ ఇస్మాయిల్, తెలంగాణ విఠల్,మరియు మహార్ కుల ప్రతినిధులు పాల్గొన్నారు.

ఓయూలో గంజాయి కలకలం

● గంజాయి సేవిస్తున్న వ్యక్తుల అరెస్ట్



నవతెలంగాణ-ఓయూ

ఉస్మానియా విశ్వవిద్యాలయం, ఇంజినీరింగ్ కళాశాల వెనుక ఉన్న సెల్ట్ కార్యాలయం వద్ద బుధవారం సాయంత్రం గంజాయి సేవిస్తున్న నలుగురు యువకులను (ఔటర్స్) టాస్క్‌ఫోర్సు పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఇంత జరుగుతున్న ఉస్మానియా విశ్వవిద్యాలయం సెక్యూరిటీకి ఈ విషయం తెలియక పోవడం శోచనీయం. ఉస్మానియా విశ్వవిద్యాలయం పరిధిలో పలు ఆటవిక ప్రాంతాలతో పాటుగా బహిరంగంగా ఐదు చోట్ల ఇలా ఔటర్స్ విద్యార్థులు వచ్చి గంజాయి, డ్రగ్స్ సేవిస్తున్నట్టు విద్యార్థులు ఆరోపిస్తున్నారు. 107 ఏండ్ల తులసి మొక్క లాంటి ఓయూలో ఇలా గంజాయి, డ్రగ్స్ సేవించడం యూనివర్సిటీ ప్రతిష్టాత్మక కాస్త ఇబ్బందిగా మారిందని విద్యార్థులు వాపోతున్నారు. మరొక వైపు ఔటర్స్ ఖరీదైన కార్లలో వస్తూ అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడ్డారని విద్యార్థులు ఆరోపిస్తున్నారు. కొందరు విద్యార్థులు వీరిని నియంత్రణ చేసేందుకు ప్రయత్నాలు చేస్తున్న విద్యార్థులకు పలు సాకులు చెప్పి కప్పి పచ్చు కుంటున్నారు. వీరిపై చర్యలు చేపట్టాలని విద్యార్థులు కోరుతున్నారు. ఓయూ సెక్యూరిటీ ఉన్న జరగాల్సిన అసాంఘిక కార్యకలాపాలు తరచుగా జరుగుతున్నట్టు విద్యార్థులు, ఉద్యోగులు ఆరోపిస్తున్నారు.

తీసుకోని రుణానికి ఇల్లు ఖాళీ చేయమంటున్నారు

● అబ్రార్‌నగర్‌కు చెందిన ఓ కుటుంబం ఆవేదన



నవతెలంగాణ-కంటోన్మెంట్

తీసుకోని రుణాన్ని చెల్లించాలని, లేకపోతే ఇల్లు ఖాళీ చేయాలని, భూకబ్జాదారు అడ్వకేట్ కమిషన్‌తో కుమ్మక్కయి తమని ఆందోళనకు గురిచేస్తూ.. బెదిరిస్తున్నారని ఓ కుటుంబం బుధవారం మీడియాతో తమ గోడు వెలబుచ్చారు. ఓల్డ్ బోయిన్‌పల్లిలోని హస్మత్‌పేట్, అబ్రార్‌నగర్‌కు చెందిన మీర్జా అనే ఓ తల్లి యాక్సిస్ బ్యాంకులో ఎలాంటి లోను తీసుకోలేదని తమ కుటుంబ సభ్యులు ఎవరు ఆ బ్యాంకుకి ఎప్పుడు వెళ్లలేదన్నారు. కాని కొంతమంది దుండగులు.. లోను పొందామని ఆ లోను చెల్లించాలని అడ్వకేట్ కమిషన్ ద్వారా వచ్చి తమని వీధిపాలు చేయాలని చూస్తున్నారని వారు పోలీసులకు, మీడియాకు మొరపెట్టుకుంటున్నారు. ఆ రుణానికి తమకు ఎలాంటి సంబంధం లేదని మా కుటుంబ సభ్యులు ఎవరు ఆ లోన్ తీసుకోలేదని, తీసుకోని లోను ఎలా కడతారన్నారు. కొందరు దొంగ డాక్యుమెంట్స్ సృష్టించి తమ ఇంటిపై లోన్ తీసుకున్నారని, అన్నారు. తమకి న్యాయం చేయాలని కుటుంబ సభ్యులు ఆవేదన వ్యక్తం చేస్తు పోలీసులకు విజ్ఞప్తి చేశారు.

తెలంగాణకు విద్యాశాఖ మంత్రిని నియమించేదెప్పుడు

● విద్యారంగాన్ని గాలికి వదిలేసిన కాంగ్రెస్ ● పీడీఎస్‌యూ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు కాంపాటి పృథ్వీ, ఎస్. అనిల్

నవతెలంగాణ-ఓయూ

తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి సుమారు రెండేండ్లు గడుస్తున్నప్పటికీ విద్యారంగానికి కనీసం ఓ ప్రత్యేక శాఖను నియమించకుండా జాప్యం చేస్తూ విద్యారంగాన్ని గాలికి వదిలేసి కేసీఆర్ అడుగుజాడల్లోనే రేవంత్ రెడ్డి ప్రయాణం చేస్తున్నాడని పీడీఎస్‌యూ రాష్ట్ర అధ్యక్ష కార్యదర్శులు కాంపాటి పృథ్వీ సాయి బోలా అనిల్ కాంగ్రెస్ ప్రభుత్వాన్ని విమర్శించారు. బుధవారం ఓయూలో పీడీఎస్‌యూ రాష్ట్ర కమిటీ పిలుపులో భాగంగా విద్యార్థుల సమావేశంలో అన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. రాష్ట్రంలో విద్యారంగం పరిస్థితి అస్తవ్యస్తంగా మారిపోయిందని ఎటువంటి పట్టింపులు లేకుండా కాంగ్రెస్ ప్రభుత్వం నామమాత్రంగా వ్యవహరిస్తూ చేతులు దులుపుకుంటున్నదని వారు కాంగ్రెస్ ప్రభుత్వంపై ధ్వజమెత్తారు. ఒకపక్క గురుకుల విద్యాలయాలలో ఫుడ్ పాయిజన్‌తో విద్యార్థులు మరణిస్తుంటే మరోపక్క ప్రభుత్వ విద్యాసంస్థలన్నింటిలో అర కొర సౌకర్యాలు, అధ్యాపకుల లేమి, మంచినీరు సమస్య, సరిపోనీ



తరగతి గదులు, శిథిలావస్థలో బిల్డింగులు, అధ్య భవనాల్లో విద్యాసంస్థల నిర్వహణ లాంటి లోపాలతో ప్రభుత్వ విద్యాసంస్థలు కొట్టుమిట్టాడుతుంటే ప్రభుత్వ విద్యారంగం అభివృద్ధికి ప్రభుత్వ చేయూత ఏమాత్రం లేదని వారు ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటివరకు రాష్ట్ర ప్రభుత్వం విద్యారంగానికి కేటాయించిన బడ్జెట్ విద్యాసంస్థల నిర్వహణకు ఉద్యోగుల జీతపత్యాలకు కూడా సరిపోని స్థితి ఉన్నదని ఈ సందర్భంలో విద్యా ఏడాది ప్రారంభం కాగానే కొత్త సీసాలో పాత సార చందంగా విద్యార్థులకు పాత సమస్యలు పరిష్కారం కాకపోగా కొత్త సమస్యలు తోడై స్వాగతం పలుకుతున్నాయని అన్నారు. అంతేకాకుండా ఏండ్ల తరబడి స్కాలర్‌షిప్స్ ఫీజు రీయింబర్‌మెంట్ పథకాన్ని అమలు చేయకుండా వేల కోట్ల రూపాయలను పెండింగ్‌లో ఉంచి విద్యార్థులకు మొండి చేయి చూపిస్తున్నారని పేర్కొన్నారు. విద్యారంగంలో కొంతమేరకైనా సమస్యలు పరిష్కరం అవ్వలంటే కొఠారి కమిషన్ సూచించిన మేరకు రాష్ట్ర బడ్జెట్లో 30శాతం నిధులు కేటాయించి కాంగ్రెస్ ప్రభుత్వం విద్యారంగం పట్ల చిత్తశుద్ధి చాటుకోవాలని వారి డిమాండ్ చేశారు. విశ్వవిద్యాలయాల స్వయం ప్రతిపత్తిని దెబ్బతీసే విధంగా కేంద్ర ప్రభుత్వం విశ్వవిద్యాలయాల నూతన ముసాయిదాను ప్రవేశపెట్టి వీసీల నియామకంలో రాష్ట్ర ప్రభుత్వానికి ఎటువంటి అధికారాలు లేకుండా కేంద్ర ప్రభుత్వానికి అనుకూలంగా వ్యవహరించే వ్యక్తులను వైస్ ఛాన్సలర్‌గా నియమించి విశ్వవిద్యాలయాలలో హిందుత్వ ఆధిపత్యాన్ని పెంచుకునేందుకు కుట్రలో భాగంగానే నూతన ముసాయిదాను తీసుకొచ్చిందని దీనిని రాష్ట్ర ప్రభుత్వం ఖండించి చేతులు దులుపుకోవడం కాకుండా అడ్డుకోవాలని వారు సూచించారు. ఈ కార్యక్రమంలో పీడీఎస్‌యూ రాష్ట్ర ఉపాధ్యక్షులు నరేందర్, రాష్ట్ర నాయకులు హరీష్, దీక్షిత, గుమ్మడి చైతన్య, శాంతా, భరత్, శివ, హరికృష్ణ పాల్గొన్నారు.

బర్డ్ ఫ్లూకి భయపడి చికెన్, గుడ్లు తినటం మానకండి

● ఇంటర్నేషనల్ ఎగ్ కమిషన్ చైర్మెన్ సురేష్ చిట్టూరి



నవతెలంగాణ-జూబ్లీహిల్స్

బర్డ్ ఫ్లూకు భయపడి చికెన్, గుడ్లు తినటం మానివేయవద్దని ఇంటర్నేషనల్ ఎగ్ కమిషన్ చైర్మెన్ సురేష్ చిట్టూరి అన్నారు. బుధవారం జూబ్లీహిల్స్ రోడ్ నెంబర్ 36లోని తన నివాసములో మీడియాతో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడురు. ఇది కొత్త వ్యాధి కాదు 2006 నుంచి ఇండియాలో ఉంది, హెచ్ 5 అనేది చాలా చిన్న వైరస్. చికెన్ కానీ గుడ్లు అయినా మనము ఉడికించగానే వైరస్ చనిపోతుంది. అందువలన మన ఇండియాలో ప్రతి ఒక్కరూ ఎలాంటి భయం లేకుండా చికెన్, గుడ్లు ఆహారంగా తీసుకోవాలని కోరుతున్నారు. ఒకవేళ చికెన్ తిని గుడ్లు తిని ఎవరికైనా బర్డ్ ఫ్లూ వ్యాధి వచ్చిందని, ఏ డాక్టర్ అయినా రుజువు చేస్తే బాధితునికి 10 లక్షలు ఆర్థిక సహాయం చేస్తానని, బహిరంగంగా మీడియాతో మాట్లాడుతూ ఛాలెంజ్ చేశారు. అయితే ప్రభుత్వం ఒక కోడి నుండి మరొక కోడికి రోగం రాకుండా ముందు జాగ్రత్తలు తీసుకుంటుందని, దానివలన ఎక్కువ కోళ్లు మరణించకుండా అరికట్టవచ్చని అన్నారు. ఇలాంటి ప్రచారాల వలన చిన్న చిన్న హేచరీస్ నడుపుకునేవారు పూర్తిగా నష్టపోతారని, పెద్ద వ్యాపారస్తులు కొన్ని రోజులు నష్టం వచ్చిన, తిరిగి రేట్లు పెంచి అమ్ముకుంటారని, ఇలాంటి ప్రచారాలు పెద్ద హేచరీస్ నడిపే వారికి ఉపయోగంగా ఉంటుందని, చిన్న హేచరీస్ నడిపే వారికి నష్టం వస్తుందని అన్నారు.

అందువలన ప్రతి ఒక్కరూ ఎలాంటి భయము లేకుండా చికెన్, గుడ్లు తినవచ్చని హామీ ఇచ్చారు. మా నాన్నగారు 93 ఏండ్లు రోజు మూడు ఉడకబెట్టిన గుడ్లు తింటాడని, మా పాప రోజు రెండు గుడ్లు తింటుందని, నాకు 65 ఏండ్లు నేను ప్రతిరోజు నాలుగు గుడ్లు తింటున్నామని, మాకు ఎలాంటి రోగాలు రాలేదని తెలిపారు. కోడిగుడ్లు తక్కువ రేట్‌లో దొరుకుతుందని, మనుషులను ఆరోగ్యం వంతులుగా ఉంచుతుందని, 90 శాతం పేదవారు కోడిగుడ్లు తిని ఆరోగ్యంగా ఉంటున్నారని సర్వేలు తెలిపాయని అన్నారు.



ఆరోగ్యవంతమైన ఆహారం తీసుకోవాలని అందరికీ ఉంటుంది. మరీ ముఖ్యంగా పిల్లల ఎదుగుదలకు పోషకాలతో కూడిన ఆహారం చాలా అవసరం. అయితే వాళ్లకు కంటికి ఇంపుగా, నోటికి రుచిగా ఉంటేనే తింటారు. లేదంటే తిండంటేనే మారాం చేస్తారు. అందుకు వాళ్ల కోసం కాస్త ప్రత్యేకంగా, ఆరోగ్యవంతమైన ఆహారం ఏం పెట్టాలా అని తల్లిదండ్రులు ఆలోచిస్తుంటారు. అలాంటి వారు వీటిని ట్రై చేయవచ్చు. పిల్లలు ఎంచక్కా మారాం చేయకుండా ఈ పోషకాల ఆహారాన్ని తినేస్తారు.

మారాం చేయకుండా తినాలంటే..?

పల్లీ అటుకుల లడ్డు

కావాల్సిన పదార్థాలు: పల్లీలు - 1 కప్పు, అటుకులు - అర కప్పు, నువ్వులు - అర కప్పు, సన్నగా తురిమిన బెల్లం - 1 కప్పు, యాలకుల పొడి - 1 టీస్పూన్

తయారీ విధానం: ఇందుకోసం ముందుగా స్టౌపై ఇనుప కడాయి పెట్టుకొని పల్లీలను వేసి లో ఫ్లేమ్ మీద బాగా వేయించుకోవాలి. తర్వాత వాటిని ఒక



ప్లేట్‌లోకి తీసుకొని పక్కన ఉంచుకోవాలి. ఇప్పుడు అదే కడాయిలో మందపాటి అటుకులు వేసి వీటిని కూడా లో ఫ్లేమ్ మీదనే కాస్త క్రిస్పీగా అయ్యేంత వరకు వేయించుకొని పక్కకు తీసుకోవాలి. ఆ తర్వాత నువ్వులు వేసుకొని వాటిలో ఒక టేబుల్ స్పూన్ నీళ్లు చల్లుకొని కలుపుతూ లో ఫ్లేమ్ మీద వేయించుకోవాలి. ఇలా వేయించుకుంటేనే నువ్వులు గుల్లగా, చక్కగా వేగుతాయి. వేయించుకున్నాక వాటిని ఒక ప్లేట్‌లోకి తీసుకొని పక్కన పెట్టుకోవాలి. అయితే వేయించుకున్న ఇంగ్రీడియంట్స్ అన్నీ చల్లారిన తర్వాతనే మిక్సీ పట్టుకోవాలి. అయితే లడ్డూల రుచి మీరు పదార్థాలను వేయించుకునే తీరుని బట్టే ఉంటుందని గుర్తుంచుకోవాలి. ఇప్పుడు మిక్సీ జార్ తీసుకొని అందులో వేయించుకున్న అటుకులు వేసి మెత్తని పొడిలా గ్రైండ్ చేసుకొని పక్కన ఉంచుకోవాలి. మరో మిక్సీ జార్ తీసుకొని ముందుగా వేయించి పొట్టు తీసుకున్న పల్లీలను వేసి కాస్త బరకగా గ్రైండ్ చేసుకోవాలి. ఆ తర్వాత అందులో వేయించిన నువ్వులను వేసి మిక్సీ పట్టుకోవాలి. అదే మిశ్రమంలో సన్నగా తురుమిన బెల్లం వేసుకొని మరోసారి మెత్తగా గ్రైండ్ చేసుకోవాలి. ఇప్పుడు ఒక మిక్సింగ్ బౌల్ తీసుకొని అందులో మిక్సీ పట్టుకున్న బెల్లం మిశ్రమం, అటుకుల పొడి వేసి బాగా కలుపుకోవాలి. ఆపై యాలకుల పొడి కూడా వేసుకొని మొత్తం కలిసేలా గట్టిగా చేసుకోవాలి. ఆ మిశ్రమాన్ని కొద్దికొద్దిగా తీసుకుంటూ చేతితో గట్టిగా లడ్డూ మాదిరిగా చుట్టుకోవాలి. ఒకవేళ ఎంత ట్రై చేసినా లడ్డూలు రానట్లయితే చేతులను కొద్దిగా తడిచేసుకుంటూ లడ్డూలను చుట్టుకోండి పర్ఫెక్ట్‌గా వస్తాయి. అంతే.. ఎంతో టేస్టీగా ఉండే 'పల్లీ అటుకుల లడ్డూలు' రెడీ! వీటిని గాలి చొరబడని డబ్బాలో స్టోర్ చేసుకుంటే కనీసం 10 నుంచి 15 రోజుల పాటు నిల్వ ఉంటాయి.

రాగి ఉప్మా

కావాల్సిన పదార్థాలు: ఒక కప్పు రాగి పిండి, 2 టేబుల్ స్పూన్ల నూనె, ఒక టీ స్పూన్ శనగపప్పు, ఒక టీ స్పూన్ మినపప్పు, ఒక టేబుల్ స్పూను పల్లీలు, అర టీ స్పూన్ ఆవాలు, అర టీ స్పూన్ జీలకర్ర, చిటికెడు ఇంగువ, 2 రెబ్బల కరివేపాకులు, కొద్దిగా తరిగిన అల్లం, ఒక ఉల్లిపాయ తరుగు, 6 పచ్చిమిర్చి, పావు టీ స్పూన్ పసుపు, ఒక టీ స్పూన్ ఉప్పు, అర కప్పు తురిమిన పచ్చికొబ్బరి, ఒక టీ స్పూన్ నెయ్యి.

తయారీ విధానం: ముందుగా ఓ గిన్నెలో రాగి పిండి తీసుకొని కొద్దిగా నీళ్లు పోసి మరీ చపాతీ పిండిలా కాకుండా కలిపి పక్కనపెట్టుకోవాలి. తర్వాత



ఓ స్టీమ్ ప్లేట్‌ను నూనెతో రాసి రాగి పిండి మిశ్రమాన్ని సమానంగా పరుచుకోవాలి. ఇప్పుడు స్టౌ ఆన్ చేసి స్టీమర్‌లో (ఇడ్లీ పాత్ర లాంటిది) నీళ్లు పోసుకుని స్టీమ్ ప్లేట్‌ను అందులో పెట్టి పది నిముషాలు రాగి పిండిని ఆవిరిపై ఉడికించుకోవాలి. పది నిమిషాల తర్వాత స్టీమర్ దించేసి రాగిపిండి మిశ్రమాన్ని గిన్నెలోకి తీసుకొని పక్కనపెట్టుకోవాలి. ఇప్పుడు ఓ కడాయిని స్టౌపై పెట్టి నూనె పోసి వేడి చేసుకుని శనగపప్పు, మినపప్పు, పల్లీలు వేసి వేయించుకోవాలి. పప్పులు కాస్త రంగు మారిన తర్వాత ఆవాలు, జీలకర్ర, ఇంగువా, కరివేపాకు, సన్నగా తరిగిన చిన్న అల్లం ముక్క వేసి వేయించుకోవాలి. ఇవి వేగాక ఉల్లి తరుగు, పచ్చిమిర్చి వేసి వేయించుకోవాలి. ఉల్లిగడ్డ కాస్త మగ్గిన తర్వాత పసుపు, ఉప్పు వేసి కలపాలి. తర్వాత తురిమిన పచ్చికొబ్బరి వేసి కలుపుకోవాలి. ఇప్పుడు ముందుగా ఉడికించుకున్న రాగి పిండి మిశ్రమం వేసి రెండు నిమిషాలు కలిపి దించేసుకుంటే ఎంతో టేస్టీ అండ్ సింపుల్ రాగి ఉప్మా రెడీ!

మిల్లెట్స్ లడ్డు

కావాల్సిన పదార్థాలు: ఒక కప్పు కొర్రలు, ఒక కప్పు రాగులు, ఒక కప్పు సజ్జలు, ఒక కప్పు అరికలు, ఒక కప్పు సామలు, ఒక కప్పు పెసరపప్పు, ఒక కప్పు బార్లీ, ఆరు కప్పుల తురిమిన బెల్లం, కొద్దిగా యాలకుల పొడి, వేయించడానికి సరిపడా నెయ్యి, పావుకప్పు జీడిపప్పు.

తయారీ విధానం: ముందుగా స్టౌ ఆన్ చేసి ప్యాన్ పెట్టి అందులో నెయ్యి వేడి చేసి జీడిపప్పును దోరగా వేయించుకుని పక్కకు పెట్టుకోవాలి. ఇప్పుడు మరో ప్యాన్‌లో కొర్రలు, రాగులు, సజ్జలు, అరికలు, సామలు, పెసరపప్పు, బార్లీలను ఒకదాని తర్వాత ఒకటి విడివిడిగా వేయించుకొని చల్లార్చి పక్కకు పెట్టాలి. ఆ తర్వాత వీటన్నింటినీ కలిపి మిక్సీలో వేసి మెత్తటి పొడిలా గ్రైండ్ చేసుకోవాలి. ఇందులోనే తురిమిన బెల్లం కూడా వేసి మళ్లీ గ్రైండ్ చేసుకోవాలి. ఇప్పుడు ఈ మిశ్రమాన్ని ఒక వెడల్పాటి గిన్నెలోకి తీసుకొని..



అందులో వేయించిన జీడిపప్పు, కరిగించిన నెయ్యి, యాలకుల పొడి వేసి బాగా కలపాలి. అనంతరం అరచేతులకు నెయ్యి రాసుకుంటూ ఈ మిశ్రమాన్ని లడ్డూలా చుట్టుకోవాలి. ఇలా తయారైన లడ్డూలను గాలి చొరబడని డబ్బాలో నిల్వ చేసుకుంటే సుమారు 2-3 వారాల పాటు నిల్వ ఉంటాయి.

మిల్లెట్ నూడుల్స్

కావాల్సిన పదార్థాలు: జొన్న పిండి - 75 గ్రాములు(అర కప్పు), పెసరపప్పు పిండి - 30 గ్రాములు, ఉప్పు - రుచికి సరిపడా, నూనె - తగినంత, సన్నని వెల్లుల్లి తరుగు - 1 టీస్పూన్, సన్నని క్యాప్సికం ముక్కలు - 30 గ్రాములు, ఉల్లి తరుగు - 30 గ్రాములు, క్యాబేజీ తరుగు - 50 గ్రాములు, క్యారెట్ తరుగు - 50 గ్రాములు, బీన్స్ తరుగు - 50 గ్రాములు, మిరియాల పొడి - రుచికి సరిపడా, మసాలా పొడి - కొద్దిగా, సోయా సాస్ - పావుటీస్పూన్, స్ప్రింగ్ ఆనియన్స్ తరుగు - కొద్దిగా.

తయారీ విధానం: ముందుగా ఒక మిక్సింగ్ బౌల్‌లో జొన్నపిండి, పెసర పిండి వేసుకొని చక్కగా మిక్స్ చేసుకోవాలి. ఇప్పుడు స్టౌపై ఒక గిన్నె పెట్టుకొని అరకప్పు వాటర్, చిటికెడు ఉప్పు వేసుకొని మరిగించుకోవాలి. వాటర్ మరిగాయనుకున్నాక అందులో ముందుగా కలిపి పెట్టుకున్న జొన్నపిండి మిశ్రమాన్ని వేసుకొని లో ఫ్లేమ్ మీద బాగా కలిపి దింపుకోవాలి. పిండి కాస్త చల్లారాక చేతితో చపాతీ పిండి మాదిరిగా బాగా కలిపి దానిపై కాస్త ఆయిల్ అప్లై చేసి మూతపెట్టి గంటన్నర నుంచి 2 గంటలపాటు అలా వదిలేయాలి. తర్వాత పిండిని మరోసారి సాఫ్ట్‌గా కలుపుకోవాలి. ఇప్పుడు మురుకుల గొట్టం తీసుకొని అందులో నూడుల్స్ మాదిరిగా వచ్చే సన్నని అచ్చును ఉంచి లోపల ఆయిల్ అప్లై చేసుకోవాలి. దానిలో కలిపి పెట్టుకున్న పిండిని ఉంచాలి. ఇప్పుడు ఒక పొడవాటి ప్లేట్ తీసుకొని దానిపై కాస్త ఆయిల్ అప్లై చేసుకోవాలి. అనంతరం మురుకుల గొట్టం తీసుకొని లైన్‌గా నూడుల్స్‌ని వత్తుకోవాలి. అలా వత్తుకున్న నూడుల్స్‌పై కొద్దిగా నూనె రాసుకొని స్టీమర్‌లో పెట్టి పావుగంట పాటు ఉడికించుకోవాలి. స్టీమర్ లేనివారు స్టౌపై పెద్ద గిన్నెలో స్టాండ్ ఉంచి, దానిపై నూడుల్స్ వత్తుకున్న ప్లేట్ ఉంచి అవి మంచిగా ఉడికే వరకు స్టీమ్ చేసుకున్నా సరిపోతుంది. ఆవిధంగా ఉడికించుకున్నాక నూడుల్స్‌ని బయటకు తీసి మరోసారి వాటిపై కొద్దిగా నూనె అప్లై చేసుకొని చలార్చుకోవాలి. ఉల్లిగడ్డ, క్యారెట్, క్యాప్సికం, క్యాబేజీ, బీన్స్‌ని పొడవుగా, సన్నని ముక్కలుగా కట్ చేసుకొని పక్కనుంచాలి. ఇప్పుడు స్టౌపై పాన్ పెట్టుకొని కొద్దిగా ఆయిల్ వేసుకోవాలి. నూనె కాస్త వేడయ్యాక వెల్లుల్లి తరుగు వేసి వేయించుకోవాలి. వేగాక ముందుగా కట్ చేసి పెట్టుకున్న ఉల్లిగడ్డ, క్యాబేజీ, క్యారెట్, క్యాప్సికం, బీన్స్ వేసుకొని మీడియం ఫ్లేమ్ మీద రెండు నుంచి మూడు నిమిషాల పాటు ఫ్రై చేసుకోవాలి. ఆవిధంగా వేయించుకున్నాక అందులో ముందుగా ప్రిపేర్ చేసుకున్న నూడుల్స్ వేసుకొని ఒకసారి చక్కగా



కలుపుకోవాలి. ఆ తర్వాత ఉప్పు, మిరియాల పొడి, మసాలా పొడి, సోయా సాస్ యాడ్ చేసుకొని ఎగరేస్తూ కాసేపు వేయించాలి. చివరిలో స్ప్రింగ్ ఆనియన్స్ తరుగు వేసుకొని కలిపి దింపేసుకుంటే చాలు. 'మిల్లెట్ నూడుల్స్' రెడీ!



నిమ్మరసం ఎక్కువగా రావాలంటే ముందుగా వాటిని 20 సెకన్ల పాటు మైక్రోవేవ్ లో ఉంచండి. ఇది నిమ్మకాయని మృదువుగా చేస్తుంది. దీంతో రసం బాగా వస్తుంది.



దోసెల పిండిలో ఒక కప్పు సగ్గుబియ్యం కూడా వేసి రుబ్బితే, దోసెలు పల్చగా, కరకరలాడుతూ వస్తాయి.

ఉల్లిగడ్డలతో...

'ఉల్లి చేసిన మేలు తల్లి కూడా చేయదు' అనే సామెత ఊరికే రాలేదు. అంతలా ఉల్లిగడ్డలో మంచి ఔషధ గుణాలున్నాయి. అందులోనూ జుట్టు రాలిపోతుందనే వారికి చక్కటి పరిష్కారం ఉల్లిగడ్డ. సాధారణంగా ఉల్లిలో ఉండే సల్ఫర్ వల్ల జుట్టు బాగా పెరుగుతుంది. ఈ సల్ఫర్ రక్త ప్రవాహాన్ని పెంచడంతో పాటు కొల్లాజెన్



ఉత్పత్తిలో ముఖ్యమైన పాత్ర పోషిస్తుంది.

ఉల్లి రసం, బాదం నూనె మిశ్రమాన్ని జుట్టుకు బాగా పట్టించి మసాజ్ చేసి ఓ అరగంట పాటు అలా వదిలేయాలి. ఆ తర్వాత గాఢత తక్కువగా ఉన్న షాంపూతో తలస్నానం చేయాలి. ఇలా క్రమం తప్పకుండా చేస్తే మీకు చక్కటి రిజల్ట్ కనిపిస్తుంది. బాదం నూనెతో జుట్టుకు మెరుపువస్తుంది. అలాగే ఉల్లి రసంతో జుట్టును సాఫ్ట్ చేయడంతో పాటు జుట్టు రాలడాన్ని నివారిస్తుంది.

ఉల్లి రసం, ఆలివ్ ఆయిల్ కూడా జుట్టు రాలడాన్ని నివారిస్తుంది. ఈ మిశ్రమాన్ని తలకు బాగా రాసి, మసాజ్ చేసి ఓ 30 నిమిషాలు అలా వదిలేయండి. ఆ తర్వాత తేలికపాటి షాంపూతో శుభ్రం చేసుకోవాలి. వారానికి ఒక్కసారైనా ఇలా చేస్తే మీకు మంచి ఫలితం కనిపిస్తుంది.

ఉల్లి రసం, నిమ్మరసం కాంబినేషన్ కూడా జుట్టుకు మంచి కండీషనర్ గా పని చేస్తుంది. దీంతో జుట్టు రాలడం తగ్గడంతోపాటు మృదువుగా తయారవుతుంది. చుండ్రు కూడా తగ్గుతుంది. ఈ మిశ్రమాన్ని తలకు రాసి, మసాజ్ చేసి ఓ 15 నిమిషాలు అలా వదిలేయాలి. ఆ తర్వాత షాంపూతో జుట్టును కడిగేయాలి.

ఉల్లి-పెరుగు కాంబినేషన్ కూడా జుట్టు రాలడాన్ని తగ్గించి సాఫ్ట్ గా తయారుచేస్తుంది. ఈ రెండింటి మిశ్రమాన్ని తలకు రాసి ఓ 45 నిమిషాలు అలా వదిలేయాలి. ఆ తర్వాత షాంపూతో తలస్నానం చేయాలి.

ఇలా ఉల్లిరసంతో పలు చిట్కాలు ట్రై చేస్తూ ఉంటే జుట్టు రాలడాన్ని అరికట్టవచ్చు.

విద్యుత్ ఆర్టిజన్లను కన్వర్షన్ చేయాలి

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

విద్యుత్ ఆర్టిజన్ కార్మికులను విద్యార్హతల ప్రాతిపదికన వెంటనే కన్వర్షన్ చేయాలని తెలంగాణ విద్యుత్ ఆర్టిజన్ కన్వర్షన్ జాయింట్ యాక్షన్ కమిటీ చైర్మెన్ కె.ఈశ్వర్‌రావు డిమాండ్ చేశారు. బుధవారం హైదరాబాద్‌లోని మింట్ కాంపౌండ్ అంబేద్కర్ విగ్రహం వద్ద నిర్వహించిన విద్యుత్ ఆర్టిజన్ కార్మికుల కన్వర్షన్ యాత్ర ముగింపు సభలో ఆయన మాట్లాడుతూ బీఆర్‌ఎస్ సర్కార్ ఆర్టిజన్లను రెగ్యులర్ చేస్తానని హామీ ఇచ్చి మోసం చేసిందని అన్నారు. రెగ్యులర్ చేయకుండా ఆర్టిజన్ అనే పేరుతో గత ఏడేండ్లుగా వారి హక్కులను కాలరాసిందని విమర్శించారు. ఆర్టిజన్ కార్మికులుగా గుర్తించినప్పుడు ఇచ్చిన స్టాండింగ్ రూల్స్‌ను సైతం అమలు చేయ లేదని ఆందోళ వ్యక్తం చేశారు. విద్యుత్ శాఖలోని వివిధ విభాగాల్లో పని చేస్తున్న ఉద్యోగులకు వారి సీనియారిటీ ప్రకారం ఇస్తున్న ప్రమోషన్లను ఆర్టిజన్లకు ఎందుకు ఇవ్వడం లేదని ప్రశ్నించారు. ఐదేండ్లు పూర్తి చేసుకున్న కార్మికులకు రావల్సిన ఇంక్రిమెంట్‌ను కాంగ్రెస్ సర్కార్ వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. గత సర్కార్ నిర్వాకం వల్ల రాష్ట్రంలోని 20 వేల మంది కార్మికులు తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్నారని గుర్తు చేశారు. ప్రభుత్వం సానుకూలంగా స్పందించకుంటే ఫిబ్రవరి 20న ఛలో విద్యుత్ సౌధ కార్యక్రమాన్ని చేపడుతామని హెచ్చరించారు సంఘాలకు అతీతంగా రాష్ట్ర వ్యాప్తంగా వేలాది మంది కార్మికులు ఈ కార్యక్రమానికి తరలి రావాలని ఈశ్వర్‌రావు పిలుపునిచ్చారు. జేఏసీ కన్వీనర్ ఎంఏ.నజీర్ మాట్లాడుతూ బీఆర్‌ఎస్ సర్కార్ మాదిరిగా మాట తప్పకుండా విద్యుత్ ఆర్టిజన్లకు న్యాయం చేయాలని రేవంత్ సర్కార్‌ను కోరారు. ప్రజలకు నాణ్యమైన విద్యుత్‌ను అందించేందుకు నిర్ణీత పని గంటలను మరిచి రాత్రనక, పగలనక కష్టపడుతుండటం వల్లే రాష్ట్రంలో ప్రజలకు నాణ్యమైన విద్యుత్ అందుతోందని పేర్కొన్నారు. జేఏసీ నాయకులు ఎం.ధన్‌రాజ్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో కో కన్వీనర్ బి.నరెందర్, అరవింద్, జాయింట్ సెక్రటరి చంద్రారెడ్డితో పాటు హైదరాబాద్, రంగారెడ్డి జిల్లాలకు చెందిన ఆర్టిజన్ కార్మికులు పాల్గొన్నారు.

చట్టబద్ధత కల్పిస్తాం

(మొదటిపేజి తరువాయి)

వివరించారనీ, చర్చ కూడా జరిగిందని గుర్తుచేశారు. ఎన్నికల ముందు కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీ మేరకు మార్చి మొదటి వారంలో అసెంబ్లీలో ఓబీసీల రిజర్వేషన్ బిల్లు ప్రవేశపెట్టి ఆమోదింపజేస్తామని నొక్కిచెప్పారు. పార్లమెంట్‌లో కూడా ప్రవేశపెట్టి ఆమోదం పొందడానికి కావలసిన అన్ని ప్రయత్నాలు చేస్తామన్నారు.

పుతిన్‌తో ట్రంప్ హలో..హలో

(మొదటిపేజి తరువాయి)

లభించే గొప్ప ప్రయోజనం గురించి తాను, పుతిన్ మాట్లాడుకున్నామని పేర్కొన్నారు. అలాగే, ఉక్రెయిన్‌తో రష్యా యుద్ధాన్ని ముగించాల్సిన అవసరాన్ని అంగీకరించామని ట్రంప్ వివరించారు. ఉక్రెయిన్‌లో యుద్ధంపై చర్చలు ప్రారంభించాలన్న ప్రతిజ్ఞతో పాటు ఇరువురు ఒకరి దేశాలను ఒకరు సందర్శించనున్నట్టు స్పష్టం చేశారు. యుద్ధం విషయంలో చర్చలకు నాయకత్వం వహించాలని విదేశాంగ కార్యదర్శి మార్కో రూబియో, సీఐఏ డైరెక్టర్ జాన్ రాట్‌క్లిఫ్, జాతీయ భద్రతా సలహాదార మైఖేల్ వాల్జ్, మిడిల్ ఈస్ట్ రాయబారి స్టీవ్ విట్‌కాఫ్‌లను ఆదేశించినట్టు ట్రంప్ వివరించారు. పుతిన్‌తో సంభాషణ గురించి తెలియజేయటానికి ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీకి కూడా ఫోన్ చేస్తానని ట్రంప్ పేర్కొన్నారు. యుద్ధంలో లక్షలాది మంది చనిపోయారనీ, అయితే, తాను అధ్యక్షుడినై ఉంటే ఆ విధంగా జరిగి ఉండేది కాదని రాసుకొచ్చారు. అయితే, దీనికి తప్పక ముగింపు ఉండాలనీ, ఇంకా ఎవరూ ప్రాణాలు కోల్పోకూడదని వివరించారు.

ఆ భూముల వివరాలివ్వండి

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రంగారెడ్డి జిల్లా మహేశ్వరం మండలం నాగారం గ్రామ సర్వే నెం181లోని 103 ఎకరాల నిషేధిత జాబితాలోని భూములను ప్రయివేట్ వ్యక్తులకు రిజిస్ట్రేషన్ చేయడంపై దాఖలైన అప్పీల్‌ను డివిజన్ బెంచ్ విచారించింది. భూదాన్ యజ్ఞ బోర్డుకు చెందిన భూములు నిషేధిత జాబితాల్లో ఉన్నప్పటికీ రిజిస్ట్రేషన్ చేశారనే వ్యాజ్యంపై విచారణను ఈనెల 27కు వాయిదా పడింది. మహమ్మద్ ఫరూజ్ అలీఖాన్ దాఖలు చేసిన అప్పీల్ పిటిషన్‌ను యాక్టింగ్ చీఫ్ జస్టిస్ సుజయ్ పాల్ ఆధ్వర్యంలోని డివిజన్ బెంచ్ విచారించింది. కౌంటర్ దాఖలు చేయాలని ప్రభుత్వాన్ని ఆదేశించింది.

ఫీజు చెల్లించాలని ఒత్తిడి..విద్యార్థిని ఆత్మహత్య

నవ తెలంగాణ- మేడ్చల్

మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా మేడ్చల్ మండలంలోని ప్రయివేటు పాఠశాలల ఆగడాలు రోజురోజుకి శృతిమించి పోతున్నాయి. ఇటీవల పట్టణంలోని క్రిక్ ప్లానెట్ స్కూల్‌లో ఓ విద్యార్థి ఫీజు కట్టలేదని సాయంత్రం 6గంటల వరకు స్కూల్లో ఉంచిన ఘటన మరువకముందే మరో దారుణ ఘటన చోటుచేసుకుంది. శ్రీచైతన్య స్కూల్ ప్రిన్సిపాల్ ఫీజు కోసం వేధించడంతో పదో తరగతి విద్యార్థిని ఆత్మహత్య చేసుకుంది. బాధితులు తెలిపిన వివరాల ప్రకారం..

శ్రీ చైతన్య స్కూల్‌లో చదువుతున్న పదో తరగతి విద్యార్థి అఖిలను తోటి విద్యార్థుల ముందే ప్రిన్సిపాల్ రమాదేవి ఫీజు చెల్లించాలని ఒత్తిడి చేశారు. దాంతో మానసిక ఒత్తిడికి గురైన సదరు విద్యార్థిని మంగళవారం ఇంట్లో ఉరేసుకుని ఆత్మహత్యాయత్నం చేసింది. కుటుంబసభ్యులు ఆమెను యశోద ఆస్పత్రికి తరలించారు. ఆమె చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి బుధవారం మృతిచెందింది. అంతకుముందు విద్యార్థిని తల్లి కమల పాఠశాల వద్దకు వచ్చి మీడియాతో మాట్లాడారు. స్కూల్ ప్రిన్సిపాల్ ఫీజు కోసం వేధించడం వల్లే తన కుమార్తె ఆత్మహత్య చేసుకుందని ఆగ్రహం వ్యక్తం చేశారు. అదే స్కూల్‌లో పదో తరగతి చదువుతున్న తన కొడుకును సైతం ఇంగ్లీషులో తక్కువ మార్కులు వచ్చాయని వేధించడంతో అతను మానసిక ఒత్తిడితో ఇబ్బంది పడుతున్నాడని తెలిపారు. సైకాలజీ డాక్టర్ దగ్గర ట్రీట్మెంట్ తీసుకుంటున్నాడని, ఆ చికిత్స కోసమే లక్ష రూపాయలు చెల్లించడంతో స్కూల్ ఫీజు కట్టడం ఆలస్యమైందని తెలిపారు. ఫీజుల విషయంలో అడ్డదారులు తొక్కుతూ మానసిక వేదనకు గురిచేస్తున్న శ్రీ చైతన్య స్కూల్‌పై విద్యాశాఖ అధికారులు కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. సమాచారం అందుకున్న ఎస్ఎఫ్ఐ, ఏబీవీపీ నాయకులు స్కూల్ ఎదుట బైటాయించి నిరసన వ్యక్తం చేశారు. స్కూల్ యాజమాన్యంపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఫీజు కోసం ఒత్తిడి చేసి విద్యార్థిని ఆత్మహత్యకు కారణమైన ప్రిన్సిపాల్ రమాదేవిపై బీఎన్ఎస్ యాక్ట్ 55 ప్రకారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఏసీపీ బీ.శ్రీనివాస్ రెడ్డి తెలిపారు.

ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీజేపీని ఓడించండి

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలో ఈనెల 27న జరిగే శాసనమండలి ఉపాధ్యాయ, పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థులను ఓడించాలని సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ పిలుపునిచ్చారు. బుధవారం హైదరాబాద్‌లోని ఎంబీ భవన్‌లో సీపీఐ(ఎం) రాష్ట్ర కమిటీ సమావేశం ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు పోతినేని సుదర్శన్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ కార్యక్రమానికి సీపీఐ(ఎం) పొలిట్‌బ్యూరో సభ్యులు బివి రాఘవులు, ఎ విజయరాఘవన్ హాజరయ్యారు. అనంతరం తనను కలిసిన విలేకర్లతో జాన్‌వెస్లీ మాట్లాడుతూ శాసనమండలి ఎమ్మెల్సీ ఎన్నికల్లో లౌకిక శక్తులను గెలిపించాలని పిలుపునిచ్చారు. బీజేపీని ఓడించే అభ్యర్థులకు మద్దతివ్వాలని నిర్ణయించామని చెప్పారు. ఎవరికి మద్దతివ్వాలనేది తర్వాత నిర్ణయం తీసుకుంటామని వివరించారు. కులగణన చేసి బీసీలకు 42 శాతం రిజర్వేషన్లను కల్పిస్తామంటూ కాంగ్రెస్ పార్టీ కామారెడ్డి డిక్లరేషన్‌లో ప్రకటించిందని గుర్తు చేశారు. కులగణన వివరాలను కేంద్ర ప్రభుత్వానికి పంపిస్తామంటూ రాష్ట్ర ప్రభుత్వం చెప్తున్నదని అన్నారు. అసెంబ్లీలో బిల్లును ప్రవేశపెట్టి బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల అమలుకు రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఆ తర్వాతే స్థానిక సంస్థల ఎన్నికలను నిర్వహించాలని కోరారు. జనాభా తగ్గిందనే చర్చ జరుగుతున్నదనీ, దానిపై కమిటీ వేసి సరిచేసేందుకు చర్యలు తీసుకోవాలని సూచించారు. ఎస్సీ వర్గీకరణను ఆహ్వానిస్తున్నామని ఆయన చెప్పారు. ఇందులో ఎస్సీలను 1,2,3 గ్రూప్‌లుగా ప్రభుత్వం విభజించిందని అన్నారు. ఎస్సీ కులాల జనాభా, ఇతర సమస్యలపై ఏకసభ్య కమిషన్ ద్వారా విచారణ జరపాలని కోరారు. ఆ సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని సూచించారు. రామరాజ్య స్థాపన అనే సంస్థ ముసుగులో చిలుకూరు బాలాజీ దేవాలయం ప్రధానార్చకుడు రంగరాజన్‌పై మతోన్మాద శక్తులు చేసిన దాడిని తీవ్రంగా ఖండిస్తున్నామని చెప్పారు. దాడికి పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ప్రజలు, లౌకిక, ప్రజాస్వామికవాదులు ఈ దాడికి ఖండించాలని కోరారు.

సీఎం చేతిలో 'సహకార' భవిష్యత్

(మొదటిపేజి తరువాయి)

తుమ్మల నాగేశ్వరరావును మంగళవారం కలిశారు. సహకార సంఘాలకు ఇప్పట్లో ఎన్నికలు నిర్వహించే పరిస్థితి లేనందున తమకే కొంత కాలం అవకాశం ఇవ్వాలని కోరినట్టు చెబుతున్నారు. రబీ వ్యవసాయ సీజన్‌తో పాటు ఖరీఫ్ ముందస్తు ప్రణాళికలు ఏప్రిల్ నెలలో చేయాల్సి ఉన్నందున సహకార సంఘాలకు పాలక వర్గాలు ఉండాలని సూచించినట్టు తెలుస్తోంది.

విత్తనాలు, ఎరువులు, పంట రుణాలు, ఇతర రుణాలు, రబీ ధాన్యం కొనుగోలు వంటి ముఖ్యమైన రైతు సేవా సహకార కార్యక్రమాలు సహకార సంఘాల ద్వారా జరుగుతున్నందున చైర్మెన్ల పదవీ కాలం పొడిగించడం వల్ల ప్రభుత్వానికి రైతుల నుంచి ఎలాంటి ఇబ్బందులూ తలెత్తవని మంత్రి దృష్టికి తెచ్చినట్టు చెబుతున్నారు. చైర్మెన్లు చెప్పిన పలు విషయాలను ప్రభుత్వం పరిశీలిస్తున్నదని, చైర్మెన్ల పదవీ కాలం పొడగింపు విషయం గురించి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్తానని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు చైర్మెన్లకు హామీ ఇచ్చినట్టు సమాచారం.

రాజకీయ సమీకరణను బట్టి నిర్ణయం

రాష్ట్రంలో సహకార సంఘాల్లో అత్యధిక మంది చైర్మెన్లు, వైస్ చైర్మెన్లు బీఆర్ఎస్ నుంచి గెలుపొందారు. పదేండ్ల పాటు అధికార పార్టీలో ఉన్నందున ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలు, జిల్లా కేంద్ర సహకార బ్యాంకుల్లో పట్టు బిగించారు. రాష్ట్రంలోని సహకార సంఘాల్లో 65 లక్షల మంది రైతులు సభ్యులుగా ఉన్నందున రాష్ట్ర ప్రభుత్వం అమలు చేసే రైతు సంక్షేమ పథకాలు డీసీసీబీలు, పీఏసీఎస్‌ల ద్వారా అమలయ్యాయి. రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చినందున కొందరు డీసీసీబీ చైర్మెన్లు, వైస్ చైర్మెన్లు ఆ పార్టీలో చేరారు. ఉమ్మడి మెదక్ జిల్లా డీసీసీబీ చైర్మెన్ చిట్టి దేవేందర్‌రెడ్డితో పాటు పలు డీసీసీబీ చైర్మెన్లు కాంగ్రెస్ తీర్థం పుచ్చుకున్నారు. మిగతావారూ కాంగ్రెస్ వైపు వచ్చేలా పదవీ కాలాన్ని పొడగించాలని కాంగ్రెస్‌లోని చైర్మెన్లు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తున్నారు. ఇప్పుడు సహకార పీఏసీఎస్, డీసీసీబీలకు కూడా స్పెషలాఫీసర్లను పెట్టడం సాధ్యమేనా అనేది పరిశీలిస్తున్నారు.

కొత్త సహకార సంఘాలెప్పుడో..

నూతన సహకార విధానం ప్రకారం దేశంలోని ప్రతి గ్రామంలో ఒక్కో ప్రాథమిక సహకార సంఘం, మత్స్య, పాత ఉత్పత్తిదారుల సంఘం ఏర్పాటు చేయాలని 2022లో కేంద్రం అన్ని రాష్ట్ర ప్రభుత్వాలకు లేఖ రాసింది. రాష్ట్రంలో 272 మండలాల్లో ఒకే ఒక సహకార సంఘముంది. 81 మండల కేంద్రాల్లో ఒక్క సంఘమూ లేదు. 2013 తర్వాత రాష్ట్రంలో కొత్త సహకార సంఘాలేర్పడలేదు. 500 పైగా కొత్తగా ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలను ఏర్పాటు చేయాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. కొత్తగా సంఘాల్ని ఏర్పాటు చేయాలా..? పాత సంఘాల్ని విభజించాలా..? అనే విషయాలపై రిపోర్టు సిద్ధం చేయాలని మంత్రి తుమ్మల ఇటీవల జరిగిన సమావేశంలో అధికారుల్ని ఆదేశించారు. ఇంతలో పదవీ కాలం ముగిసినందున కొత్త సంఘాల ఏర్పాటు ఇప్పట్లో లేనట్టేనని రైతులు అంటున్నారు.

ప్రభుత్వ నిర్ణయం బట్టి ఉంటుంది : రేపల్లె కిరణ్‌కుమార్, జిల్లా సహకార అధికారి

సహకార సంఘాల పదవీ కాలం ముగియనున్నందున రాష్ట్ర ప్రభుత్వం తీసుకునే నిర్ణయం బట్టి అమలు చేస్తాం. చైర్మెన్ల పదవీ కాలం పొడగించాలని మంత్రి తుమ్మలను కలిసి కోరారు. ప్రభుత్వం ఎన్నికలకు వెళ్తుందా..? ప్రత్యేక అధికారుల్ని నియమిస్తుందా..? పదవీ కాలం పొడగిస్తారా..? అనేది గురువారం సాయంత్రం వరకు ప్రభుత్వం ప్రకటించే అవకాశముంది.

బీసీ రిజర్వేషన్ల తర్వాతే స్థానిక పోరు

ఆ దిశగా సర్కారు అడుగులు

కేంద్రం నిధులు ఆగినా బీసీల వాటా తేల్చాలని నిర్ణయం

బీజేపీపై ఓబీసీ ఆయుధాన్ని ప్రయోగించే యోచనలో కాంగ్రెస్

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

తగ్గేదే లే.. బీసీలకు 42 శాతం రిజర్వేషన్లను తేల్చిన తర్వాతే స్థానిక సంస్థల ఎన్నికలకు వెళ్లాలనే ఆలోచనకు రాష్ట్ర ప్రభుత్వం వచ్చింది. ఓబీసీ రిజర్వేషన్ల ఆయుధాన్ని బీజేపీపై ఎక్కుపెట్టి దేశవ్యాప్తంగా ఆ సామాజిక తరగతుల్లో మళ్లీ పట్టు సాధించాలనే ఎత్తుగడతో కాంగ్రెస్ అడుగులు వేస్తున్నది. పాలకమండళ్లు లేవనే కారణంతో కేంద్ర ప్రభుత్వం గ్రామపంచాయతీలకు 15వ ఆర్థిక సంఘం నుంచి నిధులు విడుదల చేయకపోయినా సరేగానీ బీసీ రిజర్వేషన్ల అంతు తేల్చాలనే పట్టుదలతో కాంగ్రెస్ నాయకత్వం ఉంది. రాష్ట్రంలో ఫిబ్రవరి 15 తర్వాత ఏ రోజైనా పంచాయతీ ఎన్నికలకు సంబంధించిన నోటిఫికేషన్ వెలువడుతుందనే ప్రచారం జోరుగా సాగుతున్నది. అదే సమయంలో రాష్ట్ర ఎన్నికల సంఘం ఎన్నికల నిర్వహణకు సంబంధించిన ఏర్పాట్లను చకచకా చేస్తూ పోతున్నది. ఎన్నికల నిర్వహణకు సంబంధించిన ఉన్నతాధికారులకు శిక్షణను సైతం ఇచ్చింది. పోలింగ్ సిబ్బందిపైనా దృష్టిసారించింది. పదోతగరతి, ఇంటర్ పరీక్షలున్నప్పటికీ మార్చి 21వ తేదీకల్లా మూడు దశల్లో స్థానిక ఎన్నికలు పూర్తవుతాయనే చర్చ కూడా నడుస్తున్నది. ఈ తరుణంలో అసెంబ్లీ మొదటి వారంలో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కేటాయించే అంశంపై అసెంబ్లీలో బిల్లును ప్రవేశపెడతామని డిప్యూటీ సీఎం ప్రకటించారు. ఇక మార్చిలో ఎన్నికలుండవనేది దీనిని బట్టే అర్థమవుతున్నది. రిజర్వేషన్ల అంశం తేలిన తర్వాతనే స్థానిక పోరుకు పోవాలనే ఎత్తుగడ కాంగ్రెస్ ప్రభుత్వం వద్ద స్పష్టంగా ఉన్నట్టు తెలుస్తున్నది. రాష్ట్ర ఆర్థిక పరిస్థితుల నేపథ్యంలో ఇచ్చిన హామీల విషయంలో ప్రజల నుంచి వ్యతిరేకతను రాష్ట్ర ప్రభుత్వం ఎదుర్కొంటున్న విషయం విదితమే. ఈ నేపథ్యంలో బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల అమలు అంశాన్ని రాజకీయ ఎజెండాగా మలిచే పనిలో కాంగ్రెస్ పడింది. ఈ డిమాండ్ దశాబ్దాల నుంచీ ఉంది. దీనికి అన్ని పార్టీలూ అనివార్యంగా మద్దతు తెలపాల్సిన ఆవశ్యకతను కాంగ్రెస్ సృష్టించింది. ఒకవేళ 42 శాతం రిజర్వేషన్లకు చట్టబద్ధత దక్కితే ఆ క్రెడిట్ కాంగ్రెస్‌కు దక్కుతుంది. దీంతో బీజేపీ ఇరకాటంలో పడుతుంది. బీహార్‌లోనూ కులగణన పూర్తయినప్పటికీ ఇంకా కార్యరూపం దాల్చలేదు. అనివార్య, రాజకీయ అవసరాల రీత్యా నితీశ్‌కుమార్ బీజేపీ పంచన చేరడంతో ప్రస్తుతం అక్కడ కులగణన హడావిడి ఆగిపోయింది. ప్రస్తుతం దేశవ్యాప్తంగా కాంగ్రెస్ పార్టీ రాజకీయంగా ఎన్నడూ లేనంతగా రాజకీయ ఒడిదుడుకులను ఎదుర్కొంటున్నది. ఈ నేపథ్యంలో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు అనేది ఆయా తరగతుల్లో నిలదొక్కుకోవడానికి మంచి అవకాశం కాంగ్రెస్‌కు దక్కింది. దీన్ని అందిపుచ్చుకుని రాజకీయంగా ప్రజలకు మరింత చేరువయ్యే యోచనలో కాంగ్రెస్ ఉంది. ఈ బిల్లు అసెంబ్లీలో ఆమోదం పొందిన తర్వాత, దీన్ని జాతీయ అంశంగా మార్చే అవకాశముంది. ఇదంతా పదిపదిహేను రోజుల్లో పూర్తయ్యేప్రక్రియ కాదు. ఈ నేపథ్యంలో రాష్ట్రంలో స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణ మరింత ఆలస్యమయ్యే సూచనలు కనిపిస్తున్నాయి. మరోవైపు 'బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు తేల్చాలి..మాజీ సర్పంచులకు పెండింగ్ బిల్లుల చెల్లింపు ప్రక్రియ పూర్తిచేయాలి. ఆ తర్వాతనే పంచాయతీలకు ఎన్నికలు నిర్వహించాలి' అనే డిమాండ్‌తో రాష్ట్ర ఎన్నికల సంఘానికి సర్పంచుల సంఘం జేఏసీ ఫిర్యాదు చేయడం కూడా చర్చనీయాంశమవుతున్నది. మంత్రులు, ప్రభుత్వ ఉన్నతాధికారులు స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణపై రోజుకో తీరుగా లీకులిస్తుండటంతో ఎప్పుడేం జరుగుతుందో తెలియని గందరగోళ పరిస్థితి నెలకొంది.

పడకేసిన పారిశ్రామికోత్పత్తి

(మొదటిపేజి తరువాయి)

డిసెంబర్‌లో పారిశ్రామిక ఉత్పత్తి సూచీ 3.2 శాతానికి పడిపోయిందని బుధవారం కేంద్ర గణంకాల శాఖ తెలిపింది. ఇంతక్రితం నవంబర్‌లో 5 శాతంగా నమోదయ్యింది. ఇదే నెలలో తయారీ రంగంలో 5.8 శాతం పెరుగుదల ఉండగా.. డిసెంబర్‌లో 3 శాతానికి పరిమితమవడం ఆందోళనక రం. నవంబర్‌లో 1.9 శాతం పెరిగిన గనుల రంగం.. డిసెంబర్‌లో 2.6 శాతం వృద్ధిని కనబర్చింది. విద్యుత్ ఉత్పత్తి 4.4 శాతం నుంచి 6.2 శాతానికి పెరిగింది. మౌలిక వసతులు, నిర్మాణ రంగ ఉత్పత్తులు నవంబర్‌లో 8.1 శాతం వృద్ధిని సాధించగా.. డిసెంబర్‌లో 6.3 శాతానికి తగ్గాయి. జనవరికి సంబంధించిన ఐఐపి గణంకాలను మార్చ్ 12న విడుదల చేయనున్నారు. ఈ ఏడాది జనవరిలో రిటైల్ ద్రవ్యోల్బణం సూచీ 4.31 శాతంగా చోటు చేసుకుంది. 2024 డిసెంబర్‌లో ఇది 5.22 శాతంగా చోటు చేసుకుంది. గడిచిన నెలలో అహారోత్పత్తుల ధరలు 6 శాతంగా ఉండగా.. ఇంతక్రితం నెలలో 8.4 శాతం పెరుగుదలను నమోదు చేశాయి. జనవరిలో ముఖ్యంగా కొబ్బరి ఆయిల్ 54.2 శాతం, ఆలు 49.6 శాతం, కొబ్బరి 38.7 శాతం, అల్లం 30.7 శాతం, బటానీలు 30.2 శాతం చొప్పున పెరగడం గమనార్హం.

కార్పొరేట్లకు నజరానాలు

వనరులు, సంపద రాయితీల రూపేణా కార్పొరేట్లకు లబ్ధి

ఎంపీ శివదాసన్ విమర్శ

- భారంగా గ్రామీణుల జీవన వ్యయం: అఖిలభారత వ్యకాస సహాయ కార్యదర్శి విక్రంసింగ్
- కేంద్ర బడ్జెట్ - గ్రామీణ పేదలపై ప్రభావంపై తెలంగాణ వ్యకాస సెమినార్



నవతెలంగాణ ప్రత్యేక ప్రతినిధి-హైదరాబాద్

కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన తాజా బడ్జెట్ పూర్తిగా ప్రజావ్యతిరేకంగా ఉందని రాజ్యసభ సభ్యులు, అఖిల భారత వ్యవసాయ కార్మిక సంఘం జాతీయ సహాయ కార్యదర్శి వి. శివదాసన్ విమర్శించారు. బడ్జెట్ అసంపూర్తిగా ఉంది, దేశ ప్రజల కనీస అవసరాలను నెరవేర్చేదిగా లేదని వ్యాఖ్యానించారు. అమెరికా, చైనా, జర్మనీ, ఫ్రాన్స్ దేశాల్లో రైతులు, ప్రజలకు రాయితీలు ఇస్తున్నారనీ, మనదేశంలో మాత్రం అందుకు విరుద్ధంగా రాయితీల పేర కార్పొరేట్లు, ప్రయివేటుకు దోచిపెడుతు న్నారని ఆగ్రహం వ్యక్తంచేశారు. దేశంలో కార్మికవర్గ ప్రయోజనాలకు కేంద్ర బడ్జెట్ ఏమాత్రం అనుకూలంగా లేదని అభిప్రాయపడ్డారు. వనరులు, సంపద ఉన్నా రాయితీల రూపేణా కార్పొరేట్లకు ధారాదత్తం చేస్తున్నారని వివరించారు. దేశ ప్రజల పట్ల మోడీ సర్కారు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నదని తప్పుబట్టారు. బుధవారం హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో 'కేంద్ర బడ్జెట్-గ్రామీణ పేదలపై ప్రభావం' అనే అంశంపై తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం సెమినార్ నిర్వహించింది. దీనికి ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షులు జి. నాగయ్య అధ్యక్షత వహించారు. ఇందులో అఖిలభారత వ్యకాస జాతీయ సహాయ కార్యదర్శి విక్రంసింగ్, ఏపీ ప్రధానకార్యదర్శి వెంకటేశ్వర్లు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆర్.వెంకట్రాములు, నాయకులు బి. ప్రసాద్, పద్మ, ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా శివదాసన్ మాట్లాడుతూ దేశంలోని వనరులను సేకరించి ప్రజలకు ఖర్చుచేయడంలో మోడీ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని చెప్పారు. మౌలిక సదుపాయాలతోపాటు సంక్షేమ పథకాలు, అభివృద్ధికి కేంద్ర బడ్జెట్‌లో ఎక్కువ నిధులు కేటాయించాల్సి ఉందన్నారు. విద్యా, వైద్యం, ప్రజాపంపిణీ వ్యవస్థలను నాశనం చేస్తున్నారని గుర్తు చేశారు. అనేక ప్రజా సంక్షేమ పథకాలకు నిధులు కేటాయిం చడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. రాముడు పేరు చెబుతూనే నాథురామ్ గాడ్సే పనులను బీజేపీ ప్రభుత్వం చేస్తున్నదని విమర్శించారు. గ్రామీణాభివృద్ధికి, ఉపాధి హామీ చట్టానికి గతంలో ఎక్కువ నిధులు కేటాయించి ఈ బడ్జెట్‌లో తగ్గించారని గుర్తు చేశారు. తాజా బడ్జెట్ ప్రజల నిజ వేతనాలను పెంచకపోగా, తగ్గిస్తున్నదని వివరించారు. రూపాయి విలువ పడిపోవడానికి ద్రవ్యోల్బణమే కారణమని తెలిపారు. గ్యాస్ సబ్సిడీల తగ్గింపుపై పార్లమెంటులో ప్రజల తరపున ప్రశ్నిస్తే కేంద్రం సమాధానం చెప్పడం లేదని గుర్తు చేశారు. దీంతో పేద లబ్దిదారులకు నష్టం జరుగుతున్నదన్నారు. తరచూ పెట్రో ధరలు పెరగడం వల్ల కేరళలో రబ్బరు పంటపై ప్రభావం పడుతున్నదన్నారు. రబ్బరు రైతులు అనేక సమస్యలు ఎదుర్కొంటున్నారని గుర్తు చేశారు. దేశంలో వ్యవసాయ కార్మికులు, రైతుల సమస్యలను మోడీ ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తున్నదని చెప్పారు.

రాముడి పేరు చెప్పి గాడ్సే పనులు చేస్తున్నారని వ్యాఖ్య

దేశంలో పేదరికం పెరుగుతున్నది: విక్రంసింగ్

దేశంలో పేదరికం విపరీతంగా పెరుగుతున్నదని అఖిల భారత వ్యవసాయ కార్మిక సంఘం జాతీయ సహాయ కార్యదర్శి విక్రంసింగ్ ఆవేదన వ్యక్తం చేశారు. జీడీపీ అభివృద్ధిలో నిజమెంతో అందరికీ తెలుసని వ్యాఖ్యానించారు. ఒకవైపు మిలియనీర్లు పెరుగుతుండగా, మరోవైపు కార్మికుల వేతనాలు తగ్గిపోతున్నాయని అభిప్రాయపడ్డారు. గ్రామీణ ప్రాంతాల్లో పేదల జీవన వ్యయం సైతం అధికమవుతున్నదన్నారు. విద్యా, వైద్యం, ఆరోగ్యం ఖర్చులు దారుణంగా పెరిగాయని గుర్తుచేశారు. బడ్జెట్‌లో పేదల అవసరాలకు నిధుల కేటాయింపుతోపాటు వాటిని వారికోసం ఖర్చుచేయాలని సూచించారు. మోడీ సర్కారు ఆహార భద్రత, విద్యా, వైద్యం, ప్రజాపంపిణీ వ్యవస్థకు నిధులు లేవని అంటున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. పేదల కోసం ఉదారంగా డబ్బులు వ్యయం చేయాల్సిన అవసరం ఉందన్నారు. కార్పొరేట్లకు రుణాలు ఇవ్వడం, వాటిని మాఫీ చేయడం మోడీ సర్కారు చేస్తున్నదని గుర్తు చేశారు. సాధారణ పేదలపై అధికంగా పన్నులేస్తూ, కార్పొరేట్లను వదిలేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. భారీ ఉపాధి అవకాశాలు ఉన్న వ్యవసాయానికి బడ్జెట్‌లో అధికంగా నిధులు కేటాయించకపోవడాన్ని తప్పుబట్టారు. 2019 నుంచి ఇదే వైఖరి అవలంబిస్తోన్నారని చెప్పారు. దేశ ప్రజల ఆరోగ్యం కోసం అధికంగా ఖర్చు చేయాల్సి వస్తున్నదనీ, ఆ దిశగా కేంద్రం ఎలాంటి చర్యలూ తీసుకోవడం లేదని విమర్శించారు. సబ్‌కా సాత్, సబ్‌కా వికాస్ కేవలం నినాదంగానే మిగిలిపోయిందని గుర్తుచేశారు. ఢిల్లీ, బీహార్ ఎన్నికల కోసం కేంద్రం బడ్జెట్ తెచ్చినట్టుగా ఉందని వ్యాఖ్యానించారు. ఓటర్లను మభ్యపెట్టడం కోసమేనని అన్నారు. దీనిపై భారత ఎన్నికల సంఘం ఏమీ మాట్లాడటం లేదన్నారు. ఆదాయపన్ను మినహాయింపు కల్పించడం, పన్నులేయడం విచిత్రంగా ఉందన్నారు. ప్రజా సమస్యలపై సాధారణ పోరాటాలు కాకుండా దీర్ఘకాలిక ఉద్యమాలు జరగాలని పిలుపునిచ్చారు. అధ్యక్షత వహించిన జి నాగయ్య, ప్రధాన కార్యదర్శి ఆర్.వెంకట్రాములు, ఏపీ కార్యదర్శి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ దేశంలో పరోక్ష పన్నులు కట్టేది లేదన్నారు. దుర్మార్గమైన బడ్జెట్ అని వ్యాఖ్యానించారు. ఈ విషయంపై ప్రచారం చేయాలని సూచించారు. ప్రజావ్యతిరేక విధానాలు అనుసరిస్తున్న ప్రభుత్వాలపై ప్రజలు తిరగబడుతున్నారని అన్నారు. బంగ్లాదేశ్ తరహా పరిణామాలు దేశంలో కూడా వస్తాయని అభిప్రాయపడ్డారు. ఎస్సీ, ఎస్టీ సబ్‌ప్లాన్ నిధులు ఖర్చుచేయాలని చెప్పారు. ప్రభుత్వ రంగాన్ని దెబ్బతీయడాన్ని ఖండించారు.

ఆస్ట్రేలియాకు మరో ఎదురుదెబ్బ

- ఛాంపియన్స్ ట్రోఫీ నుంచి వైదొలిగిన స్టార్క్
- కెప్టెన్‌గా స్టీవ్ స్మిత్



సిడ్నీ: ఛాంపియన్ ట్రోఫీకి ముందు ఆస్ట్రేలియాకు గట్టి ఎదురు దెబ్బలు తగులుతున్నాయి. ఆసీస్ స్టార్ పేసర్లు హేజిల్‌వుడ్, కమిన్స్‌తోపాటు మిచెల్ మార్ష్ ఇప్పటికే ఛాంపియన్స్ ట్రోఫీకి దూరం కాగా.. తాజాగా స్టార్ పేసర్ మిచెల్ స్టార్క్ ఈ టోర్నీకి దూరంగా ఉండాలని నిర్ణయించుకున్నాడు. ఈ విషయాన్ని క్రికెట్ ఆస్ట్రేలియా(సిఎ) సెలెక్షన్ ప్యానల్ సభ్యులు జార్జి బెయిలీ బుధవారం తెలిపారు. ఛాంపియన్స్ ట్రోఫీలో ఆడే ఆసీస్ జట్టుకు కెప్టెన్‌గా స్టీవ్ స్మిత్ వ్యవహరించనున్నట్లు సిఎ బుధవారం ప్రకటించింది. పాకిస్తాన్ వేదికగా ఐసిసి ఛాంపియన్స్ ట్రోఫీ ఫిబ్రవరి 19నుంచి మార్చి 9వరకు జరగనుంది. ఆస్ట్రేలియా జట్టు 2006, 2009లలో ఛాంపియన్స్ ట్రోఫీ టైటిళ్లను చేజిక్కించుకుంది.

జట్టు: స్మిత్(కెప్టెన్), అబాట్, క్యారీ, డ్వార్షిస్, ఎల్లిస్, ఫ్రేసర్, హార్డి, హెడ్, ఇంగ్లిస్, జాన్సన్, లబూషేన్, మ్యాక్స్‌వెల్, సాంఘ్వా, స్టార్క్, జంపా. రిజర్వ్ కొన్నొలై.

ఛాంపియన్స్ ట్రోఫీకి అంపైర్లు వీరే : ఐసీసీ



దుబాయ్: పాకిస్తాన్-యుఎఇ వేదికలుగా ఈనెల 19నుంచి జరిగే ఛాంపియన్స్ ట్రోఫీకి అంపైర్ల జాబితాను అంతర్జాతీయ క్రికెట్ మండలి(ఐసిసి) బుధవారం వెల్లడించింది. ఇందులో 12మంది ఫీల్డ్ అంపైర్లు ఉండగా.. ఆరుగురు రిఫరీలు ఉన్నారు. పాకిస్తాన్‌లోని కరాచీ, లాహోర్, రావల్పిండి వేదికలుగా.. యుఎఇలోని దుబాయ్ వేదికగా ఈసారి ఛాంపియన్స్ ట్రోఫీ జరగనున్న సంగతి తెలిసిందే. పాకిస్తాన్-భారత్ జట్ల మధ్య జరిగే మ్యాచ్‌కు రిచర్డ్ కెటెల్‌బ్రో రిఫరీగా.. క్రిస్ గఫనే, కుమార ధర్మసేన ఫీల్డ్ అంపైర్లుగా వ్యవహరించనున్నారు. వీరితోపాటు రిచర్డ్ ఇల్లింగ్‌వర్త్, పాల్ రీఫిల్, రాడ్ టక్కర్ రిఫరీలుగా వ్యవహరించనున్నట్లు ఐసిసి ఆ ప్రకటనలో తెలిపింది. ఇక ఫీల్డ్ అంపైర్లుగా మిచెల్ గాఫ్, ఆడ్రియన్ హోల్డ్‌స్టోక్, అహసాన్ రాజా, షర్ఫుడొల్లా ఇబ్నే సాహెబ్, అలెక్స్ వార్ఫ్, జో విల్సన్ ఎంపికయ్యారు. వీరంతా భారత్ వేదికగా 2023లో జరిగిన ఐసిసి వన్డే ప్రపంచకప్‌కు బాధ్యతలు నిర్వర్తించినవారే.

గిల్ సెంచరీ

- కోహ్లి, శ్రేయస్ అర్ధసెంచరీలు
- చివరి వన్డేలో ఇంగ్లండ్‌పై 142పరుగుల తేడాతో గెలుపు
- సిరీస్ క్లీన్‌స్వీప్



అహ్మదాబాద్: ఇంగ్లండ్‌తో జరిగిన మూడో వన్డేలోనూ భారతజట్టు గెలిచి మూడు వన్డేల సిరీస్‌ను 3-0తో క్లీన్‌స్వీప్ చేసింది. నరేంద్ర మోడీ స్టేడియంలో ఇంగ్లండ్‌తో బుధవారం జరిగిన చివరి వన్డేలో ఏకంగా 142పరుగుల తేడాతో ఘన విజయం సాధించింది. టాస్ ఓడి తొలిగా బ్యాటింగ్‌కు దిగిన టీమిండియా 50 ఓవర్లలో 356పరుగుల భారీస్కోర్‌ను నమోదు చేసింది. అనంతరం ఇంగ్లండ్‌ను 34.2ఓవర్లలో 214పరుగులకే ఆలౌట్ చేసి ఘన విజయం సాధించింది. ఈ వన్డేకు తొలి రెండు వన్డేల్లో గెలిచి సిరీస్‌ను సొంతం చేసుకున్న టీమిండియా... మూడో వన్డేనూ గెలిచి క్లీన్‌స్వీప్ చేసింది. టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన టీమిండియాకు శుభారంభం దక్కలేదు. కెప్టెన్ రోహిత్ శర్మ(1) నిరాశపర్చినా... మరో ఓపెనర్ శుభ్‌మన్ గిల్ (112; 102బంతుల్లో 14ఫోర్లు, 3సిక్సర్లు) శతకంతో మెరిసాడు. 95 బంతుల్లోనే సెంచరీ పూర్తి చేసుకున్నాడు. శ్రేయస్ అయ్యర్ (78; 64బంతుల్లో 8ఫోర్లు, 2సిక్సర్లు) మరోసారి అదిరే ప్రదర్శన చేశాడు. ఫామ్‌లేమితో బాధపడుతున్న విరాట్ కోహ్లి (52; 55బంతుల్లో 7ఫోర్లు, సిక్సర్) ఫామ్‌లోకి వచ్చేశాడు. వికెట్ కీపర్ కేఎల్ రాహుల్ (40; 29బంతుల్లో 3ఫోర్లు, సిక్సర్) రాణించాడు. హార్దిక్ పాండ్యా (17; 9బంతుల్లో 2సిక్స్‌లు) రషీద్ బౌలింగ్‌లో వరుసగా రెండు సిక్సర్లు కొట్టి... ఆ తర్వాతి బంతికి బౌల్డ్ అయ్యాడు. వాషింగ్టన్ సుందర్ (14), అక్షర్ పటేల్ (13), హర్షిత్ రాణా (13) పరుగులు చేశారు. ఇంగ్లండ్ బౌలర్లలో ఆదిల్ రషీద్‌కు నాలుగు, మార్క్‌వుడ్‌కు రెండు, సకిబ్, అట్కిన్సన్, జో రూట్ ఒక్కో వికెట్ పడగొట్టారు.

భారీ లక్ష్యంతో ఛేదించే క్రమంలో ఇంగ్లండ్ ధాటిగానే ఇన్నింగ్స్‌ను ప్రారంభించింది. తొలి 6ఓవర్లలోనే 60 పరుగులు రాబట్టింది. డకెట్(34) పెవీలియన్‌కు చేరినా.. బాంటన్, సాల్ట్ రాణించారు. వీరిద్దరూ క్రీజ్‌లో ఉండగానే ఇంగ్లండ్ 8.4ఓవర్లలోనే 80పరుగులు చేసేసింది. ఆ తర్వాత సాల్ట్(23) ఔటయ్యాక ఇంగ్లండ్ బ్యాటర్లు పెవీలియన్‌కు క్యూ కట్టారు. బాంటన్(38), రూట్(24), అట్కిన్సన్(38) మాత్రమే కాస్త ఫర్వాలేదనిపించారు. ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్, సిరీస్ శుభ్‌మన్ గిల్‌కు దక్కాయి. అంతకుముందు జరిగిన ఐదు టి20ల సిరీస్‌నూ భారత్ 4-1తో చేజిక్కించుకున్న సంగతి తెలిసిందే.

స్కోర్‌బోర్డు :

ఇండియా ఇన్నింగ్స్: రోహిత్ (సి)సాల్ట్ (బి)వుడ్ 1, శుభ్‌మన్ (బి)రషీద్ 112, కోహ్లి (సి)సాల్ట్ (బి)రషీద్ 52, శ్రేయస్ (సి)సాల్ట్ (బి)రషీద్ 78, కెఎల్ రాహుల్ (ఎల్‌బి)మహమూద్ 40, హార్దిక్ (బి)రషీద్ 17, అక్షర్ (సి)బంటన్ (బి)రూట్ 13, సుందర్ (సి)బ్రూక్ (బి)వుడ్ 14, హర్షిత్ రాణా (సి)బట్లర్ (బి)అట్కిన్సన్ 13, అర్ష్‌దీప్ (రనౌట్) సాల్ట్ 2, కుల్దీప్ (నాటౌట్) 1, అదనం 13. (50 ఓవర్లలో ఆలౌట్) 356పరుగులు.

వికెట్ల పతనం: 1/6, 2/122, 3/226, 4/255, 5/289, 6/307, 7/333, 8/353, 9/353, 10/356.

బౌలింగ్: మహమూద్ 10-0-68-1, వుడ్ 9-1-45-2, అట్కిన్సన్ 8-0-74-1, రూట్ 5-0-47-1, రషీద్ 10-0-64-4, లివింగ్‌స్టోన్ 8-0-57-0

ఇంగ్లండ్ ఇన్నింగ్స్ : సాల్ట్ (సి)అక్షర్ (బి)అర్ష్‌దీప్ 23, డకెట్ (సి)రూట్ (బి)అర్ష్‌దీప్ 34, బంటన్ (సి)రాహుల్ (బి)కుల్దీప్ 38, రూట్ (బి)అక్షర్ 24, బ్రూక్ (బి)హర్షిత్ రాణా 19, బట్లర్ (బి)హర్షిత్ రాణా 6, లివింగ్‌స్టోన్ (స్టంప్)కుల్దీప్ (బి)సుందర్ 9, అట్కిన్సన్ (బి)అక్షర్ 38, రషీద్ (బి)హార్దిక్ పాండ్యా 0, వుడ్ (సి)శ్రేయస్ (బి)హార్దిక్ 9, మహమూద్ (నాటౌట్) 2, అదనం 12. (34.2ఓవర్లలో ఆలౌట్) 214పరుగులు.

వికెట్ల పతనం: 1/60, 2/80, 3/126, 4/134, 5/154, 6/161, 7/174, 8/175, 9/193, 10/214

బౌలింగ్: అర్ష్‌దీప్ 5-0-33-2, హర్షిత్ రాణా 5-1-31-2, సుందర్ 5-0-43-1, అక్షర్ 6,2-1-22-2, హార్దిక్ పాండ్యా 5-0-38-2, కుల్దీప్ 8-0-38-1.



'బ్రహ్మా ఆనందం' హిట్ ఖాయం : చిరు

'మళ్ళీ రావా, ఏజెంట్ సాయి శ్రీనివాస ఆత్రేయ, మసూద' వంటి హిట్ల తరువాత స్వధర్మ్ ఎంటర్‌టైన్‌మెంట్ నుంచి 'బ్రహ్మా ఆనందం' అనే చిత్రం రాబోతోంది. బ్రహ్మానందం, ఆయన తనయుడు రాజా గౌతమ్ ప్రధాన పాత్రలు పోషించారు. ప్రియా వడ్లమాని, ఐశ్వర్య హోలక్కల్ కీలక పాత్రల్లో కనిపించనున్నారు. సావిత్రి, ఉమేష్ కుమార్ సమర్పణలో రూపొందించిన ఈ చిత్రాన్ని నూతన దర్శకుడు నిఖిల్ తెరకెక్కించారు. నిర్మాత రాహుల్ యాదవ్ నక్కా ఈ సినిమాను 14న రిలీజ్ చేయబోతున్నారు. ఈ నేపథ్యంలో నిర్వహించిన ప్రీ రిలీజ్ ఈవెంట్‌కి చిరంజీవి ముఖ్య అతిథిగా విచ్చేయగా, దర్శకులు నాగ్ అశ్విన్, అనిల్ రావిపూడి సందడి చేశారు. చిరంజీవి మాట్లాడుతూ, 'బ్రహ్మానందం తన కొడుకుతో కలిసి చేసిన ఈ మూవీని అందరూ ఆదరించాలి. ఈ మూవీని తీసిన నిఖిల్, నిర్మాత రాహుల్‌కు ఆల్ ది బెస్ట్. రఘు బాబు, వెన్నెల కిషోర్, రాజీవ్ కనకాల వంటి వారు నటించడంతో పరిపూర్ణత చేకూరినట్టు అయింది. ప్రియ, ఐశ్వర్య, దివిజలకు ఆల్ ది బెస్ట్. ఇలాంటి చిత్రాలను ఆదరించండి. ఇలాంటి వేడుకకు నన్ను పిలిచిన నా సోల్ మేట్ బ్రహ్మానందంకు థ్యాంక్స్. ఈనెల14న ఈ చిత్రం పెద్ద హిట్ అవుతుంది. నీకు (బ్రహ్మానందం) పుత్రోత్సాహం కలుగుతుంది. నేను ఎలాగైతే పుత్రోత్సాహాన్ని పొందుతున్నానో.. నువ్వు (బ్రహ్మానందం) కూడా అంతే పుత్రోత్సాహాన్ని పొందుతావు' అని అన్నారు.

'నిర్మాత రాహుల్‌కు ఎంతో ప్యాషన్ ఉంది. డైరెక్టర్ నిఖిల్ అద్భుతంగా తీశాడు. ఇదొక తాత, మనవడు మధ్య జరిగే కథ. వెన్నెల కిషోర్ వల్లే రాజా గౌతమ్ ఈ ప్రాజెక్ట్‌లోకి వచ్చాడు. హద్దులు లేనటువంటి వారే చిరంజీవి. నన్ను చేయి పట్టుకుని విమానం ఎక్కించుకుని తీసుకొచ్చారు. ఇప్పుడు నా బిడ్డని ఈ విమానం ఎక్కిస్తున్నారు. ఈ మూవీని చూశాను. చాలా అద్భుతంగా ఉంది' అని బ్రహ్మానందం చెప్పారు.

ప్రేమికుల రోజు కానుక..



హీరో సిద్ధు జొన్నలగడ్డ నటించిన రొమాంటిక్ కామెడీ మూవీ 'కృష్ణ అండ్ హిజ్ లీల'. కరోనా సమయంలో ఓటీటీలో నేరుగా విడుదలైన ఈ సినిమా మంచి విజయాన్ని సాధించింది.

రవికాంత్ పెరెపు దర్శకత్వంలో రానా దగ్గుబాటి, సంజయ్ రెడ్డి నిర్మించిన ఈ చిత్రంలో శ్రద్ధా శ్రీనాథ్, సీరత్ కపూర్, షాలిని వడ్నికట్టి కీలక పాత్రల్లో నటించారు. రానా దగ్గుబాటి ఈ పాపులర్ చిత్రాన్ని ప్రేమికుల రోజున థియేటర్లలో విడుదల చేయనున్నారు. ఓటీటీలో మాత్రమే విడుదలైన ఈ చిత్రం ఈనెల 14న 'ఇట్స్ కాంప్లికేటెడ్' అనే టైటిల్‌తో ప్రేక్షకుల ముందుకు రానుంది.

రానా దగ్గుబాటి మాట్లాడుతూ, 'నాకు సిద్దు, రవికాంత్‌తో మరో సినిమా చేయాలని ఉండేది. ఇది రిలీజ్ చేస్తేగానే మరో సినిమా చేయనని అన్నారు(నవ్వుతూ). దీనికి ఈనెల 14 రైట్ డేట్. ఇది రీ రిలీజ్ కాదు. థియేటర్స్‌లో ఫస్ట్ టైం రిలీజ్' అని అన్నారు. 'ఈ సినిమాని థియేటర్స్‌లో ఆడియన్స్ చూడాలనేది నా స్ట్రాంగ్ ఫీలింగ్. థియేటర్స్‌లో ప్రేక్షకుల ఎగ్జైట్‌మెంట్ చూడాలని ఉంది' అని సిద్దు జొన్నలగడ్డ చెప్పారు. డైరెక్టర్ రవికాంత్ పెరెపు మాట్లాడుతూ,'లాక్ డౌన్‌లో ఈ సినిమా థియేటర్స్‌లో చూడటం కుదరలేదు. అందరితో కలిసి చూస్తే మజా వస్తుంది. ప్రేక్షకుల రియాక్షన్ కోసం వెయిట్ చేస్తున్నాం' అని తెలిపారు.

నవచిత్రం

ఇంత బీభత్సం ఎవరి కోసం?



విజయ్ దేవరకొండ

విజయ దేవరకొండ హీరోగా, గౌతమ్ తిన్ననూరి దర్శకత్వంలో రూపొందుతున్న చిత్రానికి 'కింగ్‌డమ్' అనే పవర్‌ఫుల్ టైటిల్‌ను ఖరారు చేసినట్లు నిర్మాతలు అధికారికంగా ప్రకటిం చారు. టైటిల్‌తో పాటు బుధవారం టీజర్‌ను కూడా ఆవిష్కరించారు. ఈ టీజర్ తెలుగు వెర్షన్‌కి ఎన్టీఆర్, తమిళ వెర్షన్‌కి సూర్య, హిందీ వెర్షన్‌కి రణబీర్ కపూర్ వాయిస్ ఓవర్ అందించారు. 'ఈ అలజడి ఎవరి కోసం..;, ఇంత బీభత్సం ఎవరి కోసం.. అంటూ ఎన్టీఆర్ వాయిస్ ఓవర్‌తో సాగిన టీజర్ అందర్నీ మెస్మరైజ్ చేస్తోంది. అందరి అంచనాలకు ఏమాత్రం తగ్గకుండా టీజర్ కట్టిపడేసింది. విజయ్ తన స్టార్‌డమ్‌కి తగిన సరైన కథ వస్తే.. ఏం చేయగలరో కేలవం టీజర్‌తోనే రుజువు చేశారు. 'జెర్సీ' వంటి కల్ట్ క్లాసిక్ తర్వాత గౌతమ్ తిన్ననూరి దర్శకత్వంలో రూపుదిద్దుకుంటున్న చిత్రమిది. సంగీత సంచలనం అనిరుధ్ తనదైన నేపథ్య సంగీతంతో మరోసారి కట్టిపడేశారు. ఛాయాగ్రాహకులు జోమోన్ టి.జాన్, గిరీష్ గంగాధరన్ తమ కెమెరా పనితనంతో చిత్రానికి మరింత అందం తీసుకురాబోతున్నారు. వరుస ఘన విజయాలను సొంతం చేసుకుంటున్న సితార ఎంటర్‌టైన్‌మెంట్స్, ఫార్చ్యూన్ ఫోర్ సినిమాస్ పతాకాలపై సూర్యదేవర నాగ వంశీ, సాయి సౌజన్య ఈ చిత్రాన్ని ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్నారు. శ్రీకర స్టూడియోస్ సమర్పిస్తోంది.

మే 30వ తేదీన ఈ సినిమా విడుదల కానుంది. విడుదల తర్వాత ఈ చిత్రం బాక్సాఫీస్ దగ్గర సరికొత్త సంచలనాలు సృష్టించి, ఘన విజయం సాధిస్తుందని నిర్మాతలు నమ్మకంగా ఉన్నారు.

మెగాస్టారే అలా అన్నారంటే..?



విశ్వక్‌సేన్

"భామనే సత్యభామనే, మేడం, చిత్రం భళారే విచిత్రం, రెమో' సినిమాలు చూసినప్పుడు ఆర్టిస్టుగా లేడీ గెటప్ చేయాలనుకున్నాను. అందుకే 'లైలా' కథ నా దగ్గరికి వచ్చినప్పుడు అంగీకరించా' అని హీరో విశ్వక్‌సేన్ అన్నారు.

రామ్ నారాయణ్ దర్శకత్వంలో షైన్ స్క్రీన్స్ బ్యానర్‌పై సాహు గారపాటి నిర్మించిన చిత్రం 'లైలా'. ఆకాంక్ష శర్మ హీరోయిన్. ఈ సినిమా ఈనెల 14న బిగ్ స్క్రీన్స్‌లో విడుదల కానుంది.

ఈ సందర్భంగా హీరో విశ్వక్‌సేన్ మీడియాతో ముచ్చటించారు.

- ప్రేక్షకులు ఇప్పుడు కొత్త కథలని, థీమ్స్‌ని కోరుకుంటున్నారు. ఈ జనరేషన్‌లో ఒక హీరో అమ్మాయి పాత్ర వేయడం గత 20 ఏళ్లుగా మనం చూడలేదు. పైగా దర్శకుడు రామ్ నారాయణ్ ఈ కథ చెప్పినంత సేపు విపరీతంగా ఎంజాయ్ చేశాను. ఇలాంటి నవ్వులు జనాలకి ఎందుకు ఇవ్వకూడదని అనిపించింది. దీంతో ఈ సినిమా చేశా.
- సోను మోడల్, లైలాగా ఇందులో నటించా. ఈ రెండు క్యారెక్టర్స్‌లో నాకు బాగా ఇష్టమైన క్యారెక్టర్ లైలా. అయితే సోను క్యారెక్టర్‌కి మీరు ఫ్యాన్స్ అయిపోతారు. లైలాగా సోను మారడానికి మూడు సమస్యలు వస్తాయి. ఆ మూడు సమస్యల నుంచి బయటపడటానికి లైలాగా మారుతాడు. అవి ఏంటనేది మీరు బిగ్ స్క్రీన్ మీద చూడాలి. లైలా గెటప్‌లో చూసి మా ఇంట్లో వాళ్ళు చాలా ఎంజాయ్ చేశారు. నవ్వులు, వెక్కిరింతలు అన్నీ జరిగాయి. ఇంట్లో వాళ్ళ ఎంటర్టైన్మెంట్ వేరు. మా అత్తయ్య, మమ్మీ మ్యాచింగ్ చీరలు కట్టుకొని వచ్చారు (నవ్వుతూ).
- ట్రైలర్‌లో ఎక్కువ అడల్ట్ కంటెంట్ కనిపిస్తుందని అంటున్నారు. అది అడల్ట్ కాదండి. ఇది యూత్‌ఫుల్ కంటెంట్. అవుట్ అండ్ అవుట్ ఎంటర్‌టైనర్. నేను రాసిన పాటలు మా దర్శకుడికి నచ్చి ఇందులో వాడటం హ్యాపీగా అనిపించింది. సాహు సినిమా క్రాఫ్ట్ తెలిసిన నిర్మాత. నేను ఈ క్యారెక్టర్ చేయగలని ముందు నమ్మింది ఆయనే. రిచర్డ్ ప్రసాద్ అమెజింగ్ విజువల్స్ ఇచ్చారు. లియోన్ జేమ్స్ సాంగ్స్‌కి వండర్‌ఫుల్ రెస్పాన్స్ వచ్చింది.
- ట్రైలర్ చూసి మెగాస్టార్ ప్రీ రిలీజ్ స్టేజ్ మీద 'నాకే కొరకాలనిపిస్తుందని' చెప్పడం బెస్ట్ కాంప్లిమెంట్. 'లైలా' నా కెరీర్‌లో గుర్తిండిపోయే సినిమా అవుతుందనే నమ్మకం ఉంది.

నిద్ర చుట్టూ తిరిగే కథ..



రోష్నీ సాహోతా, ఆనంద్ వర్ధన్

ప్రేమించుకుందాం రా, సూర్యవంశం, మనసంతా నువ్వే' లాంటి ఎన్నో సూపర్ హిట్ చిత్రాలతో ప్రేక్షకులని అలరించిన పాపులర్ చైల్డ్ ఆర్టిస్ట్ ఆనంద్ వర్ధన్ హీరోగా పరిచయం అవుతున్నారు. ప్రసన్న కుమార్ దేవరపల్లి దర్శకత్వంలో ఏఆర్ ఎంటర్‌టైన్మెంట్స్, శ్రీజ మూవీ మేకర్స్ బ్యానర్స్ పై సామ్, వంశీ కృష్ణ వర్మ నిర్మించిన చిత్రం 'నిదురించు జహాపన'.

నవమి గయాక్, రోష్ని సాహోతా హీరోయిన్స్‌గా నటించారు. ఈ సినిమా ఈనెల 14న రిలీజ్ కానుంది. ఈ సందర్భంగా మేకర్స్ నిర్వహించిన ప్రీరిలీజ్ ఈవెంట్‌లో హీరో ఆనంద్ వర్ధన్ మాట్లాడుతూ,'ఈ సినిమా మాకు చాలా స్పెషల్. ప్రేక్షకులకు కొత్త అనుభూతిని ఇవ్వాలని కొత్త కథ చెప్పాలనే లక్ష్యంతో చేసిన సినిమా. ఒక అద్భుతమైన కాన్సెప్ట్ మీరు చూస్తారని మనస్ఫూర్తిగా నమ్ముతున్నాను. ఒక లవ్ స్టోరీకి, నిద్రకి ఏమిటి సబంధం అనేదే ఈ సినిమా' అని తెలిపారు. 'ఈ సినిమా మొత్తం నిద్ర చుట్టూ ఉంటుంది' అని డైరెక్టర్ ప్రసన్న కుమార్ దేవరపల్లి చెప్పారు. నిర్మాతలు సామ్, వంశీకృష్ణ వర్మ మాట్లాడుతూ, 'ఓ సరికొత్త కాన్సెప్ట్‌తో తీసిన ఈ సినిమా తప్పకుండా మీ అందర్నీ మెప్పిస్తుంది' అని చెప్పారు.

'తల' రిలీజ్‌కి రెడీ

దీపా ఆర్ట్స్ బ్యానర్ పై శ్రీనివాస్ గౌడ్ నిర్మాణంలో అమ్మ రాజశేఖర్ దర్శకత్వం వహించిన సినిమా 'తల'. అమ్మ రాజశేఖర్ తనయుడు అమ్మ రాగిన్ రాజ్ ఈ చిత్రంతో హీరోగా పరిచయం అవుతున్నారు. అంకిత నస్కర్ హీరోయిన్.

ఈ నెల 14న విడుదల కాబోతోన్న ఈ మూవీ ప్రీ రిలీజ్ ఈవెంట్ ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా వచ్చిన దర్శకుడు వి.ఎన్.ఆదిత్య మాట్లాడుతూ,'గ్లింప్స్ బావున్నాయి. రాగిన్ రాజ్ బాగా ఆకట్టుకున్నాడు. మంచి ఫ్యూచర్ ఉందని అర్థం అవుతుంది. మ్యూజిక్ డైరెక్టర్ ధర్మతేజ పాటలు ఎక్సలెంట్‌గా చేశారు. సినిమా విజయం సాధించాలని ఆశిస్తున్నాను' అని అన్నారు. 'ఈ మూవీతో మునుపటి అమ్మ రాజశేఖర్‌ను చూస్తారు. ఈ కథ నాకు చాలా బాగా నచ్చింది. రాగిన్ రాజ్ తప్పకుండా పెద్ద హీరో అవుతాడు. అన్ని రకాల ఎమోషన్స్‌తో మీ అందరినీ ఖచ్చితంగా ఎంటర్‌టైన్ చేస్తుంది' అని నిర్మాత, డిస్ట్రిబ్యూటర్ శ్రీనివాస్ గౌడ్ అన్నారు.



హీరో రాగిన్ రాజ్ మాట్లాడుతూ, 'ఈ సినిమాతో కొత్త యాక్టర్‌గా పరిచయం అవుతున్నాను. నాకు మీ అందరి ఆశీర్వాదాలు కావాలి' అని చెప్పారు. దర్శకుడు అమ్మ రాజశేఖర్ మాట్లాడుతూ, 'ఇది నాకు ఛాలెంజింగ్ మూవీ. నిర్మాత శ్రీనివాస్ గౌడ్ చేసిన సపోర్ట్ లైఫ్ లాంగ్ మర్చిపోను' అని చెప్పారు.

నవ్వించే 'బద్మాషులు'

మహేష్ చింతల, విద్యాసాగర్ కారంపురి, మురళీధర్ గౌడ్ లీడ్ రోల్స్‌లో నటించిన చిత్రం 'బద్మాషులు'. శంకర్ చేగూరి దర్శకుడు. తార స్టోరీ టెల్లర్స్ బ్యానర్ పై బి.బాలకృష్ణ, సి.రామ శంకర్ ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. తాజాగా మేకర్స్ టీజర్‌ని లాంచ్ చేశారు. ఈ టీజర్ లాంచ్ ఈవెంట్‌కి ముఖ్య అతిథిగా హాజరైన హీరో రాగ్ మయూర్ మాట్లాడుతూ, 'రూటెడ్ డ్రామాలకి మంచి డిమాండ్ ఉంది. ప్రేక్షకులు చాలా రిలేట్ చేసుకుంటున్నారు. 'సినిమా బండి', 'సివరపల్లి'లోని వైబ్ ఈ టీజర్‌లో కనిపించింది. చాలా ఆర్గానిక్ అండ్ ఫన్నీగా ఉంది. ప్యూర్ కామెడీ ఉంది. ఈ సినిమా పెద్ద సక్సెస్ కావాలని కోరుకుంటున్నాను' అని అన్నారు.



'టీజర్ జస్ట్ ఒక ఫ్లేవర్ మాత్రమే. సినిమా అవుట్ అండ్ అవుట్ కామెడీ. చాలా క్లీన్ ఎంటర్ టైనర్. మీరు ఖచ్చితంగా ఎంజాయ్ చేస్తారు' అని డైరెక్టర్ శంకర్ చేగూరి చెప్పారు. మహేష్ చింతల మాట్లాడుతూ, 'ఈ సినిమాలో లీడ్ రోల్ ఛాన్స్ ఇచ్చిన శంకర్‌కి థ్యాంక్స్' అని అన్నారు. 'ఈ సినిమాలో హెల్దీ కామెడీ చేశాం. తప్పకుండా మీ అందరూ ఎంజాయ్ చేస్తారు' అని విద్యాసాగర్ చెప్పారు.

డీవోపీ వినీత్ పబ్బతి మాట్లాడుతూ, సినిమా చాలా అద్భు తంగా వచ్చింది. ప్రతి ప్రేక్షకుడిని నవ్వించే సినిమా ఇది. ఓ మంచి సినిమాతో ప్రేక్షకుల ముందుకు రాబోతున్నాం' అని అన్నారు.

Printed and Published by Nandayala Narsimha Reddy On behalf Of Navatelangna Printers Private Limited, Printed At M.H Bhavan, 1st Floor, Plot No. 21/1, Azamabad Near Rtc Kalyana Mandapam, Baghlingampally, Hyderabad-500020,Telangana State, Published at Navatelangana Printers Private Limited, M.H Bhavan,1st Floor No.21/1, Azamabad, Near Rtc Kalyana Mandapam, Baghlingampally, Hyderabad-500020, Telangana State, Editor : R.Sudha Bhaskar TELTEL/2014/59462.

బిజినెస్

ఆరో రోజూ నష్టాల పరంపర

- ఇంట్రాడేలో సెన్సెక్స్ 900 పాయింట్ల పతనం
- వీడని ట్రంప్ టారిఫ్ భయాలు



ముంబయి : వరుసగా ఆరో సెషన్‌లోనూ భారత స్టాక్ మార్కెట్లలో నష్టాల పరంపర కొనసాగింది. అమెరికా అధ్యక్షుడు ట్రంప్ సుంకాల భయాలు, ఎఫ్‌ఐఐలు తరలిపోవడం, భారత జీడీపీ వృద్ధిపై అనుమానాలు ఇన్వెస్టర్లను ఆందోళనకు గురి చేశాయి. ఈ నేపథ్యంలోనే బుధవారం ఇంట్రాడేలో బీఎస్ఈ సెన్సెక్స్ ఏకంగా 905 పాయింట్లు పతనమై 76వేల దిగువకు పడిపోయి 75,388 కనిష్టాన్ని తాకింది. మధ్యాహ్నం తర్వాత కొంత కొనుగోళ్లు పుంజుకున్నప్పటికీ.. తుదకు 122.52 పాయింట్ల నష్టంతో 76,171 వద్ద ముగిసింది. ఎన్ఎస్ఈ నిఫ్టీ 26 పాయింట్లు కోల్పోయి 23,045కు చేరింది. ఫిబ్రవరి నాలుగో తేదీ నుంచి సెన్సెక్స్ 2,412.73 పాయింట్లు లేదా 3.07 శాతం, నిఫ్టీ 694 పాయింట్లు 2.92 శాతం చొప్పున నష్టపోయాయి.

సెన్సెక్స్-30లో మహీంద్రా అండ్ మహీంద్రా, ఐటీసీ, పవర్‌గ్రిడ్, రిలయన్స్ ఇండస్ట్రీస్, ఇండస్ఇండ్ బ్యాంక్, అదానీ పోర్ట్స్, టైటాన్, ఇన్ఫోసిస్ షేర్లు అధికంగా నష్టపోయిన వాటిలో టాప్‌లో ఉన్నాయి. మరోవైపు బజాజ్ ఫిన్ సర్వ్, టాటా స్టీల్, లార్సెన్ అండ్ టర్బో, అల్ట్రా టెక్ సిమెంట్, కోటక్ మహీంద్రా బ్యాంక్, టాటా మోటార్స్ తదితర షేర్లు అధికంగా లాభపడిన వాటిలో ముందు వరసలో ఉన్నాయి. మంగళవారం నాటికి రూ. 4,486.41 కోట్ల విలువైన ఎఫ్‌ఐఐలు తరలిపోయాయి. డాలరుతో రూపాయి మారకం విలువ 9 పైసలు బలహీన పడి 86.88 వద్ద నమోదయ్యింది. ఏషియన్ మార్కెట్లలో సియోల్, టోక్యో, షాంఘై, హాంకాంగ్ మార్కెట్లు సానుకూలంగా నమోదయ్యాయి.

కావేరీ సీడ్స్ లాభాల్లో 29 శాతం వృద్ధి

హైదరాబాద్ : ప్రముఖ విత్తనాల కంపెనీ కావేరీ సీడ్స్ 2024-25 డిసెంబర్‌తో ముగిసిన మూడో త్రైమాసికం (క్యూ3)లో 29.05 శాతం వృద్ధితో రూ.15.04 కోట్ల నికర లాభాలు ప్రకటించింది. ఇంతక్రితం ఏడాది ఇదే త్రైమాసికంలో రూ.11.66 కోట్ల లాభాలు నమోదు చేసింది. ఇదే సమయంలో రూ.118.47 కోట్లుగా ఉన్న రెవెన్యూ.. గడిచిన క్యూ3లో 30.63 శాతం పెరిగి రూ.154.77 కోట్లకు చేరినట్లు తెలిపింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం తొలి తొమ్మిది మాసాల్లో 1.46 శాతం పెరుగుదలతో రూ.294.46 కోట్ల నికర లాభాలు ఆర్జించినట్టు పేర్కొంది. వరి, మొక్కజొన్న విభాగాల్లో మెరుగైన ప్రగతిని కనబర్చినట్టు ఆ కంపెనీ సీఎండీ జివి భాస్కర్ రావు తెలిపారు.

నాట్కో ఫార్మాకు రూ.133 కోట్ల లాభాలు

హైదరాబాద్ : ప్రముఖ ఔషధ ఉత్పత్తుల కంపెనీ నాట్కో ఫార్మా 2024-25 డిసెంబర్‌తో ముగిసిన మూడో త్రైమాసికం (క్యూ3)లో 37 శాతం పతనంతో రూ.133 కోట్ల నికర లాభాలు నమోదు చేసింది. ఇంతక్రితం ఏడాది ఇదే త్రైమాసికంలో రూ.212.70 కోట్ల లాభాలు ప్రకటించింది. ఇదే సమయంలో రూ.758.60 కోట్లుగా ఉన్న రెవెన్యూ.. గడిచిన క్యూ3లో 37.4 శాతం క్షీణించి రూ.474.80 కోట్లకు పరిమితమయ్యింది. 2024-25కు గాను మూడో మధ్యంతర డివిడెండ్ కింద ప్రతీ రూ.2 ముఖ విలువ కలిగిన షేర్‌పై రూ.1.50 చెల్లించడానికి ఆ కంపెనీ బోర్డు ఆమోదం తెలిపింది. రికార్డ్ తేదిని ఫిబ్రవరి 18గా నిర్ణయించింది.

ఎయిర్‌టెల్ పేమెంట్ బ్యాంక్ లాభాల్లో 70 శాతం వృద్ధి

న్యూఢిల్లీ : ప్రస్తుత ఆర్థిక సంవత్సరం అక్టోబర్ నుంచి డిసెంబర్‌తో ముగిసిన మూడో త్రైమాసికం (క్యూ3)లో ఎయిర్‌టెల్ పేమెంట్స్ బ్యాంక్ నికర లాభాలు 70 శాతం పెరిగి రూ.18.5 కోట్లకు చేరాయి. సంస్థ రెవెన్యూ 49 శాతం పెరిగి రూ.700 కోట్ల మైలురాయిని చేరినట్లు వెల్లడించింది. గడిచిన త్రైమాసికంలో నెలసరి లావాదేవీల సంఖ్య 62 శాతం పెరిగి 10 కోట్లు దాటినట్లు తెలిపింది. వినియోగదారుల సగటు నిల్వ 42 శాతం వృద్ధితో రూ.3,332కు చేరిందని బ్యాంక్ ఎండి, సిఇఒ అనుబ్రత బిస్వాస్ పేర్కొన్నారు. దేశంలోనే మూడో అతిపెద్ద మొబైల్ బ్యాంకింగ్ ఉన్నామన్నారు.

ప్రోస్టర్మ్ ఇన్ఫో ఐపీఓకు సెబీ అనుమతి

ముంబయి : పవర్ సొల్యూషన్స్ ప్రొడక్ట్స్ కంపెనీ ప్రోస్టర్మ్ ఇన్ఫో సిస్టమ్స్ ఇన్షియల్ పబ్లిక్ ఆఫర్ (ఐపీఓ) కోసం చేసుకున్న దరఖాస్తుకు మార్కెట్ రెగ్యూలేటర్ సెబీ అనుమతి ఇచ్చింది. ఈ ఇష్యూలో రూ.10 ముఖ విలువ కలిగిన 1.6 కోట్ల ఈక్విటీ షేర్లను జారీ చేయనున్నట్లు ఆ కంపెనీ ప్రతిపాదిత పత్రాల్లో తెలిపింది. ఈ నిధులను పెట్టుబడి మూలధనం, రుణాల చెల్లింపు, వృద్ధి అవకాశాలు, సాధారణ కార్పొరేట్ అవసరాల కోసం ఉపయోగించనుంది. 2023-24 నాటికి తమకు ఎల్అండ్‌టి, టాటా పవర్, బజాజ్ ఫైనాన్స్ సహా 700 పైగా క్లయింట్స్ ఉన్నారని ఆ కంపెనీ తెలిపింది. 2023-24లో 18 శాతం వృద్ధితో రూ.22.8 కోట్ల నికర లాభాలు సాధించింది.

చి'వరి'కి చేరని గోదావరి జలాలు

విడతల వారీగా నీటి విడుదలతో చివరి ఆయకట్టుకు అందని వైనం

రెండు విడతలు నీరు విడుదలైనా పూర్తి స్థాయిలో నిండని చెరువులు

గోదావరి నీళ్లపై ఆశతో వరిసాగు చేసిన రైతులు

అరకొర నీళ్లిచ్చి చేతులు దులిపేసుకున్న అధికారులు





నవతెలంగాణ - సూర్యాపేట

సూర్యాపేట జిల్లాకు వరప్రదాయినిగా మారిన శ్రీరాంసాగర్ రెండో దశ నీటి విడుదల ప్రశ్నార్థకంగా మారింది. అరకొరగా వచ్చే నీరు చివరి భూములకు అందడం లేదు. దీంతో వరి పైరు ఎండుముఖం పడుతోంది. సూర్యాపేట జిల్లాలో రబీ సీజన్‌లో సుమారు 4.5 లక్షల ఎకరాల్లో వరి సాగు జరుగుతోంది. కొందరు రైతులు బోర్లు, బావులపై ఆధారపడి సాగు చేస్తే.. మరికొందరు ఎన్ఎస్పీ, ఎస్సారెస్పీ జలాలపై ఆధారపడి సాగు చేస్తారు. జిల్లాలో ఎస్సారెస్పీ అతి పెద్ద ఆయకట్టుగా ఉంది. ప్రతి సీజన్‌లాగానే ఎస్సారెస్పీ రెండో దశ ఆయకట్టు కింద ఉన్న రైతులు గోదావరి జలాలపై ఎన్నో ఆశలు పెట్టుకున్నారు. వరి సాగు ఎక్కువగా జరిగింది. కాగా ఈ సీజన్‌కు వారబంధీ పద్ధతిలో జనవరి 1 నుంచి మార్చి 31 వరకు నీటిని విడుదల చేస్తామని అధికారులు ప్రకటించగా, ఇప్పటికే రెండు విడతల్లో నీరు విడుదలైనా మొదటి వరుసలో ఉన్న చెరువులు మాత్రమే నిండాయని చివరి వరకు నీటి సరఫరా జరగడం లేదని రైతులు అంటున్నారు.

నీటి కష్టాలు..

ఈ యాసంగిలో తొలి దశలోనే రైతులు నీటి కోసం ఆందోళనలు చేశారు. ఎస్సారెస్పీ కాల్వల నుంచి ఇటీవల వారం రోజులపాటు నీటిని విడుదల చేయగా సగం పొలాలకు కూడా చేరుకోలేదు. అర్వపల్లి, తుంగతుర్తి, మద్దిరాల, నాగారం మండలాలతోపాటు చివ్వెంల, నడిగూడెం, మునగాల, పెన్‌పహాడ్ మండలాల్లోని చాలా వరకు కాల్వల్లో నీళ్లు పారడం లేదు. బావులు, బోర్ల కింద ఇప్పటికే పైర్లు ఎండిపోతున్నాయి. తుంగతుర్తి నియోజకవర్గ పరిధిలోని పలు గ్రామాల్లో కాల్వల్లో నీళ్లు రావడం లేదని, వేసిన నాట్లు ఎండిపోతున్నాయని రైతులు తెలిపారు.

ఇలాగే నీటిని విడదల చేస్తే వరి పంట చేతికి వచ్చేదెలా అని ఆందోళనలు చేస్తున్నారు.

గోదావరి నీటి విడుదలపైనే ఆశలు..

2018 నుంచి ప్రతి ఏడాదీ రెండు సీజన్‌లకు క్రమం తప్పకుండా గోదావరి జలాలు రావడంతో రైతులు ఆరుతడి పంటలకు స్వస్తి పలికి.. రెండు సీజన్లలో వరి ధాన్యాన్ని పండిస్తున్నారు. ఈ సీజన్లో కూడా ఎక్కువ శాతం వరి సాగు చేశారు. అయితే ఆరుతడి పంటలకు ఉపయోగపడేలా ఈ సీజన్‌లో వారబంధీ పద్ధతిలో నీటిని విడుదల చేస్తున్నట్టు అధికారులు తెలిపారు. ఇప్పటికే రెండు విడతల్లో నీరు విడుదలైంది. ముందు వరుసలో ఉన్న పొలాలకు మాత్రమే నీరు అందుతోందని, చివరి భూములకు రావడం లేదని రైతులు ఆవేదన చెందుతున్నారు.

ప్రశ్నార్థకంగా ఆయకట్టు

గోదావరి జలాలు సకాలంలో అందక 2024 యాసంగి సీజన్‌లో జిల్లాలోని 2లక్షల ఎకరాల ఆయకట్టు బీడుగా మారింది. అయితే, సన్నాలు పండించిన రైతులకు రూ.500 బోనస్ ఇస్తుండటంతో రైతులు ఈ సీజన్‌లో కూడా వరి సాగుకు మొగ్గు చూపారు. వరిపంట చేతికి రావాలంటే క్రమం తప్పకుండా నీటిని విడుదల చేయాల్సి ఉంటుంది. చెరువులు పూర్తి స్థాయిలో నిండే వరకైనా నీటికి విడుదల చేయాలని కోరుతూ రైతులు ఆందోళనలు, ధర్నాలు చేస్తున్నారు.

చెరువులు వెలవెల..

జిల్లాలో మొత్తం 1,225 చెరువులు ఉండగా, 967 చెరువులు ఎస్సారెస్పీ కింద ఉన్నాయి. ఈ చెరువులు సూర్యాపేట, తుంగతుర్తి పరిధిలో ఉన్నాయి. నాగార్జునసాగర్ నిండటంతో కోదాడ, హుజూర్‌నగర్ నియోజకవర్గాల్లోని చెరువులు నిండే అవకాశం ఉంటుంది. తుంగతుర్తి, సూర్యాపేట నియోజకవర్గాల రైతులకు నీరందించే ఎస్సారెస్పీ కాల్వకు నేటికీ నీటి విడుదల జరగలేదు. ఎప్పుడు నీరు విడుదల చేస్తారనే విషయంపై స్పష్టత కూడా లేదు. నీటిని విడుదల చేస్తేనే చెరువులు నిండే అవకాశం ఉంది.

పంటలకు పూర్తి స్థాయిలో నీటిని విడుదల చేయాలి



పంటలకు పూర్తి స్థాయిలో నీటిని విడుదల చేయాలి. నీటి నిర్వహణ విషయంలో ప్రభుత్వం అప్రమత్తంగా ఉండని పక్షంలో పంటలకు భారీ నష్టం వాటిల్లే ప్రమాదం ఉంది. ఎస్సారెస్పీ ఆయకట్టు పరిధిలోని చెరువులు, కుంటల కింద మరో 45వేల ఎకరాలు మొత్తం 2.95 లక్షల ఎకరాల ఆయకట్టు ఉన్నది. యాసంగిలో పంటలు పూర్తి స్థాయిలో చేతికి అందాలంటే గతంలో ఇచ్చినట్టు నీటిని సరఫరా చేయాలి. రైతులకు నష్టం చేకూరితే వారి వెంట పార్టీ అండగా ఉండి పోరాడుతుంది.

- సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి మల్లు నాగార్జున రెడ్డి

వారబంధీ విధానంలో నీటి విడుదల

ప్రభుత్వ ఆదేశాల మేరకు యాసంగి పంటల సాగుకు శ్రీరాంసాగర్ ప్రాజెక్టు రెండో దశ ద్వారా నీటిని జనవరి ఒకటి నుంచి వారబంధీ విధానంలో విడుదల చేస్తున్నాం. ఇది కూడా జిల్లాలో ఆరుతడి పంటల సాగు కోసం ప్రణాళికను ప్రభుత్వం ప్రకటించింది. కానీ, రైతులు అధికంగా వరి వేయడం వల్ల ఇబ్బందులు వస్తున్నాయి. జనవరి 1 నుంచి 8 వరకు, 16 నుంచి 23, 31 నుంచి ఫిబ్రవరి 7, 15 నుంచి 22, మార్చి 2 నుంచి 9 వరకు ఆఖరిగా మార్చి 17 నుంచి 24 వరకు నీటి విడుదల చేస్తాం.

-ఇరిగేషన్ ఈఈ శ్రీనివాస్ రావు

మండె మెలిగే.. మేడారం వెలిగే..

శుద్ధి పండుగతో ప్రారంభమైన మినీ మేడారం జాతర

నవతెలంగాణ -తాడ్వాయి

ప్రపంచంలోనే అతిపెద్ద గిరిజన జాతరగా పేరుగాంచిన మేడారం సమ్మక్క-సారలమ్మల మినీ జాతర బుధవారం ఉదయం ప్రారంభమైంది. వడ్డెలు సమ్మక్క-సారలమ్మ కొలువైన మేడారం, కన్నెపల్లికి ద్వార బంధనం చేసి జాతర ప్రారంభించారు. సమ్మక్క పుట్టిన బయ్యక్కపేట, సారలమ్మ జన్మించిన కన్నెపల్లి, జంపన్న, నాగులమ్మ కొలువైన కొండాయి, పగిడిద్దరాజు కొలువైన పూనుగొండ్ల లోనూ జాతరల సందడి నెలకొంది. ములుగు శివారు గట్టమ్మ ఆలయం వద్ద భక్తుల రద్దీ నెలకొంది. భక్తులు మేడారం చిన్నజాతరకు వెళ్తూ గట్టమ్మను దర్శనం చేసుకుంటున్నారు. ఈ క్రమంలో ములుగు మన్నెంలో జాతరల సందడి నెలకొంది. మేడారం, కన్నెపల్లిలో మండెమెలిగే పండుగను సమ్మక్క-సారలమ్మ పూజారులు ఘనంగా నిర్వహించారు. మొదటగా సమ్మక్క పూజా మందిరంలో తల్లి గద్దెను, పూజా సామగ్రిని పూజారులు సిద్ధబోయిన మునీందర్, కృష్ణయ్య శుద్ధి చేశారు. అనంతరం పూజారుల సంఘం అధ్యక్షులు సిద్ధబోయిన జగ్గారావు ఆధ్వర్యంలో పూజారుల కుటుంబాలకు చెందిన ఆడపడుచులు తల్లి గద్దెకు అలుకుపూతలు నిర్వహించి, ముగ్గులతో అలంకరించారు. అనంతరం ధూప, దీప నైవేద్యాలు సమర్పించి డోలివాయిద్యాల నడుమ గ్రామంలోని బొడ్రాయి, పోచమ్మ గుళ్లకు చేరుకుని ప్రత్యేక పూజలు చేశారు. అక్కడి నుంచి



ప్రధాన పూజారి సిద్ధబోయిన నితిన్ ఇంటి నుంచి మామిడి తోరణాలు, పసుపు, కుంకుమలు తీసుకుని గ్రామ శివారుకు చేరుకుని ధ్వజ స్తంభాల వద్ద కల్లు, సాక బెట్టారు. అక్కడి నుంచి సమ్మక్క పూజా మందిరానికి చేరుకుని నైవేద్యం సమర్పించారు. మండెమెలిగే పండుగతో మినీ జాతర ప్రారంభమైనట్టు పూజారులు సంకేతాలు ఇచ్చారు. కన్నెపల్లిలోని సారలమ్మ దేవాలయంలో పూజారి కాక సారయ్య అమ్మవారి పూజా సామగ్రిని, పూజామందిరాన్ని నీటితో కడిగి శుభ్రం చేశారు. తల్లి అడెరాలను శుద్ధి చేసి అలంకరించారు. బొడ్రాయి వద్ద ప్రత్యేక పూజలు చేసి, అడెరాలకు చీరె, సారె, పసుపు, కుంకుమ సమర్పించారు. పూజామందిరాన్ని పూలతో అలంకరించారు. ఈ సందర్భంగా ఆర్టీసీ ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేసింది. ఈ కార్యక్రమంలో మేడారం ట్రస్ట్ బోర్డ్ చైర్మెన్ అర్రెం లచ్చు పటేల్, సమ్మక్క ప్రధాన పూజారి సిద్ధబోయిన మునిందర్, కొక్కర కృష్ణయ్య, మల్లెల సత్యం, బొక్కన్న, లక్ష్మయ్య సిద్ధబోయిన స్వామి, వసంతరావు, నర్సింగరావు, జనార్దన్, మేడారం అభ్యుదయ సంఘం అధ్యక్షులు సిద్ధబోయిన భోజారావు, మహేష్, వంశీ, సిద్ధబోన అరుణ్, అనిల్, సిద్ధబోయిన పాపారావు, సందీప్ దోబె నాగేష్, కొక్కెర రమేష్, రానా రమేష్, సిద్ధబోయిన సురేందర్, పూర్ణచందర్, పీరిల వెంకన్న వట్టం సమ్మయ్య, సారలమ్మ పూజారులు కాక సారయ్య, కాక కిరణ్, అమృత, కనకమ్మ, కాక వెంకటేశ్వర్లు, భుజంగరావు, సోలం వెంకటేశ్వర్లు, చేల సత్యం ఎల్ఐసీ హన్మకొండ బ్రాంచ్ అసిస్టెంట్ మేనేజర్, గ్రామ పెద్దలు, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

బర్డ్‌ఫ్లూ ఎఫెక్ట్..

మేడారం జాతరలో కోడిని గద్దెల వైపు ఎగురవేసి ఎదురుకోళ్ల మొక్కు సమర్పిస్తారు. అక్కడే విడిది చేసి వండుకొని బంధుమిత్రులతో విందు చేసుకుంటారు. అయితే పలు జిల్లాల్లో బాయిలర్ కోళ్లకు బర్డ్‌ఫ్లూ సోకుతుండటం, ప్రభుత్వం అప్రమత్తమై కొద్దిరోజులు చికెన్ తినొద్దని సూచిస్తున్న నేపథ్యంలో చిన్న జాతరపై ప్రభావం పడనుంది. బాయిలర్ కోళ్లను తినొద్దని ప్రభుత్వం చెప్పడంతో నాటుకోళ్లకు డిమాండ్ పెరిగింది.



రాష్ట్రంలో 93 లక్షల గృహాలకు డిజిటల్ కనెక్టివిటీ

ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్ బాబు

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలోని 93 లక్షల గృహాలను డిజిటల్ కనెక్టివిటీ పరిధిలోకి తీసుకురానున్నట్టు ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు తెలిపారు. టీ ఫైబర్ ద్వారా ప్రతి ఇంటికి ఇంటర్నెట్ సౌకర్యం కల్పించే కార్యక్రమాన్ని ప్రారంభించినట్టు బుధవారం హైదరాబాద్‌లోని సచివాలయంలో తనను కలిసిన ప్రపంచబ్యాంకు ప్రతినిధి బృందానికి వివరించారు. పైలట్ ప్రాజెక్ట్ కింద డిజిటలైజేషన్ చేపట్టిన నాలుగు గ్రామాలను ఈ బృందం సందర్శించి తమ అనుభవాలను మంత్రితో పంచుకుంది. హాజిపల్లి (రంగారెడ్డి జిల్లా), మద్దూర్ (నారాయణ్ పేట), సంగుపేట (సంగారెడ్డి), అడవి శ్రీరాంపూర్ (పెద్దపల్లి) గ్రామాల్లో ఇంటర్నెట్ కనెక్టివిటీ వల్ల స్థానికులకు కలిగిన ప్రయోజనాలను ప్రత్యక్షంగా తెలుసుకున్నట్టు వైజంతీ దేశాయ్, కింబర్లీ జాన్స్ ఆధ్వర్యంలోని ప్రపంచబ్యాంకు ప్రతినిధి బృందం వెల్లడించింది. మరో మూడేండ్లలో రాష్ట్రంలోని అన్ని గ్రామాలకు కనెక్టివిటీ విస్తరించాలని లక్ష్యంగా పెట్టుకున్నట్టు శ్రీధర్ బాబు వారికి వివరించారు.

తెలంగాణలో ఇప్పటికే 32 వేల కిలోమీటర్ల ఫైబర్ ఆప్టిక్ కేబుల్‌ను ఏర్పాటు చేసినట్టు వివరించారు. సమావేశంలో ఐటీ శాఖ డిప్యూటీ సెక్రెటరీ భవేశ్ మిశ్రా, టీ ఫైబర్ ఎండీ వేణు ప్రసాద్, ప్రపంచబ్యాంకు ప్రతినిధులు ఇషిరా మెహతా, అరుణ్ శర్మ స్యూ సంజ్ ఎంగ్ తదితరులు పాల్గొన్నారు.

రేపు పవర్‌పాయింట్ ప్రజెంటేషన్

కులగణన, ఎస్సీ వర్గీకరణపై క్యాడర్‌కు అవగాహన

నవతెలంగాణబ్యూరో -హైదరాబాద్

రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన కులగణన, ఎస్సీ వర్గీకరణపై క్యాడర్‌కు అవగాహన కల్పించేందుకు కాంగ్రెస్ సమయత్తమవుతోంది. టీపీసీసీ అధ్యక్షులు బొమ్మ మహేష్‌కుమార్‌గౌడ్ ఆధ్వర్యంలో దీనిపై శుక్రవారం పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ఇవ్వనున్నారు. మధ్యాహ్నం రెండు గంటలకు గాంధీభవన్ ఆవరణలోని ప్రకాశం హాల్ జరగనున్న ఈ కార్యక్రమానికి ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క, రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి దీపాదాస్ మున్షితోపాటు మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, చైర్మెన్లు, ఆఫీస్ బేరర్లు, డీసీసీ అధ్యక్షులు, అధికార ప్రతినిధులు హాజరు కానున్నారు.

కేటీఆర్‌కు మతిభ్రమించింది : ప్రభుత్వ విప్ రామచంద్ర నాయక్

మాజీ మంత్రి కేటీఆర్‌కు మతి భ్రమించిందని ప్రభుత్వ విప్ రామచంద్రనాయక్ ఎద్దేవా చేశారు. అందుకే సీఎం రేవంత్‌రెడ్డిపై అనుచితంగా మాట్లాడుతున్నారని విమర్శించారు. బుధవారం హైదరాబాద్‌లోని సీఎల్పీ కార్యాలయంలో ఆయన విలేకర్లతో మాట్లాడారు.అధికారం పోయిందన్న ఆవేదనతో మతిభ్రమించి పిచ్చి ప్రేలాపనలు పేలుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కేసీఆర్, ఆయన కుటుంబానికి సిగ్గు, శరం లేకుండా పోయిందన్నారు. అవినీతి డబ్బుతో సోషల్ మీడియాలో తప్పుడు ప్రచారం చేయిస్తున్నారని ఆరోపించారు. లిక్కర్ స్కామ్‌లో కల్వకుంట్ల కవిత తెలంగాణ పరువు తీసినందుకు ఆపార్టీ నేతలు సిగ్గుపడాలని సూ చించారు.

కేటీఆర్ జైలుకు పోవాల్సి వస్తుంద న్న భయంతో ఆందోళన పడుతున్నారని ఎద్దేవా చేశారు. తమ ప్రభుత్వం ఆరు గ్యారంటీలను అమలు చేస్తుందని తెలిపారు. స్థానిక సంస్థల ఎన్నికల విషయంలో కేటీఆర్ చేతకాని మాటలు మాట్లాడుతున్నారని విమర్శించారు. మంత్రులు సర్పంచులను ఏకగ్రీవం చేయరని, కాంగ్రెస్ అభ్యర్థులను ప్రజలే ఏకగ్రీవం చేసుకుంటారని ఆయన స్పష్టం చేశారు.

ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలి

- సీఎం రేవంత్‌రెడ్డి ప్రత్యేక చొరవ చూపాలి : టీఎన్జీవో అధ్యక్షులు జగదీశ్వర్



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలో ఉద్యోగుల పెండింగ్ సమస్యలను వెంటనే పరిష్కరించాలని టీఎన్జీవో కేంద్రసంఘం అధ్యక్షులు మారం జగదీశ్వర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సమస్యల పరిష్కారం కోసం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రత్యేక చొరవ చూపాలని కోరారు. బుధవారం హైదరాబాద్‌లో టీఎన్జీవోల కేంద్ర సంఘం కార్యవర్గ సమావేశాన్ని నిర్వహించారు. అనంతరం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో టీఎన్జీవో అధ్యక్షులు జగదీశ్వర్, ప్రధాన కార్యదర్శి ఎస్ఎం ముజీబ్ హుస్సేనీ మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ఉద్యోగుల సమస్యలను పరిష్కరిస్తుందని ఆశిస్తున్నామని చెప్పారు. పెండింగ్‌లో ఉన్న నాలుగు డీఏలను, పెండింగ్ బిల్లులను చెల్లించాలని కోరారు.

పీఆర్సీ నివేదికను తెప్పించుకుని మెరుగైన ఫిట్‌మెంట్‌ను ప్రకటించాలని డిమాండ్ చేశారు. ఉద్యోగులు, పెన్షనర్లందరికీ ఆరోగ్య కార్డులను ఇవ్వాలని చెప్పారు. సీపీఎస్‌ను రద్దుచేసి ఓపీఎస్‌ను అమలు చేయాలని అన్నారు. 317 జీవోలో జరిగిన అనేక తప్పులను సవరించి ఉద్యోగులందరికీ న్యాయం చేయాలని కోరారు. ఆకాల వర్షాలకు తుపాను బీభత్సంలో ప్రజలు అనేక ఇబ్బందులు ఎదుర్కొని తమ ధన, ప్రాణాలకు, ఆస్తులకు తీవ్ర నష్టం అయిన సందర్భంలో పది లక్షల మంది ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మికులు, కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు సెప్టెంబర్‌లో ఒకరోజు బేసిక్ వేతనాన్ని దాదాపుగా రూ.130 కోట్లు ముఖ్యమంత్రి సహాయ నిధికి అందజేశామని వివరించారు. ఉద్యోగులుగా తాము ప్రభుత్వానికి, ప్రజలకు అండగా ఉన్నామనీ, భవిష్యత్తులోనూ ఉంటామని అన్నారు. ఈ కార్యక్రమంలో టీఎన్జీవో అసోసియేట్ అధ్యక్షులు కస్తూరి వెంకటేశ్వర్లు, ముత్యాల సత్యనారాయణగౌడ్, కోశాధికారి రామినేని శ్రీనివాస్ రావు, 33 జిల్లాల అధ్యక్ష కార్యదర్శులు, కేంద్ర సంఘ కార్యసభ్యులు తదితరులు హాజరయ్యారు.


అభ్యసనా సామర్థ్యాలను మెరుగుపర్చాలి

పిల్లల సమగ్ర అభివృద్ధికి చర్యలు చేపట్టాలి : విద్యాశాఖ కార్యదర్శి యోగితా రాణా

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలో ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థుల అభ్యసనా సామర్థ్యాలను మెరుగుపర్చాలని విద్యాశాఖ కార్యదర్శి యోగితారాణా అన్నారు. పిల్లల సమగ్రాభివృద్ధికి చర్యలు చేపట్టాలని సూచించారు. బుధవారం హైదరాబాద్‌లోని మర్రి చెన్నారెడ్డి మానవ వనరుల కేంద్రంలో ఎన్జీవోస్ కన్సల్టేటివ్ మీటింగ్‌ను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పాఠశాల విద్యలో ఎవరు ఏ ప్రాంతంలో ఏ పని చేస్తున్నారో, ఎలా విస్తరించాలనుకుంటున్నారో సవివరంగా ఒక ఫార్మాట్‌లో తీసుకుని వారికి కావాల్సిన మద్దతును ఇస్తామని అన్నారు. ఎన్జీవోస్ అనేక జిల్లాలలో సేవలను అందిస్తున్నాయని వివరించారు. కావున జిల్లా కలెక్టర్ల సమావేశానికి ఎన్జీవోస్ అందర్నీ ఆహ్వానించి, వారు అందిస్తున్న సేవలు గురించి వివరించాలని కోరారు.

వారి సేవలను వినియోగించుకోవాలని కలెక్టర్లకు సూచనలు జారీ చేస్తామన్నారు. ఎన్జీవోలు పాఠశాల విద్యలో వారు సేవలందిస్తున్న రంగాలలో ఆశించిన ఫలితం, అభివృద్ధి చూపిస్తే అవసరాన్ని బట్టి రాష్ట్రవ్యాప్తంగా వారి పనిని విస్తరించేందుకు అవసరమైన మద్దతును ప్రభుత్వం అందిస్తుందని చెప్పారు. ఎన్జీవోలు అందరూ సమన్వయంతో పనిచేయడానికి ఎన్జీవో కనెక్ట్ ప్లాట్‌ఫామ్ ఏర్పాటు



ఆలోచిస్తున్నామని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం పాఠశాల విద్యను మెరుగుపరిచే దిశగా తీసుకెళ్లేందుకు చర్యలు చేపట్టిందని చెప్పారు. దానికి వివిధ ఎన్జీఓలను ఒకచోట చేర్చేందుకు వారి సహకారాన్ని తీసుకునేందుకు మార్గాలను గుర్తించామని అన్నారు. పిల్లల అభ్యసనా ఫలితాలను మెరుగుపరచాలని కోరారు. పిల్లల సమగ్ర అభివృద్ధి చేయాలన్నారు. మెరుగైన అభ్యాస వాతావరణాన్ని సృష్టించేందుకు పాఠశాల మౌలిక సదుపాయాలు, డిజిటల్ మౌలిక సదుపాయాలను అభివృద్ధి చేయాలని కోరారు. పాలన సంబంధిత విధానాలను మెరుగుపరచాలని చెప్పారు. ఉపాధ్యాయులు, పాఠశాల ప్రధానోపాధ్యాయుల సామర్థ్యాన్ని అభివృద్ధి చేయాలని సూచించారు.

ప్రభుత్వ పాఠశాలలే మెరుగు : నరసింహారెడ్డి

ప్రాథమిక అక్షరాస్యత, గణితం, మౌలిక సదుపాయాలు, పాలన, విధాన రూపకల్పనలో మద్దతు, డిజిటల్ విధానాలు, ఉపాధ్యాయుల సామర్థ్యాన్ని అభివృద్ధి చేయాలనీ, తల్లిదండ్రుల భాగస్వామ్యం ఉండాలని పాఠశాల విద్యాశాఖ సంచాలకులు ఈవి నరసింహారెడ్డి అన్నారు. పాఠశాల విద్యలో ప్రధాన సవాల్ ఏమిటంటే ప్రభుత్వ పాఠశాలలకు వచ్చేవారు ఆర్థికంగా అత్యంత వెనుకబడిన వారని చెప్పారు.

ఇతరులు ప్రయివేట్ పాఠశాలలకు వెళ్తున్నారని అన్నారు. కానీ ప్రయివేట్ పాఠశాలలు కూడా అసర్ సర్వే, ఎస్ఎస్‌సీ ఫలితాల్లో మెరుగైన ర్యాంక్‌ను సాధించడంలేదన్నారు. కేవలం 'ప్రయివేట్ స్కూల్ బెటర్'అనే మానసిక ధోరణి ఉందని చెప్పారు. కానీ చాలా విషయాల్లో ప్రభుత్వ పాఠశాలలే మెరుగ్గా ఉన్నాయని వివరించారు. కేజీబీవీల్లో చదివిన బాలికలు ఆదర్శంగా నిలిచారని అన్నారు. తల్లిదండ్రులు పిల్లల విద్యపై ఆసక్తి చూపడం లేదన్నారు. వారు విద్య కోసం ఖర్చు చేయడం లేదని వివరించారు. అందుకే ఉపాధ్యాయులు, తల్లిదండ్రుల్లాగా బాధ్యత తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమానికి ఎస్‌సీఈఆర్టీ డైరెక్టర్ గాజర్ల రమేష్, సమగ్ర శిక్ష జాయింట్ డైరెక్టర్లు పి రాజీవ్, బి వెంకట నరసమ్మ కోఆర్డినేటర్లు జోసెఫ్, సంపత్ రావు, వెంకటస్వామి తదితరులు హాజరయ్యారు.

హెూంగార్డులకు జీతాలు చెల్లించరా?

- మాజీ మంత్రి హరీశ్ రావు ఆగ్రహం

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

హెూంగార్డులకు జీతాలు చెల్లించక పోవడం పట్ల మాజీ మంత్రి హరీశ్ రావు రాష్ట్ర ప్రభుత్వం పై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ మేరకు బుధవారం ఆయన ట్వీట్ చేశారు. రాష్ట్రవ్యాప్తంగా 16వేలకు పైగా ఉన్న హెూం గార్డులకు 12 రోజులు గడుస్తున్నా జీతాలు చెల్లించకపోవడం సిగ్గుచేటని ఎద్దేవా చేశారు. చిన్న జీతాలపైనే ఆధారపడి జీవిస్తున్న హెూంగార్డులు చేతిలో చిల్లిగవ్వలేక అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. ఇంటి అద్దెలు, పిల్లల స్కూల్ ఫీజులు, రోజువారీ ఖర్చుల కోసం అప్పులు చెయ్యాల్సిన దుస్థితిలో ఉన్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈఎంఐలు చెల్లించకపోవడం వల్ల బ్యాంకు అధికారులు ఫోన్లు చేసి నిలదీస్తున్నారని తెలిపారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన నాటి నుంచి ప్రతి నెలా ఇదే తీరు కొనసాగుతున్నా పట్టించుకునే వారే లేరని చెప్పారు. మాటలు కోటలు దాటితే, చేతలు గడప దాటని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వారికి ఏం సమాధానం చెబుతారు? అని ప్రశ్నించారు. పథకాల్లో కోతలు, జీతాలు చెల్లించకుండా ఉద్యోగులకు వాతలు.. ఇది ప్రజా పాలన కాదు, ప్రజా వ్యతిరేక పాలన అని విమర్శించారు. హెూంగార్డులకు వేతనాలు తక్షణం చెల్లించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

బీజేపీ, కాంగ్రెస్ పార్టీలు ఒక్కటే

- మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్ర ప్రజల ప్రయోజనాలను తాకట్టు పెట్టడంలో బీజేపీ, కాంగ్రెస్ పార్టీలు రెండూ ఒక్కటేనని మాజీ మంత్రి, బీఆర్ఎస్ నేత కొప్పుల ఈశ్వర్ విమర్శించారు. బుధవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. తాను ఆర్ఎస్ఎస్ పత్రిక జాగృతిలో పని చేశాననీ చెప్పడం ద్వారా సీఎం రేవంత్ రెడ్డి తాను ఆర్ఎస్ఎస్ వాదిననీ, బీజేపీ వ్యక్తినని చెప్పుకున్నారని విమర్శించారు. రేవంత్ రెడ్డి సీఎం అయ్యాక ఆ రెండు పార్టీలు మరింత దగ్గరయ్యాయని చెప్పారు. రాష్ట్రంలో రైతులు, ఆటోడ్రైవర్లు ఆత్మహత్యలు, అలాగే హైడ్రా పేరుతో నిరుపేదల ఇళ్ళను నేలమట్టం చేస్తున్న రేవంత్ రెడ్డి సర్కార్‌ను బీజేపీ ఎంపిలు, ఎమ్మెల్యేలు ఎందుకు ప్రశ్నించడం లేదని కొప్పుల నిలదీశారు. రాష్ట్ర విభజన హామీలు మోడీ పట్టించుకోకున్నా సీఎం రేవంత్ రెడ్డి ప్రశ్నించడం లేదని విమర్శించారు. తెలంగాణ హక్కుల కోసం ఎలాంటి రాజీ లేకుండా పోరాటం చేసే పార్టీ బీఆర్ఎస్ పార్టీ కొప్పుల ఈశ్వర్ గుర్తుచేశారు.

హెూంగార్డులను పర్మినెంట్ చేయాలి

- మాజీ మంత్రి వి.శ్రీనివాస్ గౌడ్

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

హెూంగార్డులను పర్మినెంట్ చేయాలనీ, మాజీ మంత్రి, బీఆర్ఎస్ నేత వి.శ్రీనివాస్ గౌడ్ డిమాండ్ చేశారు. బుధవారం హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో ఆయన మీడియాతో మాట్లాడారు. హెూంగార్డులకు జీతాలు రావడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. గత బీఆర్ఎస్ హయాంలో హెూంగార్డుల స్థాయిని పోలీసుల స్థాయికి తీసుకెళ్లామని గుర్తుచేశారు. రెండు తెలుగు రాష్ట్రాలను మద్యం మాఫియా నడిపిస్తోందని ఆరోపించారు. ఎవరు చెప్పారని బీర్ల ధరలు పెంచారని ఆయన ప్రశ్నించారు. త్వరలోనే విస్కీ, బ్రాందీ ధరలను కూడా పెంచుతారన్నారు. నాణ్యతలేని బీర్లు తీసుకు వస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ విషయంలో ఏపీ, తెలంగాణ ప్రభుత్వాలు ఒప్పందంతో నడుస్తున్నాయని తెలిపారు. కాంగ్రెస్ డిక్లరేషన్లు, హామీలు అమలు కావడం లేదని విమర్శించారు. కులగణన రీసర్వే చేయాలని డిమాండ్ చేశారు.

వనపర్తికి ఐటీ టవర్ మంజూరు

- రూ.22 కోట్లు విడుదల చేసిన ప్రభుత్వం
- సీఎం రేవంత్‌రెడ్డికి ధన్యవాదాలు : ప్రణాళికా సంఘం వైస్ చైర్మెన్ చిన్నారెడ్డి

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలో వనపర్తి జిల్లాకు ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ (ఐటీ) టవర్ మంజూరైందని రాష్ట్ర ప్రణాళికా సంఘం వైస్ చైర్మెన్ జి చిన్నారెడ్డి చెప్పారు. బుధవారం హైదరాబాద్‌లోని సచివాలయం మీడియా సెంటర్‌లో ఆయన మాట్లాడుతూ ఐటీ టవర్ నిర్మాణం కోసం రూ.22 కోట్లు విడుదల చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులను జారీ చేసిందని అన్నారు. వనపర్తి పట్టణ శివారులోని నాగవరం గ్రామంలోని రెండెకరాల స్థలంలో ఐటీ టవర్‌ను నిర్మిస్తున్నట్టు వివరించారు. 25 వేల చదరపు అడుగుల విస్తీర్ణంలో భవన నిర్మాణం ఉంటుందనీ, ఏకకాలంలో 250 మంది ఐటీ ప్రొఫెషనల్స్ పని చేసుకునే సౌకర్యం ఉంటుందని చెప్పారు. ఏడాది కాలంలో నిర్మాణం పూర్తి చేసేలా లక్ష్యాన్ని నిర్ణయించుకున్నామని అన్నారు. వనపర్తి ప్రాంతంలో విద్యాభ్యాసం చేసిన సీఎం రేవంత్‌రెడ్డి ప్రత్యేక చొరవ వల్ల ఐటీ టవర్ మంజూరైందన్నారు. ఆయనకు ప్రత్యేకంగా ధన్యవాదాలు చెప్పారు. ఇది వనపర్తి ప్రాంతంలోని విద్యార్థులకు ఎంతగానో దోహదపడుతుందని వివరించారు.

ఛత్తీస్‌గఢ్‌లో మావోయిస్టుల ఏరివేత

- ఎడాదిన్నర వ్యవధి..ఎన్‌కౌంటర్‌లో 305 మంది మృతి



న్యూఢిల్లీ: ఛత్తీస్‌గఢ్‌లో మావోయిస్టుల్లేకుండా చేయాలనే దిశగా కేంద్రం అడుగులేస్తోంది. ఛత్తీస్‌గఢ్, మహారాష్ట్ర, తెలంగాణ సరిహద్దులోని దండకారణ్యంపై భద్రతా బలగాలు పట్టుసాధించే దిశగా ఆపరేషన్‌ను ముమ్మరం చేశాయి. ఎదురుకాల్పుల పేరిట జరుగుతున్న భీకరయుద్ధంలో అమాయక ప్రాణాలు గాల్లో కలిసిపోతున్నాయి.

మావోయిస్టులపై ఎదురుదాడి

మావోయిస్టుల హింస 47 శాతం తగ్గినట్టు కేంద్ర ప్రభుత్వం పేర్కొన్నది. 2010 నాటితో పోలిస్తే, 2024లో జరిగిన హింస వల్ల పౌరులు, భద్రతా సిబ్బంది మృతుల సంఖ్య కూడా 64 శాతం తగ్గినట్టు ప్రభుత్వం చెప్పింది.మంగళవారం లోక్‌సభలో కేంద్ర హెూంశాఖ సహాయ మంత్రి నిత్యానంద రాయ్ ఓ ప్రశ్నకు బదులు ఇచ్చారు. 2024లో ఛత్తీస్‌గఢ్‌లో తీవ్రవాదం కేసులు 267గా నమోదైనట్టు తెలిపారు. 2010లో ఆ సంఖ్య 499గా ఉన్నట్టు వెల్లడించారు. పౌరులు, భద్రతా దళాల సంఖ్య 2010లో 343 ఉండగా, గత ఏడాది ఆ సంఖ్య 122కు తగ్గినట్టు చెప్పారు. గడిచిన ఐదేండ్లలో వామపక్ష తీవ్రవాద ప్రభావిత ప్రాంతాలకు రూ.1925 కోట్ల నిధుల్లో 43 శాతాన్ని అందజేసినట్టు మంత్రి తెలిపారు.

305 మంది మావోయిస్టులు హతం

ఛత్తీస్‌గఢ్‌లో భద్రతాబలగాలు పట్టు బిగిస్తున్నాయని కేంద్రం చెబుతోంది. ఇప్పటివరకు 985 మంది మావోయిస్టులు లొంగిపోయారు, 1,177 మందిని అరెస్టు చేయగా.. కేవలం 13 నెలల్లోనే 305 మంది మరణించారు. అయితే మావోయిస్టుల పేరుతో దండకారణ్యంలో రక్తపుటేర్లు పారుతున్న తీరుపై సర్వత్రా ఆందోళన వ్యక్తమవుతోంది.మావోయిస్టులు అభివృద్ధిని అడ్డుకుంటున్నారంటూ.. స్థానిక జనాన్ని తమవైపు తిప్పుకుంటూ.. వారి ప్రభావాన్ని బలహీనపరిచేందుకు కేంద్రం, అక్కడి బీజేపీ పాలకులు దాడులను ముమ్మరం చేయిస్తున్నారని పౌరసమాజం ఆరోపిస్తోంది.రాష్ట్ర ప్రభుత్వం భద్రతా దళాలకు పూర్తి కార్యాచరణ స్వేచ్ఛను ఇచ్చి, అత్యాధునిక ఆయుధాలు, నిఘా నెట్‌వర్క్‌లతో మావోయిస్టుల కదలికలను ఆరా తీస్తోంది. ఇలా కీలకమావోయిస్టు నేతల్ని నిర్మూలించడం లేదా పట్టుకోవడంలో భద్రతాబలగాలు పైచేయి సాధిస్తున్నాయని ఉన్నతాధికారులు పేర్కొంటున్నారు.గిరిజన వర్గాలను విస్తృత ఆర్థిక వ్యవస్థలో అనుసంధానించడం లక్ష్యంగా పెట్టుకున్నామని బీజేపీ గాలం వేస్తోందన్న విమర్శలు లేకపోలేదు. ఇన్నాళ్లు తమకు ఆయుధం అనుకునే చోట సాయిధ ప్రతిఘటనకు ప్రత్యామ్నాయాలను అందిస్తామని ఇన్‌ఫార్మర్ వ్యవస్థలతో కూడా కేంద్రం మావోయిస్టులను కోలుకోలేని విధంగా దెబ్బ తీయటానికి కారణమవుతోందని నిపుణులు విశ్లేషిస్తున్నారు.

అడవులపై అదానీ పడగ!



- ఒడిశాలో రూ.2.60లక్షల కోట్ల విలువైన బాక్సైట్ ఖనిజ కొండ
- బలంగీర్‌లోని 'గంధమదన' పర్వతం లూటీకి కేంద్రం గ్రీన్ సిగ్నల్
- విశాఖపట్నం-రాయపూర్ 6 లేన్ ఎక్స్‌ప్రెస్ హైవే నిర్మాణం వెనక కారణమిదేనా!
- మూలపేట పోర్టుకు ఈ బాక్సైట్ తేవడానికి మరో హైవే రోడ్డు ఏర్పాటు



విశాఖ :అటవీ గ్రామాలు, ప్రాంతాలే కాదు... ఏజెన్సీ రాష్ట్రాలన్నిటినీ దేశ పారిశ్రామిక దిగ్గజం అదాని పరం చేసేందుకు కేంద్రంలోని మోడీ ప్రభుత్వం కంకణం కట్టుకుంది. తాను చేసిందే 'ధర్మ సంస్థాపనం' అనే సూక్తులు వల్లెవేస్తూ ప్రకృతి సిద్ధమైన కొండలను కొల్లగొడుతూ గిరిజన సంపదలను దోచిపెట్టేందుకు సిద్ధమైంది. అడవుల్లో అడిగేవారెవ్వరూ ఉండరని ఇష్టారాజ్య పాలన సాగిస్తోంది. మావోయిస్టుల ఏరివేత వెనుక మర్మం కూడా కార్పొరేట్లకు సేవ చేయడానికేనని వ్యాఖ్యలు వినిపిస్తున్నాయి. అదాని గ్రూప్ సంస్థకు అన్ని మార్గాలనూ సుగమం చేస్తూ కేంద్రంలోని బిజెపి సర్కారు గిరిజన హక్కులను కాలరాస్తోంది. ఒడిశా జియలాజికల్ సర్వే అథారిటీ సంస్థ నిర్వహించిన సర్వే ప్రకారం బలంగీర్ కొండ (గంధమదన పర్వతం)పై బాక్సైట్, ఇతర ఖనిజ నిక్షేపాలు ఉన్నాయని గతంలోనే నివేదిక ఇచ్చింది. దీంతో, అదాని గ్రూపు ఈ పర్వతంపైగల రూ.2.60 లక్షల కోట్ల విలువైన బాక్సైట్ ఖనిజ సంపద దోపిడీకి సిద్ధమయ్యారు. ఈ చర్య ఏకంగా గిరిజనాన్ని ఏజెన్సీ రాష్ట్రాల నుంచి తరిమేసేలా తయారైంది. ఇప్పటికే దేశంలోని పోర్టులు, ఎయిర్ పోర్టులు అదానీ సొంతం అవుతున్నాయి. గ్రీన్ ఎనర్జీ పేరుతో విశాఖ ఉమ్మడి జిల్లా పూడిమడక అదానీ హైడ్రోజన్ హబ్‌కు 1200 ఎకరాలు భూమిని రాష్ట్ర ప్రభుత్వం ఇవ్వ చూడడంతో భూములు, కొండలన్నీ అదాని పాదాక్రాంతం అవుతున్నట్టే లెక్క. అనకాపల్లి వద్ద పరవాడ ఎన్‌టిపిసిలో బొగ్గు కాంట్రాక్టులన్నిటినీ దక్కించుకునేందుకు టిడిపి కూటమి ప్రభుత్వం సహకరించింది. తాజాగా ఎపి మినరల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్‌కు నష్టం చేసే నిర్ణయాన్ని చంద్రబాబు ప్రభుత్వం ఈ నెల రెండున తీసుకుంటూ ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలోని సులియారీ గనిలోని ఎపిఎండిసికి చెందిన బొగ్గును అదానీకి మరో ఏడాది పాటు పొడిగిస్తూ (టెండరు పిలవకుండా) పోటీ లేకుండా అడ్డగోలుగా కొట్టేసే అవకాశం కల్పిస్తూ ఇక్కడ రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది.

గంధమదన పర్వతం ప్రత్యేకత బాక్సైట్ గనే...

బాక్సైట్ ఉన్న గంధమదన పర్వతానికి అంజనేయుడి సంజీవుని పర్వతం అని పేరుంది. సూదిగా ఉండడంతో సూది కొండ అని స్థానికులు పిలుస్తుంటారు. అక్కడ ఆంజనేయుడు ఉంటాడనే నమ్మకంతో ఈ కొండకు దూరం నుంచి మొక్కుతుంటారు. ఈ కొండ అదానీపరం అవుతుందన్న సంగతి వీరికి తెలియదు. ప్రపంచంలో లభ్యమయ్యే బాక్సైట్‌లో 50 శాతం ఒడిశాలోనే నాణ్యమైనది ఉందన్నది బ్రిటిష్ వారు గతంలో చేసిన సర్వే ద్వారా తెలుస్తోంది. ఛత్తీస్‌గఢ్‌లోని మాంగనీసు, ఇతర ఖనిజాలకోసం ఒడిశా కొండలపై బిజెపి కన్ను అందుకే పడింది. ముఖ్యంగా ఒడిశా ప్రభుత్వ జియలాజికల్ సర్వే ఆఫ్ ఇండియా చేసిన సర్వే ప్రకారం మాంగనీసు, మెలనైట్, బొగ్గు, డోలమైట్, నికెల్, మెగ్నీషియం, సీసం, గ్రానైట్ వంటివి ఇదే ప్రాంతంలో మిగతా కొండలపైనా లభ్యమవుతున్నాయి. బలంగీర్ కొండపై మాత్రం ఇనుప ఖనిజం, బాక్సైట్ విరివిగా ఉన్నందున అదాని ఎంట్రీ ఇచ్చాడని తెలుస్తోంది. ఈ కొండ ఎక్కాలంటే కాలినడకన 4 నుంచి 5 గంటలు పడుతుంది. కొండపై బిజెపి హయాంలోనే 2017లో హెలిప్యాడ్ నిర్మించి ఉంచారు.

శర వేగంగా రాయపూర్-విశాఖపట్నం ఎక్స్‌ప్రెస్ వే

విశాఖపట్నం- రాయపూర్ ఆరు లేన్ల ఎక్స్‌ప్రెస్ వే అదాని వ్యాపార సామ్రాజ్య విస్తరణకు దోహదపడేదే. 2017లోనే మోడీ ప్రభుత్వం ఆమోదించింది. 2025 నాటికి సిద్ధం చేసేశారు. 464 కిలోమీటర్ల పొడవు, ఆరు లేన్ల వెడల్పు ఉంది. ఛత్తీస్‌గఢ్, ఒడిశా, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలను కలుపుతూ దేశ కొత్త ఎక్స్‌ప్రెస్ హైవేలలో ఇదొకటి. రాయపూర్-విశాఖపట్నం ఎక్స్‌ప్రెస్ వే అనేది భారతమాల పరియోజన ఫేజ్-1 కింద ఆమోదించబడిన ఆర్థిక కారిడార్. ఎక్స్‌ప్రెస్ వే మార్గం ఛత్తీస్‌గఢ్‌లోని 124 కిలోమీటర్లు, ఒడిశాలో 240 కిలోమీటర్లు, మన రాష్ట్రంలో వంద కిలోమీటర్లు గ్రీన్‌ఫీల్డ్ ఎక్స్‌ప్రెస్ వే డిపిఆర్ రూపొందించారు. దీని మొత్తం ఖర్చు రూ.20 వేల కోట్లు. ఈ ఎక్స్‌ప్రెస్ హైవే ప్రారంభం కరుద్, రాయపూర్ నుంచి విశాఖపట్నం పోర్టు, విశాఖపట్నం వరకూ ఉంటుంది. 2014లోనే మోడీ తొలిసారి ప్రధాని మంత్రి అయినప్పుడే (ఎంఒఆర్‌టిహెచ్-మోర్త్) అంటే మినిస్ట్రీ ఆఫ్ రోడ్డు ట్రాన్స్‌పోర్టు అండ్ హై వేస్ మధ్య కనెక్టివిటీ, టూరిజం, అభివృద్ధి, ఆర్థిక కారిడార్‌ల అభివృద్ధికి రాయపూర్ నుంచి విశాఖపట్నం వరకూ ఒక ఎక్స్‌ప్రెస్ హైవేను నిర్మించాలని ఆమోదించింది. 2022లో దీని నిర్మాణానికి మోడీ శంకుస్థాపన చేశారు. ఆర్థిక కార్యకలాపాలను మెరుగుపరచడానికి, ప్రయాణ సమయాన్ని గణనీయంగా తగ్గించడానికి ఈ ఎక్స్‌ప్రెస్ హై వేను చేపడుతున్నట్లు కేంద్రం చెబుతోంది. అయితే, బలంగీర్ కొండ చుట్టూ అదాని గ్రూపు కేంద్రీకృతమై సాగిస్తున్న దోపిడి కోసమే ఈ రహదారి చేపడుతోందని స్పష్టమవుతోంది.

మూలపేట పోర్టు 'అదాని' వ్యాపారం కోసమే!

బలంగీర్ జిల్లాలోంచి రాయపూర్‌ను కలుపుకుని మరో హై వే సంబల్‌పూర్ వరకూ కేంద్రం నిర్మిస్తోంది. ఇది కూడా బాక్సైట్ రవాణా కోసమే. రాయపూర్ నుంచి బలంగీర్ జిల్లా మీదుగా రాయగడలో కలుస్తుంది ఈ రోడ్డు. రాయగడ మీదుగా శ్రీకాకుళం జిల్లాలోని మూలపేట పోర్టుకు బాక్సైట్‌ను తరలించాలనేది భవిష్యత్ ప్లాన్. ఈ నేపథ్యంలో ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ జనవరి 8న విశాఖకు, ఆ తర్వాత 9న భువనేశ్వర్‌కు వెళ్లారని తెలుస్తోంది. ప్రస్తుత ఒడిశా గవర్నర్, గతంలో బిజెపి విశాఖ ఎంపీగా ఉన్న కంభంపాటి హరిబాబు ప్రవాస్ భారత్ సమ్మేళన్‌ను 9న భువనేశ్వర్‌లో నిర్వహించారు. ఖనిజ సంపదల వ్యాపారం ఎగుమతులే ప్రధాన అజెండాగా ఇది సాగింది. శ్రీకాకుళం జిల్లాలో నిర్మాణంలో ఉన్న మూలపేట పోర్టుకు తొలి సరకు రవాణా ఈ అదానీ బాక్సైట్ అని తెలుస్తోంది. 2026-2027 తర్వాత దీన్ని ఎగుమతి చేసేందుకు వీలుగా అన్ని వైపుల నుంచీ సిద్ధం చేస్తున్నారని సమాచారం.

ఉచితాలు మంచి పద్ధతి కాదు

- ప్రజలు పని చేయటానికి ఇష్టపడరు
- ఆశ్రయం, భద్రత హక్కు మాత్రం ప్రాథమిక హక్కు : సుప్రీంకోర్టు ధర్మాసనం



నవతెలంగాణ-న్యూఢిల్లీ బ్యూరో

ఎన్నికల సమయాల్లో ఆయా రాజకీయ పార్టీలు ప్రకటించే ఉచిత పథకాలను భారత అత్యున్నత న్యాయస్థానం తప్పుబట్టింది. ఇది మంచి పద్ధతి కాదని తెలిపింది. ఉచితంగా రేషన్, డబ్బులు ఇస్తుంటే ప్రజలు పని చేసేందుకు ఇష్టపడరని వ్యాఖ్యానించింది. పేదలు, నిరాశ్రయులకు సంక్షేమం అవసరమనీ, ఆశ్రయం, భద్రత హక్కు ప్రాథమిక హక్కు అని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. పట్టణ ప్రాంతాల్లో నిరాశ్రయులకు ఆశ్రయం కల్పించాలని కోరుతూ దాఖలైన పిటిషన్‌పై విచారణ సందర్భంగా సుప్రీంకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ బి.ఆర్ గవాయ్, జస్టిస్ అగస్టిన్ జార్జి మాసిహ్‌లతో కూడిన ధర్మాసనం ఈ వ్యాఖ్యలు చేసింది. " దురదృష్టవశాత్తు ఉచితాలతో ప్రజలు పనిచేయడానికి ఇష్టపడటం లేదు. వాళ్లకు ఉచితంగా రేషన్ అందుతోంది. ఏ పనిచేయకుండానే డబ్బులు వస్తున్నాయి" అని ధర్మాసనం అభిప్రాయపడింది. నిరాశ్రయులకు ఆశ్రయం కల్పించాలనే ఉద్దేశం మంచిదేననీ, అయితే వారిని సమాజ అభివృద్ధిలో భాగస్వాములను చేయాలని వివరించింది.పిటిషనర్ల తరపు సీనియర్ న్యాయవాది ప్రశాంత్ భూషణ్ వాదనలు వినిపించారు. గ్రామీణ పేదలు పనుల కోసం పట్టణ ప్రాంతాలకు వలస వెళ్తారని తెలిపారు. "వారికి పని ఉంటే, వారు పని చేస్తారు. వారు పని వెతుక్కుంటూ నగరానికి వస్తారు. వారికి లభించే ఉద్యోగాలు చిన్నవే. వారు ఆశ్రయం కూడా పొందలేరు" అని అన్నారు. దీనిపై అటార్నీ జనరల్ ఆర్.వెంకటరమణి సమాధానమిస్తూ.. పట్టణ పేదరిక నిర్మూలన మిషన్‌ను పూర్తి చేసే దశలో కేంద్రం ఉందన్నారు. నిరాశ్రయులకు ఆశ్రయం కల్పించడంతో పాటు పలు సమస్యల పరిష్కారానికి యోచిస్తోందని చెప్పారు. దీంతో ధర్మాసనం తిరిగి స్పందిస్తూ.. పట్టణ పేదరిక నిర్మూలన మిషన్ ఎంత కాలం పనిచేస్తుందో తెలియజేయాలని కేంద్రాన్ని ఆదేశించింది. దేశాభివృద్ధిలో ప్రజల భాగస్వామ్యం అవసరమనీ, సమాజంలో ప్రజల పాత్రను పెంచాల్సిన అవసరమున్నదని కోర్టు తెలిపింది. ప్రజల పట్ల ఉన్న శ్రద్ధను మెచ్చుకుంటున్నామనీ, కానీ వాళ్లను పని చేయకుండా ఉండేలా తయారు చేయొద్దని జస్టిస్ గవాయ్ సూచించారు. పథకాలను ఖరారు చేసి అమలు చేయడానికి పట్టే సమయం, అవి ఏ అంశాలను కవర్ చేస్తాయో వివరిస్తూ ఆరు వారాల్లోగా అఫిడవిట్ దాఖలు చేయాలని కోర్టు.. కేంద్రాన్ని ఆదేశించింది. ఆరు వారాల తర్వాత తిరిగి విచారణ జరుపుతామని పేర్కొంటూ కేసును వాయిదా వేసింది.

ఇంక్రిమెంట్లపై యూజీసీ యూ-టర్న్

పరిశోధనలకు వేతన పెంపుదల ఉండదంటూ ఆదేశాలు

న్యూఢిల్లీ : పరిశోధనలకు పెద్ద పీట వేస్తానని చెప్పుకునే యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్ (యూజీసీ) అందుకు విరుద్ధంగా వ్యవహరిస్తోంది. కేంద్రీయ విశ్వవిద్యాలయాల్లో పీహెచ్‌డీ, ఎంఫిల్ డిగ్రీల కోసం పరిశోధనలు చేసే ఫ్యాకల్టీ సభ్యులకు ఇంక్రిమెంట్లు ఇచ్చే విషయంలో కమిషన్ యూ-టర్న్ తీసుకుంది. కళాశాలలు, యూనివర్సిటీల్లో పరిశోధనలకు సంబంధించిన అర్హతలు పొందేందుకు ఫ్యాకల్టీ సభ్యులకు యూజీసీ ఇంక్రిమెంట్లు ఇస్తోంది. అయితే వాటిని నిరాకరించేందుకు ఇప్పుడు ఎనిమిది సంవత్సరాల నాటి ప్రభుత్వ ఆదేశాలను బూజు దులిపి బయటికి తీసింది. ఈ నేపథ్యంలో తమకు ఇప్పటికే చెల్లించిన మొత్తాన్ని రికవరీ చేస్తుందేమోనని అధ్యాపకులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.పీహెచ్‌డీ, ఎంఫిల్ డిగ్రీల కోసం పరిశోధనలు చేసే ఫ్యాకల్టీ సభ్యులకు ఇంక్రిమెంట్లు చెల్లించేందుకు యూనివర్సిటీలను యూజీసీ గతంలో అనుమతించింది. గత దశాబ్ద కాలంగా ఇంక్రిమెంట్ల చెల్లింపు జరుగుతోంది. అయితే ఇప్పుడు ఇకపై ఇంక్రిమెంట్లు ఇవ్వరాదంటూ తాజాగా ఆదేశాలు జారీ చేసింది. దీనికి సంబంధించి యూజీసీ సోమవారం కేంద్రీయ వర్సిటీలకు వివరణ పంపింది. ఇంక్రిమెంట్ విషయంలో ఉన్నత విద్యా శాఖ పంపిన లేఖను పరిగణనలోకి తీసుకొని, దాని ప్రకారం నడుచుకోవాలని అందులో సూచించింది. అయితే ఇక్కడ గమనించాల్సిన విషయమేమంటే ఉన్నత విద్యా శాఖ లేఖ పంపింది 2017 నవంబర్ 2వ తేదీన. 'ఇంటెన్సివ్‌లు వేతనాల్లో భాగంగానే ఉన్నాయి. కెరీర్ అడ్వాన్స్‌మెంట్ పథకం కింద మంచి పురోగతి కనబరుస్తున్న ఎంఫిల్ లేదా పీహెచ్‌డీ డిగ్రీ అధ్యాపకులకు ఇచ్చే ఇంక్రిమెంట్లు వేతనాల్లో భాగంగానే ఉన్నాయి.కాబట్టి ఎంఫిల్ లేదా పీహెచ్‌డీ డిగ్రీలు పొందడానికి అడ్వాన్స్ ఇంక్రిమెంట్ రూపంలో ప్రోత్సాహకాలు ఇవ్వాల్సిన అవసరం లేదు' అని అప్పటి విద్యా శాఖ లేఖ పేర్కొంది. యూజీసీ తాజా నిర్ణయంపై వర్సిటీ ఫ్యాకల్టీ సభ్యులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇంక్రిమెంట్లను నిరాకరించడంతో పరిశోధన, నైపుణ్యాన్ని అభివృద్ధి చేయాలన్న లక్ష్యానికి విఘాతం ఏర్పడుతుందని వారు తెలిపారు.

సైన్స్ కోర్సులపై మహిళలకు ఆసక్తి

ఇంజినీరింగ్‌లో తగ్గుతున్న ప్రవేశాలు



న్యూఢిల్లీ : ఉన్నత విద్యలో మహిళల ప్రవేశం నిలకడగా పెరుగుతూనే ఉన్నప్పటికీ వారిలో ఇంజినీరింగ్, ఇతర సాంకేతిక సంబంధమైన కోర్సులను అభ్యసిస్తున్న వారి సంఖ్యకు, ఇతర కోర్సుల్లో చేరుతున్న వారి సంఖ్యకు మధ్య అంతరం ఎక్కువగా ఉంటోంది. 2013-14, 2021-22 మధ్యకాలంలో మహిళల ప్రవేశాలు అండర్ గ్రాడ్యుయేట్ కోర్సుల్లో 46 శాతం, పోస్ట్ గ్రాడ్యుయేట్ కోర్సుల్లో 55.5 శాతం పెరిగాయి. అయితే ఇంజినీరింగ్ డిగ్రీలో చేరిన వారి సంఖ్య అండర్ గ్రాడ్యుయేట్లలో 1.35 శాతం, పోస్ట్ గ్రాడ్యుయేట్లలో 43 శాతం మేర తగ్గిందని ప్రభుత్వ గణాంకాలు చెబుతున్నాయి.

ఇదే కాలంలో అండర్ గ్రాడ్యుయేట్ కామర్స్ కోర్సుల్లో మహిళల ప్రవేశాలు 42 శాతం మేర పెరిగాయి. అండర్ గ్రాడ్యుయేట్ ఆర్ట్స్, హ్యుమానిటీస్, సోషల్ సైన్సెస్ కోర్సుల్లో చేరిన వారి సంఖ్య 15 శాతం పెరిగిందని ఉన్నత విద్యపై నిర్వహించిన అఖిల భారత సర్వే తెలిపింది. అండర్ గ్రాడ్యుయేట్ కోర్సులకు సంబంధించి ఐటీ, కంప్యూటర్స్‌లో మహిళల ప్రవేశాలు 23.4 శాతం పెరిగినప్పటికీ పోస్ట్ గ్రాడ్యుయేట్ ఐటీ కోర్సుల్లో ప్రవేశాలు 27.4 శాతం తగ్గిపోయాయి. మార్కెట్‌ను దృష్టిలో ఉంచుకొని మహిళలు ఎక్కువగా నేచురల్ సైన్స్, వైద్య కోర్సుల్లో ప్రవేశాలు పొందుతున్నారని, పోస్ట్ గ్రాడ్యుయేట్ ఇంజినీరింగ్, ఐటీ కోర్సుల వైపు వారు వెళ్లడం లేదని నిపుణులు తెలిపారు.

సైన్స్ రంగంలో నిపుణులైన సిబ్బంది కోసం డిమాండ్ పెరుగుతున్న నేపథ్యంలో మహిళలు ఆ కోర్సుల్లో చేరడానికి ఇష్టపడుతున్నారని సత్వా కన్సల్టింగ్ సంస్థ ఎంగేజ్‌మెంట్ మేనేజర్ శ్వేతా గౌర్ చెప్పారు. ముఖ్యంగా దక్షిణాది రాష్ట్రాలైన ఆంధ్రప్రదేశ్, తెలంగాణలో 75 శాతం వరకూ బాలికలు సైన్స్‌తో ఇంటర్ ఉత్తీర్ణులవుతున్నారని ఆమె తెలిపారు.

నిపుణులైన సిబ్బంది కొరత కారణంగా సైన్స్ రంగాన్ని ఎంచుకునే మహిళలను కేంద్ర ప్రభుత్వం ప్రోత్సహిస్తోందని, ఆ రంగంలో గణనీయంగా పెట్టుబడులు పెడుతోందని అన్నారు. గ్రామీణ, మారుమూల ప్రాంతాల్లో అటల్ టింకరింగ్ ల్యాబ్స్‌ను ఏర్పాటు చేస్తున్నామని, ఇప్పటి వరకూ 10,000 ల్యాబ్స్‌ను ఏర్పాటు చేస్తే వాటిలో 57 శాతం గ్రామీణ ప్రాంతాల్లోనే ఉన్నాయని ప్రభుత్వం గత నవంబరులో లోక్‌సభకు తెలియజేసింది. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల్లో సైన్స్ కోర్సులకు ప్రోత్సాహం లభిస్తోందని గౌర్ చెప్పారు. ఇంటర్‌లో దాదాపు 100 శాతం కళాశాలలు సైన్స్ సబ్జెక్టును బోధిస్తున్నాయని, 75 శాతం బాలికలు సైన్స్‌తోనే ఇంటర్‌ను పూర్తి చేస్తున్నారని ఆమె వివరించారు.

వర్సిటీల్లో నియామకాలు జరిగేనా ?

- చర్చకు దారితీసిన ప్రొఫెసర్ల వయోపరిమితి పెంపు
- ఖాళీలు భర్తీ చేయాలంటున్న నిరుద్యోగులు



నవతెలంగాణ-ఓయూ

రాష్ట్ర విశ్వవిద్యాలయాల్లో ప్రొఫెసర్ల వయోపరిమితిని 60 నుంచి 65 సంవత్సరాల వరకు పెంచుతూ ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం జీఓ విడుదల చేయడంతో భవిష్యత్తులో నియామకాలు ఉండవా? అన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది. ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం పట్ల అటు విద్యార్థులు, నిరుద్యోగుల్లో.. ఇటు ప్రొఫెసర్లలోనూ ఆసక్తికరమైన చర్చ జరుగుతోంది. మొదట విశ్వవిద్యాలయాల్లో ఇప్పటికే ప్రకటించిన ఖాళీలను భర్తీ చేసిన తర్వాత వయోపరిమితి పెంచినా ఇబ్బంది ఉండేది కాదని పలువురు అభిప్రాయపడ్డారు. వయోపరిమితిని పెంచాలనే డిమాండ్‌ను యూజీసీ నియమ నిబంధనలకు అనుగుణంగా మార్చాలనే ఆలోచన గత రాష్ట్ర ప్రభుత్వం నుంచి ఉన్నప్పటికీ ప్రస్తుతం వయోపరిమితిని పెంచిన పరిస్థితుల వెనుక పలు కారణాలు లేకపోలేదు.

ఆర్థిక భారం నుంచి విముక్తి కోసమేనా ?

వయోపరిమితికి ప్రధాన కారణం ఆర్థికపరమైన ఇబ్బందులేనని సర్వత్రా వినిపిస్తున్న మాట. ఒకవేళ అదే నిజమైతే నూతనంగా విశ్వవిద్యాలయాల్లో ఏ విధంగా నియామకాలు జరుపుతారనేది సందేహాస్పదం. ఎప్పటికప్పటికీ ఖాళీగా ఉన్న అధ్యాపకుల పోస్టుల్లో వెంటనే అసిస్టెంట్ ప్రొఫెసర్లను నియమించుకుంటూ పోతే ఈ సమస్య ఉండేది కాదు. గత ప్రభుత్వం నియామకాలు చేయలేదు. అన్ని విశ్వవిద్యాలయాల్లో ప్రొఫెసర్ల కొరత తీవ్రంగా ఏర్పడింది. అంతేకాకుండా, ఆర్థిక స్థితికి భారంగా పరిణమించే సీనియర్ ప్రొఫెసర్ల ఉద్యోగోన్నతి వ్యవహారం.. అందులో జరిగిన అక్రమాలు ఓయూ పరువు ప్రతిష్టలను మంటగలిపిన విషయం తెలిసిందే.

నిరాశలో నిరుద్యోగులు

వయోపరిమితి పెంపు నిరుద్యోగుల ఆశలు, ఆకాంక్షలపై నీళ్లు చల్లిందని, ప్రభుత్వ నిర్ణయం సరైంది కాదనే చర్చ విద్యార్థి సంఘాల్లో వ్యక్తమవుతోంది. ఇప్పటికైనా ప్రభుత్వం నిరుద్యోగుల్లో భరోసా కల్పించడానికి వెంటనే విశ్వవిద్యాలయాల్లో నియామకాల కోసం ప్రకటన విడుదల చేయాలని విద్యార్థులు, నిరుద్యోగులు కోరుతున్నారు. వయోపరిమితిని ఆగమేఘాల మీద పెంచుతూ నిర్ణయం తీసుకున్నట్టుగానే అసిస్టెంట్ ప్రొఫెసర్ల నియామకంపైనా చర్యలు తీసుకోవాలంటున్నారు. ఇప్పటికే యూజీసీ రూపొందించిన ముసాయిదా నియమ నిబంధనలు నియామక ప్రక్రియలపై నీలి నీడలను కమ్ముకునేట్టు చేశాయి. దీన్ని బూచిగా చూపించి రాష్ట్ర ప్రభుత్వం మరిన్ని రోజులు నియామక ప్రక్రియ వాయిదా చేయొచ్చనే చర్చ నడుస్తోంది. విశ్వవిద్యాలయాల్లో వయోపరిమితి పెంపుతో ప్రభుత్వానికి కొంత మేరకు లాభాలు ఉన్నప్పటికీ రెట్టింపు స్థాయిలో నష్టాలు వస్తాయని విద్యార్థి సంఘాలు ఆరోపిస్తున్నాయి.

వెక్కిరిస్తున్న ఖాళీలు

ఓయూకు మంజూరైన పోస్టులు 1257. ప్రస్తుతం పనిచేస్తున్న వారి సంఖ్య 376మంది, ఖాళీలు 891. కాకతీయ యూనివర్సిటీలో 409 పోస్టులు ఉండాల్సి ఉండగా, ప్రస్తుతం 86 మంది ఉన్నారు. 323 ఖాళీలు ఉన్నాయి.

కేసీఆర్‌కు పుట్టిన రోజు కానుక

- వెయ్యి మొక్కలు నాటిన కడియం నర్సరీ

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

తెలంగాణ మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌కు ఆంధ్రప్రదేశ్‌లోని కడియం నర్సరీలు అడ్వాన్స్ బర్త్‌డే గిఫ్ట్ అందించాయి. ఫిబ్రవరి 17న ఆయన పుట్టిన రోజును పురస్కరించుకుని గ్రీన్ ఇండియా ఛాలెంజ్ పిలుపు మేరకు కడియం నర్సరీల రైతుల ఆధ్వర్యంలో వెయ్యి మొక్కలు నాటి ఘనంగా వేడుకలు నిర్వహించారు. రాజ్యసభ మాజీ సభ్యులు జోగినిపల్లి సంతోష్‌కుమార్ ముఖ్య అతిథిగా హాజరైన ఈ కార్యక్రమంలో రైతులు బాలాజీ, ఈల సత్యనారాయణ, శ్రీనివాసరావు, భోజనారాయణ తదితరులు పాల్గొన్నారు.

బీసీలకు సీఎం రేవంత్ క్షమాపణ చెప్పాలి

- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి బీసీలకు క్షమాపణ చెప్పాలని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఎక్స్ వేదికగా డిమాండ్ చేశారు. కాంగ్రెస్ సర్కార్ చేసిన కులగణన సర్వే తప్పుల తడకని ఎట్టకేలకు ఒప్పుకోవడాన్ని స్వాగతిస్తున్నామని పేర్కొన్నారు. "అసమగ్రంగా చేసిన సర్వేపై బీఆర్ఎస్‌తోపాటు బీసీ సంఘాలు అభ్యంతరం వ్యక్తం చేశాయి. ప్రజాభిప్రాయన్ని కాదని కాంగ్రెస్ ప్రభుత్వం అసంపూర్తి లెక్కల ఆధారంగా అసెంబ్లీలో తీర్మానం చేయడం ముమ్మాటికీ తప్పేనని అంగీకరించాలి. రెండోసారి సర్వేనైనా సమగ్రంగా చేయాలి. బీసీలకు చట్టబద్ధంగా 42 శాతం రిజర్వేషన్లు కల్పించిన తర్వాతే స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలి" అని కేటీఆర్ డిమాండ్ చేశారు.

వరంగల్ రాలేక పారిపోయిన రాహుల్ గాంధీ

- హామీలపై ప్రజలు నిలదీస్తారని భయం : కల్వకుంట్ల కవిత



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

హామీలపై ప్రజలు నిలదీస్తారని భయపడ్డ రాహుల్ గాంధీ వరంగల్ పర్యటనకు రాలేక పారిపోయారని బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత ఎద్దేవా చేశారు. కాంగ్రెస్ పార్టీ మహిళలకిచ్చిన హామీలను అమలు చేయాలని ఆమె డిమాండ్ చేశారు. బుధవారం హైదరాబాద్‌లోని తన నివాసంలో తెలంగాణ జాగృతి ఆధ్వర్యంలో మార్చి 8న మహిళా శంఖారావం పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కవిత మాట్లాడుతూ ఎన్నికలకు ముందు వరంగల్‌లో రైతు డిక్లరేషన్ ప్రకటించారనీ, అది అమలు కానందునే మళ్లీ వచ్చేందుకు రాహుల్ గాంధీ భయపడ్డారని తెలిపారు. సీఎం రేవంత్ రెడ్డి, రాష్ట్ర నాయకులను చూసి కాకుండా రాహుల్, సోనియా, ప్రియాంక గాంధీలను చూసి ప్రజలు ఓట్లేసినట్టు చెబుతున్నారని చెప్పారు. కాంగ్రెస్ సర్కారు ఒక్కో మహిళకు నెలకు రూ.2,500 చొప్పున 14 నెలలకు రూ.35 వేలు బాకీ పడిందని తెలిపారు. కేసీఆర్ కిట్ల పంపిణీని ఆపేసిందనీ, మానవత్వం లేకుండా రేవంత్ సర్కార్ పాలన చేస్తున్నదని విమర్శించారు. ప్రభుత్వ ఆస్పత్రులపై శ్రద్ధ పెట్టాలని ఆమె డిమాండ్ చేశారు. పెన్షన్లను రూ.4 వేలకు పెంచుతామన్న హామీ ఏమైందని ప్రశ్నించారు. మహిళలకు భద్రత లేని పరిస్థితి దాపురించిందనీ, రేవంత్ రెడ్డి పాలనలో నేరాల రేటు 20 శాతం పెరిగిందని విమర్శించారు. కాంగ్రెస్ పాలనలో తరచూ మతకల్లోలాలు జరుగుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రభుత్వం ఏర్పాటు చేసిన సీసీటీవీల్లో 70 శాతం పని చేయడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు.